

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 280

మంగళవారం 31-12-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



కార్పొరేట్ వలంటీర్లు

సమాజ సేవలో ఉద్యోగులు.. ప్రోత్సహిస్తున్న కంపెనీలు - 15లో



పోరాడినా.. ఓటమి తప్పలేదు


మెల్‌బోర్న్ టెస్టులో భారత్ పరాజయం. 184 పరుగులతో నెగ్గిన ఆసీస్ - 14లో



డీఏపీ ధర పెంపు!

డై–అమ్మోనియం ఫాస్ఫేట్ ధర యాభై కిలోల బ్యాగ్‌పై జనవరి నుంచి కనీసం రూ.200 వరకు పెరిగే అవకాశముందని సమాచారం.

- వివరాలు 6లో▶



జడ్జీల సంతానానికి నో చాన్స్

సుప్రీం, హైకోర్టు ప్రస్తుత, మాజీ న్యాయమూర్తుల సంతానాన్ని హైకోర్టు జడ్జీలుగా నియమించరాదన్న ప్రతిపాదనను కొలీజియం పరిశీలిస్తోంది.

- వివరాలు 6లో▶



'నెట్'లో చిక్కకుండా నేర్పుగా..


పిల్లలు 'నెట్'లో చిక్కకుండా తల్లిదండ్రులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో సూచిస్తూ టీజీసీఎస్‌బీ మార్గదర్శకాలు రూపొందించింది.

- వివరాలు 16లో▶

జిమ్మీ కార్టర్ అస్తమయం

అమెరికా 39వ అధ్యక్షుడు జిమ్మీ కార్టర్ ఇక లేరు. ఇటీవలే 100వ పుట్టిన రోజు జరుపుకున్న ఆయన ఆదివారం కన్నుమూశారు.

- వివరాలు 6లో▶





సోమవారం మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు నివాళులర్పిస్తున్న తెలంగాణ శాసనసభ

మన్మోహన్‌కు భారతరత్న ఇవ్వాలి

శాసనసభలో తీర్మానం పెట్టిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ఆర్థిక మంత్రిగా, ప్రధానిగా దేశానికి మన్మోహన్‌సింగ్ చేసిన విశిష్ట సేవలెన్నో..

విప్లవాత్మక ఉపాధి హామీ, సమాచార హక్కు, విద్యాహక్కు చట్టాలు తెచ్చారు

- 60 ఏళ్ల తెలంగాణ కలను సాకారం చేశారు
- రాష్ట్ర అసెంబ్లీ తరఫున మన్మోహన్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి ప్రకటన
- హైదరాబాద్‌లోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో మన్మోహన్ విగ్రహం పెడతామని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు కేంద్ర ప్రభుత్వం దేశ సర్వోన్నత పురస్కారమైన భారతరత్న ఇవ్వాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి రాష్ట్ర శాసన సభ తరఫున విజ్ఞప్తి చేశారు. అంతర్జాతీయ ఖ్యాతి పొందిన ఆర్థికవేత్త అయిన మన్మోహన్‌సింగ్.. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సలహాదారుగా, ఆర్బీఐ గవర్నర్‌గా, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడిగా, ఆర్థిక మంత్రిగా, ప్రధానిగా వివిధ హోదాల్లో దేశానికి విశిష్ట సేవలు అందించారని కొనియాడారు. మన్మోహన్‌కు నివాళి అర్పించేందుకు సోమవారం అసెంబ్లీ ప్రత్యేకంగా సమావేశమైంది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టి మాట్లాడారు. మాజీ ప్రధాని కుటుంబ సభ్యులకు సభ తరఫున ప్రగాఢ సానుభూతి తెలిపారు. సభలో రేవంత్ ప్రసంగం ఆయన మాటల్లోనే.. ''ఆర్థిక సంస్కరణల మిగతా 2వ పేజీలో ▶

మన్మోహన్ చిరస్థాయిగా నిలిచిపోతారు

మాజీ ప్రధానిని కొనియాడిన డిప్యూటీ సీఎం, మంత్రులు

పీవీకి గౌరవ వీడ్కోలు దక్కలేదు: కేటీఆర్


ఢిల్లీలో ఆయన స్మారకం ఏర్పాటు చేయాలి

వివరాలు 2లో▶

అత్యంత ధనిక సీఎం చంద్రబాబు

రూ. 931 కోట్లకుపైగా ఆస్తులు పోగేశారు.. ఏడీఆర్ నివేదిక

- అత్యల్ప సంపద గల సీఎంగా అట్టడుగున నిలిచిన మమతా బెనర్జీ
- అత్యధిక క్రిమినల్ కేసులున్న ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: పూర్వం రెండెకరాల భూమికి మాత్రమే యజమానిని అని చెప్పుకునే వ్యక్తి ఇప్పుడు ఏకంగా వందల కోట్లకు అధిపతి అని అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ సంస్థ(ఏడీఆర్) కుండబద్దలు కొట్టింది. భారతదేశంలోని ఎన్నికల ప్రక్రియలో సమూల సంస్కరణ కోసం అవిశ్రాంతంగా పోరాడుతున్న ఏడీఆర్ సంస్థ సోమవారం పలు రాష్ట్రాల ముఖ్యమంత్రుల ఆస్తుల చిట్టాను విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చాలా సంవత్సరాలపాటు అధికారం చలాయించి, ప్రస్తుతం సైతం ఏపీ సీఎం కుర్చీపై కూర్చున్న చంద్రబాబు నాయుడు పేరిట ఏకంగా రూ.931 కోట్లకు పైగా ఆస్తులు ఉన్నాయని ఏడీఆర్ సోమవారం విడుదలచేసిన ఒక నివేదికలో ప్రకటించింది. ప్రస్తుతం భారతదేశంలో అత్యంత ధనిక ముఖ్యమంత్రి చంద్రబాబేనని స్పష్టంచేసింది. 2023–24 ఆర్థికసంవత్సరంలో దేశంలో వార్షిక తలసరి ఆదాయం కేవలం రూ. 1,85,854 కాగా సగటున ముఖ్యమంత్రి తలసరి ఆదాయం ఏకంగా రూ.13,64,310కు పెరిగింది. అంటే దేశంలో వార్షిక తలసరి మిగతా 2వ పేజీలో ▶

అగ్రగామిగా హైదరాబాద్.. సహకరించండి

ప్రభుత్వ ప్రయత్నాలకు మైక్రోసాఫ్ట్ మద్దతివ్వాలి

కంపెనీ చైర్మన్, సీఈఓ సత్య నాదెళ్లకు సీఎం రేవంత్ విజ్ఞప్తి

ఏఐ, జెన్ ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్‌పై ప్రభుత్వం దృష్టి పెడుతున్నట్లు వెల్లడి.. మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌తో కలిసి భేటీ

ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగస్వామిగా ఉంటామన్న సత్య నాదెళ్ల



సత్య నాదెళ్లకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: సాంకేతిక రంగంలో హైదరాబాద్‌ను ప్రపంచంలోనే అగ్రగామి నగరంగా నిలిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు మద్దతు ఇవ్వాలని మైక్రోసాఫ్ట్ చైర్మన్, సీఈఓ సత్య నాదెళ్లకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఏఐ, జెన్ (జెనరేటివ్) ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్ తదితరాలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారిస్తోందని, ఈ నేపథ్యంలో వివిధ సాంకేతిక అవసరాలకు అనుగుణంగా వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు సహకరించాలని కోరారు. సీఎం మిగతా 3వ పేజీలో ▶

తప్పు.. 'పుష్ప'..



గోటితో పోయేదానికి గొడ్డలా?: ఏపీ డిప్యూటీ సీఎం పవన్

- మానవతా దృక్పథం లోపించింది
- సినిమా టీమ్ ఫాల్ట్ ఉంది
- తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి బాగా పని చేస్తున్నారు

12లో



డాకింగ్ దిశగా... ఇస్రో తొలి అడుగు

పీఎస్‌ఎల్‌వీ ప్రయోగం విజయవంతం

- నిర్ధారిత కక్ష్యలోకి స్పేడెక్స్ జంట ఉపగ్రహాలు
- జనవరి 7న డాకింగ్ ప్రక్రియ: ఇస్రో
- సఫలమైతే నాలుగో దేశంగా రికార్డు
- గగన్‌యాన్, భావి మిషన్లకు కీలకం

- వివరాలు 6లో▶

అవినీతి లేకున్నా ఏసీబీ కేసు.. ఈడీది అత్యుత్సాహం

ఈసీఐఆర్ నమోదైనట్టు ఈడీ నుంచి నోటీసు వచ్చింది నిజమే: కేటీఆర్

ఫార్ములా–ఈ ప్రతినిధులతో భేటీని రేవంత్ ఏడాదిగా దాచిపెట్టారు

- డిస్ట్రాక్షన్, డిస్ట్రక్షన్, డైవర్షన్.. ఇదే సీఎం రేవంత్ త్రిముఖ వ్యూహం
- ప్రభుత్వ వైఫల్యాల నుంచి దృష్టి మళ్లించేందుకే అల్లు అర్జున్ అంశం..
- సినిమా వాళ్లతో సెటిల్‌మెంట్ చేసుకుని సైలెంట్ అయ్యారని ఆరోపణ

12లో

రూ. 24 కోట్ల ఆస్తిపై రూ. 91 కోట్ల రుణం



చట్టవిరుద్ధంగా సుజనా చౌదరికి రుణం.. ప్రజా ఆస్తుల దుర్వినియోగం

3 కంపెనీలు, రెవెన్యూ అధికారులు కుమ్మక్కు..

నిబంధనలకు విరుద్ధంగా లీజు ఆస్తి తాకట్టు.. అప్పట్లో ఎంపీ అయిన సుజనా చౌదరి బ్యాంకు అధికారులను ఏమార్చి ఉండవచ్చు

హైకోర్టులో హైదరాబాద్ వాసి పిటిషన్

12లో

ఇదండీ సంగతి



పాత సంవత్సరంలో ఇచ్చిన హామీలు కొత్త ఏడాది మర్చిపోతే బావుండు సార్!



▲ శత వసంతాల ఉత్సవాల సభలో మాట్లాడుతున్న డి.రాజా

మతతత్వ బీజేపీ నుంచి దేశానికి విముక్తి కల్పించాలి

రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాలి

లౌకిక, వామపక్ష శక్తులన్నీ ఐక్య పోరాటం చేయాలి

12లో సీపీఐ శత వసంతాల సభలో డి.రాజా

క్లుప్తంగా...

మన్మోహన్‌కు సంతాపంపై మాట్లాడేందుకు కేసీఆర్ వస్తారనుకున్నాం

ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



సాక్షి, హైదరాబాద్: మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు సంతాప తీర్మానంపై మాట్లాడేందుకు ప్రతిపక్ష నేత కేసీఆర్ అసెంబ్లీకి రాకపోవడం దౌర్భాగ్యమని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య వ్యాఖ్యానించారు. మన్మోహన్ కేబినెట్‌లో కేంద్ర మంత్రిగా పనిచేసిన కేసీఆర్ అసెంబ్లీకి వస్తారని ఆశించామని పేర్కొన్నారు. కానీ కేసీఆర్ రాకపోవడం నిరాశను కలిగించిందన్నారు. సోమవారం సీఎల్పీ కార్యాలయంలో ఐలయ్య విలేకరులతో మాట్లాడారు. మాజీ మంత్రి కేటీఆర్ మతిభ్రమించి మాట్లాడుతున్నారని, ఆయనకు కొత్త ఏడాదిలోనైనా దేవుడు మంచి బుద్ధిని ప్రసాదించాలని కోరుతున్నానని తెలిపారు. ఈ మేరకు లక్ష్మీనరసింహస్వామిని వేడుకుంటున్నట్టు చెప్పారు.

పోలీసు యంత్రాంగం కక్ష సాధిస్తోంది

- బీఆర్‌ఎస్ నాయకుడు ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పోలీసు యంత్రాంగం రాజకీయ కక్ష సాధింపులకు వేదికగా మారిందని బీఆర్‌ఎస్ నాయకుడు ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. ఏడాదిలోనే శాంతిభద్రతలు క్షీణించాయని, గాంధీభవన్ ఆదేశాల మేరకు బీఆర్‌ఎస్ నాయకులపై పోలీసులు కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ప్రభుత్వ వైఫల్యాలు ఎండగట్టిన వారిని పోలీసు స్టేషన్ల చుట్టూ తిప్పుతున్నారని మండిపడ్డారు. పోలీసు సైబర్ విభాగం.. బీఆర్‌ఎస్ నాయకులు, సోషల్ మీడియా వారియర్ల మీద నిఘా పెట్టిందన్నారు. సోషల్ మీడియాలో పోలీసులపై వార్తలు రావడంతో జగిత్యాల ఎస్పీ కేసులు నమోదు చేశారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావస్తున్నా హోమ్ శాఖకు మంత్రి లేరని ప్రవీణ్‌కుమార్ ధ్వజమెత్తారు. కాంగ్రెస్ నేతలు దాడులకు పాల్పడినా పోలీసులు కేసులు నమోదు చేయడం లేదని, లగచర్లలో గిరిజన మహిళలపై సీఎం సోదరుడు తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో వేధింపులు జరిగాయని ఆరోపించారు. సీఎం రేవంత్ సొంత గ్రామం కొండారెడ్డిపల్లిలో మాజీ సర్పంచ్ సాయిరెడ్డి ఆత్మహత్య ఘటనపై డీజీపీ మాట్లాడకపోవడాన్ని ప్రవీణ్‌కుమార్ ప్రశ్నించారు.

సంక్రాంతి తర్వాత పార్టీకి కొత్త అధ్యక్షుడు

బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: సంక్రాంతి పండుగ తర్వాత పార్టీని ఉరికించే కొత్త అధ్యక్షుడు వస్తున్నారని బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి వ్యాఖ్యానించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిస్తుందని, తెలంగాణ సచివాలయంపై తాము కాషాయ జెండా ఎగరేయడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. సోమవారం అసెంబ్లీ లాబీల్లో రాకేశ్‌రెడ్డి విలేకరులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. బాహుబలి-1లో భాగంగా (అధ్యక్షుడిగా మొదటగా) మూడేళ్ల సమయం ఇస్తామని, ఈ సందర్భంగా బాగా పనిచేస్తే బాహుబలి-2 (ఆ తర్వాత ఎన్నికల దాకా) అవకాశం ఇస్తామని తెలిపారు. మొదటి భాగంలో ఆశించిన విధంగా అధ్యక్షుడు పనిచేయకపోతే రెండో భాగంలో (బాహుబలి-2లో)మార్చేస్తామన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల సమయంలో తనకు ఉమ్మడి నల్లగొండ, వరంగల్, ఖమ్మం జిల్లాల ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించాలని నాయకత్వాన్ని కోరనున్నట్టు రాకేశ్‌రెడ్డి చెప్పారు. తాను కోరుకున్న విధంగా ఈ జిల్లాల బాధ్యతలను అప్పగిస్తే 18 ఎమ్మెల్యే సీట్లలో పార్టీని గెలిపించి చూపిస్తామని వ్యాఖ్యానించారు.

కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలే బీజేపీ టార్గెట్

అందుకే 'పుష్ప' వివాదంలోకి కేంద్ర మంత్రులు: ఎంపీ చామల



సాక్షి, హైదరాబాద్: సినీనటుడు అల్లు అర్జున్ సంధ్య థియేటర్ వివాదంలో బీజేపీ టార్గెట్ సీఎం రేవంత్‌రెడ్డి కాదని, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలే లక్ష్యంగా ఆ పార్టీ నేతలు ఈ వివాదంలో వేలు పెట్టారని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. కాంగ్రెస్ పరిపాలనలో ఉన్న రాష్ట్రాల్లో పరిస్థితి బాగాలేదని దేశానికి చెప్పాలనేది బీజేపీ లక్ష్యమని, అందుకే పుష్ప ఎపిసోడ్‌లో కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్, పురందేశ్వరి, బండి సంజయ్ జోక్యం చేసుకుంటున్నారన్నారు. సోమవారం అసెంబ్లీ లాబీల్లో చామల మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ, తెలంగాణ, కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్‌లలో పరిపాలన బాగా లేదని చెప్పడమే బీజేపీ ప్రధాన ఉద్దేశమని, వారు ఏదో చేయాలనుకున్నారని, కానీ నిజం నిలకడ మీద తెలిసిందని అన్నారు. సంధ్య థియేటర్ ఎపిసోడ్‌తో సినీ వర్గాలకు నష్టమేమీ జరగలేదని, ఆ సినిమా కలెక్షన్లు మరో 100 కోట్లు పెరిగాయని చెప్పారు. తాజాగా ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పాజిటివ్ మాటలు తమకు అనుకూలమని అనుకోవడం లేదని కిరణ్ అన్నారు.

మన్మోహన్‌కు భారతరత్న ఇవ్వాలి

▶ మొదటి పేజీ తరువాయి

రూపశిల్పి మన్మోహన్. 1991-96 మధ్య మన పీవీ ప్రధానిగా ఉన్నప్పుడు కేంద్ర ఆర్థిక మంత్రిగా భారత ఆర్థిక వ్యవస్థను సరళీకరించారు. ఆర్థిక స్థితిగతుల దశదిశను మార్చిన సంస్కరణల అమల్లో కీలకపాత్ర పోషించారు. ఆ పునాదులతోనే నేడు భారతదేశం ప్రపంచంతో పోటీపడుతోంది. ఆయన దార్శనికత, కృషిని అంతా స్మరించుకోవాలి.

ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో మన్మోహన్ విగ్రహం

మన్మోహన్‌సింగ్ దేశానికి, ప్రత్యేకంగా తెలంగాణకు చేసిన సేవలకు శాసనసభ అపార కృతజ్ఞతలు తెలియజేస్తోంది. 4 కోట్ల తెలంగాణ ప్రజలు ఆయనకు రుణపడి ఉన్నారు. తెలంగాణ ప్రజలకు సోనియా గాంధీ ఇచ్చిన మాటను పార్లమెంటరీ ప్రక్రియలో నెరవేర్చిన గొప్ప నేత మన్మోహన్. రాజ్యసభలో రాజ్యాంగ సవరణపై వచ్చిన చర్చలో తెలంగాణ రాష్ట్రం వెనక్కి పోతుందన్న గందరగోళ పరిస్థితి ఏర్పడినప్పుడు మన్మోహన్ వ్యూహాత్మకంగా ప్రకటన చేయడంతోనే తెలంగాణ ఏర్పడింది. నాటి కేంద్ర మంత్రి జైపాల్‌రెడ్డి ఆయనతో మాట్లాడి సమన్వయపర్చారు. రాష్ట్రానికి పురుడు పోసిన డాక్టర్‌గా, తెలంగాణ బిల్లును ఉభయసభల్లో ఆమోదింపజేసిన సారథిగా ఆయనను తెలంగాణ సమాజం ఎప్పటికీ గుండెల్లో పెట్టుకుంటుంది. తెలంగాణ ప్రజల తరఫున రాజకీయాలు, పార్టీలకు అతీతంగా కృతజ్ఞతలు తెలపడమే కాకుండా ఘన నివాళి అర్పించాల్సిన అవసరం ఉంది. తెలంగాణ ప్రజలు సోనియాకు ఎంత రుణపడి ఉంటారో మన్మోహన్‌కూ అంతే రుణపడి ఉంటారు. గొప్ప ఆర్థికవేత్త అయిన మన్మోహన్‌సింగ్ విగ్రహాన్ని హైదరాబాద్‌లోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఆవిష్కరించుకుందాం. ఆయన వర్ధంతి, జయంతి కార్యక్రమాలు చేసుకుందాం.

తెలంగాణ పట్ల ప్రత్యేక అభిమానం..

నేను మన్మోహన్ మరణవార్త తెలిసి హుటాహుటిన ఢిల్లీ వెళ్లి ఆయన కుటుంబాన్ని కలిసి తెలంగాణ సీఎంగా పరిచయం చేసుకున్నాను. మన్మోహన్ సతీమణి నాతో మాట్లాడారు. 'మన్మోహన్ తెలంగాణ రాష్ట్రాన్ని ప్రత్యేక పరిస్థితుల్లో ఇచ్చారు. ఆయనకు తెలంగాణ పట్ల ప్రత్యేక అభిమానం ఉంది. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించండి, ఆయన ఆశీస్సులు మీకు ఉంటాయి.' అని ఆమె చెప్పారు. దేశానికే ఆదర్శంగా నిలిచిన మన్మోహన్.. తన కుటుంబాన్ని అత్యంత నిరాడంబరంగా నడిపించారు. ఆయనను కోల్పోవడం వారి కుటుంబానికే కాదు యావత్ దేశానికి, ప్రపంచానికి తీరని లోటు. మౌనంగా ఉంటారని, మౌన ముని అని, యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్ అని రకరకాలుగా విమర్శించినా సహనాన్ని కోల్పోకుండా పనినే ధ్యాసగా, జీవిత లక్ష్యంగా చేసుకున్న గొప్ప వ్యక్తి మన్మోహన్. నేను, ఉత్తమ్, కోమటిరెడ్డి ఎంపీలుగా ఉన్నప్పుడు పార్లమెంట్‌లో ధర్నా చేస్తుంటే.. మన్మోహన్ కూడా మా మధ్య కూర్చుని నిరసన తెలిపారు. మాకు జీవితకాలం గుర్తుండిపోయే ఘటన అది.

గొప్ప మానవతావాదం చూపారు

ఉపాధి హామీ, సమాచార హక్కు, విద్యా హక్కు, ఆహార భద్రత వంటి నిర్ణయాలతో మన్మోహన్ చరిత్ర సృష్టించారు. గతంలో ప్రభుత్వాలు యజమానులతో సంబంధం లేకుండా భూములను తీసుకునేవి. కానీ కేవలం భూమి కోల్పోయే వారికే కాకుండా కులవృత్తులు, చేతువృత్తులపై ఆధారపడిన వారు, ఇళ్లు లేనివారికి సహాయ పునరావాసం అందేలా 2013లో భూసేకరణ చట్టం తెచ్చి గొప్ప మానవతావాదం చూపించారు. 2006లో అటవీ హక్కుల చట్టాన్ని తీసుకురావడంతో ఆదివాసులు, గిరిజనులకు పోడుభూములకు పట్టాలు ఇవ్వగలుగుతున్నాం. గొప్ప పరిపాలన అందించడానికి అంబేడ్కర్ రాజ్యాంగం ఇచ్చి పునాదులు వేయగా.. ఆ స్ఫూర్తితో మన్మోహన్ చట్టాలు తెచ్చి ప్రజలకు మేలు చేశారు..'' అని సీఎం రేవంత్ కొనియాడారు.

మన్మోహన్ చిరస్థాయిగా నిలిచిపోతారు

- పార్లమెంట్‌లో బలం లేకున్నా ప్రతిపక్షాలను ఒప్పించి తెలంగాణ తెచ్చారు
- ప్రజలకు మేలు చేసే ఉపాధి హామీ, ఆర్టీఐ, భూసేకరణ చట్టాలు తీసుకువచ్చారు
- మాజీ ప్రధానిని కొనియాడిన ఉప ముఖ్యమంత్రి, మంత్రులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఉన్నంతకాలం మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ పేరు నిలిచిపోతుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పాటుకు పార్లమెంట్‌లో అవసరమైన బలం లేకున్నా ప్రతిపక్షాలను ఒప్పించి నాటి యూపీఏ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, ప్రధాని మన్మోహన్ తెలంగాణ బిల్లును ఆమోదింపజేశారని గుర్తు చేసుకున్నారు. సోమవారం శాసనసభ ప్రత్యేక సమావేశంలో మన్మోహన్‌కు నివాళి అర్పిస్తూ ప్రవేశపెట్టిన తీర్మానంపై చర్చలో భట్టి విక్రమార్కతోపాటు మంత్రులు ఉత్తమ్, శ్రీధర్ బాబు, దామోదర రాజనర్సింహా, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీతక్క తదితరులు మాట్లాడారు.

రుణమాఫీకి స్ఫూర్తినిచ్చారు: భట్టి



చర్చలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ''ఎందరో పుట్టి మాయం అవుతారు. కొందరు మాత్రమే ఈ భూమిపై మానవీయ పరిమళాలు వెదజల్లుతారు. అందులో మన్మోహన్ ఒకరు. దేశంలో తొలిసారిగా రైతు రుణమాఫీ చేసిన ప్రధాని ఆయనే. నేడు రాష్ట్రంలో రూ.2 లక్షల రుణమాఫీ అమలుకు స్ఫూర్తి ప్రదాత ఆయనే. దేశ ఆర్థిక, సామాజిక స్థితులను అర్థం చేసుకొని సమాచార హక్కు, అటవీ హక్కు, భూసేకరణ, ఉపాధి హామీ వంటి చట్టాలను తీసుకువచ్చారు. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక సంక్షోభం ఏర్పడగా... ఉపాధి హామీతో దేశ ప్రజలు ఆర్థిక మాంద్యం బారిన పడకుండా కాపాడగలిగారు..''అని పేర్కొన్నారు.

అణు ఒప్పందం చేసుకున్న ధీశాలి: ఉత్తమ్



దేశానికి రైతు వెన్నెముక అయితే.. దేశ రైతాంగానికి మాజీ ప్రధాని మన్మోహన్ వెన్నెముకగా నిలిచారని మంత్రి ఉత్తమ్ పేర్కొన్నారు. యావత్ దేశ రైతాంగానికి ఏకకాలంలో ఋణమాఫీ చేసిన ఘనత ఆయనకే దక్కుతుందని చెప్పారు. అమెరికాతో అణు ఒప్పందం కుదుర్చుకోవడంతోపాటు ప్రతిపక్షాలు వ్యతిరేకించినా ఉభయసభల్లో బిల్లు పెట్టి ఆమోదింపజేసుకున్న ధీశాలి మన్మోహన్ అని కొనియాడారు. తన రాజకీయ గురువు పీవీ నరసింహారావు జన్మదిన వేడుకలను సంవత్సరం పొడవునా నిర్వహించాలని తమకు సూచించి గురుభక్తిని చాటుకున్నారని చెప్పారు.

114 ప్రెస్‌మీట్స్ పెట్టినా మౌన ప్రధానిగా విమర్శలు: శ్రీధర్‌బాబు



మన్మోహన్ ప్రధానిగా మీడియా, విపక్షాల నుంచి నిరంతరం విమర్శలను ఎదుర్కొన్నారని మంత్రి శ్రీధర్‌బాబు గుర్తు చేసుకున్నారు. ఆయన 114 ప్రెస్ మీట్లు పెట్టి మాట్లాడినా.. అన్యాయంగా మౌన ప్రధాని అని విమర్శించారని పేర్కొన్నారు. తెలుగు బిడ్డ పీవీ నాయకత్వంలో ఆర్థిక మంత్రిగా మన్మోహన్ తీసుకొచ్చిన సరళీకృత ఆర్థిక విధానాలే నేడు దేశ ప్రగతికి దోహదపడుతున్నాయని చెప్పారు.

మన్మోహన్‌కు గుర్తుగా పార్కు: కోమటిరెడ్డి



విగ్రహం ఏర్పాటు మాత్రమే కాకుండా మన్మోహన్ సింగ్‌కు గుర్తుగా మంచి పార్కును రూపొందించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కోరారు. పార్లమెంటు ఎదుట ఎంపీలుగా తాము ధర్నాలో ఉండగా, తమ మధ్య కూర్చుకుని మద్దతు తెలపటాన్ని ఎన్నటికీ మరువలేమన్నారు.

ఆయన వల్లే దేశ సుస్థిర ఆర్థిక పురోగతి: దామోదర రాజనర్సింహ



దేశం స్థిరమైన ఆర్థిక పురోగతిని సాధించటంలో ఆర్థిక మంత్రిగా, ప్రధానిగా మన్మోహన్ సింగ్ తీసుకున్న నిర్ణయాలే ప్రధాన కారణమని మంత్రి దామోదర రాజనర్సింహ కొనియాడారు. రాబోయే తరాలు కూడా ఆదర్శంగా తీసుకోవాల్సిన గొప్ప వ్యవహార శైలి మన్మోహన్‌సింగ్‌దని పేర్కొన్నారు.

దేశమంతా మాట్లాడుకునేలా చేశారు: మంత్రి పొన్నం



మన్మోహన్‌సింగ్ ఎక్కువగా మాట్లాడరని అంతా అంటారని, కానీ తాను చేసిన కార్యక్రమాలపై ప్రపంచమంతా మాట్లాడుకునేలా చేసిన గొప్ప వ్యక్తి ఆయన అని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. ప్రపంచంలో మరే రాజకీయ నేత సాహసించని రీతిలో ఆయన సమాచార హక్కు చట్టాన్ని తీసుకొచ్చారన్నారు.


ఆయన మాట్లాడితే ప్రపంచమంతా వింటుంది: సీతక్క



విద్యకు ఒకేసారి రూ.70 వేల కోట్లను బడ్జెట్‌లో ప్రతిపాదించటమే కాకుండా దేశ వ్యాప్తంగా 30 వేల పాఠశాలలను ఏర్పాటు చేశారని మన్మోహన్‌ను మంత్రి సీతక్క కొనియాడారు. మన్మోహన్ మాట్లాడితే ప్రపంచమంతా వింటుందని అమెరికా మాజీ అధ్యక్షుడు ఒబామా గొప్పగా చెప్పారని గుర్తు చేశారు.

స్కిల్స్ వర్సిటీకి మన్మోహన్ పేరు పెట్టాలి

- రాష్ట్ర ప్రభుత్వానికి బీఆర్‌ఎస్ సభ్యుడు హరీశ్‌రావు సూచన
- మన్మోహన్ ఎదిగిన తీరు ఆయన గొప్పతనాన్ని చాటుతోందని కితాబు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేస్తున్న స్కిల్స్ యూనివర్సిటీకి దివంగత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ పేరు పెట్టాలని బీఆర్ఎస్ సభ్యుడు హరీశ్‌రావు సూచించారు. వీధిదీపాల వెలుగుల్లో చదువుకొనే స్థాయి నుంచి ప్రధాని వరకు ఎదిగిన తీరు మన్మోహన్ గొప్పతనాన్ని చాటుతోందని ఆయన కొనియాడారు. విదేశాల్లో గొప్ప అవకాశాలు లభించినా దేశంపై ప్రేమతో వాటిని తిరస్కరించారని.. పదవులే ఆయనను వరించాయని కీర్తించారు. ఆర్థిక మంత్రిగా పార్లమెంటులో తొలి ప్రసంగం ఆర్థిక మంత్రుల ప్రసంగాల్లో ఉత్తమమైందిగా నిలిచిపోయిందన్నారు. ఆయన ప్రధానిగా ఉన్న సమయంలో ఎన్నో కుంభకోణాలు వెలుగుచూసినా, వ్యక్తిగా ఆయనకు ఒక్క మచ్చకూడా అంటుకోలేదని చెప్పారు. కేసీఆర్‌కు షిప్పింగ్ మంత్రిత్వ శాఖ ఇచ్చినప్పుడు డీఎంకే అభ్యంతరం వ్యక్తం చేస్తే కేసీఆరే స్వచ్ఛందంగా ఆ శాఖను వదులుకున్నారని.. ఈ తీరును మన్మోహన్ అభినందించారని హరీశ్‌రావు పేర్కొన్నారు.

కేసీఆర్ పొగడ్తలు ఎందుకు?: పొన్నం అభ్యంతరం

ఈ సమయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ జోక్యం చేసుకొని మన్మోహన్ గురించి మాత్రమే మాట్లాడేందుకే అసెంబ్లీ సమావేశమైందని.. ఇందులో కేసీఆర్ గురించి వర్ణించడం ఎందుకని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. అయినా హరీశ్ తన ప్రసంగంలో కేసీఆర్ ప్రస్తావన తేవడంతో ఇది సరికాదని స్పీకర్ సూచించారు. మన్మోహన్ సంతాప సభకు హాజరు కావాలని తాను స్వయంగా కేసీఆర్‌కు ఫోన్ చేసి పిలిచినా ఆయన సభకు రాలేదన్నారు. స్పీకర్ వ్యాఖ్యలపై హరీశ్ మండిపడ్డారు. సభ సభలాగా జరగట్లేదని.. కేసీఆర్‌కు సభలో ఏం గౌరవం ఇస్తున్నారని ప్రశ్నించారు. పీఏసీ చైర్మన్ విషయంలో కేసీఆర్ సూచనను ఎందుకు పట్టించుకోలేదని నిలదీశారు. చివరకు మంత్రి శ్రీధర్‌బాబు జోక్యం చేసుకొని మన్మోహన్ అంశానికే పరిమితమై మాట్లాడాలని హరీశ్‌కు సూచించారు. కాగా, మన్మోహన్‌కు భారతరత్న ప్రకటించడంతోపాటు ఢిల్లీలో పీవీ స్మారకాన్ని ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ సభ్యుడు తలసాని కోరగా మన్మోహన్ నిరాడంబర జీవితం గడిపారని బీజేపీ సభ్యుడు వెంకటరమణారెడ్డి కొనియాడారు.

నీటిపారుదల శాఖకు ఇంజనీర్లే వెన్నెముక: ఉత్తమ్

సాక్షి, హైదరాబాద్: నీటిపారుదల శాఖకు ఇంజనీర్లే వెన్నెముక అని నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. తెలంగాణ నీటిపారుదల ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ అసోసియేషన్ కేలండర్, డైరీని ఆవిష్కరించారు. శాఖను పటిష్టపరచడానికి ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ నూనె శ్రీధర్, సెక్రటరీ జనరల్ బి.గోపాలకృష్ణారావు పాల్గొన్నారు.

సావిత్రీబాయి పూలే జయంత్యుత్సవాలకు హాజరుకండి

సాక్షి, హైదరాబాద్: వచ్చే నెల 3న రవీంద్రభారతిలో నిర్వహించనున్న సావిత్రీబాయి పూలే 194వ జయంత్యుత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని అటవీ, పర్యావరణ, దేవాదాయ, ధర్మాదాయ శాఖమంత్రి కొండా సురేఖను.. తెలంగాణ రాష్ట్ర బీసీ ఉమెన్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కలిసి ఆహ్వానించారు.

సోనియా, రాహుల్ షాడో ప్రధానులుగా పనిచేశారు

- మన్మోహన్‌సింగ్ హయాంలో స్కాంలకు వారే కారణం
- కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: మన్మోహన్‌సింగ్ ప్రధానిగా ఉన్న సమయంలో జరిగిన అవినీతి, కుంభకోణాలకు కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీలే కారణమని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ఆరోపించారు. అప్పట్లో వారిద్దరూ షాడో ప్రధానులుగా పనిచేశారని, యూపీఏ ప్రభుత్వంలో నిర్ణయాధికారం మొత్తం సోనియా తన చేతిలో పెట్టుకున్నారని విమర్శించారు. మన్మోహన్‌సింగ్ ఆలోచనకు విరుద్ధంగా 2జీ స్పెక్ట్రంపై నిర్ణయం తీసుకున్నారని, ఆయనతో బలవంతంగా సంతకాలు పెట్టించి స్కాంకు పాల్పడ్డారని ఆరోపించారు. సోమవారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. మన్మోహన్‌సింగ్ మరణాన్ని కూడా రాజకీయం చేయడం కాంగ్రెస్ పార్టీ దివాళాకోరు తనానికి నిదర్శనమని కిషన్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ పెద్దలు అనేక పర్యాయాలు మన్మోహన్‌సింగ్‌ను అగౌరవపరిచారని అన్నారు. ఆయన సాధించిన ఘనతలు అన్నీ సోనియా అకౌంట్‌లో వేసి, ఇబ్బందులు మన్మోహన్‌సింగ్ ఖాతాలో వేశారని చెప్పారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు, సీనియర్ నేత ప్రణబ్ ముఖర్జీ పట్ల కూడా కాంగ్రెస్ ఏ విధంగా వ్యవహరించిందో ప్రజలకు తెలుసునన్నారు. పీవీని కాంగ్రెస్ అవమానించిందని, ఒక కాంగ్రెస్ నేతకు దక్కే గౌరవాన్ని కూడా ఆయనకి ఇవ్వలేదని విమర్శించారు. 'ఏఐసీసీ కార్యాలయంలోకి పీవీ పార్థివ దేహాన్ని రానివ్వలేదు. అంత్యక్రియలు ఢిల్లీలో జరపనివ్వలేదు.'అని ఆరోపించారు. మన్మోహన్‌సింగ్ మృతి నేపథ్యంలో దేశంలో సంతాప దినాలు పాటిస్తుంటే రాహుల్‌గాంధీ నూతన సంవత్సర వేడుకల కోసం వియత్నాం వెళ్లారని విమర్శించారు.

ఆ తల్లికి జీవితమంతా కష్టాలే..

- పన్నెండేళ్ల క్రితం అప్పుల భారంతో భర్త ఆత్మహత్య
- ఇప్పుడేమో నీట మునిగి కొడుకు మరణం... తల్లడిల్లుతున్న నిఖిల్ తల్లి
- ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్న గ్రామస్తులు



నిఖిల్ తల్లి స్వరూప

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: భర్త చావును తట్టుకుని నిలబడ్డ ఆ తల్లికి కొడుకు చావు పుట్టెడు దుఃఖాన్ని మిగిల్చింది. పన్నెండేళ్ల క్రితం అప్పుల బాధతో భర్త ఆత్మహత్య చేసుకున్నా నిలదొక్కుకుంది. పిల్లలే లోకంగా బతికింది. రెక్కలు ముక్కలు చేసుకుని పిల్లల్ని పెంచి పెద్ద చేసింది. ఎదిగిన పిల్లలకు ఓ గూడు చూపాలని ఈ మధ్యే ఆరేడు లక్షలు అప్పు చేసి ఇల్లు కట్టింది. పెళ్లిళ్లు చేసి ఓ ఇంటివాళ్లను చేయాలనుకుంది. ఇంతలోనే కొడుకు నీట మునిగి చనిపోవడంతో ఆ తల్లికి కడుపుకోత మిగిలింది. రాష్ట్రంలో సంచలనం కలిగించిన ఎస్సై, మహిళా కానిస్టేబుల్‌తో పాటు చెరువులో మునిగి చనిపోయిన నిఖిల్ తల్లి స్వరూప పరిస్థితి ఇది. కామారెడ్డి జిల్లా బీబీపేట మండల కేంద్రానికి చెందిన తోట లింగం ఇళ్లకు రంగులు వేసే వృత్తిలో, ఆయన భార్య స్వరూప బీడీలు చుడుతూ జీవనం సాగించేవారు. వాళ్లకు రాజేందర్, నిఖిల్ అనే ఇద్దరు కొడుకులు. అయితే పిల్లలు పెరుగుతున్న సమయంలో అప్పుల భారంతో లింగం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో కుటుంబ భారం అంతా భార్య స్వరూప పైనే పడింది. రాత్రింబవళ్లు కష్టపడుతూ పిల్లలిద్దరినీ పెంచి పెద్ద చేసింది. పెద్ద కొడుకు స్వయం ఉపాధి వెదుక్కున్నాడు, చిన్న కొడుకు నిఖిల్ కూడా స్థానికంగా ఉన్న సహకార సంఘంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేసేవాడు.

తల్లడిల్లిన హృదయం..

అయితే విధి ఆ తల్లిని చిన్నచూపు చూసింది. ఐదు రోజుల కిందట ఎస్సై, మహిళా కానిస్టేబుల్‌తో పాటు అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువులో మునిగి నిఖిల్ చనిపోవడంతో ఆ తల్లి తల్లడిల్లిపోయింది. ఆమె రోదనలు ఆ రోజు అందరినీ కదిలించాయి. కొడుకును కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న స్వరూపను బంధువులు, గ్రామస్తులు ఓదార్చి వెళుతున్నారు. అయితే ముగ్గురి మరణాలకు కారణం ఏమైనా.. ఎస్సై, కానిస్టేబుల్ కుటుంబాలకు శాఖాపరంగా, ప్రభుత్వపరంగా భరోసా ఉంటుందని, ఎలాంటి ఆధారం లేని నిఖిల్ తల్లికి భరోసా కావాలని గ్రామస్తులు అంటున్నారు. కొడుకును కోల్పోయిన స్వరూపను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

పీవీకి గౌరవ వీడ్కోలు దక్కలేదు

ఢిల్లీలో ఆయన స్మారకం ఏర్పాటు చేయాలి

- మన్మోహన్‌కు భారతరత్న, విగ్రహం ఏర్పాటుకు పూర్తి మద్దతు
- 'సాధారణ జీవితం-అసాధారణ ఆలోచనలు' అనే విధానానికి ఆయన ఉదాహరణ... సంతాప తీర్మానంపై చర్చలో కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: 'మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు దక్కిన గౌరవప్రదమైన వీడ్కోలు మన తెలుగు బిడ్డ పీవీ నరసింహారావుకు దక్కలేదనే బాధ కలిగింది. మన్మోహన్‌ను రాజకీయాల్లోకి తీసుకొచ్చి దేశానికి మంచి నేతను అందించిన పీవీకి ఢిల్లీలో స్మారకాన్ని ఏర్పాటు చేయాలి. మాజీ ప్రధానులందరికీ ఢిల్లీలో స్మారకం ఉండగా పీవీకి మాత్రం లేదు. ఢిల్లీలో పీవీ స్మారకం ఏర్పాటు చేయాలని కోరుతూ అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేయాలి..'అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కె.తారక రామారావు కోరారు. మన్మోహన్‌సింగ్ మృతి నేపథ్యంలో సోమవారం శాసనసభలో ప్రవేశపెట్టిన సంతాప తీర్మానంపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు.

మన్మోహన్‌ను పీవీయే రాజకీయాల్లోకి తెచ్చారు

మన్మోహన్ సింగ్‌కు భారతరత్న ఇవ్వాలని, అలాగే హైదరాబాద్‌లో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్న తీర్మానానికి, కేటీఆర్ తమ పార్టీ తరఫున సంపూర్ణ మద్దతు తెలిపారు. మన్మోహన్‌ను తెలుగు బిడ్డ పీవీ రాజకీయాల్లోకి లాటరల్ ఎంట్రీగా తీసుకొచ్చి ఆర్థిక మంత్రిని చేశారని గుర్తుచేశారు. యావత్ ప్రపంచం భారతదేశం విజయాల గురించి వినక తప్పదని తన తొలి బడ్జెట్ ప్రసంగంలోనే మన్మోహన్ అన్నారని చెప్పారు. 'సాధారణ జీవితం-అసాధారణ ఆలోచనలు' అనే విధానానికి మన్మోహన్ ఉదాహరణ అని పేర్కొన్నారు. విశ్వాసం, నిబద్ధత నేటి రాజకీయాల్లో అత్యంత అరుదుగా మారాయని, కానీ తనకు అవకాశమిచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఆయన కడ వరకూ సేవలందించారని కొనియాడారు.

తెలంగాణ ఆకాంక్ష నెరవేరుతుందంటూ దీవించారు

మన్మోహన్ సింగ్ మంత్రివర్గంలో కేసీఆర్‌కు తొలుత షిప్పింగ్ శాఖను కేటాయించగా, మిత్రపక్షం డీఎంకే ఆ శాఖను కోరుకోవడంతో స్వచ్ఛందంగా వదులుకున్నారని కేటీఆర్ గుర్తు చేశారు. తనకు పదవులు వద్దని, తెలంగాణ కోసం వచ్చానని నాడు మన్మోహన్‌కు కేసీఆర్ తెలియజేయగా, మీ ఆకాంక్ష తప్పకుండా నెరవేరుతుందంటూ ఆయన దీవించారని తెలిపారు. కేసీఆర్ విజ్ఞప్తి మేరకు ఓబీసీల సమస్యలు వినడానికి నాటి ప్రధాని మన్మోహన్ 45 నిమిషాల సమయం ఇచ్చి గంటన్నరపాటు చర్చించారని చెప్పారు. సైలెంట్ ఆర్కిటెక్ట్ ఆఫ్ ఇండియాగా మన్మోహన్‌సింగ్ పేరుగాంచారన్నారు. ఎన్ని నిందలు వేసినా మౌనంగా ఉండి సంస్కరణలను అద్భుతంగా ముందుకు తీసుకుపోయిన వ్యక్తి అని కొనియాడారు.


సంతాప సమయంలో రాహుల్ వేడుకలా?



- అసెంబ్లీ చర్చలో బీజేఎల్పీ నేత ఏలేటి ఆరోపణ
- కాంగ్రెస్ అభ్యంతరం.. సభ రికార్డుల నుంచి వ్యాఖ్యలు తొలగింపు
- ఏలేటి తీరును తప్పుబట్టిన కూనంనేని

సాక్షి, హైదరాబాద్: మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి నేపథ్యంలో దేశం సంతాప దినాలను పాటిస్తుండగా, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నూతన సంవత్సర వేడుకల కోసం వియత్నాం వెళ్తున్నారని బీజేపీపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. మన్మోహన్ మృతి నేపథ్యంలో సోమవారం శాసనసభలో ప్రవేశపెట్టిన సంతాప తీర్మానంపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. మన్మోహన్ మరణిస్తే కేంద్రం ఢిల్లీలో ఆయనకు స్మారక స్థలం కేటాయించిందని ఏలేటి చెప్పారు. ఈ విషయంలో ఇతర ప్రధానులందరికీ దక్కిన గౌరవం తెలుగు బిడ్డ పీవీకి దక్కలేదని, సోనియా, ఆమె కుటుంబం పీవీపై ఏ స్థాయిలో కక్ష పెట్టుకుందో దీంతో తెలుస్తోందన్నారు. ఏలేటి ఆరోపణల పట్ల అధికార కాంగ్రెస్ సభ్యులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. మంత్రి డి.శ్రీధర్‌బాబు విజ్ఞప్తి మేరకు ఏలేటి వ్యాఖ్యలను సభా రికార్డుల నుంచి తొలగిస్తున్నట్టు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రకటించారు. సంతాప తీర్మానంపై రాజకీయాలు చేస్తూ వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం సరికాదని మంత్రి పొన్నం ఆగ్రహం వ్యక్తం చేశారు. మన్మోహన్‌కు భారతరత్న, ఆయన విగ్రహం ఏర్పాటుకి ప్రతిపాదించిన తీర్మానానికి బీజేపీ, సీపీఐ, ఎంఐఎం సైతం మద్దతు తెలిపాయి.

సంతాప తీర్మానంపై వివాదాలా: కూనంనేని



సంతాప తీర్మానంపై చర్చలో వివాదాస్పద అంశాలను లేవనెత్తిన సాంప్రదాయం గతంలో ఎన్నడూ చూడలేదని బీజేపీ సభ్యుడు ఏలేటి తీరును సీపీఐ సభ్యుడు కూనంనేని సాంబశివరావు తప్పుబట్టారు. బీఆర్ఎస్ సభ్యుడు కేటీఆర్ కూడా హుందాగా మాట్లాడారని గుర్తు చేశారు. ఇలాంటి వివాదాలతో మన్మోహన్ ఆత్మ క్షోభిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. నీతి, నిజాయితీ, నిబద్ధతకు నిలువుటద్దం మన్మోహన్ సింగ్ అని ఆయన కొనియాడారు.

మైనారిటీల సంక్షేమానికి నిబద్ధతతో పనిచేశారు: ఎంఐఎం



మైనారిటీల సంక్షేమానికి మాజీ ప్రధాని మన్మోహన్ నిబద్ధతతో పనిచేశారని ఎంఐఎం సభ్యుడు మీర్ జుల్ఫికర్ అలీ కొనియాడారు. దేశంలో ముస్లింల స్థితిగతులపై సచార్ కమిషన్ ఏర్పాటు చేశారని, వారి సంక్షేమానికి ప్రధానమంత్రి 15 పాయింట్ ప్రోగ్రాం అమలు చేశారని చెప్పారు.

అత్యంత ధనిక సీఎం చంద్రబాబు

▶ మొదటి పేజీ తరువాయి

సగటు కంటే సీఎం ఆదాయం ఏకంగా 7.3 రెట్లు అధికంగా ఉంది. దేశంలోని మొత్తం 31 మంది ముఖ్యమంత్రుల ఆస్తుల విలువ రూ.1,630 కోట్లుగా ఉందని నివేదిక వెల్లడించింది. మోదీ సర్కార్ విధానాలను తీవ్రంగా తప్పుబట్టే తృణమూల్ కాంగ్రెస్ చీఫ్ మమతా బెనర్జీ పేరిట కేవలం రూ.15 లక్షల ఆస్తులు ఉండటం విశేషం. చంద్రబాబు తర్వాత దేశంలో రెండో అత్యంత ధనిక ముఖ్యమంత్రిగా అరుణాచల్‌ప్రదేశ్ సీఎం పేమా ఖండూ నిలిచారు. ఆయన పేరిట రూ.332 కోట్ల ఆస్తులు ఉన్నాయి. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఈ జాబితాలో మూడోస్థానంలో నిలిచారు. ఆయన పేరిట రూ.51.93 కోట్ల ఆస్తులు ఉన్నాయి. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేరిట రూ.30 కోట్లకుపైగా ఆస్తులున్నాయి. ఒక కోటి రూపాయల అప్పు ఉంది. జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా పేరిట రూ.55 లక్షల ఆస్తులున్నాయి. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ పేరిట రూ.1.18 కోట్ల ఆస్తులున్నాయి. ముఖ్యమంత్రుల సగటు ఆస్తి ఏకంగా రూ.52.59 కోట్లుకావడం గమనార్హం.

42 శాతం సీఎంలపై క్రిమినల్ కేసులు: నివేదికలో పేర్కొన్న ముఖ్యమంత్రుల్లో 42 శాతం మందిపై.. అంటే 13 మందిపై క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. వీరిలో 32 శాతం మందిపై.. అంటే పది మందిపై హత్య, అపహరణ, ముడుపులు వంటి అత్యంత తీవ్రమైన క్రిమినల్ కేసులున్నాయి. అత్యధిక క్రిమినల్ కేసులు ఉన్న ముఖ్యమంత్రిగా తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి నిలిచారు. ఆయనపై ఏకంగా 89 కేసులు పెండింగ్‌లో ఉండగా వాటిలో 72 కేసులు తీవ్రమైన నేరాలకు సంబంధించినవి ఉన్నాయి. రేవంత్‌రెడ్డి తర్వాత స్థానాల్లో 47 కేసులతో తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, 19 కేసులతో చంద్రబాబు ఉన్నారు. అరుణాచల్ ముఖ్యమంత్రి ఖండూకు అత్యధికంగా రూ.180 కోట్ల అప్పులు ఉన్నాయి. సిద్ధరామయ్య రూ. 23 కోట్లు, చంద్రబాబు నాయుడుకు రూ.10 కోట్లకు పైగా అప్పులు ఉన్నాయని ఏడీఆర్ తన నివేదికలో పేర్కొంది. 31 మంది సీఎంలలో 9 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్లు కాగా, ఇద్దరు డాక్టరేట్ పట్టా పొందారు. అఫిడవిట్లు దాఖలు చేసే సమయానికి ఆరుగురు ముఖ్యమంత్రులు 71 నుంచి 80 ఏళ్ల మధ్య వయస్కులు కాగా, 12 మంది సీఎంలు 51 నుంచి 60 ఏళ్ల మధ్య వయస్కులేనని ఏడీఆర్ నివేదిక పేర్కొంది. మొత్తం 31 మంది ముఖ్యమంత్రుల్లో కేవలం ఇద్దరే మహిళా సీఎంలు(మమతా బెనర్జీ, అతిశీ మార్లేనా) ఉన్నట్టు తెలిపింది.

క్లుప్తంగా...

మందా జగన్నాథం ఆరోగ్యం విషమం

నిమ్స్‌లో ప్రముఖుల పరామర్శ



లక్డీకాపూల్ (హైదరాబాద్): నిమ్స్‌లో చికిత్స పొందుతున్న నాగర్ కర్నూల్ మాజీ ఎంపీ మందా జగన్నాథం ఆరోగ్యం విషమంగా మారింది. దీంతో ఆయనకు వైద్యులు వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నారు. జగన్నాథం కొంతకాలంగా కిడ్నీలు, ఊపిరితిత్తుల సమస్యలతో బాధపడుతున్నారు. డిసెంబర్ 26న ఆయనకు గుండెపోటు రావడంతో కుటుంబసభ్యులు నిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న ఆయనను పలువురు ప్రముఖులు పరామర్శించారు. సోమవారం నిమ్స్‌కు వచ్చిన మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్కలు ఆయనను పరామర్శించారు. మందా ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మంత్రుల వెంట ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి కూడా ఉన్నారు. అదేవిధంగా జగన్నాథంను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కాగా అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ తల్లి జోగమ్మను కూడా కేటీఆర్ పరామర్శించారు.

మళ్లీ వెంటిలేటర్‌పై శ్రీతేజ్

రాంగోపాల్‌పేట్: పుష్ప–2 బెనిఫిట్ షో సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాటలో గాయపడి కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజ్ ఆరోగ్య పరిస్థితి కాస్త దెబ్బతిన్నది. రెండు రోజులుగా ఆక్సిజన్ తీసుకోవడంలో అతనికి ఇబ్బందులు ఎదురవుతుండటంతో వెంటిలేటర్ అవసరం వస్తున్నట్లు వైద్యులు తెలిపారు. అయితే శ్రీతేజ్‌కు జ్వరం లేదని.. నాసోగాస్ట్రిక్ ట్యూబ్ ద్వారా ఆహారం సాధారణంగా తీసుకుంటున్నాడని వివరించారు.

జనవరి 9 వరకు హరీశ్ అరెస్టు వద్దు

ఫోన్ ట్యాపింగ్ కేసులో మరోసారి హైకోర్టు ఊరట

సాక్షి, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్‌పై పంజగుట్ట పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో మాజీ మంత్రి, సిద్దిపేట శాసనసభ్యుడు హరీశ్‌రావును జనవరి 9 వరకు అరెస్టు చేయొద్దని హైకోర్టు ఆదేశించింది. గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పొడిగించింది. రాజకీయ కక్షతో చక్రధర్‌గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పంజగుట్ట పీఎస్‌లో తనపై నమోదు చేసిన 'ట్యాపింగ్' కేసును కొట్టి వేయాలని కోరుతూ హరీశ్‌రావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. నిరాధార ఆరోపణతో నమోదు చేసిన ఎఫ్ఐఆర్ చెల్లదన్నారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ సోమవారం విచారణ చేపట్టారు. వాదనలకు సమయం కావాలని ప్రభుత్వ న్యాయవాది కోరడంతో తదుపరి విచారణను వాయిదా వేశారు.

శిక్షణలేని బౌన్సర్ల వల్లే సంధ్య థియేటర్ ఘటన

సెక్యూరిటీ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ వెల్లడి

పంజగుట్ట: రాష్ట్రంలో ఇటీవల కాలంలో సెటిల్‌మెంట్లు చేసేవారు కూడా బౌన్సర్లను నియమించుకుంటున్నారని.. ప్రజలకు ఎవరు బౌన్సర్లో, ఎవరు రౌడీలో అర్థంకాని పరిస్థితి నెలకొందని సెక్యూరిటీ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆవేదన వ్యక్తం చేసింది. లైసెన్స్ లేని ప్రైవేటు సెక్యూరిటీ సంస్థలు, ఎలాంటి శిక్షణ లేని బౌన్సర్ల వల్లే ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోందని పేర్కొంది. ఇటీవలి సంధ్య థియేటర్‌లో జరిగిన ఘటనకు శిక్షణలేని బౌన్సర్లే కారణమని పేర్కొంది. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో అసోసియేషన్ చైర్మన్ డి.ఎస్.రెడ్డి, అధ్యక్షుడు శ్రీకాంత్ మాట్లాడుతూ రాష్ట్రంలో 840 సెక్యూరిటీ సంస్థలు లైసెన్స్‌లు పొందాయన్నారు. నేరచరిత్ర ఉందో లేదో చూసుకోవడంతోపాటు సమగ్ర శిక్షణ అందించాకే ఆయా సంస్థలు బౌన్సర్లను నియమించుకుంటున్నాయని చెప్పారు. అందువల్ల వీఐపీలు, సెలబ్రిటీలు బౌన్సర్లను ఏర్పాటు చేసుకొనే ముందు ఈ విషయాలను సరిచూసుకోవాలని సూచించారు. కాగా, రాష్ట్రంలో 5 లక్షల మంది ప్రైవేటు సెక్యూరిటీగా పనిచేస్తున్నారని.. వారికి ప్రభుత్వం ఒకే డ్రెస్ కోడ్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్, దినేష్ పాల్గొన్నారు.



పరుచుకున్న పచ్చదనం.. ప్రయాణం ఆహ్లాదం

నిజామాబాద్ జిల్లా కేంద్రం నుంచి ఆర్మూర్ వెళ్లే 63వ జాతీయ రహదారిని ఆనుకొని అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. ఈ మార్గం గుండా రాకపోకలు సాగించే ప్రయాణికులకు ఇరువైపులా పచ్చదనం కనువిందు చేస్తూ ఆహ్లాదం కలిగిస్తోంది.

- సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్-నిజామాబాద్

అగ్రగామిగా హైదరాబాద్.. సహకరించండి

▶ మొదటి పేజీ తరువాయి

సోమవారం.. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి బంజారాహిల్స్‌లోని సత్యనాదెళ్ల నివాసంలో ఆయనతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో మైక్రోసాఫ్ట్ కార్యకలాపాలపై చర్చించారు. రీజినల్ రింగు రోడ్డు, రేడియల్ రోడ్లు, ఫ్యూచర్ సిటీ, కొత్తగా మాన్యుఫాక్చరింగ్ క్లస్టర్ల అభివృద్ధికి సంబంధించిన అంశాలను వివరించారు. రాష్ట్రంలో మౌలిక వసతుల కల్పనకు అమలు చేస్తున్న ప్రణాళికలు, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా నైపుణ్య శిక్షణ వంటి అంశాలను వివరించారు. హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ పెట్టుబడులను పెంచడంపై రేవంత్ కృతజ్ఞతలు తెలిపారు.



సోమవారం సత్యనాదెళ్లను కలిసిన సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో సీఎస్ శాంతికుమారి, మంత్రులు ఉత్తమ్, శ్రీధర్‌బాబు, ఐటీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్

నైపుణ్యాభివృద్ధితో టాప్ ఫిఫ్టీకి: సత్య నాదెళ్ల

తెలంగాణ ప్రభుత్వం చేపట్టే అన్ని కార్యక్రమాల్లో భాగస్వామిగా ఉంటామని సత్య నాదెళ్ల ప్రకటించారు. నైపుణ్యాభివృద్ధి, భవిష్యత్ అవసరాలకు తగిన రీతిలో మౌలిక సదుపాయాలు మెరుగుపరిచే అంశంలో ముఖ్యమంత్రి దార్శనికతను ఆయన ప్రశంసించారు. నైపుణ్యాభివృద్ధి, మెరుగైన మౌలిక వసతులే ఆర్థికాభివృద్ధికి దోహదపడతాయని, హైదరాబాద్‌ను ప్రపంచంలోని 50 అగ్రశ్రేణి నగరాల జాబితాలో చేర్చుతాయని చెప్పారు. హైదరాబాద్‌లో ఏర్పాటైన తొలి సాంకేతిక సంస్థల్లో ఒకటైన మైక్రోసాఫ్ట్ ప్రస్తుతం ఇక్కడ పది వేల మందికి ఉపాధి కల్పిస్తోందని తెలిపారు. రాష్ట్రంలో 600 మెగావాట్ల సామర్థ్యం కలిగిన డేటా సెంటర్ల ఏర్పాటుకు పెట్టుబడి పెట్టామని గుర్తుచేశారు. సీఎస్ శాంతికుమారి, ఐటీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి ఈ భేటీలో పాల్గొన్నారు.

ఆర్ అండ్ డీ సెంటర్ ఏర్పాటు చేయండి: శ్రీధర్‌బాబు

సీఎం భేటీ అనంతరం మంత్రి శ్రీధర్‌బాబు నేతృత్వంలోని ప్రతినిధి బృందం సత్య నాదెళ్లతో సమావేశమై పలు అంశాలపై చర్చించింది. ఇటీవల కొత్తగా మరో 4 వేల ఉద్యోగాల కల్పనకు మైక్రోసాఫ్ట్ ముందుకు రావడంపై మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. చందనవెల్లిలో రెండు, మేకగూడ, షాద్‌నగర్‌లో ఒక్కో సెంటర్ చొప్పున మొత్తంగా 600 మెగావాట్ల సామర్థ్యం కలిగిన మైక్రోసాఫ్ట్ డేటా సెంటర్ల ఏర్పాటును స్వాగతించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న క్లౌడ్ కంప్యూటింగ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో మైక్రోసాఫ్ట్ భాగస్వామ్యం కావాలని విజ్ఞప్తి చేశారు. ఫ్యూచర్ సిటీలో భాగంగా నిర్మించే ఏఐ సిటీలో 'ఏఐ సాంకేతికత'కు సంబంధించి ప్రత్యేక పరిశోధన, అభివృద్ధి కేంద్రం (ఆర్ అండ్ డీ), ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీలో నిర్వహిస్తున్న నైపుణ్య శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా ఏఐ, జెన్ ఏఐ కోర్సుల్లో మైక్రోసాఫ్ట్ శిక్షణ ఇవ్వాలని శ్రీధర్‌బాబు విజ్ఞప్తి చేశారు.

రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ పర్వతరావుకు హైకోర్టు నివాళి



సాక్షి, హైదరాబాద్: విద్యాభివృద్ధికి జస్టిస్ ఎస్.పర్వతరావు ఎంతో కృషి చేశారని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే పేర్కొన్నారు. గౌతమి సేవా సమితికి 27 ఎకరాల భూమిని విరాళంగా ఇచ్చారని కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు రిటైర్డు న్యాయమూర్తి జస్టిస్ ఎస్.పర్వత రావు (90)కు తెలంగాణ హైకోర్టు ఘన నివాళి అర్పించింది. ప్రధాన న్యాయమూర్తి ఆధ్వర్యంలో న్యాయమూర్తులు హైకోర్టు మొదటి కోర్టు హాల్లో సోమవారం ప్రత్యేకంగా సమావేశమై సంతాపం తెలియజేశారు. ఈ సందర్భంగా జస్టిస్ పర్వతరావు అందించిన సేవలను కొనియాడారు. ఆయన వెలువరించిన కీలక తీర్పులను ప్రధాన న్యాయమూర్తి గుర్తు చేశారు. ఎంసెట్ రాసిన విద్యార్థులకు తమ జవాబు పత్రాన్ని తిరిగి మూల్యాంకనం చేయాలని కోరే హక్కు ఉంటుందనే కీలక తీర్పు ఇచ్చారన్నారు. ఏజీ ఎ.సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. జస్టిస్ పర్వత రావు 1961లో న్యాయవాదిగా నమోదు చేసుకుని నాటి ఏజీ డి. నరసరాజు వద్ద జూనియర్‌గా ప్రాక్టీస్ ప్రారంభించారన్నారు. 1990లో ఏపీ హైకోర్టు న్యాయ మూర్తిగా నియమితులై 1997లో పదవీ విరమణ చేశారని తెలిపారు. జస్టిస్ పర్వతరావు డిసెంబర్ 12న కన్నుమూసిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ పి.వెంకట్రామిరెడ్డి, హైకోర్టు రిటైర్డు న్యాయమూర్తి జస్టిస్ సి.కోదండరాం, అదనపు సొలిసిటర్ జనరల్ నర్సింహాశర్మ, బార్ కౌన్సిల్ చైర్మన్ ఎ. నర్సింహారెడ్డి, హైకోర్టు బార్ అసోసియేషన్ చైర్మన్ ఎ.రవీందర్‌రెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.నాగేశ్వర్ రావు, రిటైర్డు న్యాయమూర్తుల సంఘం అధ్యక్షుడు జస్టిస్ జి.యతిరాజు తదితరులు పాల్గొన్నారు.

'ఉపకార' దరఖాస్తులు 62 శాతమే

నేటితో ముగియనున్న గడువు.. కనీసం నెలపాటు పొడిగించనున్న ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పోస్టుమెట్రిక్ విద్యార్థుల ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాల దరఖాస్తు ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. ఈ ఏడాది సెప్టెంబర్‌తో మొదలైన ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ గడువు నేటితో ముగియ నున్నప్పటికీ కేవలం 62 శాతం మందే రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఉపకార వేత నాలు, ఫీజు పథకాలకు సంబంధించి ఏటా సగటున 12.5 లక్షల దరఖాస్తులు వస్తుండగా 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇప్పటివరకు 7.75 లక్షల మందే దరఖాస్తులు సమర్పించారు. వారిలో ఫ్రెషర్స్ 3.11 లక్షల మంది ఉండగా... రెన్యువల్ విద్యార్థులు 4.64 లక్షల మంది ఉన్నారు. మరోవైపు వివిధ వృత్తివిద్యా కోర్సుల్లో ప్రవేశాల ప్రక్రియ ఇంకా కొనసాగుతుండటంతో ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ రిజిస్ట్రేషన్‌ను కొనసాగించాల్సిన అవసరం ఉందని సంక్షేమ శాఖలు నిర్ణయించాయి. అందుకు అనుగుణంగా గడువును మరో 3 నెలలు పొడిగించేందుకు అనుమతివ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరాయి. అయితే ప్రభుత్వం కనీసం మరో నెలపాటు అవకాశం ఇచ్చేందుకు సుముఖంగా ఉంది. ఇందుకు సంబంధించి ఒకట్రెండు రోజుల్లో ప్రభుత్వం అనుమతించే అవకాశం ఉంది.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో కదం తొక్కిన మెప్మా ఉద్యోగులు



ధర్నాలో మాట్లాడుతున్న రూప్‌సింగ్. హాజరైన మెప్మా ఉద్యోగులు

కవాడిగూడ (హైదరాబాద్): రాష్ట్రంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) పరిధిలో పనిచేస్తున్న 6 వేల మంది రిసోర్స్ పర్సన్స్‌కు 2024 జూన్ నుంచి డిసెంబర్ వరకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని, అధికారుల వేధింపులు, వెట్టిచాకిరీ నుంచి విముక్తి కల్పించాలని సంస్థ, రిసోర్స్ పర్సన్ల సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎల్.రూప్‌సింగ్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రిసోర్స్ పర్సన్స్‌కు ప్రభుత్వపరంగా ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించి సెర్ప్ ఉద్యోగులకు వీవోఏల మాదిరిగా గౌరవ వేతనం చెల్లించాలని కోరారు. సోమవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మెప్మా, రిసోర్స్ పర్సన్స్ (ఆర్పీ) సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో మహాధర్నా చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మెప్మా ఉద్యోగులు పెద్దసంఖ్యలో ధర్నాకు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎల్.రూప్‌సింగ్, బీఆర్ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జి.రాంబాబు యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వ కార్యక్రమాలకు మహిళలను సమీకరించడంతోపాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన వారికి అందించడంలో మెప్మా ఉద్యోగులు ప్రభుత్వ ఉద్యోగులకంటే ఎక్కువగా పనిచేస్తున్నారని, అయినప్పటికి ప్రభుత్వం వారిని గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మెప్మా ఉద్యోగులకు సంబంధం లేని పనులను చేయిస్తూ ఉన్నతాధికారులు వేధింపులకు గురిచేస్తున్నారని వారు ఆరోపించారు.

'డీట్'తో మరిన్ని ప్రైవేటు కొలువులు!

పరిశ్రమలు, వాణిజ్య శాఖతో డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ యాప్ అనుసంధానం

రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేస్తే ఉచితంగా ఉద్యోగ ఖాళీల సమాచారం

ఇంటర్వ్యూ తేదీలు, అర్హత, శిక్షణకు సంబంధించి ఎప్పటికప్పుడు వివరాలు

సాక్షి, హైదరాబాద్: ప్రైవేటు సంస్థల్లో అందుబాటులో ఉన్న ఉద్యోగ అవకాశాలను నిరుద్యోగుల దరికి చేర్చేందుకు 2019లో ఏర్పాటు చేసిన ఏఐ ఆధారిత జాబ్ పోర్టల్/ యాప్ 'డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ' (డీట్)ను తెలంగాణ ప్రభుత్వం తాజాగా విస్తృతపరిచింది. ఇప్పటివరకు కార్మిక, ఉపాధి కల్పన విభాగంతో 'డీట్' కలిసి పనిచేస్తుండగా ఇకపై పరిశ్రమలు, వాణిజ్య శాఖతోనూ అనుసంధానం కానుంది. గతంలో కార్మిక శాఖ కింద రిజిస్టర్ అయిన ప్రైవేటు సంస్థల్లోని ఉద్యోగ ఖాళీల సమాచారం మాత్రమే కనిపించే పరిస్థితి ఉండగా ప్రభుత్వ తాజా నిర్ణయంతో పరిశ్రమలు, వాణిజ్య శాఖ కింద రిజిస్టర్ అయిన ప్రైవేటు సంస్థల్లోని ఉద్యోగ ఖాళీల సమాచారం కూడా నిరుద్యోగులకు అందుబాటులోకి రానుంది. ఈ యాప్ సేవలు పూర్తిగా ఉచితమని పరిశ్రమలు, వాణిజ్య శాఖ తెలిపింది. ఇటీవలే 'డీట్' కొత్త లోగోను ప్రభుత్వం ఆవిష్కరించడం తెలిసిందే.

నైపుణ్యాభివృద్ధి, శిక్షణ సమాచారం కూడా..

ఉద్యోగ ఖాళీలకు సంబంధించిన సమాచారంతోపాటు నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలకు సంబంధించిన సమాచారం కూడా 'డీట్'లో లభిస్తుంది. ఉద్యోగ ఖాళీలు, ఇంటర్వ్యూ తేదీలు, ఇతర సమాచారం దీనిద్వారా లభిస్తుంది. ఉద్యోగాలు అందించే సంస్థ ప్రతినిధితో నేరుగా మాట్లాడటం, ఇంటర్వ్యూలో పాల్గొనడం, ఆ తర్వాత ఎంపిక ప్రక్రియ, చేరిక, నియామకపత్రం అందజేత తదితర పూర్తి ప్రక్రియంతా ఈ యాప్ ద్వారా జరుగుతుంది.

రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఇలా..

- నిరుద్యోగులు గూగుల్ ప్లేస్టోర్ నుంచి డీట్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి.
- పేరు, మొబైల్ నంబర్, ఈ–మెయిల్ ఐడీ, తదితర వివరాలు సమర్పించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.
- యాప్‌లోకి లాగిన్ అయ్యాక ఉద్యోగాలను అన్వేషిస్తూ విద్యార్హతలకు తగిన ఉద్యోగాలను తెలుసుకోవచ్చు.

మహిళలకు భద్రత కరువైంది

ఎమ్మెల్సీ కవిత విమర్శ



నిజామాబాద్ అర్బన్: కాంగ్రెస్ పార్టీకి బీజేపీ తోక పార్టీలా మారిందని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. సోమవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. బీజేపీ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏమాత్రం ప్రశ్నించడం లేదన్నారు. రైతుబంధు ఇవ్వాలన్న సోయి ఈ ప్రభుత్వానికి లేదని, రైతు కూలీలకు కూడా సాయం చేస్తామన్న ప్రభుత్వం ఎవరికీ ఇవ్వలేదని విమర్శించారు. హామీల అమలులో నిర్లక్ష్యం వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులను ప్రశ్నించాలని ఆమె ప్రజలకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో మహిళలకు భద్రత లేదని కవిత ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రతి మూడు గంటలకు ఒక అత్యాచారం జరుగుతోందని, ప్రతి ఐదు గంటలకు ఒక మహిళ కిడ్నాప్ అవుతోందని డీజీపీ వెల్లడించిన గణాంకాలు తెలియజేస్తున్నాయన్నారు. మహిళా భద్రత కోసం కేసీఆర్ షీటీమ్స్ ఏర్పాటు చేస్తే, సీఎం రేవంత్ రెడ్డి మహిళా భద్రతను గాలికొదిలేశారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి మహిళా భద్రతపై ప్రత్యేకంగా సమీక్షించాలని కవిత డిమాండ్ చేశారు.

ఇందిరా మహిళా శక్తి ద్వారా సంచార చేపల విక్రయ వాహనాలు

3న ప్రారంభించనున్న మంత్రి సీతక్క



సాక్షి, హైదరాబాద్: మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తాజాగా సంచార చేపల విక్రయ వాహనాలను సమకూర్చుతోంది. మహిళా సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఆదేశాలతో ఈ వాహనాలను గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) సిద్ధం చేస్తోంది. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా మహిళా సంఘాల ద్వారా పలు వ్యాపారాలను ప్రారంభింపజేయనున్నారు. జిల్లాకు ఒకటి చొప్పున మొత్తం 32 వాహనాలను మహిళా సంఘాల కోసం ప్రత్యేకంగా తయారు చేయిస్తున్నారు. ఒక్కో వాహనానికి రూ. 10 లక్షలు ప్రభుత్వం సమకూరుస్తోంది. జనవరి 3న వాహనాలను మంత్రి సీతక్క ప్రారంభించనున్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రధానమంత్రి మత్స్య యోజన పథకంతో అనుసంధానం చేసి.. 60 శాతం సబ్సిడీతో రూ. 4 లక్షలకే మహిళా సంఘాలకు ఈ వాహనాలు అందజేస్తారు. ఈ సబ్సిడీ మొత్తాన్ని సైతం బ్యాంకుల నుంచి వడ్డీ లేని రుణాలుగా సెర్ప్ ఇప్పించనుంది. గచ్చిబౌలిలోని నిథమ్ ఇన్‌స్టిట్యూట్‌లో మహిళా సంఘాల సభ్యులకు సంచార చేపల విక్రయానికి సంబంధించిన శిక్షణను సెర్ప్ ఆధ్వర్యంలో ఉచితంగా అందించనున్నారు.

తేలుతున్న జేఆర్వో 'లెక్క'

రాత పరీక్షపై నిర్ణయం తీసుకోనున్న ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక జూనియర్ రెవెన్యూ అధికారిని నియమించే ప్రక్రియ లెక్క తేలుతోంది. ఈ పోస్టుల భర్తీకి గతంలో వీఆర్వో, వీఆర్ఏలుగా పనిచేసిన ఉద్యోగుల నుంచి 'రెవెన్యూ శాఖ సమ్మతి సేకరణ' కార్యక్రమం పూర్తయింది. ఈనెల 28న గడువు ముగిసే సమయానికి మొత్తం 11,783 మంది మళ్లీ రెవెన్యూ శాఖలోకి వచ్చేందుకు సమ్మతి తెలుపుతూ ఆప్షన్ ఇచ్చారు. అయితే, వీరిలో డూప్లికేట్ దరఖాస్తులు, మళ్లీ ఆప్షన్లు ఇచ్చినవి, ఉద్యోగి ఐడీలు చెప్పనివి, సర్టిఫికెట్లు జత చేయనివి అధికారులు తిరస్కరించినట్టు తెలిసింది. ఇవిపోను 9,654 దరఖాస్తులు నికరంగా మిగిలాయని ఆయా వర్గాల ద్వారా తెలిసింది. ఇందులో డిగ్రీ, ఇంటర్ ఉత్తీర్ణులయిన వారు 6,162 మంది ఉన్నారని సమాచారం. వీరు కాకుండా మరో 3,492 మంది ఇంటర్‌కంటే తక్కువ చదువుకున్న వారు మళ్లీ శాఖలోకి వచ్చేందుకు సమ్మతి తెలిపారు. డిగ్రీ చదివిన వారు 3,498 మంది, ఇంటర్ చదివిన వారు 2,664 మంది ఆప్షన్లు ఇవ్వగా, వీరికి పరీక్ష పెట్టి ఎంపిక చేయాలా? లేక నేరుగా విధుల్లోకి తీసుకోవాలా అన్నదానిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

అల్లు అర్జున్‌కు సంబంధం లేదు

బీఎన్ఎస్ సెక్షన్ 105 ఆ ఘటనకు వర్తించదు

సెషన్స్ కోర్టులో న్యాయవాది నిరంజన్‌రెడ్డి వాదన

సంధ్య థియేటర్ వద్ద మహిళ మృతి కేసులో రెగ్యులర్ బెయిల్ ఇవ్వాలని వినతి

జనవరి 3వ తేదీకి తీర్పును రిజర్వ్ చేసిన న్యాయస్థానం

సిటీ కోర్టులు (హైదరాబాద్): హైదరాబాద్‌లోని సంధ్య థియేటర్ వద్ద ఇటీవల జరిగిన తొక్కిసలాటలో మహిళ మృతి చెందిన కేసుతో నటుడు అల్లు అర్జున్‌కు ఎలాంటి సంబంధం లేదని ఆయన తరఫు న్యాయవాది నిరంజన్‌రెడ్డి చెప్పారు. ఘటనలో మహిళ మృతి చెందిన విషయం కూడా అల్లు అర్జున్‌కు తెలియదని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఈ కేసులో అరెస్టయి హైకోర్టు మధ్యంతర బెయిల్‌పై ఉన్న అల్లు అర్జున్‌కు రెగ్యులర్ బెయిల్ కోసం.. ఆయన తరఫు న్యాయవాదులు నిరంజన్‌రెడ్డి, అశోక్‌రెడ్డి నాంపల్లిలోని 2వ అదనపు మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టులో గతవారం పిటిషన్ దాఖలు చేశారు. విచారణ వాయిదా కోరిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామకృష్ణ సోమవారం కౌంటర్ దాఖలు చేయగా.. ఇరు పక్షాల న్యాయవాదులు వాదనలు వినిపించారు. అనంతరం జడ్జి వినోద్ కుమార్ తీర్పును జనవరి 3కు రిజర్వ్ చేశారు.

అలాంటి ఘటన జరిగినట్టు కూడా తెలియదు

పోలీసులు అల్లు అర్జున్‌పై పెట్టిన బీఎన్ఎస్ సెక్షన్ 105 ఈ ఘటనకు వర్తించదని నిరంజన్‌రెడ్డి చెప్పారు. ఒక వ్యక్తి, మరో వ్యక్తి మృతికి ప్రత్యక్షంగా కారణమైనప్పుడే ఆ సెక్షన్ పెట్టాలని, కానీ థియేటర్ వద్ద తొక్కిసలాట జరిగినప్పుడు అల్లు అర్జున్ 30 నుంచి 40 అడుగుల దూరంలో ఉన్నారని తెలిపారు. అల్లు అర్జున్ ఏ రకంగా చూసినా ఈ ఘటనకు కారణం కాదని, అసలు అక్కడ అలాంటి ఘటన జరిగిందని కూడా ఆయనకు తెలియదని, మొదటి గేటు నుంచి నేరుగా సినిమా చూసేందుకు కుటుంబ సభ్యులతో కలిసి బాల్కనీలోకి వెళ్లిపోయారని తెలిపారు. ఘటన చోటు చేసుకుంది సెల్లార్ దగ్గర అని.. థియేటర్‌కు సంబంధించిన మ్యాప్‌ను చూపిస్తూ ఆయన కోర్టుకు వివరించారు. అల్లు అర్జున్‌కు రెగ్యులర్ బెయిల్ ఇవ్వాలని కోరుతూ, హైకోర్టు మధ్యంతర బెయిల్ ఇచ్చిన విషయం జడ్జి దృష్టికి తెచ్చారు. నిరంజన్‌రెడ్డి వాదనలతో పీపీ రామకృష్ణ విభేదించారు. అల్లు అర్జున్‌కు బెయిల్ మంజూరు చేస్తే పోలీసుల తదుపరి విచారణకు సహకరించరని అన్నారు. ఈ నేపథ్యంలో న్యాయమూర్తి తీర్పును రిజర్వ్ చేశారు. ఈనెల 13న అల్లు అర్జున్‌ను పోలీసులు అరెస్టు చేసిన నేపథ్యంలో, నాంపల్లిలోని 9వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ నిర్మల 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించగా, హైకోర్టు 4 వారాల మధ్యంతర బెయిల్ మంజూరు చేసిన సంగతి తెలిసిందే.

విహంగాల విడిది.. జన్నారం

అరుదైన స్వదేశీ, విదేశీ పక్షుల వలస

తెలంగాణ శ్రీశైలం.. ఓదెల మల్లన్న ఆలయం

భక్తుడి పేరిట వెలుగొందుతున్న గుడి

కోరిన కోర్కెలు తీర్చే స్వామిగా ప్రసిద్ధి

వివరాలు సాక్షి ప్లస్(ఈ-పేపర్)లో



హాస్య చతురత ఒక్కటే మనిషి దైవిక గుణం.
– ఆర్థర్ షోపెన్‌హావర్

సాక్షి
మంగళవారం, 31 డిసెంబర్ 2024

స్ఫూర్తిదాయక విజయాలు

చదరంగంలో భారత దేశానికి ఇది స్వర్ణయుగం. న్యూయార్క్‌లో జరుగుతున్న 'ఫిడే' ఉమెన్స్ వరల్డ్ ర్యాపిడ్ చెస్ ఛాంపియన్ పోటీల్లో భారత క్రీడాకారిణి కోనేరు హంపీ ఆదివారం సాధించిన ఘన విజయం అందుకు మరో తాజా నిదర్శనం. న్యూయార్క్‌లో మొత్తం 110 మంది పాల్గొన్న ర్యాపిడ్ చెస్ టోర్నీలో 8.5 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి, ఛాంపియన్ అయ్యారు. అంతకు ముందు సింగపూర్‌లో క్లాసికల్ వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లో గుకేశ్ విజయం, అంతకన్నా ముందు ఈ ఏడాది సెప్టెంబర్‌లో బుడాపెస్ట్‌లోని చెస్ ఒలింపియాడ్‌లో ఓపెన్, ఉమెన్స్ కేటగిరీలు రెంటిలోనూ కనివిని ఎరు గని రీతిలో భారత్ రెండు స్వర్ణాలు సాధించడం... ఇవన్నీ ఈ 2024ను భారత చదరంగానికి చిరస్మరణీయ వత్సరంగా నిలిపాయి. మంగళవారం నుంచి జరగనున్న 'ఫిడే' వరల్డ్ బ్లిట్జ్ ఛాంపియన్‌షిప్ పైనా కన్నేసి, గ్రాండ్‌డబుల్ సాధించాలని హంపీ అడుగులేస్తుండడం విశేషం.

గతంలో 2019లో జార్జియాలో తొలిసారి మహిళల వరల్డ్ ర్యాపిడ్ ఛాంపియన్‌షిప్ గెలిచిన కోనేరు హంపీకి తాజా విజయం రెండో ప్రపంచ టైటిల్. చైనాకు చెందిన జూ వెన్‌జున్ తర్వాత ఈ టైటిల్‌ను ఒకటికి రెండుసార్లు గెలిచింది హంపీయే! నిరుడు పెళ్ళి తరువాత మాతృత్వం కోసం కొన్నాళ్ళు ఆటకు దూరం జరిగిన హంపీ 2018లో చదరంగపు పోటీలకు తిరిగి వచ్చాక కూడా తన హవా కొనసాగిస్తూ వచ్చారు. 2019లో టైటిల్ సాధించారు. గత ఏడాది కూడా ఆమె గెలవాల్సింది. టై బ్రేక్‌లో త్రుటిలో ప్రపంచ టైటిల్‌ను కోల్పోయారు. అయితేనేం, పట్టుదలతో కృషిని కొనసాగించి మళ్ళీ ఇప్పుడు ఆటలో కిరీటం గెల్చుకొని, తనలో సత్తా చెక్కుచెదరలేదని నిరూపించారు. సామాన్యులతో పాటు ఆటలోని వర్ధిష్ణువులకు సైతం ఇది స్ఫూర్తి మంత్రం. నిజానికి, ఈ భారత నంబర్ 1 చదరంగ క్రీడాకారిణే అన్నట్టు, కచ్చితంగా సరికొత్త టైటిల్ విజయం మన దేశంలోని యువతరాన్ని చదరంగ క్రీడ వైపు మరింతగా ఆకర్షిస్తుంది. అదే సమయంలో పలువురు చెస్ ప్రొఫెషనల్స్‌గా తయారవడానికి ప్రేరణ కూడా అవుతుంది.


ఫస్ట్ రౌండ్‌లో ఓటమి పాలైనా, 11వ, ఆఖరి రౌండ్‌లో గెలవడంతో 8.5 పాయింట్లతో పట్టికలో హంపీ అగ్రస్థానానికి చేరారు. ఇండోనేసియాకు చెందిన ఇరీన్ సుకందర్‌ను ఓడించి, వరల్డ్ ర్యాపిడ్ చెస్ ఛాంపియన్‌షిప్ గెలుపుతో 2024కు ఘనంగా వీడ్కోలు పలికారు. చెస్‌లో ఆరితేరిన గ్రాండ్ మాస్టర్ అయినా బిడ్డకు తల్లి అయ్యాక, ఎన్నో కుటుంబ బాధ్యతలు మీద పడ్డాక, 37 ఏళ్ళ వయసులో హంపీ ఈ అరుదైన విన్యాసం సాధించడం అబ్బురం. అంతేకాదు... అభినందించాల్సిన అంశం. వయసు, బాధ్యతలు మీద పడుతున్నప్పటికీ పట్టు వదలకుండా, నిత్య కృషితో ముందుకు సాగడం, ఆటలో అదే నైశిత్యాన్ని ప్రదర్శించడం ఆషామాషీ కాదు. ఈ 2024 అంతా ఆశించిన ఆటతీరు కనబరచలేక, ఆత్మవిశ్వాసం కుంటుబడిన హంపీ ఒక దశలో అసలీ ఛాంపియన్‌షిప్‌లో పోటీ పడకూడదనీ అనుకున్నారట. ఆట నుంచి రిటైరవుతారన్న అనుమానాల నుంచి ఆఖరికి అగ్రపీఠాన్ని అధిష్ఠించే దాకా ఆమె ప్రస్థానం చిరస్మరణీయం. అందుకే, హంపీ గెలిచిన ఈ కొత్త కిరీటం మునుపటి విజయాల కన్నా ఎంతో ప్రత్యేకమైనది. చిన్నారి కూతురును చూసుకోవడంలో ఆమె తల్లితండ్రులు, భర్త పోషించిన పాత్ర మరెందరికో స్ఫూర్తిపాత్రమైనది.

అంతర్జాయ యవనికపై భారత క్రీడాకారులు, అందులోనూ తెలుగువాళ్ళు కొన్నాళ్ళుగా సాధిస్తున్న ఘనతలు అనేకం. తాజా ఘటనలే తీసుకుంటే, తెలుగు మూలాలున్న చెన్నై కుర్రాడు గుకేశ్ ఇటీవల ప్రపంచ చదరంగ ఛాంపియన్‌గా అవతరించాడు. అంతకన్నా ముందు ఆ వెంటనే ఇప్పుడు హంపీ ర్యాపిడ్ చెస్‌లో రెండోసారి వరల్డ్ టైటిల్ సాధించారు. మరోపక్క భారత క్రికెట్ జట్టులో విశాఖకు చెందిన 22 ఏళ్ళ నవ యువ ఆటగాడు నితీశ్ రెడ్డి ఆస్ట్రేలియాలో సంచలనం రేపాడు. ఆస్ట్రేలియాలో జరుగుతున్న 4వ టెస్టులో ప్రతికూల పరిస్థితుల్లో క్రీజులో పాతుకుపోయి, అద్భుతమైన తొలి శతకం సాధించి, జట్టు పరువు నిలిపాడు. విదేశీగడ్డపై తొలి టెస్ట్ సిరీస్ ఆడుతూ, 8వ నంబర్ ఆటగాడిగా బరిలో దిగి సెంచరీ చేసిన తీరు యువతరంలోని క్రీడాకౌశలానికి నిదర్శనం. ఇవన్నీ భారత జాతి, మరీ ముఖ్యంగా మన తెలుగువాళ్ళు గర్వించాల్సిన క్షణాలు. అయితే, ఇవి సరిపోవు. మన 140 కోట్ల జనాభాలో ఇంతకు మించి శక్తి సామర్థ్యాలు, ఇంకా ఎంతో మంది ప్రతిభావంతులు ఉన్నారు. వారినీ సరైన రీతిలో ప్రోత్సహించి, ప్రాథమిక వసతి సౌకర్యాలు అందిస్తే ఇలాంటి విజయాలు అనునిత్యం మన సొంతమవుతాయి. తాజా ఘటనలు అదే రుజువు చేస్తున్నాయి.

అయితే, మన దేశంలో ఎవరికి ఎంత ఆసక్తి ఉన్నా క్రీడల్లో కెరీర్‌ను నిర్మించుకోవడం ఇప్పటికీ కష్టసాధ్యంగానే ఉందన్నది నిష్ఠురసత్యం. ఆటల్లో అంతర్జాతీయ పోటీల్లో పాల్గొన్న పలువురు ఆనక కూలీనాలీ చేసుకుంటూ, కష్టంగా బతుకీడుస్తున్న ఉదంతాలు నేటికీ కళ్ళ ముందుకొస్తూ, కన్నీళ్ళు పెట్టిస్తున్నాయి. ఈ పరిస్థితులను చక్కదిద్ది, క్రీడల మీద ఆసక్తిని పెంచాల్సింది పాలకులు, ప్రభుత్వాలే. ఆ పని చేయకుండా... పతకాలు, టైటిళ్ళ మీదే ధ్యాసతో, ఆటగాళ్ళను నిందించి ప్రయోజనం లేదు. ఇంట్లో తల్లితండ్రులు, పాఠశాలలో అధ్యాపకుల స్థాయి నుంచి అందుకు తగ్గట్టు వాతావరణం కల్పించడం ముఖ్యం. అదే సమయంలో క్రీడా సంఘాలు, ప్రభుత్వ ప్రాధికార సంస్థల లాంటి వాటిని రాజకీయాలకు అతీతంగా నడపడం అంతకన్నా ముఖ్యం. అప్పుడే క్రీడాకారుల కలలు ఫలిస్తాయి. క్రీడాభిమాన లోకం ఆశించిన ఫలితాలు సిద్ధిస్తాయి. ఒలింపిక్స్‌కు సైతం ఆతిథ్యమివ్వాలని ఆశపడుతున్న మన పాలకులు అంత కన్నా ముందు సరిదిద్దుకోవాల్సిన అంశాలపై దృష్టి పెట్టడం అవసరం.

బీద పిల్లల నోట్లో మట్టి కొట్టే యత్నం

సందర్భం



ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

విజయవాడలో జరిగిన ప్రపంచ తెలుగు రచయితల మహాసభల్లో తెలుగులో ప్రపంచ గుర్తింపు పొందగల పుస్తకాలను ఎలా రాయాలో చర్చించాలి గానీ ప్రభుత్వ స్కూళ్లను తెలుగు మీడియంలోకి మార్చే అంశాన్ని కాదు గదా! మూడు వేల ఏండ్లు నిరక్షరాస్యులుగా ఉండి ఇప్పుడిప్పుడే విద్యపట్ల కళ్లు తెరుస్తున్న ప్రజల మీద వ్యతిరేకత మంచిదా? తెలుగు భాషతో ఉద్యోగం, ఉపాధి దొరక్కపోవడం భ్రమ అంటున్నారు; మరి తెలుగులో ఐఏఎస్, ఐపీఎస్ పరీక్ష రాసిన బీద విద్యార్థులు ఎంతమంది సెలెక్ట్ అయ్యారు? వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆంధ్రప్రదేశ్‌లో మొదలైన విద్యా విప్లవాన్ని వెనక్కి తిప్పాలని ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇంగ్లిష్ విద్యను కాపాడుకునే ఉద్యమాలు గ్రామీణ స్థాయిలో మొదలైతే తప్ప ప్రభుత్వ స్కూళ్లలో ఇంగ్లిష్ మీడియం బతకదు.

విజయవాడలో డిసెంబర్ 28, 29 తేదీల్లో రెండ్రోజులు 'ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు' జరిగాయి. ఆ సభల్లో దేశానికి చీఫ్ జస్టిస్‌గా పనిచేసి రిటైరైన జస్టిస్ ఎన్.వి. రమణ గారు వైకాపా ప్రభుత్వం ఇంగ్లిష్ విద్యను రాష్ట్రమంతటా ప్రవేశపెడుతూ తెచ్చిన జీవో నంబర్ 85 రద్దు చేయాలనీ, మొత్తం ఏపీ ప్రభుత్వ రంగ విద్యావ్యవస్థను మళ్ళీ పాత తెలుగు మీడియంలోకి మార్చాలనీ సూచించారు. ఆయన సూచనను చంద్రబాబు నాయుడి ప్రభుత్వం ఒక కోర్టు ఆర్డరుగా పరిగణించి ప్రభుత్వ విద్యారంగాన్ని మళ్లీ తెలుగు మీడియంలోకి మార్చే పెను ప్రమాదం లేకపోలేదు.

జస్టిస్ రమణగారు కోర్టుల్లో కేవలం ఇంగ్లిష్‌లో వాదించినవారు. జడ్జిగా తీర్పులన్నీ ఇంగ్లిష్ భాషలో రాసినవారు. ఆయనది ధనవంతమైన రైతు కుటుంబం కనుక తెలుగు మీడియం స్కూల్ విద్య నుండి వచ్చి కూడా ఇంగ్లిష్‌పై పట్టు సాధించి జ్యుడీషియల్ సిస్టమ్‌లో అత్యున్నత స్థాయికి ఎదిగారు. కానీ గ్రామీణ కూలినాలి ఎస్సీ, ఎస్టీ, బీసీ పిల్లలకు అలా ఎదగడం సాధ్యమా? జడ్జిగారు తెలుగు భాషతో ఉద్యోగం, ఉపాధి దొరక్కపోవడం భ్రమ అంటున్నారు.

జస్టిస్ రమణగారు వకీలు నుండి సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌గా ఎదిగిన జ్యుడీషియల్ సిస్టమ్‌లోనే చూద్దాం. తెలంగాణ హైకోర్టు నుండి కింది కోర్టుల వరకు నేను కోర్టు రూముల్లో నిలబడి చూశాను. గ్రామాల నుండి తెలుగు మీడియంలో చదువుకొని, కష్టపడి లా డిగ్రీ సంపాదించిన యువ లాయర్లు ఇప్పుడు కోర్టుల్లో చాలామంది ఉన్నారు. వారికి చట్టాలపై ఎంత పట్టు ఉన్నా ఇంగ్లిష్‌లో వాదించే భాష లేక ఎంత డిప్రెషన్‌కు గురౌతున్నారో నేను చూశాను. వారితో మాట్లాడాను. వారికి వకీలు నుండి జడ్జిగా పై కోర్టుల్లో ఎదగడానికి రాజకీయ సపోర్టు, కమ్యూనిటీ బలం లేదు. ఇంగ్లిష్ రాని, వాదించలేని బాధతో ఆత్మగౌరవం దెబ్బ తింటుంది. ఇదే కోర్టులో ఇప్పుడు నేషనల్ లా స్కూల్స్ నుండి వస్తున్న యువ లాయర్లు చట్టంలో పట్టున్నా, లేకున్నా ఇంగ్లిష్ బలంతో కేసులు గెలుస్తున్నారు. కార్పొరేట్ కంపెనీల్లో లా గ్రాడ్యుయేట్స్‌ను రిక్రూట్స్ చేసుకునేటప్పుడు ఏ కంపెనీల్లో తెలుగులో ఇంటర్వ్యూ జరుగుతుందో సిస్టమ్ గురించి తెలిసిన జస్టిస్ రమణగారిని చెప్పమనండి! దేశ సంపద ఇప్పుడు ఈ కంపెనీల్లో పోగుపడి లేదా? అందులో తెలుగు భాషతో ఉద్యోగాలొస్తాయా?

నేషనల్ సివిల్ సర్వీస్‌లో ప్రశ్నపత్రాలు ఇంగ్లిష్, హిందీలోనే ఇస్తున్నారు కదా! 'ఇటాలియన్ ఆఫ్ ఈస్ట్' అంటున్న ఈ తెలుగు భాషకు, సివిల్ సర్వీస్‌లో ప్రశ్నపత్రం లేని గతి ఎందుకున్నది? తెలుగు భాషలో ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ పరీక్ష రాసిన బీద విద్యార్థులు ఎంతమంది సెలెక్ట్ అయ్యారు? తెలుగుపై ఇంత ప్రేమ ఉన్న జస్టిస్ రమణగారు సుప్రీం కోర్టులో ఒక 'పిల్' వేయించి యూపీఎస్సీ ప్రశ్నపత్రాలు అన్ని రాష్ట్ర భాషల్లో ఉండాలని ఒక జడ్జిమెంట్ ఇచ్చి ఉంటే ప్రాంతీయ భాషల్లో చదువుకునే మొదటితరం అమ్మాయిలు, అబ్బాయిలు కొంతైనా మేలు పొందేవారు. అదే సుప్రీం కోర్టు ప్రైవేట్ రంగంలో స్కూల్ విద్య, ప్రభుత్వ రంగంలో స్కూలు విద్య దేశం మొత్తంగా ఆ యా రాష్ట్రాల ప్రాంతీయ భాషల్లో ఉండాలని ఎందుకు చెప్పలేదు? ప్రైవేట్ స్కూళ్లను కన్నడలో బోధించాలని కర్ణాటక జీవో ఇచ్చినప్పుడు సుప్రీం కోర్టే తమ పిల్లల్ని ఏ భాషలో చదివించాలో నిర్ణయించే హక్కు తల్లిదండ్రుల ప్రాథమిక హక్కు అని చెప్పింది కదా! మరి గ్రామీణ కూలీల పిల్లల తల్లిదండ్రులు తమ పిల్లల్ని ఏ భాషల్లో చదివించుకోవాలో నిర్ణయించుకునే హక్కు ఉండదా? జస్టిస్ రమణగారు తల్లిదండ్రుల అభిప్రాయం మళ్ళీ సేకరించండి అంటే న్యాయం ఉంది. ఇప్పుడు చంద్రబాబు ఆ పని చేసి ఉండవచ్చు. అలా కాకుండా తెలుగులోకి మార్చాలని నిర్ణయాలు ఎలా ప్రకటిస్తారు?



ఒకవైపు కేంద్ర ప్రభుత్వ స్కూళ్లలో ఇంగ్లిష్ మీడియం, మరోవైపు కార్పొరేట్ సంస్థలు నడిపే ఎయిర్ కండిషన్డ్ స్కూళ్ళల్లో ఇంగ్లిష్ మీడియం. ఆ స్కూళ్లలో అంతర్జాతీయ సిలబస్ ఉండగా ఆంధ్రప్రదేశ్‌లో జగన్‌మోహన్ రెడ్డి ప్రారంభించిన ఇంగ్లిష్ మీడియం స్కూళ్ళ నుండి ఒక బ్యాచ్ కూడా బయటికి రాకముందే జస్టిస్ రమణ గారు వారి భవిష్యత్ గురించిన ఈ జడ్జిమెంట్ ఎలా ఇచ్చారు?

చంద్రబాబు నాయుడి ప్రభుత్వం ప్రభుత్వ స్కూళ్లను పూర్తిగా తెలుగు మీడియంలోకి మార్చమంటున్నారు. ఆయన మనుమడు ఏ భాష స్కూలులో చదివి ఇప్పుడు అంతర్జాతీయ చెస్ ఛాంపియన్ కాబోతున్నాడు? 9 ఏండ్ల మనుమని కోచ్ ఆయనకు ఏ భాషలో మాట్లాడి కోచింగ్ ఇస్తున్నాడు? బీద కుటుంబాల్లోని పిల్లలు అంతర్జాతీయ ఆటగాళ్లు కావద్దు అనే కదా ఈ ఆలోచన.

మూడు వేల ఏండ్లు నిరక్షరాస్యులుగా ఉండి ఇప్పుడిప్పుడే విద్యపట్ల కండ్లు తెరుస్తున్న ప్రజల మీద ఇంత వ్యతిరేకత మంచిదా? ఈ దేశ విద్యావంతులు, అధికారాన్ని, ధనబలాన్ని అనుభవించిన మేధావులు సైతం బీద ప్రజల సమాన విద్యా హక్కు పట్ల న్యాయబద్ధంగా మాట్లాడకపోతే ఈ బీద, అణచి వేయబడ్డ జీవితాలు ఎలా మారుతాయి? మేధావులకు తెలుగుపట్ల ప్రేమ ఉంటే ప్రపంచ భాషల్లోకి అనువాదం చెయ్యబడి నోబెల్ ప్రైజ్ పొందే పుస్తకాలు రాయాలి కాని దిక్కులేని ప్రజల జీవితాల్లో మట్టి పొయ్యడానికి సిద్ధాంతాలు అల్లకూడదు కదా!

తెలుగు నిజంగానే 'ఈస్టర్న్ ఇటాలియన్' భాష అయితే... నన్నయ్య, తిక్కన కాలం నుండి జస్టిస్ రమణ కాలం వరకు ఇటాలియన్ భాషనే 'తెలుగు ఆఫ్ వెస్టర్న్ వరల్డ్' అనేంతగా ఎదిగించడానికి బీద పిల్లల తల్లిదండ్రులు అడ్డువచ్చారా? ప్రపంచ రచయితల మహాసభల్లో తెలుగులో ప్రపంచ గుర్తింపు పొంద గల పుస్తకాలను ఎలా రాయాలో చర్చించాలి గానీ ప్రభుత్వ స్కూళ్లను తెలుగు మీడియంలోకి మార్చే అంశాన్ని కాదు గదా! రవీంద్రనాథ్ టాగూర్‌లా బెంగాలీలో గీతాంజలి రాసి నోబెల్ బహుమతి తెచ్చినట్లు... తెలుగులో ఎటువంటి పుస్తకాలు రాయాలి, నోబెల్ బహుమతిని ఎలా తేవాలి వంటి అంశాలను చర్చిస్తే బీద ప్రజల పిల్లలు కూడా అటువంటి పుస్తకాన్ని చదివి నేర్చుకుంటారు.

ఏది ఏమైనా ఆంధ్రప్రదేశ్‌లో మొదలైన విద్యా విప్లవాన్ని మళ్ళీ వెనక్కి తిప్పాలని ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇది కేవలం జస్టిస్ రమణ గారి అభిప్రాయం మాత్రమే అనుకోవడానికి లేదు. చంద్రబాబు ఆలోచనకు ఆయన ఒక ప్రజాభిప్రాయ సేకరణ ప్రక్రియను ప్రారంభించారు. ఇప్పటికే ఈ ప్రభుత్వం అమ్మఒడి పథకాన్ని ఆపేసింది. స్కూల్ విద్యపై చర్చ పూర్తిగా నిలిచిపోయింది. కనీసం తెలంగాణ ప్రభుత్వం పెట్టిన ఫోకస్ కూడా చంద్రబాబు ప్రభుత్వం పెట్టడం లేదు. స్కూళ్ల అభివృద్ధి కోసం చేసుకున్న అంతర్జాతీయ అగ్రిమెంట్లన్నీ నిలిపివేశారు. క్రమంగా ప్రభుత్వ విద్యారంగాన్ని మళ్ళీ పాతబాటలోకి విద్యామంత్రిగా లోకేష్ నెడుతున్నారు.

ఇప్పుడు ప్రపంచ తెలుగు రచయితల మహాసభల పేరుతో పిల్లల భవిష్యత్తుకు ముగుతాడు వెయ్యాలనే ప్రచారం మొదలైంది. ఒక్క జస్టిస్ రమణగారే కాదు... మండలి బుద్ధప్రసాద్ ఇటువంటి ఆలోచన కలవారే. ఇప్పుడు ఇంగ్లిష్ విద్యను ప్రభుత్వ స్కూళ్లలో కాపాడుకునే ఉద్యమాలు గ్రామీణ స్థాయిలో మొదలైతే తప్ప ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఈ స్కూళ్లలో ఇంగ్లిష్ మీడియం బతకదు. ఈ విద్యా విధానాన్ని కాపాడవలసిన బాధ్యత ఒక్క వైసీపీదే కాదు... వివిధ ప్రజా సంఘాలు, కుల సంఘాలు, తల్లిదండ్రుల సంఘాలు ఇంగ్లిష్ విద్య పరిరక్షణ పోరాటం చేస్తే తప్ప ఈ తిరోగమన రథ చక్రం ఆగదు.

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక విశ్లేషకుడు

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

పంపించేయాలి!



ఆటగాళ్లందరికీ సహజంగానే ఆత్మవిశ్వాసం ఉంటుంది. అదే వాళ్లను గడ్డుకాలంలో నడిపిస్తుంది. మన భారతీయ క్రికెట్ స్టార్లందరూ గడ్డు కాలాల్లోనూ ఏదో ఒక దశలో అసామాన్యంగా ఆడారు. అలాగని వాళ్లు నిర్ణయం తీసుకునేదాకా ఆగకూడదు. అత్యుత్తమ ఎలెవన్‌ను ఎంపిక చేసుకునే బాధ్యత సెలక్టర్లు, కోచ్‌ది. – జాయ్ భట్టాచార్య, క్రీడా విశ్లేషకుడు

చెప్పకోవడానికే...



ఆస్ట్రేలియా నుంచి తిరిగొచ్చాను. ఇన్ని రోజులూ ఎక్కడా రాజకీయ పోస్టర్లు, స్టేడియంలలో పాన్ మసాలా యాడ్స్, తప్పేసిన రోడ్లు కనబడకపోవడం బాగుంది. కానీ మన జీడీపీ బాగుంది కాబట్టి, దాన్ని నా నుదుటి మీద రాసుకుని తిరగాలనిపిస్తోంది. – విక్రమ్ సథాయే, కమెడియన్

మరింత తీవ్ర ద్వేషం

భారతీయులు పాశ్చాత్యుల జాత్యహంకారం, ద్వేషం మాత్రమే చూశారు. ఇక నుంచీ ఆసియా జాత్యహంకారాన్ని చూస్తారు. పాశ్చాత్యుల ద్వేషం మీ ముఖం మీద గుద్దినట్టు, ఒక్కోసారి భౌతికంగానూ ఉంటుంది. అయినా అది పాశ్చాత్యుల్లోని కొన్ని వర్గాలకే పరిమితం. అదే ఆసియన్లు చూపే ద్వేషం విస్తారమైనది, అనేక స్థాయుల్లో ఉంటుంది. – అరవింద్, రాజకీయాంశాల వ్యాఖ్యాత

అసలు ఎవరు?



మొదటి స్వీయ జ్ఞానం ఏమిటంటే, మీరు ఇప్పుడు ఎలా ఉన్నారో ఉన్నది ఉన్నట్టుగా గుర్తించడం. తర్వాత, వాస్తవంగా మీరు ఏమిటో తెలుసుకుని, అలా మారడానికి ఏం చేయాలో కనుక్కోవడం. అది తుది జ్ఞానం. – శ్రీ ఎం, ఆధ్యాత్మిక బోధకుడు

బెస్ట్ కాంబినేషన్



ఆటగాడి శరీరం, తాత్వికుడి మెదడు, యోధుడి స్ఫూర్తి, కళాకారుడి హృదయం... అదీ అత్యుత్తమ సమతులనం. – హర్ష్ గోయెంకా, పారిశ్రామికవేత్త

ఎందుకు స్మరించాలంటే...

డాక్టర్ భీంరావ్ రాంజీ అంబేడ్కర్ భారతీయ చరిత్రలో మహోన్నత వ్యక్తి. ఆయన కేవలం సామాజిక సంస్కర్తగానే కాకుండా దేశ సమగ్రాభివృద్ధి కోసం పారిశ్రామీకరణ, పట్టణీకరణ, ఆధునికీకరణ, నాగరికత గురించి దశాబ్దాల ముందే చర్చించిన దూరదృష్టి కలిగిన తత్వవేత్త. ఆయన కేవలం దళితులకు మాత్రమే చెందిన వారు కాదు. ఆయన విశ్వమానవతా సిద్ధాంతాలు, సేవలు ప్రతి భారతీయుడి గుండెల్లో నిలిచి పోవాలి. పారిశ్రామికీకరణ ప్రజల సాంఘిక-ఆర్థిక స్థితులను మెరుగు పరచడానికి మార్గమని ఆయన విశ్వసించారు. గ్రామాధారిత ఆర్థిక వ్యవస్థ ఒక్కటే భారతదేశ అవసరాలను తీర్చలేదని ఆయన స్పష్టంగా గ్రహించారు. పరిశ్రమల అభివృద్ధి ద్వారా ఉపాధి అవకాశాలు పెంచి, పేదరికాన్ని తగ్గించి, ఆర్థిక పురోగతిని సాధించవచ్చనేది ఆయన నమ్మకం. అలాగే, పట్టణీకరణ ద్వారా సామాజిక సమానత్వానికి మార్గం సుగమం అవుతుందని ఆయన పేర్కొన్నారు. పట్టణ ప్రాంతాలు విద్య, సాంకేతికత, సామాజిక మార్పు కేంద్రాలుగా; కులవాదం నుండి విముక్తి కలిగించే చోట్లుగా ఉండాలి అని ఆయన బలంగా విశ్వసించారు. మరుగునపడిన వర్గాల అభివృద్ధిలో విద్య ప్రాముఖ్యాన్ని ఆయన ప్రత్యేకంగా పేర్కొన్నారు. ఇది భారతీయుల మనోభావాలను ఆధునికీకరించే క్రమంలో పెద్ద ముందడుగు.

కార్మిక సంక్షేమం, మహిళా హక్కులు, అంటరానితనం నివారణ వంటి రంగాల్లో ఆయన రూపకల్పన చేసిన విధానాలు ఈ రోజు కూడా అద్భుతంగా పని చేస్తున్నాయి. 'హిందూ కోడ్ బిల్లు' ద్వారా మహిళలకు వారసత్వ ఆస్తి హక్కును కల్పించడం ద్వారా లింగ సమానత్వానికి ఆయన బలమైన పునాది వేశారు. ఆయన రాసిన 'ది ప్రాబ్లం ఆఫ్ ది రూపీ: ఇట్స్ ఆరిజిన్ అండ్ ఇట్స్ సొల్యూషన్' అనే గ్రంథం ఆర్థిక స్థిరత్వం, కేంద్ర బ్యాంకింగ్ సంస్కరణల ప్రాముఖ్యాన్ని చూపిస్తుంది. ఆయన పేరు మనం న్యాయ సమానత్వం, ఆర్థిక పురోగతి వంటి గౌరవప్రద విలువల వైపు అడుగులు వేస్తున్నామని గుర్తు చేస్తుంది.

– ప్రొ॥ఎం. జేమ్స్ స్టీఫెన్, చైర్ ప్రొఫెసర్, డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ చైర్, ఆంధ్రా యూనివర్సిటీ

మహాత్మా గాంధీ మార్గదర్శకత్వంలో...

అభిప్రాయం



బి. మహేశ్ కుమార్ గౌడ్

కాంగ్రెస్ నేతలు తమ జీవితాలను పణంగా పెట్టి నిస్వార్థంగా పోరాడి దేశానికి స్వాతంత్ర్యం తీసుకువస్తే, ఇప్పుడు బీజేపీ పాలకుల చేతిలో స్వతంత్ర భారత్‌లో ప్రజాస్వామ్యానికి ప్రమాదం ఏర్పడింది. జాతిపిత మహాత్మాగాంధీ మార్గదర్శకత్వంలో కాంగ్రెస్ నేతృత్వంలో యావత్ దేశం అహింసా మార్గంలో ఉద్యమాలు చేసి సాధించిన స్వతంత్ర దేశంలో పదేళ్ల బీజేపీ హయాంలో దౌర్జన్యాలు, హింసతో లౌకికవాదం ప్రశ్నార్థకమైంది. ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిన మన పవిత్రమైన రాజ్యాంగంపై, దాని రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై రాజకీయ కుట్రలకు తెరలేపి బడుగు బలహీన, మైనార్టీ వర్గాల్లో తీవ్ర భయాందోళనలు సృష్టిస్తున్నారు బీజేపీ నేతలు. అధిక శాతం పేదలుండే మన దేశంలో సామాన్యుడి నడ్డి విరిచే విధానాలతో వారి బతుకులను దుర్భరం చేసింది బీజేపీ పాలన.

నియంతృత్వ పోకడలతో అన్ని వర్గాల ప్రజలను ఇబ్బంది పాలు చేస్తున్న నరేంద్ర మోదీ పాలనకు వ్యతిరేకతంగా మహాత్మా గాంధీ స్ఫూర్తి, సిద్ధాంతాల మార్గదర్శకంలో దేశవ్యాప్తంగా ఉద్యమించాలని 'బెళగావి'లో జరిగిన కార్యవర్గ (సీడబ్ల్యూసీ) సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. ఈ చారిత్రాత్మక సమావేశాలు జరుగుతున్న సమయంలోనే న్యూఢిల్లీలో దురదృష్టవశాత్తు అనారోగ్యంతో మాజీ ప్రధాని డా॥ మన్మోహన్ సింగ్ మృతి చెందడం దేశ ప్రజలకు, ప్రత్యేకించి కాంగ్రెస్ పార్టీకి తీరని నష్టం.

జాతిపిత మహాత్మా గాంధీ 1924లో కర్ణాటకలోని బెళగావిలో జరిగిన కాంగ్రెస్ 39వ సమావేశాల్లో పార్టీ అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా... అదే బెళగావిలో మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ నేతృత్వంలో 2024 డిసెంబర్ 26న పార్టీ సీడబ్ల్యూసీ సమావేశాలు నిర్వహించారు. బీజేపీ పాలనలో దేశం ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించి, వాటిపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు దేశవ్యాప్తంగా రాబోయే సంవత్సరం పాటు పార్టీ తరపున పెద్ద ఎత్తున చేపట్టాల్సిన నిరసనల కార్యక్రమాలపై ఈ సమావేశాల్లో పలు కీలక తీర్మానాలు చేయడం జరిగింది.

పవిత్రమైన భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా దేశం సుభిక్షంగా ఉండాల్సిన సమయంలో బీజేపీ పాలకుల ఒంటెత్తు పోకడలతో రాజ్యాంగానికి ప్రమాదం ఏర్పడింది. కీలక బాధ్యతలో ఉన్న హోం మంత్రి అమిత్ షా బాధ్యతారాహిత్యంగా పార్లమెంట్ వేదికగా రాజ్యాంగ నిర్మాత, కోట్లాది భారతీయుల ఆరాధ్య దైవమైన అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసి ప్రజల మనసులను గాయపరిస్తే, ఆయనను బర్తరఫ్ చేయాల్సిన ప్రధాని మోదీ చివరకు ఆయన్నే వెనుకేసుకొని రావడం దురదృష్టకరం. దీనిపై చర్చించిన సీడబ్ల్యూసీ అమిత్ షా రాజీనామా చేయాలనీ, ఆయన క్షమాపణ చెప్పాలనీ డిమాండ్ చేసింది. అంతేకాక రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తున్న బీజేపీ ప్రయత్నాలకు వ్యతిరేకంగా, రాజ్యాంగం



పరిరక్షణకు బెళగావి వేదికగానే శంఖారావం పూరించింది. రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 వసంతాలు పూర్తయ్యే 2025 జనవరి 26వ తేదీన దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ర్యాలీలు నిర్వహించి, అదే స్ఫూర్తితో 2026 జనవరి 26వ తేదీ వరకు 'సంవిధాన్ బచావో రాష్ట్రీయ పాదయాత్ర'ను దేశవ్యాప్తంగా నిర్వహించి బీజేపీ మెడలను వంచాలని సీడబ్ల్యూసీ పిలుపునిచ్చింది.

చట్టవిరుద్ధంగా బీజేపీ స్వయం ప్రతిపత్తిగల... న్యాయ వ్యవస్థ, ఎన్నికల కమిషన్, మీడియా వంటి రంగాలపై ఒత్తిడి తెస్తూ రాజకీయాలు చేయడంపై సీడబ్ల్యూసీ విచారం వ్యక్తం చేసింది. స్వార్థ ప్రయోజనాల కోసం బీజేపీ పాలనలో మైనార్టీలను లక్ష్యంగా చేసుకొని దాడులు పెరిగిపోవడంతో వారు అభద్రతకు లోనవుతున్నారని, ప్రత్యేకంగా మణిపూర్‌లో 2023 మే నెల నుండి అల్లర్లు కొనసాగుతున్నా ప్రధాని మోదీ ఆ రాష్ట్రంలో ఒక్కసారి కూడా పర్యటించక పోవడాన్ని సీడబ్ల్యూసీ తప్పుపట్టింది. రాజకీయ ప్రయోజనాల కోసం సంభాల్‌లో మతకలహాలు సృష్టించడం, యూపీఏ ప్రభుత్వం 1991లో తీసు కొచ్చిన ప్రార్థనా స్థలాల చట్టాన్ని నీరుగార్చడాన్ని కాంగ్రెస్ వ్యతిరేకిస్తుంది. తాము అధికారంలో ఉన్న అస్సాం, యూపీ రాష్ట్రాల్లో కాంగ్రెస్‌ను దౌర్జన్యంగా అడ్డుకోవడాన్ని సీడబ్ల్యూసీ తప్పుపట్టింది.

జనాభా ఆధారంగా బడుగు బలహీన వర్గాలకు న్యాయం చేయాలనే లక్ష్యంతో దేశంలో కులగణన చేపట్టి, గణాంకాల ఆధారంగా రిజర్వేషన్లు కల్పించాలనేది కాంగ్రెస్ విధానం. ఇందుకు అనుగుణంగా రిజర్వేషన్లపై ప్రస్తుతమున్న 50 శాతం సీలింగ్ నిబంధనను తొలగిస్తే సామాజికంగా అందరికీ సమ న్యాయం జరుగుతుందనీ, ఇందుకు ఎన్డీఏ ప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలనీ సీడబ్ల్యూసీ తీర్మానించింది. రాబోయే కేంద్ర బడ్జెట్‌లో పేద ప్రజలు ఆర్థికంగా బలపడేలా, మధ్య తరగతి ప్రజలకు పన్ను మినహాయింపు ఉండేలా చర్యలు తీసుకోవాలనీ, పేదల సంక్షేమానికి బడ్జెట్ కేటాయింపులు పెంచాలనీ, భారంగా మారిన జీఎస్టీలో సంస్కరణలు చేపట్టి సరళతరం చేయాలనీ సీడబ్ల్యూసీ డిమాండ్ చేసింది.

పంటలకు న్యాయమైన మద్దతు ధరలు కల్పించాలనీ, ఉపాధి హామీ పథకం కింద రోజుకు రూ. 400 చెల్లించాలనీ సీడబ్ల్యూసీ కోరింది. లద్దాఖ్ సరిహద్దుకు సంబంధించి చైనాతో కుదుర్చుకున్న ఒప్పందంతోపాటు ఎల్ఏసీపై పార్లమెంట్‌లో చర్చించి ప్రతిపక్ష పార్టీల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలి. దీంతోపాటు బంగ్లాదేశ్‌లో మైనార్టీల రక్షణ కోసం భారత్ చొరవ తీసుకోవాలని కూడా కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోంది.

దేశ ప్రస్తుత రాజకీయాలపై సుదీర్ఘంగా చర్చించిన సీడబ్ల్యూసీ... ప్రజాస్వామ్యం, లౌకికవాదం, రాజ్యాంగం పరిరక్షణ కోసం 'జై బాపు', 'జై భీమ్', 'జై సంవిధాన్ అభియాన్' కార్యక్రమాలను దేశవ్యాప్తంగా నిర్వహించాలని తీర్మానించింది. అంబేడ్కర్ ఆశయాలనూ, జాతిపిత మహాత్మా గాంధీ వారసత్వాన్నీ కొనసాగిస్తూ కాంగ్రెస్ నేతృత్వంలో దేశవ్యాప్తంగా చేపట్టబోయే 'సంవిధాన్ బచావో రాష్ట్రీయ పాదయాత్ర'ను విజయవంతం చేయాలని సీడబ్ల్యూసీ దేశ ప్రజలకు పిలుపునిచ్చింది.

వ్యాసకర్త ఎమ్మెల్సీ, టీపీసీసీ అధ్యక్షులు

తొమ్మిది భక్తి సాధనలు

ఆధ్యాత్మ రామాయణం అరణ్య కాండలో శబరికి శ్రీరామ దర్శనం లభించినప్పుడు 'నేను స్త్రీనీ, మూఢురాలినీ, నిన్నెలా స్తోత్రం చేయాలో తెలియదు. అనుగ్రహించి ప్రసన్నుడవు కమ్మ'ని ఆమె ప్రార్థిస్తుంది. అప్పుడు శ్రీరాముడు స్త్రీ-పురుష భేదాలు కాని, ఆశ్రమ భేదాలు కాని తనని స్తుతించటానికి అవరోధాలు కావనీ, భక్తి ఒక్కటి ఉంటే చాలనీ చెబుతాడు.

భక్తి భావం మనసులో కలగటానికి తొమ్మిది సాధనా మార్గాలను రాముడు చెప్పాడు. భాగవతంలో



నవ విధ భక్తి మార్గాలున్నట్లే, ఆధ్యాత్మ రామాయణంలోనూ ఉన్నాయి. భక్తి కలగటానికి మొదట సత్పురుషుల సాంగత్యం ఉండాలి. మంచి వారి స్నేహంలో దుష్ట భావాలు తొలగిపోయి పవిత్ర భావాలు ఉదయిస్తాయి. రెండవది, రాముని జన్మ-కర్మలను గురించి కథాగానం చేయాలి. దేవుని అనంత కల్యాణ గుణ గణాలను చర్చించుకోవటం మూడవది. భగవంతుని కథలు పాడుకుంటూ ఉంటే దృష్టి ఇతర విషయాలపై మళ్ళదు. నలుగురు కూడినప్పుడు లౌకిక విషయాలు కాకుండా రాముని కల్యాణ గుణాలు చర్చించుకోవటం వల్ల భక్తి స్థిరమవుతుంది. ఉపనిషత్తులు, గీతా వాక్యాలను విశ్లేషించుకోవటం, వ్యాఖ్యానం చేయటం నాలుగవది. పుణ్య కార్యాలలో ఆసక్తి కలిగి ఉండటం ఐదవది. ప్రతి నిత్యం నిష్ఠతో పూజ చేయటం ఆరవది. రామ మంత్రాన్ని ఉపాసించటం ఏడవది. భగవంతుడు తన కంటే తన భక్తులను గుర్తించి, గౌరవించిన వారిని ఇష్ట పడతాడు. భగవద్భక్తులలోనూ, సమస్త ప్రాణికోటిలోనూ రాముని స్వరూపాన్ని దర్శిస్తూ, వైరాగ్యాన్ని కలిగి ఉండటం ఎనిమిదవ భక్తి సాధనం. భగవంతుని యధార్థ తత్వ జ్ఞానం కలిగి వుండటం తొమ్మిదవది. ఈ తొమ్మిది భక్తి సాధనలలో మొదటిది సత్సాంగత్యం లభించిన వారికి తరవాతవి క్రమంగా సిద్ధిస్తాయి. శబరికి కూడా మునుల సత్సాంగత్యం వల్లనే తన దర్శనం లభించిందనీ, భక్తి ఒక్కటే ముక్తికి మార్గమనీ శ్రీరాముడు చెప్పాడు.

– డా॥ చెంగల్వ రామలక్ష్మి

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, పుష్య మాసం, **తిథి:** శు.పాడ్యమి తె.4.07 వరకు (తెల్లవారితే బుధవారం) తదుపరి విదియ, **నక్షత్రం:** పూర్వాషాఢ రా.1.12 వరకు, తదుపరి ఉత్తరాషాఢ, **వర్జ్యం:** ఉ.10.30 నుండి 12.06 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.46 నుండి 9.34 వరకు, తదుపరి రా.10.48 నుండి 11.36 వరకు, **అమృతఘడియలు:** రా.8.10 నుండి 9.48 వరకు; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 6.34, **సూర్యాస్తమయం:** 5.32.

సీఆర్‌టీల సర్వీసు రెన్యువల్ ఫైలుపై సీఎం సంతకం

సాక్షి, హైదరాబాద్: గిరిజన సంక్షేమశాఖ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న మూడు వేల మంది కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్ల (సీఆర్‌టీ) సర్వీసును ప్రభుత్వం రెన్యువల్ చేసింది. ఇందుకు సంబంధించిన ఫైలుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం సంతకం చేశారు. గత కొంతకాలంగా పెండిం గ్‌లో ఉన్న ఈ సమస్యను పరిష్కరించేందుకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఇందులో భాగం గా సీఆర్‌టీల సర్వీసు రెన్యువల్ ఫైలును సోమవారం అసెంబ్లీలోని సీఎం చాంబర్‌కు తీసుకెళ్లారు. ఈ అంశాన్ని ముఖ్యమంత్రికి వివరించి పరిష్కరించాలని కోరారు. దీంతో గిరిజన విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఈ ఫైలుపై సీఎం సంతకం చేశారు. ఈ సందర్భంగా సీఎంకు మంత్రి సీతక్క కృతజ్ఞతలు తెలిపారు.

స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు ఊరట

- ఆయనపై ఎఫ్ఐఆర్‌ను కొట్టివేసిన హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు హైకోర్టు ఊరటనిచ్చింది. 2019లో ఆయనపై దాఖలైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేసింది. 2019లో వికారాబాద్ ఆర్డీవో ఆఫీస్ ముందు కాంగ్రెస్ ఆందోళన చేపట్టింది. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, రోహిత్‌రెడ్డి, గడ్డం ప్రసాద్‌కుమార్ పాల్గొన్నారు. అనుమతి లేకుండా ఎన్నికల సమయంలో కోడ్‌ను ఉల్లంఘించి ఆందోళన చేపట్టారంటూ పోలీసులు వీరిపై కేసు నమోదు చేశారు. వికారాబాద్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్ కొట్టివేయాలని కోరుతూ గడ్డం ప్రసాద్‌కుమార్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ సోమవారం విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. పిటిషన్‌ను అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

మానసిక దివ్యాంగురాలిపై కుక్కల దాడి

జనగామ: జనగామ జిల్లా కేంద్రం ధర్మకంచ ప్రాంతానికి చెందిన మాన సిక దివ్యాంగురాలు శాడా సుజా తపై సోమవా రం కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచా యి. ఇంటి బయట కూర్చున్న సుజాతపై వీధి కుక్కలు దాడి చేసి చేయి కండలు పీకేశాయి. తీవ్రంగా గాయప డిన ఆమెను స్థానికులు వెంటనే జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. కుక్కలు గంట తర్వాత మరో బాలుడిపై దాడి చేసి గాయప రిచాయి. కుక్కలు స్వైర విహారం చేస్తున్నా యని మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



పంటలకు వానలా నీళ్లు!

- ఇక్రిశాట్‌లో సరికొత్తగా లీనియర్ ఇరిగేషన్ విధానం
- పంటలకు అవసరమైన మొత్తంలోనే నీరందించే సాంకేతికత
- వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా మార్చుకునే వెసులుబాటు
- సెల్‌ఫోన్, కంప్యూటర్, రిమోట్ ద్వారా నియంత్రించుకునే అవకాశం

తక్కువ ఎత్తు ఉండే పంటలకు ఎంతో ప్రయోజనం అంటున్న శాస్త్రవేత్తలు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: కాలువలు, బోరు బావుల పైప్‌లైన్లు వంటివి సాంప్రదాయ సాగునీటి పద్ధతులు... డ్రిప్‌లు, స్ప్రింక్లర్లు.. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సూక్ష్మ సేద్య విధానాలు.. కానీ ఇందుకు భిన్నంగా పంటలపై వాన కురిసినట్టుగా, అవసరానికి తగినట్టే నీళ్లు అందేలా 'పివోట్ లీనియర్ ఇరిగేషన్' విధానాన్ని ఇక్రిశాట్ శాస్త్రవేత్తలు అవలంబిస్తున్నారు. విదేశాల్లో వినియోగిస్తున్న ఈ సాంకేతికతను మన దేశంలో ప్రయోగాత్మకంగా పరిశీలిస్తున్నారు. పరిశోధనల్లో భాగంగా సాగు చేస్తున్న పంటలకు ఈ విధానంలో నీళ్లు అందిస్తున్నారు. మొత్తం పొలమంతా కాకుండా... కావాల్సిన చోట మాత్రమే, అనుకున్న సమయంలో పంటలకు వర్షంలా నీళ్లు అందించగలగడం దీని ప్రత్యేకత.

తక్కువ ఎత్తులో పెరిగే పంటలకు..



ప్రస్తుతం ఇక్రిశాట్‌లో వేరుశనగ, శనగ కొత్తవంగడాలపై పరిశోధనల కోసం సాగు చేస్తున్న వ్యవసాయ క్షేత్రాల్లో ఈ 'సెంట్రల్ పివోట్ లీనియర్ ఇరిగేషన్' విధానం ద్వారా నీటిని అందిస్తున్నారు. ఇలా తక్కువ ఎత్తుండేపంటల సాగుకు ఈ విధానంతో ఎంతో ప్రయోజనం ఉంటుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. మీటరుకన్నా తక్కువ ఎత్తుతోనే పండే పంటలకు ఎక్కువ మేలు అని పేర్కొంటున్నారు. భారీ విస్తీర్ణంలో పంటలు వేసే భూకమతాలు, ఒకేచోట వందల ఎకరాల్లో ఒకేతరహా పంటలు సాగు చేసే భారీ వ్యవసాయ క్షేత్రాల్లో ఈ విధానాన్ని వినియోగిస్తుంటారని చెబుతున్నారు. యంత్రాలతో కూడిన పద్ధతిలో కేవలం ఒకరిద్దరు వ్యక్తులతోనే వందల ఎకరాలకు సాగునీటిని అందించవచ్చని వివరిస్తున్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లోని భారీ వ్యవసాయ క్షేత్రాల్లో పివోట్‌లీనియర్ ఇరిగేషన్ విధానం ఎక్కువగా వినియోగిస్తున్నారని చెబుతున్నారు.

ప్రయోజనాలు ఎన్నెన్నో...

ఈ విధానంలో పంటలకు సాగునీరు అందించడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ విధానంలో విద్యుత్ వినియోగం కూడా తక్కువని, నీటి వృథాను తగ్గిస్తుందని.. తక్కువ నీటి వనరులతో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేయవచ్చని వివరించారు. నీటిని పారించే కూలీల అవసరం ఉండదని.. నేల కోతకు గురికావడం వంటి నష్టాలు కూడా ఉండవని వెల్లడించారు. పంటల అవశేషాలు తిరిగి మట్టిలో కలిసి కుళ్లిపోవడానికి ఈ విధానం వీలు కల్పిస్తుందని, తద్వారా ఎరువుల వినియోగం తక్కువగా ఉంటుందని వివరించారు.

- పొలంలో కొన్ని పదుల నుంచి వందల మీటర్ల వరకు దూరంలో రెండు భారీ రోలర్లు, వాటి మధ్య పైపులతో అనుసంధానం ఉంటుంది. ఆ పైపులకు కింద వేలాడుతున్నట్టుగా సన్నని పైపులు ఉంటాయి. వీటి చివరన నాజిల్స్ ఉంటాయి.
- పొలంలోని బోరు/ మోటార్ ద్వారా వచ్చే నీటిని పైపుల ద్వారా రోలర్ల మధ్యలో ఉన్న ప్రధాన పైప్‌లైన్‌కు అనుసంధానం చేస్తారు. దీనితో బోరు/మోటార్ నుంచి వచ్చే నీరు.. రెండు రోలర్ల మధ్యలో ఉన్న పైపులు, వాటికి వేలాడే సన్నని పైపుల ద్వారా ప్రయాణిస్తుంది. నాజిల్స్ నుంచి వర్షంలా పంటలపై నీరు కురుస్తుంది.
- ఈ రోలర్లు పొలం పొడవునా నిర్దేశించిన వేగంలో ముందుకు, వెనక్కి కదులుతూ ఉంటాయి. ఈ క్రమంలో పంటపై వర్షంలా నీరు పడుతూ ఉంటుంది.
- రోలర్లను రిమోట్ ద్వారా నడపవచ్చు. లేదా కంప్యూటర్, సెల్‌ఫోన్ ద్వారా కూడా ఆపరేట్ చేయవచ్చు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటకు ఎంత పరిమాణంలో నీటిని అందించాలన్నది నియంత్రించవచ్చు.

'పివోట్ లీనియర్ ఇరిగేషన్' విధానం ఇదీ..

- కావాలనుకున్న చోట ఎక్కువగా, లేకుంటే తక్కువగా నీటిని వర్షంలా కురిపించవచ్చు. వేర్వేరు పంటలను పక్కపక్కనే సాగు చేస్తున్న చోట ఇది ప్రయోజనకరంగా ఉంటుంది.
- వ్యవసాయ క్షేత్రం విస్తీర్ణాన్ని బట్టి, ఏర్పాటు చేసుకునే పరికరాలను దీనికి అయ్యే ఖర్చు ఆధారపడి ఉంటుందని ఇక్రిశాట్ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. చిన్న, సన్నకారు రైతులు కాకుండా.. సమష్టి వ్యవసాయం చేసేందుకు ఈ విధానం మేలని పేర్కొంటున్నారు.



తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలకు అనుమతి

సీఎం రేవంత్‌కు ఏపీ సీఎం చంద్రబాబు లేఖ

సాక్షి, హైదరాబాద్: తిరుమల శ్రీవారి ఆలయంలో దర్శనాలకు తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రతినిధుల సిఫారసు లేఖలను అనుమతిస్తామని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. ఈమేరకు సోమవారం సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. తెలుగుజాతి సత్సంబంధాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. శ్రీవారి దర్శనానికి అనేక రాష్ట్రాల నుంచి వచ్చే సామాన్య భక్తులకు సౌకర్యం, రద్దీ, సులభంగా దర్శనం కలిగించడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని తెలంగాణ ప్రభుత్వం కోరిక మేరకు ఆదేశాలు జారీ చేస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు. ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేల నుంచి ప్రతివారం ఏవైనా రెండు రోజుల్లో (సోమవారం నుంచి గురువారం వరకు) వీఐపీ బ్రేక్ దర్శన్ (రూ.500 టికెట్) కోసం రెండు లేఖలు, స్పెషల్ ఎంట్రీ దర్శన్ (రూ.300 టికెట్) కోసం రెండు లేఖలు స్వీకరించనున్నట్లు తెలిపారు. ప్రతి లేఖలో ఆరుగురు భక్తులకు దర్శనం సిఫారసు చేయవచ్చని పేర్కొన్నారు. కాగా, ఈమేరకు అనుమతి ఇచ్చినందుకు ఏపీ సీఎం చంద్రబాబునాయుడుకు.. సీఎం రేవంత్‌రెడ్డి 'ఎక్స్' వేదికగా కృతజ్ఞతలు తెలిపారు.

దక్షిణ 'రింగ్' అలైన్‌మెంట్ మారుస్తున్నారు

మాజీ మంత్రి వేముల ధ్వజం



సాక్షి, హైదరాబాద్: కేంద్రం అంగీకారం తెలిపిన దక్షిణ భాగం రీజనల్ రింగ్ రోడ్డుకు సంబంధించి కాంగ్రెస్ నేతలు తమ భూముల చుట్టూ అలైన్‌మెంట్‌ను మార్చే ప్రయత్నం చేస్తున్నారని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. సోమవారం ఆయన తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ నేతలు ఎర్రోళ్ల శ్రీనివాస్, గెల్లు శ్రీనివాస్‌యాదవ్‌తో కలసి విలేకరులతో మాట్లాడారు. దక్షిణ భాగం రీజనల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చకుండా కేంద్రం చర్యలు తీసుకోవాలని కోరారు. ఉత్తర భాగం రీజనల్ రింగ్ రోడ్డుపై రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి దుష్ప్రచారం చేస్తున్నారని, అబద్ధాలు చెప్పడంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పోటీ పడుతున్నారని ధ్వజమెత్తారు. రీజనల్ రింగ్‌రోడ్డు ప్రాజెక్టు కేసీఆర్ మానస పుత్రిక అని, దూరదృష్టితో రీజనల్ రింగ్‌రోడ్డుకు రూపకల్పన చేశామని తెలిపారు.

ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడిగా సాదుల మధుసూదన్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ గుర్తింపు పొందిన స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ట్రస్మా) రాష్ట్ర శాఖ అధ్యక్షుడిగా అంబర్‌పేట ప్రగతి విద్యానికేతన్ హైస్కూల్ చైర్మన్ సాదుల మధుసూదన్ భారీ మెజారిటీతో ఎన్నికయ్యారు. సోమవారం మొదటిసారిగా డిజిటల్ బ్యాలెట్ పద్ధతిలో జరిగిన ఈ ఎన్నికల్లో ట్రస్మా అధ్యక్షుడిగా మధుసూదన్, ప్రధాన కార్య దర్శిగా రమేశ్‌రావు, కోశాధికారిగా పి.రాఘ వేంద్రరెడ్డి ఎన్నికయ్యారు. ఈమేరకు రిటర్నింగ్ అధికారి నర్రా నారాయణరెడ్డి ఎన్నికల వివ రాలను ప్రకటించారు. ఎన్నికల్లో 92 శాతం ఓట్లు పోలైనట్లు తెలిపారు. తెలంగాణలోని 33 జిల్లాల నుంచి ఆన్‌లైన్‌లో ఓటింగ్‌కు అవకాశం లభించిందన్నారు. అనంతరం మధుసూదన్ మాట్లాడుతూ ఎంతో నమ్మకంతో తనను భారీ గా ఓట్లు వేసి గెలిపించడం ఆనందంగా ఉందన్నారు. ఏ నమ్మకంతో ఓట్లేశారో అంతకంటే ఎక్కువ నమ్మకంతో ప్రైవేటు స్కూళ్లకు లాభం జరిగే విధంగా పనిచేస్తానని హామీ ఇచ్చారు.

టీఎస్ యూటీఎఫ్ అధ్యక్షుడిగా రవి

- నల్లగొండలో ముగిసిన రాష్ట్ర మహాసభలు


అధ్యక్షుడు చావ రవి, ప్రధాన కార్యదర్శి వెంకట్

నల్లగొండ: తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) రాష్ట్ర మహాసభలు ముగిశాయి. నల్లగొండ జిల్లా కేంద్రంలో మూడు రోజుల పాటు మహాసభలు జరిగాయి. మహాసభల చివరి రోజు సోమవారం రాష్ట్ర కమిటీ ఎన్నికలు నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా చావ రవి, ప్రధాన కార్యదర్శిగా ఎ.వెంకట్, ఉపాధ్యక్షులుగా కె.జంగయ్య, సీహెచ్ దుర్గాభవాని, కోశాధికారిగా టి.లక్ష్మారెడ్డి ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా సీహెచ్ రాములు, కె.సోమశేఖర్, ఎం.రాజశేఖర్‌రెడ్డి, వి.శాంతికుమారి, జి.సమ్మారావు, డి.సత్యానంద్, జి.నాగమణి, బి.రాజు, కె.రంజిత్‌కుమార్, ఎస్.రవిప్రసాద్‌గౌడ్, ఎస్.మల్లారెడ్డి, కె.రవికుమార్, జి.శ్రీధర్, ఎ.సింహాచలం, వై.జ్ఞానమంజరి, ఎం.వెంకటప్ప, ఆడిట్ కన్వీనర్‌గా జాకటి యాకయ్య, ఆడిట్ కమిటీ సభ్యులుగా సి.లక్ష్మణ్‌రావు, పి.శ్రీనివాసరావు, రఘుపాల్, కె.శంకర్, ఎస్.వెంకటేశ్వర్లు, డి.కిరణ్‌కుమార్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మహాసభల్లో 43 తీర్మానాలు చేశారు. జాతీయ విద్యా విధానం-2020ని రద్దుచేయాలని, నో డిటెన్షన్ విధానాన్ని కొనసాగించాలని పలు అంశాలు తీర్మానాల్లో ఉన్నాయి.

ముదిరాజ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వెంకటేశ్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ముదిరాజ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర సంఘం ఎన్నికలు విస్టోరా హోటల్‌లో జరిగాయి. ఇందులో రాష్ట్ర సంఘం కమిటీని ఎన్నుకున్నారు. తెలంగాణ ముదిరాజ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా వెంకటేశ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జంగయ్య, ఉపాధ్యక్షులుగా వెంకటయ్య, సురేందర్, ధన్‌రాజ్.. రాష్ట్ర కోశాధికారిగా మహేశ్వర్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శులుగా సురేశ్‌బాబు, విష్ణువర్ధన్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులుగా శ్రీనివాస్, రామకృష్ణ, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా వెంకటేశ్వర్లు, అశ్వినీకుమార్, ప్రసాద్, రాము, రాష్ట్ర కోఆర్డినేటర్‌గా మహేశ్‌రాజ్ ఎన్నికయ్యారు.

మందలించారని ఉరేసుకున్నారు

బయటకు వెళ్లొద్దన్నందుకు ఒకరు... చదువుకోమని చెప్పడంతో మరొకరు..

- పెద్దపల్లి జిల్లాలో ఇద్దరు బలవన్మరణం


రోహక్

యైటింక్లయిన్‌కాలనీ (రామగుండం)/ గోదావరిఖని: అర్ధరాత్రి బయటకు వెళ్లొద్దని తండ్రి మందలించడంతో ఒకరు, పద్ధతి మార్చుకోవాలని తల్లి హెచ్చరించడంతో మరొకరు బలవన్మరణానికి పాల్పడ్డారు. పెద్దపల్లి జిల్లాలో ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. గోదావరిఖని యైటింక్లయిన్‌కాలనీ సమీప పోతనకాలనీలో ఉంటూ, ఏఎల్‌పీ గనిలో ఎలక్ట్రీషియన్‌గా విధులు నిర్వహిస్తున్న సింగరేణి కార్మికుడు కొండిల్ల శ్రీనివాస్‌కు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పెద్దకుమారుడు సాయి అవినాష్ (20) డిప్లొమా చదువుతూ వార్షిక పరీక్షల్లో ఫెయిలయ్యాడు. అతడి కోరిక మేరకు తండ్రి మంచిర్యాలలోని ప్రభుత్వ ఐటీఐలో చదివిస్తున్నాడు. ఈనెల 29న ఇంటికి వచ్చిన అవినాష్.. ఆదివారం రాత్రి బయటకు వెళ్తానని, బైక్ కావాలని తండ్రిని అడిగాడు, రాత్రి సమయంలో బయటకు వెళ్లద్దని, బైక్ ఇవ్వనని తండ్రి చెప్పడంతో కలత చెందిన అవినాష్.. తెల్లవారు జామున ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

మరో ఘటనలో తల్లిమందలించిందన్న మనస్తాపంతో పెద్దపల్లి జిల్లా గోదావరిఖని మార్కండేయకాలనీకి చెందిన ముక్క రోహక్(16) సోమవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై రమేశ్ కథనం ప్రకారం.. రోహక్ మార్కండేయ కాలనీలో నివాసం ఉంటూ ఎస్టీపీసీలోని సచ్‌దేవ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కాలేజీకి సరిగ్గా వెళ్లడంలేదు. కనీసం ప్రీ ఫైనల్ పరీక్షలు కూడా రాయలేదు. ఎప్పుడూ బయట తిరుగుతూ ఇంటికి వచ్చేవాడు కాదు. ఆదివారం కూడా బయటకు వెళ్లి ఇంటికి వచ్చాడు. ఇలా చేస్తే కెరీర్ పాడవుతుందని, పద్ధతి మార్చుకోవాలని తల్లి మందలించింది. దీంతో మనస్థాపానికి గురైన రోహక్ పెంట్‌హౌస్ ఇనుపరాడ్‌కు ఉరివేసుకుని మృతి చెందాడు.

అన్నారం బరాజ్‌లో సీడబ్ల్యూపీఆర్‌ఎస్ పరీక్షలు పూర్తి

- ఎన్‌డీఎస్‌ఏకు నివేదిక అందజేయనున్న ఇరిగేషన్‌శాఖ


అన్నారం బరాజ్‌లోని నాలుగవ బ్లాక్ వద్ద పరీక్షలు జరుపుతున్న పుణే నిపుణుల బృందం

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం అన్నారం బరాజ్‌లో పుణేకు చెందిన సీడబ్ల్యూపీఆర్‌ఎస్ బృందం నిపుణుడు ధనుంజయ నాయుడు ఆధ్వర్యంలో పరీక్షలు పూర్తిచేసింది. ఎన్‌డీఎస్‌ఏ (నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ) ఆదేశాలతో ప్యారలల్ సీస్మిక్ వేవ్ మెథడ్ పరీక్షలను సోమవారం పూర్తి చేశారు. గతంలో రెండు సార్లు, ప్రస్తుతం ఆది, సోమవారాల్లో రెండు రోజులపాటు పరీక్షలు నిర్వ హించారు. బరాజ్‌లో అప్, డౌన్ సీమ్‌లలో 42 వెంట్‌లో కంప్యూటర్ చిత్రీకరణ ద్వారా భూగర్భంలోని లీకేజీలపై పరీక్షించారు. బరాజ్‌లోని మూడు, నాలుగు బ్లాకుల్లోని వెంట్‌ల వద్ద పరీక్షలు జరిపారు. ఈ పరీక్షల రిపోర్టులను ఇరిగేషన్‌శాఖ అధికారులకు అందజేయడంతో వారు ఎన్‌డీఎస్‌ఏకు సమర్పిస్తారని ఇంజనీర్లు పేర్కొంటున్నారు. ఎన్‌డీఎస్‌ఏ సూచించిన పరీక్షలను అన్నారం బరాజ్‌లో రూ.1.13 కోట్ల వ్యయంతో ఇరిగేషన్‌శాఖ చేపట్టింది. జియోఫిజికల్ పరీక్షలు చేయాల్సి ఉంది. ఈ పరీక్షల నివేదికలు అందజేసిన తర్వాత ఎన్‌డీఎస్‌ఏ లీకేజీలపై రిటైనింగ్ వాల్ భూగర్భంలో నిర్మాణం చేపట్టనున్నారా.. గ్రౌటింగ్‌తో మరమ్మతులకు ఆదేశించనున్నారా.. అనేది తెలియాల్సి ఉంది. వారి వెంట బరాజ్ ఈఈ యాదగిరి, సీడబ్ల్యూ పీఆర్‌ఎస్ బృందం సభ్యులు ప్రశాంత్, శివాంగ్, ఇరిగేషన్‌శాఖ డీఈఈ సతీశ్, ఏఈఈలు యాకయ్య, శ్రవణ్, రాజేశ్, సారయ్య ఉన్నారు.

జర్నలిస్టులకు ఆరోగ్య బీమా కల్పించాలని సీఎంను కోరాం

- మీట్ ది ప్రెస్‌లో మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి



నల్లగొండ టూటౌన్: జర్నలిస్టులకు రూ.15 లక్షల వరకు ఆరోగ్య బీమా కల్పించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి కోరామని, దీనికి సంబంధించి విధివిధానాల రూపకల్పన ప్రక్రియ కొనసాగుతోందని మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వ హయాంలో జర్నలిస్టులు రూ.1,000 చెల్లిస్తే రూ.లక్ష వరకు ఉచిత ఆరోగ్య బీమా కార్డులు అందజేశారని గుర్తుచేశారు. సోమవారం నల్లగొండ పట్టణంలోని రామగిరి ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం అందించే ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలిపారు. అక్రెడిటేషన్ కార్డులకు సంబంధించి కమిటీ ప్రభుత్వానికి నివేదిక అందించిందన్నారు. అనంతరం జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇప్పించాలని కోరుతూ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. మీట్ ది ప్రెస్‌లో ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యెరెడ్ల చంద్రశేఖర్‌రెడ్డి, వంగాల శ్రీనివాస్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి, కోశాధికారి గుండాల యాదగిరి పాల్గొన్నారు.

డాకింగ్ దిశగా...

ఇస్రో తొలి అడుగు

పీఎస్‌ఎల్‌వీ ప్రయోగం విజయవంతం

- నిర్ధారిత కక్ష్యలోకి స్పేడెక్స్ జంట ఉపగ్రహాలు
- జనవరి 7న డాకింగ్ ప్రక్రియ: ఇస్రో
- సఫలమైతే నాలుగో దేశంగా రికార్డు
- గగన్‌యాన్, భావి మిషన్లకు కీలకం





సోమవారం రాత్రి షార్ కేంద్రం నుంచి స్పేడెక్స్ ప్రయోగ దృశ్యం

సూళ్లూరుపేట: అంతరిక్షంలో ఉపగ్రహాల అనుసంధానం, విడదీత సామర్థ్యాన్ని సమకూర్చుకునే దిశగా భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో వేసిన తొలి అడుగు విజయవంతమైంది. స్పేస్ డాకింగ్ ప్రయోగం (స్పేడెక్స్)లో భాగంగా ఛేజర్, టార్గెట్ జంట ఉపగ్రహాలను పీఎస్‌ఎల్‌వీ-సీ60 రాకెట్ సోమవారం విజయవంతంగా నిర్ధారిత కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. దాంతో ప్రయోగంలో తొలి అంకం దిగ్విజయమైంది. అతి కీలక మైలురాయికి ఇస్రో కేవలం అడుగు దూరంలో నిలిచింది. రెండో దశలో జంట ఉపగ్రహాలను అంతరిక్షంలో అనుసంధానం (డాకింగ్) చేయడం స్పేడెక్స్ మిషన్ ప్రధాన లక్ష్యం. ఈ ప్రక్రియ జనవరి 7న జరగవచ్చని ఇస్రో చైర్మన్ సోమనాథ్ ప్రకటించారు. అది సఫలమైతే అమెరికా, చైనా, రష్యా తర్వాత అతి సంక్లిష్టమైన డాకింగ్ టెక్నాలజీ కలిగిన నాలుగో దేశంగా భారత్ నిలుస్తుంది. ఇస్రో నిర్వహించబోయే మానవ సహిత గగన్‌యాన్, చంద్రయాన్-4 ప్రయోగాలతో పాటు భారతీయ స్పేస్ స్టేషన్ నిర్మాణం తదితరాల్లో ఈ టెక్నాలజీది కీలక పాత్ర కానుంది. ప్రయోగం విజయవంతం కావడం పట్ల ఏపీ సీఎం మాజీ సీఎం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హర్షం వెలిబుచ్చారు.

ఇలా జరిగింది...

ప్రయోగం ముందు నిర్ణయించినట్టు సోమవారం రాత్రి 9.58కు బదులు 2 నిమిషాల ఆలస్యంగా పదింటికి జరిగింది. 25 గంటల కౌంట్‌డౌన్ అనంతరం రెండు ఉపగ్రహాలతో పీఎల్‌ఎల్వీ-సీ60 తిరుపతి జిల్లా సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్‌లోని తొలి ప్రయోగవేదిక నుంచి నింగికెగిసింది. మామూలుగా 320 టన్నులుండే పీఎస్‌ఎల్‌వీ రాకెట్ స్ట్రాపాన్ బూస్టర్లు లేకపోవడంతో 229 టన్నులతోనే దూసుకెళ్లింది. 111.12 సెకన్లకు తొలి దశ, 262.06 సెకన్లకు రెండో దశ, 511.22 సెకన్లకు మూడో దశ, 792.48 సెకన్లకు నాలుగో దశ విజయవంతంగా పూర్తయ్యాయి. 15.15 నిమిషాలకు టార్గెట్, 15.20 నిమిషాలకు ఛేజర్ ఉపగ్రహాలను 470 కి.మీ. ఎత్తులో నూతన సెమీ మేజర్ యాక్సిస్ వృత్తాకార కక్ష్యలో 55 డిగ్రీల వాలులో విజయవంతంగా ప్రవేశపెట్టారు. తర్వాత పీఎస్-4లో అమర్చిన పలు స్టార్టప్ కంపెనీలకు చెందిన 24 పేలోడ్లను కూడా కక్ష్యలోకి ప్రవేశపెట్టడంతో ప్రయోగం పూర్తయింది. 2024లో చివరిదైన ఈ ప్రతిష్టాత్మక ప్రయోగం విజయవంతం కావడంతో సైంటిస్టుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. షార్ కేంద్రం నుంచి ఇది 99 ప్రయోగం. పీఎస్‌ఎల్‌వీ సిరీస్‌లో 62వది. వాటిలో 60 విజయాలే కావడం విశేషం!

వారంలోనే పని మొదలు

స్పేడెక్స్ ఉపగ్రహాలు వారంలోనే పని చేయడం ప్రారంభిస్తాయని ఇస్రో చైర్మన్ డాక్టర్ ఎస్ సోమనాథ్ చెప్పారు. సూళ్లూరుపేట చెంగాళమ్మ ఆలయ సందర్శన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ''2025 మార్చిలోపు రెండు పీఎస్ఎల్వీ, ఒక జీఎస్ఎల్వీ, రెండు ఎల్‌వీఎం3 రాకెట్ ప్రయోగాలు లక్ష్యంగా పెట్టుకున్నాం. గగన్‌యాన్ ప్రయోగమూ వీటిలో ఉంది'' అని వివరించారు.

స్పేడెక్స్ ఉపయోగాలెన్నో...

స్పేడెక్స్ జంట ఉపగ్రహాలను ఇస్రో పూర్తిగా సొంత సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించింది. ఒక్కోదాని బరువు 220 కిలోలు. ఇవి రెండేళ్ల పాటు సేవలందిస్తాయి. వీటి అనుసంధానం సాంకేతికంగా అత్యంత సవాలుతో కూడింది. అత్యంత వేగంగా ప్రయాణించే రెండు ఉపగ్రహాలు వేగాన్ని నియంత్రించుకుంటూ క్రమంగా పరస్పరం చేరువవుతూ సున్నితంగా అనుసంధానం కావాలి. ఏమాత్రం తేడా వచ్చినా ఢీకొని పేలిపోతాయి.

- అంతరిక్షంలో భారత స్పేస్ స్టేషన్ నిర్మాణానికి స్పేడెక్స్ ప్రయోగం తొలి అడుగు.
- రోదసీలో వ్యోమనౌకల మధ్య వస్తు మార్పిడి తదితరాలకు డాకింగ్ టెక్నాలజీ వీలు కల్పిస్తుంది.
- ఇస్రో చేపట్టే మానవసహిత అంతరిక్ష యాత్ర గగన్‌యాన్‌కు ఎంతో దోహదపడుతుంది.
- చంద్రయాన్-4 ద్వారా చంద్రుడి ఉపరితలంపై సేకరించిన నమూనాలను భూమికి తేవడాన్ని సులభతరం చేస్తుంది. ఇందుకోసం రెండు రాకెట్ల ద్వారా భిన్న మాడ్యూల్స్‌ను పంపి భూమి, చంద్రుడి కక్ష్యలో డాకింగ్ చేయనున్నారు.
- కక్ష్యలో ఉపగ్రహాల మరమ్మతులు, వాటిలో ఇంధనం నింపడం తదితరాలకు ఉపయోగపడుతుంది.
- ఈ టెక్నాలజీ వల్ల ఉపగ్రహాల జీవితకాలమూ పెరుగుతుంది.
- జంట ఉపగ్రహాల్లో అమర్చిన హై రిజల్యూషన్ కెమెరా మెరుగైన భూ పరిశీలనకు తోడ్పడుతుంది.
- మినియేచర్ మల్టీ స్పెక్ట్రల్ పేలోడ్ మానవ సహిత అంతరిక్ష యాత్రలకు తోడ్పడుతుంది.

జిమ్మీ కార్టర్ అస్తమయం

నూరేళ్లూ జీవించిన ఏకైక అమెరికా అధ్యక్షుడు



వాషింగ్టన్: అమెరికా 39వ అధ్యక్షుడు, డెమొక్రటిక్ నేత జిమ్మీ కార్టర్ ఇక లేరు. ఇటీవలే 100వ పుట్టిన రోజు జరుపుకున్న ఆయన జార్జియా రాష్ట్రంలో ప్లెయిన్స్‌లోని తన నివాసంలో ఆదివారం ప్రశాంతంగా కన్నుమూశారు. అమెరికా అధ్యక్షుల్లో అత్యధిక కాలం జీవించిన రికార్డు ఆయనదే. 1977–81 మధ్య అధ్యక్షునిగా చేసిన కార్టర్ మృతి పట్ల ప్రపంచవ్యాప్తంగా సంతాపాలు వెల్లువెత్తాయి. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రధాని నరేంద్ర మోదీతో సహా పలువురు దేశాధినేతలు కార్టర్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన నాయకత్వ పటిమ తిరుగులేనిదని బైడెన్ తన సంతాప సందేశంలో పేర్కొన్నారు. గొప్ప వ్యక్తిత్వానికి, సానుకూల దృక్పథానికి కార్టర్ ప్రతిరూపమని కొనియాడారు. కార్టర్ అంత్యక్రియలను జనవరి 9న పూర్తి అధికార లాంఛనాలతో జరపనున్నట్టు ప్రకటించారు. రాజకీయంగా, సైద్ధాంతికంగా కార్టర్‌తో తాను తీవ్రంగా విభేదించినా ఆయన నిష్కళంక దేశభక్తుడన్నది నిస్సందేహమని ట్రంప్ పేర్కొన్నారు. కార్టర్ అంత్యక్రియలు స్వగ్రామంలో ఆయనకెంతో ఇష్టమైన సొంత వ్యవసాయ క్షేత్రంలోనే జరిగే అవకాశముంది.

రైతు బిడ్డ

జిమ్మీ కార్టర్‌గా ప్రసిద్ధుడైన జేమ్స్ ఎర్ల్ కార్టర్ జూనియర్ ఓ నికార్సైన రైతు బిడ్డ. 1924 అక్టోబర్ 1న జార్జియాలోని ప్లెయిన్స్ అనే చిన్న పట్టణంలో జన్మించారు. ఆయన తండ్రి కార్టర్ సీనియర్ ఓ రైతు. తల్లి లిలియన్ నర్సు. 1943లో అమెరికా నావల్ అకాడమీలో క్యాడెట్‌గా ఆయన కెరీర్ మొదలైంది. దీర్ఘకాలం పాటు విధులు నిర్వర్తించడమే గాక ప్రతిష్టాత్మక అణు జలాంతర్గామి కార్యక్రమానికి ఎంపికయ్యారు. 1962లో తొలిసారి సెనేటర్‌గా ఎన్నికయ్యారు. 1970లో జార్జియా గవర్నర్ అయ్యారు. 1974లోనే అధ్యక్ష ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. అధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్ రాజీనామాకు దారితీసిన వాటర్‌గేట్ కుంభకోణం నుంచి అమెరికా అప్పటికింకా బయటపడనే లేదు. 1977 ఎన్నికల్లో నెగ్గి అమెరికా అధ్యక్షుడయ్యారు. 1979లో ఈజిప్టు, ఇజ్రాయెల్ మధ్య చరిత్రాత్మక శాంతి ఒప్పందంలో కీలకపాత్రధారిగా నిలిచారు. చైనాతో అమెరికా దౌత్య సంబంధాలకు తెర తీసిన అధ్యక్షునిగా నిలిచిపోయారు. మానవ హక్కులే మూలసూత్రంగా అమెరికా విదేశాంగ విధానాన్ని పునర్నిర్వచించారు. అయితే అఫ్గానిస్తాన్‌పై సోవియట్ యూనియన్ ఆక్రమణను అడ్డుకోలేకపోయారు. ఇరాన్ బందీల సంక్షోభమూ కార్టర్ చరిత్రపై ఓ మచ్చగా మిగిలింది. డజన్ల కొద్దీ అమెరికన్లను ఇరాన్ తిరుగుబాటు విద్యార్థులు బందీలుగా చేసుకోవడం స్వదేశంలో ఆయన ప్రతిష్టను బాగా దెబ్బతీసింది. 1980 ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థి రొనాల్డ్ రీగన్ చేతిలో ఓటమి చవిచూశారు. అలా వైట్‌హౌస్‌ను వీడినా కార్టర్ ప్రజాసేవ మాత్రం నిర్నిరోధంగా కొనసాగింది. అమెరికా ప్రభుత్వం తరఫున ఉత్తర కొరియాకు శాంతి స్థాపన బృందాన్ని తీసుకెళ్లారు. అంతర్జాతీయంగా శాంతి స్థాపనకు చేసిన నిర్విరామంగా కృషికి నోబెల్ శాంతి బహుమతి అందుకున్నారు. కార్టర్‌కు ముగ్గురు పిల్లలున్నారు. ఆయన భార్య రోసలిన్ ఏడాది క్రితమే మరణించారు.

భారత్‌తో అనుబంధం

కార్టర్‌కు భారత్‌తో మంచి అనుబంధముంది. ఆయన తల్లి లిలియన్ పీస్ కార్ప్స్ బృందంలో భాగంగా 1960ల చివర్లో భారత్‌లో హెల్త్ వలంటీర్‌గా పని చేశారు. దాంతో కార్టర్ భారత్‌కు సహజ మిత్రునిగా పేరుబడ్డారు. మన దేశంలో పర్యటించిన మూడో అమెరికా అధ్యక్షునిగా నిలిచారు. 1977లో కేంద్రంలో జనతా పార్టీ అధికారంలోకి వచ్చి ఎమర్జెన్సీని ఎత్తేసిన మరుసటేడాది కార్టర్ భార్యాసమేతంగా భారత్‌కు వచ్చారు. ఆ సందర్భంగా భారత పార్లమెంటులో చేసిన ప్రసంగంలో నియంతృత్వ పాలనను స్పష్టంగా వ్యతిరేకించారు. ద్వైపాక్షిక సంబంధాలను ఎంతగానో మెరుగుపరిచినదిగా ఆ పర్యటన చిరస్థాయిగా నిలిచిపోయింది. కార్టర్ దంపతులు ఢిల్లీ సమీపంలోని ఓ గ్రామాన్ని సందర్శించడం అందరినీ ఆకర్షించింది.

న్యాయమూర్తుల సంతానానికి

హైకోర్టు జడ్జిలుగా నో చాన్స్!

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు, హైకోర్టు ప్రస్తుత, మాజీ న్యాయమూర్తుల సంతానం, అతి సమీప బంధువులను హైకోర్టు న్యాయమూర్తులుగా నియమించరాదన్న ప్రతిపాదనను సుప్రీంకోర్టు కొలీజియం చురుగ్గా పరిశీలిస్తున్నట్టు తెలిసింది. అలాంటి వారి పేర్లను సిఫార్సు చేయరాదంటూ హైకోర్టు కొలీజియాలకు సూచిస్తే ఎలా ఉంటుందని ఆలోచిస్తున్నట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. తద్వారా అర్హులైన కొందరికి అన్యాయం జరిగినా బంధుప్రీతి వంటి ఆరోపణలకు తావుండదని, ఎంపిక ప్రక్రియ మరింత పారదర్శకంగా మారుతుందని కొలీజియం సభ్యుడైన సీనియర్ న్యాయమూర్తి అభిప్రాయపడ్డట్టు సదరు వర్గాలు వెల్లడించాయి. తొలి తరం న్యాయవాదులతో పాటు విభిన్న సామాజికవర్గాల వారికి హైకోర్టు న్యాయమూర్తులుగా అవకాశం లభిస్తుందన్నది దీని ఉద్దేశమని వివరించాయి.

మళ్లీ తెరపైకి 'సంప్రదింపులు'

హైకోర్టు న్యాయమూర్తుల నియామకానికి సంబంధించి మరో ఇటీవల కీలక పరిణామం కూడా చోటుచేసుకుంది. హైకోర్టు కొలీజియం సిఫార్సు చేసిన అభ్యర్థులతో సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా సారథ్యంలోని ఐదుగురు సభ్యుల సుప్రీంకోర్టు కొలీజియం డిసెంబర్ 22న వ్యక్తిగతంగా భేటీ అయింది. తద్వారా గత సంప్రదాయాన్ని పునరుద్ధరించింది. అనంతరం రాజస్తాన్, ఉత్తరాఖండ్, బాంబే, అలహాబాద్ హైకోర్టులకు న్యాయమూర్తులుగా ఆరుగురు పేర్లను కేంద్రానికి సిఫార్సు చేసింది. దేశంలో మెజారిటీ ప్రజల అభిప్రాయమే సాగాలంటూ అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్ ఇటీవల చేసిన వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో ఈ 'సంప్రదింపు'ల నిర్ణయం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇప్పటిదాకా హైకోర్టు న్యాయమూర్తుల నియామకానికి అభ్యర్థుల బయోడేటా, వారి అర్హత, సామర్థ్యాలపై కొలీజియం అంచనా, నిఘా సమాచారం తదితరాలను ప్రాతిపదికగా తీసుకుంటూ వస్తుండటం తెలిసిందే.

జనవరి నుంచి డీఏపీ ధర పెంపు

50 కిలోల బస్తా ధర రూ.1,550కు చేరే అవకాశం

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో యూరియా తర్వాత అత్యధికంగా వినియోగించే డై-అమ్మోనియం ఫాస్ఫేట్ (డీఏపీ) ధర జనవరి నుంచి పెరగొచ్చని తెలుస్తోంది. యాభై కిలోల బ్యాగ్‌పై కనీసంగా రూ.200 వరకు పెరిగే అవకాశముందని సమాచారం. డీఏపీ దిగుమతులకు కేంద్రం ఇప్పటివరకు అందించిన ప్రత్యేక ప్రోత్సాహకాల గడువు డిసెంబర్‌తో ముగియనుంది. దీని పొడిగింపుపై కేంద్రం ఎలాంటి ప్రకటన చేయలేదు. అంతేకాదు, డాలర్‌తో రూపాయి మారకం విలువ మరింతగా పడిపోయింది. ఈ నేపథ్యంలో దిగుమతి వ్యయం పెరిగి ఆమేరకు డీఏపీ ధర పెరిగే అవకాశముందని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. ఫాస్ఫేటిక్ ఎరువుల్లో 90 శాతం వరకు దిగుమతి చేసుకునేవే. దేశంలో ఏటా 100 లక్షల టన్నుల డీఏపీ వినియోగం అవుతుండగా, అందులో 60 లక్షల టన్నుల మేర దిగుమతి అవుతోంది. దేశీయ ఉత్పత్తికి ఉపయోగించే ముడి పదార్థాలైన రాక్ ఫాస్ఫేట్, ఫాస్పారిక్ యాసిడ్ కూడా దిగుమతి చేసుకునేవే. డీఏపీ ధరను రైతులకు అందుబాటులో ఉంచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం దిగుమతులపై టన్నుకు రూ.3,500 ప్రత్యేక ప్రోత్సాహకం అందిస్తోంది. ఈ గడువు డిసెంబర్‌తో 31తో ముగియనుంది. ఈ ప్రోత్సాహకాల కొనసాగింపుపై ఇంతవరకు కేంద్రం ఎలాంటి ప్రకటన చేయలేదు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం 50 కిలోల బ్యాగ్ ధర రూ.1,350 ఉండగా, అది 12–15 శాతం వరకు పెరిగే అవకాశాలున్నాయని తెలుస్తోంది. అంటే సుమారు రూ.200 మేర పెరిగి రూ.1,550కి చేరే అవకాశముందని అంటున్నారు. అంతర్జాతీయంగా పెరుగుతున్న ధరలు, చైనా నుంచి తగ్గిన ముడి సరుకు సరఫరా, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ఎర్ర సముద్రంలో రవాణా పరమైన సవాళ్లు సైతం ధరల పెరుగుదలకు కారణాలని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

ఇథియోపియాలో ఘోర ప్రమాదం..

ట్రక్కు నదిలో పడి 71 మంది మృత్యువాత

అడిస్ అబాబా: ఆఫ్రికా దేశం ఇథియోపియాలో నదిలో ట్రక్కు పడిన దుర్ఘటనలో 71 మంది మృత్యువాతపడ్డారు. దక్షిణ ప్రాంత సిడామాలోని లెమ్మ లగిడెలో ఆదివారం దుర్ఘటన చోటుచేసుకుంది. బాధితులంతా పెళ్లి బృందంలోని వారు. కిక్కిరిసిన ట్రక్కు గలానా నదిపైన వంతెన మీదుగా వెళ్తుండగా అదుపు తప్పి పడిపోయింది. అక్కడికక్కడే 60 మంది అసువులు బాశారు. మిగతా 11 మంది చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారని అధికారులు చెప్పారు. పేద దేశం కావడంతో వివాహాలు వంటి వేడుకలకు వెళ్లే వారు ఎక్కువ ఖర్చయ్యే బస్సులకు బదులుగా తక్కువకే దొరికే ట్రక్కులనే జనం వాడుతుంటారు. రహదారుల నిర్వహణ లోపభూయిష్టంగా మారడంతో ఇక్కడ ప్రమాదాలు సర్వసాధారణంగా మారాయి.

పంజాబ్‌లో రైతుల బంద్

- స్తంభించిన జనజీవనం
- రాష్ట్రవ్యాప్తంగా ట్రాఫిక్ జామ్‌లు
- రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం

చండీగఢ్: పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడంసహా తమ పలు డిమాండ్ల సాధనకు ఉద్యమిస్తున్న పంజాబ్ కర్షకులు సోమవారం చేపట్టిన తొమ్మిది గంటల రాష్ట్రవ్యాప్త బంద్‌తో జనజీవనం స్తంభించింది. పంజాబ్ గుండా సాగే జాతీయ రహదారులపై రాస్తారోకోలు, రైల్వేపట్టాలపై బైఠాయింపులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రైల్వే రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పంజాబ్–ఢిల్లీ రూట్‌లో రాకపోకలు సాగించే 163 రైళ్ల సర్వీసులు రద్దయ్యాయి. రాస్తారోకోలతో వాహనాల్లో జనం ఎక్కడికక్కడ చిక్కుకుపోయి అవస్థలు పడ్డారు. సోమవారం ఉదయం ఏడు గంటలకు మొదలెట్టి సాయంత్రం నాలుగు గంటలకు బంద్‌ను ముగిస్తామని రైతు సంఘాలు ప్రకటించినా బంద్ ప్రభావం రోజంతా కనిపించింది. పటియాలా, జలంధర్, అమృత్‌సర్, ఫిరోజ్‌పూర్, బఠిండా, పఠాన్‌కోట్‌లలో బంద్ ప్రభావం ఎక్కువగా కనిపించింది. పటియాలా–చండీగఢ్ జాతీయ రహదారిపై ధరేరీ జఠాన్ టోల్‌ప్లాజా వద్ద రైతులు రోడ్డుపై బైఠాయించడంతో కిలోమీటర్ల పొడవునా వాహనాలు నిలిచిపోయి సామాన్యులు ఇబ్బందులపాలయ్యారు. అమృత్‌సర్‌లోని గోల్డెన్ గేట్‌సహా చాలా పట్టణాల్లో వేల సంఖ్యలో రైతులు బంద్‌లో పాల్గొని ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా(రాజకీయేతర), కిసాన్ మజ్దూర్ మోర్చాలు ఈ బంద్‌కు పిలుపునివ్వడం తెల్సిందే. గత 35 రోజులుగా ఖనౌరీ సరిహద్దు వద్ద నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న రైతు సంఘం నేత జగ్జీత్‌సింగ్ ధల్లేవాల్‌కు బంద్ సందర్భంగా రైతులు సంఘీభావం ప్రకటించారు. మరోవైపు దీక్ష మొదలై 35 రోజులు పూర్తవడంతో ఆయన ఆరోగ్యం క్షీణించింది. ఇప్పటికైనా తమ డిమాండ్లపై కేంద్రం దృష్టిసారించాలని సోమవారం ఒక వీడియో విన్నపంలో ధల్లేవాల్ కోరారు.

లైంగిక వేధింపుల కేసులో ట్రంప్‌కు ఎదురుదెబ్బ

న్యూయార్క్: కాలమిస్ట్ ఇ.జీన్ కరోల్‌పై లైంగిక వేధింపుల కేసులో అమెరికా కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఎదురుదెబ్బ తగిలింది. బాధితురాలికి 50 లక్షల డాలర్ల పరిహారం ఇవ్వాలంటూ మన్‌హటన్ జ్యూరీ ఇచ్చిన తీర్పును రెండో యూఎస్ సర్క్యూట్ అప్పీల్స్ కోర్టు సమర్థించింది. 1996లో న్యూయార్క్‌లోని ఓ డిపార్ట్‌మెంట్ స్టోర్ డ్రెస్సింగ్ రూంలో లైంగికంగా వేధించినట్లు జీన్ కరోల్ ఆరోపించిన సంగతి తెలిసిందే.

ఎన్నికల నిధుల కోసం సిసోడియా క్రౌడ్ ఫండింగ్

న్యూఢిల్లీ: ఢిల్లీ అసెంబ్లీకి వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరిగే ఎన్నికల నిధుల సేకరణలో ఆమ్‌ఆద్మీ పార్టీ(ఆప్) సీనియర్ నేత మనీశ్ సిసోడియా వినూత్న ఒరవడికి శ్రీకారం చుట్టారు. సోమవారం ఆయన ఆన్‌లైన్ క్రౌడ్ ఫండింగ్ వేదికను ప్రారంభించారు. సిసోడియా వచ్చే ఎన్నికల్లో జంగ్‌పుర నుంచి పోటీ చేస్తున్న సంగతి తెలిసిందే.

ప్రపంచం ఓటేసింది..

ఏకంగా 73 దేశాల్లో ఎన్నికలు

2024 రివైండ్

- ఓటేసిన 173 కోట్ల మంది
- ప్రభుత్వాలకు, అధినేతలకు షాక్
- పలు దేశాల్లో ప్రహసనప్రాయం

అత్యధిక దేశాల్లో ఎన్నికలు జరిగిన సంవత్సరంగా 2024 చరిత్రలో నిలిచిపోనుంది. అమెరికా నుంచి భారత్ దాకా ఈ ఏడాది ప్రపంచవ్యాప్తంగా ఏకంగా 73 దేశాలు ఓట్ల పండుగ జరుపుకోవడం విశేషం. 27 సభ్య దేశాలున్న యూరోపియన్ యూనియన్‌కు జరిగిన పార్లమెంటరీ ఎన్నికలు వీటికి అదనం! ఈ దేశాల్లో దాదాపు 400 కోట్ల పై చిలుకు జనాభా ఉంది. అంటే ప్రపంచ జనాభాలో దాదాపుగా సగం మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా ఈ ఏడాది ఎన్నికల క్రతువులో పాల్గొన్నారు. వీటిలో చాలా ఎన్నికలు ఓటర్ల పరిణతికి అద్దం పట్టాయి. ఒక్కో దేశంలో ఒక్కోలా ప్రజలు తీర్పు వెలువరించడం విశేషం. పలు ఫలితాలు ఊహించినట్టు రాగా కొన్ని మాత్రం అనూహ్యలతో ఆశ్చర్యపరిచాయి. అధికార పార్టీల అక్రమాల నడుమ ఎన్నికల ప్రక్రియనే అపహాస్యం చేసినవీ ఉన్నాయి...

భారత ఓటర్ల పరిణతి

భారత్‌లో సాధారణ ఎన్నికలు ప్రపంచంలోకెల్లా అతి పెద్ద ప్రజాస్వామిక క్రతువుగా ఎప్పుడో రికార్డు సృష్టించాయి. ఇంతటి బృహత్తర కార్యక్రమం ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ లేకుండా ప్రశాంతంగా జరిగే తీరు చూసి ప్రపంచమంతా ఎప్పటికప్పుడు ఆశ్చర్యపోతూనే ఉంటుంది. ఈసారి కూడా అందుకు తగ్గట్టే ఏప్రిల్ నుంచి ఆరు వారాల వ్యవధిలో ఏడు విడతల్లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఏకంగా 64.64 కోట్ల మంది ఓటు హక్కును వినియోగించుకోవడం విశేషం. ఈసారి ఏకంగా '400కు మించి'అన్న బీజేపీ చివరికి మెజారిటీకీ కాస్త తక్కువగా 240 లోక్‌సభ స్థానాలతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. అలా ఈసారి ఫలితాలు కూడా అందరినీ ఆశ్చర్యపరచడమే గాక భారత ఓటర్ల పరిణతికి అద్దం పట్టాయి.

పారిపోయిన నేతలు



హసీనా



అసద్

పొరుగు దేశం బంగ్లాదేశ్‌లో అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. అది కూడా జనవరిలో సాధారణ ఎన్నికలు ముగిసి షేక్ హసీనా రికార్డు స్థాయిలో ఐదోసారి ప్రధాని కావడం ద్వారా అధికారాన్ని నిలబెట్టుకున్న ఐదు నెలలకే! అజ్ఞాత శక్తి కనుసన్నల్లో సాగినట్టు కన్పించిన 'ప్రజా ఉద్యమం'దెబ్బకు ఆమె పదవీచ్యుతురాలయ్యారు. అధికార నివాసాన్ని ఆందోళనకారులు చుట్టుముట్టడంతో దాదాపుగా కట్టుబట్టలతో ఉన్నపళంగా దేశం వీడి భారత్‌లో రాజకీయ ఆశ్రయం పొందారు. నోబెల్ గ్రహీత మహమ్మద్ యూనుస్ సారథ్యంలోని తాత్కాలిక సర్కారు కొలువుదీరింది. నాడు మొదలైన అల్లర్లు, అరాచకాలు బంగ్లాలో నేటికీ కొనసాగుతున్నాయి. హిందువులతో పాటు మైనారిటీల భద్రతను ప్రమాదంలో పడేశాయి.

అసద్‌లకు అల్విదా

సిరియాలో అసద్‌ల 50 ఏళ్ల కుటుంబ పాలనకు తిరుగుబాటుదారులు డిసెంబర్‌లో తెర దించారు. అధ్యక్షుడు బషర్ అల్ అసద్ కుటుంబంతో పాటు రష్యాకు పారిపోయారు. అలా నియంతృత్వ పాలనకు తెర పడ్డా దేశం మాత్రం అనిశ్చితితో కూరుకుపోయింది.

ట్రంప్.. తగ్గేదేలే...!

నానారకాల వాదాలతో విడిపోయిన అమెరికాలో ఈసారి జరిగిన అధ్యక్ష ఎన్నికలు ప్రపంచమంతటినీ అమితంగా ఆకర్షించాయి. డొనాల్డ్ ట్రంప్ హవాకు అద్దం పట్టిన ఎన్నికలుగా నిలిచిపోయాయి. రిపబ్లికన్ల అభ్యర్థిత్వం సాధించడం మొదలుకుని ప్రధాన పోరు దాకా ఆద్యంతం ఆయన కనబరిచిన దూకుడు ఓటర్లను అమితంగా ఆకర్షించింది. ఆయన 'అమెరికా ఫస్ట్'నినాదం రెండోసారి ప్రపంచంలోకెల్లా అత్యంత శక్తిమంతమైన అధికార పీఠం ఎక్కించింది. డెమొక్రాట్లకు అధ్యక్షుడు జో బైడెనే భారంగా మారారు. సకాలంలో తప్పుకోకపోవడం ద్వారా పార్టీ విజయావకాశాలకు తీవ్రంగా గండి కొట్టిన అప్రతిష్టను మూటగట్టుకున్నారు. భారత మూలాలున్న వైస్ ప్రెసిడెంట్ కమలా హారిస్ శాయశక్తులా ప్రయత్నించినా, ఆమెదే పైచేయి అని ప్రధాన మీడియా ఎంతగా హోరెత్తించినా ట్రంప్ 'తగ్గేదే లే'అన్నారు. 538 ఎలక్టోరల్ ఓట్లలో ఏకంగా 312 ఓట్లను ఒడిసిపట్టి భారీ మెజారిటీతో విజయ దరహాసం చేశారు.



రిషికి ఓటమి

సమస్యలతో సతమతమవుతున్న బ్రిటన్ ప్రజలు తమ ఆగ్రహమంతటినీ అధికార కన్జర్వేటివ్ పార్టీపై చూపించారు. ఆ పార్టీ 14 ఏళ్ల ఏలుబడికి తెర దించారు. భారత మూలాలున్న తొలి బ్రిటన్ ప్రధానిగా చరిత్ర సృష్టించిన రిషి సునాక్ సారథ్యంలో కన్జర్వేటివ్‌లు దారుణ ఓటమి మూటగట్టుకున్నారు. లేబర్ పార్టీ నేత కియర్‌స్టార్మర్‌కు జనం పట్టం కట్టారు.

పాక్‌లో ప్రహసనం

పాకిస్తాన్‌లో ఫిబ్రవరిలో జరిగిన ఎన్నికలు అత్యంత వివాదాస్పదంగా నిలిచాయి. ప్రధాని షహబాజ్ షరీఫ్ కుటుంబ పార్టీ పాకిస్తాన్ ముస్లిం లీగ్ నవాజ్ (పీఎంఎల్–ఎన్) ఆద్యంతం ఎన్నికల అక్రమాలకు పాల్పడిందంటూ విమర్శలు వెల్లువెత్తాయి. ఎన్ని చేసినా జైలుపాలైన ఇమ్రాన్‌ఖాన్ ఆధ్వర్యంలోని పాకిస్తాన్ తెహ్రీక్–ఇ–ఇన్సాఫ్ (పీటీఐ)ను అడ్డుకోలేకపోయింది. పీటీఐ గుర్తింపునే రద్దు చేసినా స్వతంత్రులుగానే నిలబడి అన్ని పార్టీల కంటే ఎక్కువ సీట్లు నెగ్గి సత్తా చాటారు. దాంతో నానా పార్టీలను కలుపుకుని షహబాజ్ మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సి వచ్చింది.

లంకలో నవోదయం :

కల్లోల శ్రీలంకలో సుదీర్ఘ వాయిదాల తర్వాత ఎట్టకేలకు నవంబర్‌లో జరిగిన ఎన్నికల్లో వామపక్షవాది అనూర కుమార దిస్సనాయకే సాధించిన విజయం ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. దేశ దుస్థితికి ప్రధాన కారకులని భావించిన రాజపక్స కుటుంబాన్ని జనం రాజకీయంగా సమాధి చేశారు.

ఎన్నికలు జరిగిన దేశాల్లో జనాభాపరంగా టాప్-5

భారత్	140 కోట్లు
అమెరికా	34.5 కోట్లు
ఇండోనేసియా	28.3 కోట్లు
పాకిస్తాన్	25.1 కోట్లు
బంగ్లాదేశ్	17.3 కోట్లు

ఎన్నికల అంకెల్లో 2024

ఎన్నికలు జరిగిన దేశాలు	73
మొత్తం ఓటర్లు	170 కోట్ల పై చిలుకు
మొత్తమ్మీద ఓటింగ్	సగటు 61 శాతం
అత్యల్ప ఓటింగ్	ట్యునీషియా (28.8 శాతం)
అత్యధిక ఓటింగ్	రువాండా (98.2)

పుతిన్ ఐదోసారి

చెప్పుకోదగ్గ ప్రత్యర్థే లేకుండా జరిగిన ఎన్నికల్లో రష్యాలో పుతిన్ రికార్డు స్థాయిలో ఐదోసారి అధ్యక్ష ఎన్నికల్లో నెగ్గారు. అది కూడా ఏకంగా 87 శాతం ఓట్లు సాధించారు. సోవియట్ అనంతర కాలంలో రష్యాలో ఇదే అత్యధిక మెజారిటీ. పుతిన్‌కు ప్రధాన అడ్డంకిగా మారడం ఖాయమని భావించిన విపక్ష నేత అలెక్సీ నావల్నీ ఎన్నికలకు ముందు జైల్లో అనుమానాస్పద స్థితిలో మరణించడం పెను దుమారమే రేపింది. వెనెజువెలాలో అధ్యక్షుడు నికొలస్ మదురో విజయమూ వివాదాస్పదమైంది.

– సాక్షి, నేషనల్ డెస్క్

సాక్షి హైదరాబాద్

మంగళవారం । 31 । డిసెంబర్ । 2024



రెడీమిక్స్ లారీ బీభత్సం
ముషీరాబాద్ చౌరస్తా వద్ద సోమవారం తెల్లవారుజామున ఓ రెడీమిక్స్ వాహనం అదుపు తప్పి బీభత్సం సృష్టించింది. ఈ ఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. -8లో



నగరంలో.. నయా బీట్..
కొత్త సంవత్సరం వేళ..మ్యూజిక్ బాష్‌కు సర్వం సిద్ధమైంది. నగరంలో బాలీవుడ్ డీజేలతో లోకల్ సింగర్స్ జోడీకట్టనున్నారు. బోటా బోటీ ఈవెంట్లతో అభిమానులకు ఇక పండగే. - సిటీప్లస్‌లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం
30.0/16.0

నగరంలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం వేళల్లో పొగమంచు వాతావరణం ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. రాత్రి వేళ చలి పెరుగుతుంది.

'హమ్ ఆప్ కే సాథ్ హై' పేరిట ఉచిత రవాణా సౌకర్యం

సాక్షి, సిటీబ్యూరో: నూతన సంవత్సర వేడుకల సందర్భంగా 'హమ్ ఆఫ్ కే సాథ్ హై' కార్యక్రమంలో భాగంగా నగరవాసులకు ఉచిత రవాణా సదుపాయాన్ని అందజేయనున్నట్లు తెలంగాణ ఫోర్‌వీలర్స్ డ్రైవర్స్ అసోసియేషన్, తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు షేక్ సలావుద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త సంవత్సర వేడుకల్లో పాల్గొని మద్యం తాగి ఇళ్లకు చేరుకునేందుకు క్యాబ్‌లు, బైక్ ట్యాక్సీలు అందుబాటులో ఉంచనున్నట్లు పేర్కొన్నారు. 2017 నుంచి ఈ సేవలను అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. రోడ్డు భద్రతలో భాగంగా ఉచిత రవాణా సదుపాయాన్ని అందజేస్తున్నామన్నారు. ఇందుకోసం 500 క్యాబ్‌లు, 250 బైక్ ట్యాక్సీలు, డ్రైవర్‌లు ఈ నెల 31వ తేదీ రాత్రి హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పరిధిలో సేవలను అందజేస్తారని చెప్పారు. రాత్రి 10 గంటల నుంచి తెల్లవారుజామున ఒంటిగంట వరకు ఈ సదుపాయం అందుబాటులో ఉంటుంది. ఉచిత రవాణా సదుపాయం అవసరమైన వారు 9177624678 నెంబర్‌లో సంప్రదించవచ్చు.

రాచకొండ ట్రాఫిక్ పోలీసులకు బాడీవార్న్ కెమెరాలు



సాక్షి, సిటీబ్యూరో: క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తిస్తున్న ట్రాఫిక్ పోలీసుల ప్రవర్తనతో పాటు వారితో ప్రజల వ్యవహారశైలిని పర్యవేక్షించడానికి, రోడ్డు ప్రమాదాలు తదితరాలు జరిగినప్పుడు అక్కడి పరిస్థితులు పరిశీలించడానికి ఉపకరించే బాడీవార్న్ కెమెరాలను రాచకొండ పోలీసులూ అమలులోకి తీసుకువచ్చారు. తొలి దఫా 50 కెమెరాలు ఖరీదు చేసిన పోలీసు కమిషనర్ జి.సుధీర్‌బాబు సోమవారం కమిషనరేట్‌లో జరిగిన సమావేశంలో వీటిని అధికారులకు అందించారు. కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ నుంచి లైవ్ ఫీడ్ చూడటంతో పాటు ట్రాఫిక్ పోలీసులతో దురుసుగా ప్రవర్తిస్తున్న వాహనచోదకుల ప్రవర్తననూ వీటి ద్వారా రికార్డు చేయవచ్చు.

మెట్రో-2 భూసేకరణ పనులు వేగవంతం

సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న మెట్రో రెండోదశ ప్రాజెక్టు కొత్త సంవత్సరం 2025లో పట్టాలెక్కనుంది. కేంద్రం నుంచి అనుమతులు లభించిన వెంటనే రెండోదశ పనులు చేపట్టేందుకు హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రోరైల్ లిమిటెడ్ కార్యాచరణ చేపట్టింది. ఇప్పటికే ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కిలోమీటర్ల రూట్‌లో భూసేకరణ పనులను ప్రారంభించారు. బాధితులకు పరిహారం చెల్లించేందుకు చర్యలు చేపట్టారు. జనవరి నెలాఖరు నాటికి ఈ పనులను పూర్తి చేయనున్నట్లు అధికారులు తెలిపారు. రెండో దశ మెట్రో ప్రాజెక్టులో నాగోల్ నుంచి ఎయిర్‌పోర్టు వరకు, మియాపూర్ నుంచి పటాన్‌చెరు వరకు, హయత్‌నగర్ నుంచి ఎల్బీనగర్ వరకు, రాయదుర్గం నుంచి కోకాపేట్ తదితర 5 కారిడార్‌లలో మెట్రోరైల్ నిర్మాణం చేపట్టనున్న సంగతి తెలిసిందే. ఆరో కారిడార్‌గా ఎయిర్‌పోర్టు నుంచి ఫోర్త్‌సిటీ వరకు మరో మార్గం నిర్మించనున్నారు. 2028 నాటికి రెండో దశ ప్రాజెక్టును పూర్తి చేయాలని హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రోరైల్ లిమిటెడ్ లక్ష్యంగా పెట్టుకుంది. జైకా, ఏడీబీ వంటి బ్యాంకులు, అంతర్జాతీయ సంస్థల నుంచి రుణాలను సేకరించనున్నారు. మొత్తం 76.4 కిలోమీటర్ల మార్గానికి సుమారు రూ.24,269 కోట్లతో అంచనాలు రూపొందించారు.

వేసవిలో మంచినీటి కొరత రావొద్దు

సాక్షి సిటీబ్యూరో: వేసవిలో మంచినీటి కొరత లేకుండా కార్యాచరణ కోసం సూక్ష్మ స్థాయి ప్రణాళికలు సిద్ధం చేయాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆయన సోమవారం ఉన్నతాధికారులు, సీజీఎం, జీఎంలతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..వేసవిలో సమర్థవంతంగా తాగునీరు సరఫరా చేసేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందించాలన్నారు. గత వేసవి డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నుంచే సిద్ధం కావాలన్నారు. ఫిబ్రవరి 15 నుంచి జూన్ 15 వరకు 120 రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ చేపడతామని వెల్లడించారు. ఈ సమయంలో తాగునీటి సరఫరా, సరైన వేళలపై సూక్ష్మ పర్యవేక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఇలా చేయడం వల్ల ఎలాంటి సమస్యలు తలెత్తకుండా తాగునీటిని సరఫరా చేయవచ్చన్నారు. తాగునీటి సరఫరా, పైపులైన్లకు సంబంధించి ఏవైనా పనులు ఉంటే ఇప్పుడే పూర్తి చేసుకోవాలని సూచించారు. గతేడాది వేసవిలో 6 డివిజన్లలోని 20 సెక్షన్ల నుంచి అధికంగా ట్యాంకర్లు బుక్ అయ్యాయని, అలాగే ఓ వంద కుటుంబాలు 31 వేల ట్రిప్పులను బుక్ చేశారని, వారికి ఈ పరిస్థితి ఎందుకు తలెత్తిందో కారణాలు తెలుసుకోవాలని అధికారుల్ని ఆదేశించారు. మరోవైపు 40 వేల కుటుంబాలు 70 శాతం ట్యాంకర్లను బుక్ చేశారన్నారు. వీరి ప్రాంగణాల్లో సర్వే చేస్తే..18 వేల కుటుంబాలు మాత్రమే ఇంకుడు గుంతల నిర్మాణాలు కలిగి ఉన్నాయన్నారు. మిగిలిన వారికి నోటీసులు ఇచ్చామని తెలిపారు. ఇంకుడు గుంతలు నిర్మించుకోకుంటే వచ్చే ఏడాది నుంచి వాటర్ ట్యాంకర్ రేట్లు రెట్టింపు చేస్తామని పేర్కొన్నారు.

'ఫ్యూచర్' వైపు వెలుగు రేఖలు..

కొత్త ఏడాదిలో అభివృద్ధిపై కొంగొత్త ఆశలు
- 2025లో మూసీకీ ప్రాధాన్యం..
- ఎలివేటెడ్ రహదారులు.. రూ.వేల కోట్ల పనులు
- ఫ్యూచర్ సిటీతో మారనున్న మహానగర రూపురేఖలు





మూసీ సుందరీకరణ అనంతరం ఇలా...(నమూనా చిత్రం)

సాక్షి, సిటీబ్యూరో:

2025! కాలగమనంలో ఒక మైలురాయి..

రేపటి నుంచి ప్రారంభం కానున్న కొత్త సంవత్సరంలో రాష్ట్ర రాజధాని నగరంలో రూ.వేల కోట్ల పనులు ప్రారంభం కానున్నాయి. ఓల్డ్‌సిటీ, న్యూసిటీ, సైబర్‌సిటీల తర్వాత ఫోర్త్‌సిటీగా ఫ్యూచర్‌సిటీ పనులు వేగం కానున్నాయి. హైదరాబాద్‌ను న్యూయార్క్, టోక్యోల మాదిరిగా అభివృద్ధి చేస్తామని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి ఆశయాలకనుగుణంగా ప్రభుత్వ కార్యాచరణలో ఫ్యూచర్ సిటీది కీ రోల్. మురికి కూపం నుంచి పేద ప్రజలకు విముక్తితో పాటు మూసీ పరిసర ప్రాంతాల్ని సాంస్కృతిక, వారసత్వ, పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేసేందుకు చేపట్టిన మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టుదీ ముఖ్య భూమికే. వీటికి సంబంధించిన పనులు కొత్త సంవత్సరంలో ముమ్మరం కానున్నాయి. మీర్‌ఖాన్‌పేట కేంద్రంగా రూపుదిద్దుకోనున్న ఫ్యూచర్ సిటీలో స్కిల్ యూనివర్సిటీ పనులు ఇప్పటికే మొదలయ్యాయి. మరోవైపు, ప్యారడైజ్ నుంచి శామీర్‌పేట ఓఆర్ఆర్ వరకు ఎలివేటెడ్ కారిడార్ (రూ.3619 కోట్లు), ఎన్‌హెచ్44ను కలుపుతూ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్(రూ.1487కోట్లు) పనులకు శ్రీకారం చుట్టనున్నారు.



మూసీపై వంతెన ఇలా...(నమూనా చిత్రం)

మురికి నుంచి ఆకర్షణీయంగా మూసీ

మూసీ ప్రక్షాళన, పునరుజ్జీవం, మూసీ పరిసరాల అభివృద్ధితో ఆదాయం లక్ష్యంగా ముఖ్యమంత్రి ఈ ప్రాజెక్టుపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. అందుకుగాను నగరం మధ్య నదులున్న లండన్‌లోని థేమ్స్, సియోల్‌లోని చెయోంగ్‌జిచియోన్‌లను సందర్శించి వచ్చారు. సియోల్‌కు అధికారులు, మీడియా ప్రతినిధులను సైతం పంపించారు. మూసీ క్లీనింగ్‌కు చర్యలు త్వరలో ప్రారంభం కానున్నాయి. సైకిల్ ట్రాక్‌లు, జాగింగ్ ట్రాక్‌లు, పాదచారుల జోన్‌లు, పీపుల్స్ ప్లాజాలు, హెరిటేజ్ జోన్‌లు, గ్రీన్ స్పేస్‌లు, హాకర్ జోన్‌లు, వంతెనలు, వినోదం, తదితర అంశాలతో ప్రాజెక్ట్ రిపోర్ట్ రెడీ అయింది. దశలవారీగా పనులు జరగనున్నాయి.

అందుబాటులోకొచ్చే సదుపాయాలు...

ఆరాం గా..
- ఈ పాటికే ప్రారంభం కావాల్సిన ఆరాంఘర్ ఫ్లై ఓవర్ కొత్త సంవత్సరంలో అందుబాటులోకి రానుంది.
- శిల్పా లేఔట్ రెండో దశ (రూ.183 కోట్లు), నల్గొండ చౌరస్తా- ఒవైసీ జంక్షన్ ఫ్లై ఓవర్ (రూ.467కోట్లు), ఉప్పల్ జంక్షన్ రెండో లెవెల్ ఫ్లై ఓవర్ (రూ.311కోట్లు)పనులు కొత్త సంవత్సరంలో పూర్తికానున్నాయి.
- దాదాపు రూ.120 కోట్లతో చేపట్టిన ఫలక్‌నుమా, శాస్త్రిపురం ఆర్‌ఓబీలు అందుబాటులోకి రానున్నాయి. - దాదాపు 75 జంక్షన్లలో అభివృద్ధి, సుందరీకరణ పనులు చేయనున్నారు.

హై సిటీ కోసం

హై సిటీ (హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) పనుల్లో భాగంగా రూ.7032 కోట్ల పనులకు ఇటీవలే సీఎం శంకుస్థాపన చేశారు. ఇందులోని కేబీఆర్ పార్కు చుట్టూ రూ.1200 కోట్లతో ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల పనులకు బహుశా ఈ వారంలోనే టెండర్లు పిలవనున్నారు. కేబీఆర్ పార్కు వద్ద పీపీపీ విధానంలో మల్టీలెవెల్ పార్కింగ్ పనులు సైతం ప్రారంభం కానున్నాయి. ఎస్ఎన్‌డీపీ-2 కింద రూ.667 కోట్లతోపాటు ఎన్‌డీఎంఎఫ్ (నేషనల్ డిజాస్టర్ మిటిగేషన్ ఫండ్) కింద రూ.291.80 కోట్లతో వరద కాలువల ఆధునీకరణ, చెరువుల పటిష్టతకు సంబంధించిన పనులు చేపట్టనున్నారు.

జీహెచ్ఎంసీ విభజనపై స్పష్టత

జీహెచ్ఎంసీని మూడు లేదా నాలుగు కార్పొరేషన్లు చేస్తారో, లేదో ఈ సంవత్సరం స్పష్టత రానుంది. ఆ తర్వాతే పాలకమండలి ఎన్నికలు జరగనున్నాయి. శివారు ప్రాంతాలను జీహెచ్ఎంసీలో విలీనం చేసేట్లయితే..ఈ సంవత్సరం అక్కడ జరగాల్సిన పంచాయతీలు, స్థానిక సంస్థల ఎన్నికలు ఇక జరగవు.

ముఖ్యమైన అభివృద్ధి పనులు.. వాటికి నిధులు ఇలా..

- రేతిబౌలి, నానల్‌నగర్ దగ్గర ఫ్లై ఓవర్లు: రూ.398 కోట్లు.
- ఎస్ఎఫ్‌సీఎల్ జంక్షన్ వద్ద ఫస్ట్‌లెవెల్ ఫ్లై ఓవర్, టీవీ9 జంక్షన్ దగ్గర అండర్‌పాస్ పనులకు రూ.210 కోట్లు.
- ఖాజాగూడ, ఐఐఐటీ, విప్రో జంక్షన్ల వద్ద ఫ్లై ఓవర్లు: రూ.837 కోట్లు.
- మియాపూర్ క్రాస్‌రోడ్- ఆల్విన్ క్రాస్‌రోడ్ ఫ్లై ఓవర్, లింగంపల్లి- గచ్చిబౌలి అండర్‌పాస్: రూ.530 కోట్లు.
- శేరిలింగంపల్లి రైల్వేస్టేషన్ ఆర్‌ఓబీ: రూ.124 కోట్లు.
- కూకట్‌పల్లి వైజంక్షన్ వద్ద అమీర్‌పేట వైపు, మియాపూర్ వైపు ఫ్లై ఓవర్లు:రూ.180 కోట్లు.
- ఫాక్స్‌సాగర్ సర్‌ప్లస్ నాలా పైప్‌లైన్ రోడ్‌పై స్టీల్ బ్రిడ్జి: రూ.56 కోట్లు.
- రసూల్‌పురా ఫ్లై ఓవర్: రూ.150 కోట్లు
- పాటిగడ్డ ఆర్‌ఓబీ: రూ.80 కోట్లు
- ఆర్‌కేపురం ఆర్‌ఓబీ: రూ.210 కోట్లు
- ఆర్‌కేపురం ఆర్‌యూబీ: రూ.35 కోట్లు
- చిలకలగూడ ఆర్‌యూబీ: రూ.30 కోట్లు
- ఏటీసీ సెంటర్ చుట్టూ ప్రత్యామ్నాయ రోడ్లు: రూ.960 కోట్లు
- టీకేఆర్ కాలేజ్, గాయత్రినగర్, మందమల్లమ్మ జంక్షన్ల మీదుగా ఫ్లై ఓవర్ :రూ.416 కోట్లు.
- ఒవైసీ ఫ్లై ఓవర్‌కు సంతోష్‌నగర్ వైపు డౌన్‌ర్యాంప్, హఫీజ్ బాబానగర్ జంక్షన్ -బాలాపూర్ చర్చిరోడ్ జంక్షన్ వరకు ఫ్లై ఓవర్, బండ్లగూడ-ఎర్రకుంట జంక్షన్ ఫ్లైఓవర్ పనులకు: రూ.339 కోట్లు.
- మైలార్‌దేవ్‌పల్లి, శంషాబాద్, కాటేదాన్ జంక్షన్ల వద్ద ట్రాఫిక్ ఒత్తిడి తగ్గేందుకు ఫ్లైఓవర్: రూ.200 కోట్లు.
- ఆరాంఘర్ జంక్షన్ వద్ద రెండు ఆర్‌యూబీలు: రూ.59 కోట్లు..తదితరమైనవి ఉన్నాయి.

ఇక 'గ్రీన్ ఫీల్డ్' జర్నీ!

ఫ్యూచర్ సిటీకి రాచమార్గం నిర్మించేందుకు హెచ్ఎండీఏ ప్రణాళికలు

ఫ్యూచర్ సిటీకి రాచమార్గం నిర్మించేందుకు హెచ్ఎండీఏ సన్నాహాలు చేపట్టింది. ఔటర్‌రింగ్ రోడ్డు నుంచి రీజినల్ రింగ్‌రోడ్డు వరకు ప్రతిపాదించిన గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణానికి ప్రణాళికలను సిద్ధం చేసింది. ఇప్పటికే క్షేత్రస్థాయిలో సర్వే పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం భూసేకరణ ప్రక్రియను చేపట్టింది. కొత్త సంవత్సరంలో గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు ప్రాజెక్టును పట్టాలెక్కించనున్నట్లు హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ తెలిపారు. – సాక్షి, సిటీబ్యూరో



శరవేగంగా విస్తరిస్తున్న హైదరాబాద్ మహానగర అభివృద్ధికి అనుగుణంగా పార్కులు, రహదారుల అభివృద్ధి, అవసరమైన చోట్ల ఎలివేటెడ్ కారిడార్‌లు, చెరువుల పరిరక్షణ, సుందరీకరణ ప్రాజెక్టులను కొత్తసంవత్సరంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్నట్లు హెచ్ఎండీఏ పేర్కొంది. కాంప్రహెన్సివ్ మొబిలిటీ ప్లాన్ ప్రకారం హైదరాబాద్ సమగ్ర మాస్టర్ ప్లాన్‌ను కూడా వచ్చే ఏడాది సెప్టెంబర్ నాటికి అమలు చేయనున్నారు. ఈ మేరకు ప్రజారవాణాతో పాటు, అన్ని రకాల మౌలిక సదుపాయాలను విస్తరించేవిధంగా హెచ్ఎండీఏ కార్యాచరణ ఉంటుందన్నారు. ఈ కార్యాచరణలో భాగంగానే ఔటర్‌రింగ్ రోడ్డు రావిర్యాల నుంచి రీజనల్ రింగ్‌రోడ్డు వరకు అంటే ఆమనగల్ వరకు 41.50 కిలోమీటర్ల గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణానికి హెచ్ఎండీఏ ప్రాథమిక పనులు చేపట్టింది. రెండు దశల్లో ఈ ప్రాజెక్టు చేపట్టనున్నారు.

- ఔటర్ నుంచి రీజినల్ రింగు రోడ్డు వరకు గ్రీన్ ఫీల్డ్ రహదారులు
- మొదటి దశ నిర్మాణం కోసం మొదలైన భూసేకరణ ప్రక్రియ
- పరిహారంపైన బాధితుల ఆందోళన
- భూమికి బదులు భూమి ఇవ్వాలని డిమాండ్



మొదటి దశలో..

ప్రతిపాదిత గ్రీన్‌ఫీల్డ్ రోడ్డులో భాగంగా మొదటిదశలో రావిర్యాల నుంచి మీర్‌ఖాన్‌పేట్ వరకు 18 కిలోమీటర్ల మార్గాన్ని నిర్మిస్తారు. ఇందుకోసం అధికారులు క్షేత్రస్థాయి సర్వేలు పూర్తి చేశారు. భూసేకరణ పనులు కూడా ప్రారంభమయ్యాయి. ఈ రోడ్డు పూర్తిగా ఫ్యూచర్ సిటీ అభివృద్ధి లక్ష్యంగా చేపట్టనున్నారు. 100 మీటర్ల వెడల్పుతో నిర్మించనున్నారు. దీనికి రెండు వైపులా 3 మీటర్ల వెడల్పుతో సైకిల్ ట్రాక్‌లు, 2 మీటర్ల వెడల్పుతో ఫుట్‌పాత్‌లు ఉంటాయి. వాహనదారులు, పాదచారులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా రాకపోకలు సాగించేవిధంగా ఎక్స్‌ప్రెస్‌హైవేగా నిర్మించనున్నారు. మొదటి దశ ప్రాజెక్టు కోసం రూ.1665 కోట్లు ఖర్చు కానున్నట్లు అంచనా. 447.29 ఎకరాల భూమి సేకరించవలసి ఉంటుంది. భూసేకరణ కోసమే రూ.246 కోట్ల వరకు వెచ్చించవలసి ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఫోర్త్ సిటీ నిర్మాణాన్ని ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న దృష్ట్యా కొత్త సంవత్సరంలోనే మొదటిదశ గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుకు పనులు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

రెండో దశలో....

మీర్‌ఖాన్‌పేట్ నుంచి రీజనల్ రింగ్ రోడ్డు వరకు అంటే ఆమనగల్ వరకు 23.50 కిలోమీటర్ల మార్గాన్ని రెండో దశలో చేపట్టనున్నారు. రెండోదశ ప్రాజెక్టు కోసం రూ.2365 కోట్లు ఖర్చుకానున్నట్లు అంచనా. ఇందుకోసం 589.63 ఎకరాల భూమిని సేకరించనున్నారు. రైతుల నుంచి సేకరించనున్న భూమికి పరిహారంగా రూ.345 కోట్ల వరకు చెల్లించవలసి ఉంటుందని అంచనా. రెండో దశ భూసేకరణ కోసం జనవరి నెలలో నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉంది. వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ భూములతోపాటు సుమారు 208 ఎకరాల అటవీ భూములను కూడా గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు కోసం సేకరించనున్నారు.

పరిహారం వద్దు..భూమి కావాలి...

ఇలా ఉండగా, గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు కోసం రైతులు, స్థలాల యజమానుల నుంచి సేకరించనున్న భూమికి పరిహారం ఇచ్చేందుకు హెచ్ఎండీఏ చర్యలు చేపట్టింది. భూములు కోల్పోనున్న బాధితులు మాత్రం అందుకు నిరాకరిస్తున్నారు. మార్కెట్ ధర కంటే తక్కువ మొత్తంలో చెల్లించడం వల్ల తాము తీవ్రంగా నష్టపోతామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో మెట్రో రైల్ నిర్మాణం కోసం సేకరించిన తరహాలోనే రైతుల నుంచి సేకరించే భూమికి పరిహారంగా భూమినే బదులు ఇవ్వాలని కోరుతున్నారు.

ఇదీ స్వరూపం..

- ప్రతిపాదిత మార్గం: రావిర్యాల నుంచి ఆమనగల్ వరకు 41.50 కి.మీలు
- మొదటి దశలో రావిర్యాల నుంచి మీర్‌ఖాన్‌పేట్ వరకు 18 కి.మీ
- మొదట 6 లేన్‌లు నిర్మించి ఆ తరువాత 8 లేన్‌లకు విస్తరిస్తారు.

  నిర్మాణంవ్యయం: 1665 కోట్లు : సేకరించాల్సిన భూమి : 447.29 ఎకరాలు. చెల్లించాల్సిన పరిహారం: రూ.246 కోట్లు.
- రెండో దశలో మీర్‌ఖాన్‌పేట్ –ఆమనగల్: 23.50 కి.మీ

నిర్మాణ వ్యయం: రూ.2356 కోట్లు
సేకరించాల్సిన భూమి: 589.63 ఎకరాలు.
పరిహారం రూ.345 కోట్లు.



హద్దు మీరితే అంతే సంగతులు

'కొత్త' వేడుకలు శ్రుతిమించితే కఠిన చర్యలు

- డ్రంక్‌తో పాటు డ్రగ్ డ్రైవింగ్‌పైనా తనిఖీలు
- రంగంలోకి దిగనున్న 150 ప్రత్యేక బృందాలు
- నేటి రాత్రి నగరంలోని అనేక ఫ్లైఓవర్లు బంద్
- వెస్ట్‌జోన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టిన అధికారులు

సాక్షి, సిటీబ్యూరో: 'డిసెంబర్ 31'ని జీరో ఇన్సిడెంట్, యాక్సిడెంట్ నైట్‌గా చేయడానికి నగర పోలీసు విభాగం కసరత్తు పూర్తి చేసింది. న్యూ ఇయర్ పార్టీల విషయంలో సభ్యత, భద్రత మరవద్దని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఇతరులకు ఇబ్బంది కలుగకుండా వేడుకలు నిర్వహించుకోవాలని చెబుతున్నారు. బౌన్సర్లు, నిర్వాహకులు సహా ఎవరు హద్దు మీరినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్ణీత సమయం తర్వాత ఏ కార్యక్రమం కొనసాగకూడదని స్పష్టం చేస్తున్నారు. డిసెంబర్ 31 రాత్రి పార్టీలకు సంబంధించి పోలీసులు జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం...కార్యక్రమాలకు వచ్చే ఆర్టిస్టులు, డీజేలకూ నిబంధనలున్నాయి. వీరి వస్త్రధారణ, హావభావాలు, పాటలు తదితరాల్లో ఎక్కడా అశ్లీలం, అసభ్యతలకు తావుండకూడదు. అక్కడ ఏర్పాటు చేసే సౌండ్ సిస్టం నుంచి వచ్చే ధ్వని తీవ్రత 45 డెసిబుల్స్ మించకూడదు. ఇళ్లు, అపార్ట్‌మెంట్స్‌లో వ్యక్తిగత పార్టీల నిర్వహిస్తున్న వాళ్లూ పక్కవారికి ఇబ్బంది లేకుండా సౌండ్ సిస్టమ్ పెట్టుకోవాలి. న్యూ ఇయర్ కార్యక్రమాల్లో ఎక్కడా మాదకద్రవ్యాల వినియోగానికి తావు లేకుండా చూడాలి. వీటిని సేవించి వచ్చే వారినీ హోటల్స్, పబ్స్ నిర్వాహకులు అనుమతించకూడదు. యువతకు సంబంధించి ఎలాంటి విశృంఖలత్వానికి తావు లేకుండా, మైనర్లు పార్టీలకు రాకుండా నిర్వాహకులు చూసుకోవాలి. బౌన్సర్లు అతిగా ప్రవర్తించినా, ఆహూతులకు ఇబ్బందులు కలిగించినా వారితో పాటు ఏర్పాటు చేసిన సంస్థల పైనా చర్యలు తప్పవు. నిబంధనల పర్యవేక్షణ, నిఘా కోసం 150 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నారు. వీరు కార్యక్రమాలు జరిగే ప్రాంతాల్లో తనిఖీలు చేయడం, వాటిని చిత్రీకరించడంతో పాటు ఆడియో మిషన్ల సాయంతో శబ్దతీవ్రతనూ కొలుస్తారు.

'సాగర్' చుట్టూ నో ఎంట్రీ...

మద్యం సేవించి వాహనాలు నడపడం, దురుసుగా డ్రైవింగ్ చేయడం, మితిమీరిన వేగం, పరిమితికి మించి వాహనాలపై ప్రయాణించడం చేయకూడదని పోలీసులు పేర్కొన్నారు. శాంతి భద్రతల విభాగం అధికారులతో పాటు ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు నిర్వహిస్తారని, ఉల్లంఘనలకు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తప్పవని ఉన్నతాధికారులు హెచ్చరించారు. ట్యాంక్‌బండ్‌పైన ఇతర కీలక ప్రాంతాల్లో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా హుస్సేన్ సాగర్ పరిసరాల్లో ట్రాఫిక్ మళ్లింపులు విధించారు. మంగళవారం రాత్రి 10 గంటల నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు ఎన్టీఆర్ మార్గ్, నెక్లెస్‌రోడ్, అప్పర్ ట్యాంక్ బండ్‌లపై వాహనాల ప్రవేశాన్ని పూర్తిగా నిషేధించారు. ప్రత్యామ్నాయాలు లేని బేగంపేట, లంగర్‌హౌస్, డబీర్‌పుర ఫ్లైఓవర్లు మినహా మిగిలిన అన్ని ఫ్లైఓవర్లను మంగళవారం రాత్రి మూసి ఉంచుతారు.

వెస్ట్‌జోన్‌లో స్పెషల్ యాక్షన్స్...

నగరంలోని మిగతా నాలుగింటితో పోలిస్తే పశ్చిమ మండలం పూర్తి విభిన్నమైంది. మాదకద్రవ్యాల విక్రయం, వినియోగం సైతం ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. వీటిని దృష్టిలో పెట్టుకున్న ఉన్నతాధికారులు న్యూ ఇయర్ వేడుకలకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. వివిధ సందర్భాలు, సమయాల్లో సిటీలోని పబ్స్ కపుల్ ఎంట్రీలను మాత్రమే అనుమతిస్తుంటాయి. జంటగా వచ్చేవారు మినహా మిగతా వారిని పబ్స్‌లోకి రానివ్వరు. దీనిపై పలు సందర్భాల్లో కొందరు యువకులు గుంపులుగా వచ్చి పబ్స్ వద్ద హల్‌చల్ చేస్తుంటారు. స్టాగ్ గ్యాంగ్స్‌గా పిలిచే వీరు గతంలో చేసిన హంగామాలను బట్టి పోలీసులు ఓ బ్లాక్‌లిస్ట్ తయారు చేస్తున్నారు. ఇలాంటి వారి కదలికలు, వ్యవహారాలపై డేగకన్ను వేయడానికి ప్రత్యేక బృందాలు ఏర్పాటు కానున్నాయి. నగర వ్యాప్తంగా ఎక్కడా శాంతి భద్రతల సమస్యలు రాకుండా చూసేందుకు క్విక్ రెస్పాన్స్ టీమ్స్ (క్యూఆర్టీ), ఈవ్ టీజింగ్ కంట్రోలింగ్‌కు ప్రత్యేక షీ-టీమ్స్ బృందాలు మోహరిస్తున్నారు. ఆయా కార్యక్రమాలు, వెన్యూల వద్ద ఉండే బౌన్సర్లు అతిగా ప్రవర్తించినా, ఆహూతులకు ఇబ్బందులు కలిగించినా వారితో పాటు ఏర్పాటు చేసిన సంస్థల పైనా చర్యలు తప్పవని స్పష్టం చేస్తున్నారు.



'డ్రింక్స్' కాదు డ్రగ్స్ పట్టేస్తారు...

కేవలం డ్రంక్ డ్రైవింగే కాకుండా 'డ్రగ్ డ్రైవింగ్'కు చెక్ చెప్పాలని అధికారులు నిర్ణయించారు. డ్రగ్స్ తీసుకుని వాహనాలు నడిపే వారితో పాటు కొన్ని సందర్భాల్లో ఇతర అనుమానితులకు గుర్తించడానికి డ్రగ్ డిటెక్టర్స్ సమీకరించుకున్నారు. జర్మనీ నుంచి ఖరీదు చేసిన ఈ అత్యాధునిక పరికరాల్లో 75 పరికరాలను తెలంగాణ స్టేట్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (టీఎస్ ఏఎన్‌బీ) అధికారులు హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండలకు అందించారు. వీటి ఆధారంగా అధికారులు రహదారులపైనే కాకుండా పబ్స్, ఫామ్‌హౌస్‌లతో పాటు మరికొన్ని సున్నిత ప్రాంతాల్లోనూ తనిఖీలు చేయనున్నారు. స్నిఫర్ డాగ్స్‌తోనూ తనిఖీలు చేపడతారు.

రూ. 500 అడిగినందుకు హత్య


సాయికుమార్ (ఫైల్)

రాజేంద్రనగర్: దౌర్జన్యంగా డబ్బులు లాక్కోవడమేగాక తన డబ్బులు తిరిగి ఇవ్వాలని అడిగినందుకు ఓ వ్యక్తి దినసరి కూలీపై డ్రైనేజీ పై కప్పుతో దాడి చేసి హత్య చేసిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ మామిడి కిషోర్‌కుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బుద్వేల్ ప్రాంతానికి చెందిన సాయికుమార్(35) దినసరి కూలీగా పని చేసేవాడు. ఆదివారం అదే ప్రాంతంలో కూలీ పనులు పూర్తి చేసుకుని యజమాని వద్ద డబ్బులు తీసుకుని ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యలో అతను బుద్వేల్ కల్లు కంపౌండ్‌లో కల్లు తాగిన అనంతరం తన వద్ద ఉన్న డబ్బులను తీసి లెక్కిస్తున్నాడు. అదే సమయంలో కల్లు కంపౌండ్ నుంచి బయటికి వచ్చిన బుద్వేల్‌కు చెందిన శ్రీనివాస్ అనే వ్యక్తి సాయికుమార్ నుంచి రూ.500 బలవంతంగా లాక్కున్నాడు. దీంతో సాయికుమార్ తన డబ్బులు తిరిగి ఇవ్వాలని శ్రీనివాస్‌ను కోరాడు. అయితే అతను డబ్బులు ఇవ్వకుండా వెళ్లిపోతుండటంతో ఇద్దరి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. దీంతో సాయికుమార్ శ్రీనివాస్‌ను తోసివేయడంతో కింద పడిన అతను పక్కనే ఉన్న డ్రైనేజీ పై కప్పు మూతను తీసి సాయికుమార్ తలపై మోదడంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న రాజేంద్రనగర్ పోలీసులు కొన ఊపిరితో ఉన్న సాయికుమార్‌ను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రెడీమిక్స్ లారీ బీభత్సం


సహాయక చర్యలు చేపడుతున్న పోలీసులు


నుజ్జునుజ్జయిన డీసీఎంలు

- రెండు డీసీఎంలతో సహా ఆరు వాహనాలు ధ్వంసం
- డీసీఎం డ్రైవర్ మృతి
- మరో ముగ్గురికి తీవ్ర గాయాలు
- త్రుటిలో తప్పించుకున్న రక్షక్ వాహనంలోని పోలీసులు
- ముషీరాబాద్ చౌరస్తాలో ఘటన


మృతుడు మహ్మద్ అబ్దుల్లా



ప్రమాదంలో గాయపడిన వ్యక్తులు

చిలకలగూడ : రెడీమిక్స్ వాహనం సోమవారం తెల్లవారుజామున ముషీరాబాద్ చౌరస్తా వద్ద అదుపుతప్పి బీభత్సం సృష్టించింది. రెండు డీసీఎం వ్యాన్లతోపాటు పలు వాహనాలపైకి దూసుకెళ్లింది. బలంగా ఢీకొనడంతో ఓ వాహనం ఎగిరి సమీపంలో ఉన్న పోలీస్ రక్షక్ వాహనంపై పడింది. ఈ ఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. చిలకలగూడ ఇన్‌స్పెక్టర్ అనుదీప్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బీహార్‌కు చెందిన మహ్మద్ అబ్దుల్లా (27) ములుగు మండలం, కొత్తూరు బండ మైలారం గ్రామంలో ఉంటూ డీసీఎం డ్రైవర్‌గా పనిచేసున్నాడు. సోమవారం తెల్లవారుజామున ముషీరాబాద్ చౌరస్తా వద్ద డీసీఎం టైర్ పంక్చర్ కావడంతో యజమాని వరప్రసాద్‌కు ఫోన్ చేసి సమాచారం అందించారు. మరో డీసీఎంలో టైర్ తీసుకుని బయలుదేరిన అతను గాంధీ ఆస్పత్రి సమీపంలోని డీసీఎం అడ్డా వద్దకు వెళ్లి అక్కడ ఉన్న వర్కర్లు సామల అఖిల్, అహ్మద్‌తో కలిసి ముషీరాబాద్ చౌరస్తాకు చేరుకున్నాడు. రెండు వాహనాలను పక్కపక్కన నిలిపి టైర్ మారుస్తుండగా అదే సమయంలో రాంపల్లి నుంచి ఆర్టీసీ క్రాస్ రోడ్డు వైపు వెళుతున్న గ్లోబల్ రెడీమిక్స్ కంపెనీకి చెందిన రెడీమిక్స్ లారీ అదుపుతప్పి డీసీఎం వాహనాలను ఢీకొట్టింది. అంతటితో ఆగకుండా సమీపంలో పార్కింగ్ చేసిన వాహనాలపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో టైరు మారుస్తున్న డీసీఎం డ్రైవర్ మహ్మద్ అబ్దుల్లా అక్కడికక్కడే మృతి చెందాడు. డీసీఎం యజమాని వరప్రసాద్‌తోపాటు వర్కర్లు సామల అఖిల్, అహ్మద్ తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితి సమీక్షించారు. అబ్దుల్లా మృతదేహాన్ని గాంధీ మార్చురీకి, క్షతగాత్రులను గాంధీ ఆస్పత్రికి తరలించారు. రెడీమిక్స్ డ్రైవర్ యూసఫ్‌ను అదుపులోకి తీసుకున్నారు. డ్రైవర్ యూసఫ్ మద్యం సేవించలేదని, నిద్రమత్తు కారణంగానే ప్రమాదం చోటు చేసుకున్నట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. డీసీఎం యజమాని వరప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

త్రుటిలో తప్పించుకున్న పోలీసులు...

ఈ ప్రమాదం నుంచి రక్షక్ వాహన పోలీసులు త్రుటిలో తప్పించుకున్నారు. సోమవారం తెల్లవారుజామున ఓ ఏఎస్‌ఐ, ఇద్దరు కానిస్టేబుళ్లు గస్తీ నిర్వహిస్తూ ముషీరాబాద్ చౌరస్తాకు చేరుకున్నారు. తమ వాహనాన్ని పక్కన ఆపి వాహనాల తనిఖీ కోసం కిందికి దిగారు. అదే సమయంలో వేగంగా వచ్చిన రెడీమిక్స్ వాహనం డీసీఎంలను ఢీకొట్టడంతో ఒక వాహనం ఎగిరి పార్కింగ్ చేసిన రక్షక్‌పై పడింది. వాహనంలో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది.

స్వయంగా రంగంలోకి సీపీ



సాక్షి,సిటీబ్యూరో: నూతన సంవత్సర వేడుకలకు వేదిక కానున్న శివర్లలోని ఫామ్ హౌస్ లపై రాచకొండ పోలీసులు నిఘా ముమ్మరం చేశారు. ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా స్వయంగా రంగంలోకి దిగిన సీపీ సుధీర్ బాబు సోమవారం రాత్రి యాదాద్రి జోన్ పరిధిలోని పలు ఫామ్ హౌస్‌లలో తనిఖీలు చేశారు. సీపీపీ రాజేష్ తో కలిసి వాటి నిర్వాహకులతో పాటు కాపలాదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆయా పార్టీల్లో పాల్గొనే వారిపై కన్ను వేసి ఉంచాలని, అనుమానం వస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అనుమతులు లేకుండా ఈవెంట్లు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని, పార్టీల్లో డ్రగ్స్ దొరికితే లైసెన్సుల రద్దు తో పాటు కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వాహనదారులే టార్గెట్

- నిర్మానుష్య ప్రాంతాలకు తీసుకెళ్లి బెదిరింపులు
- డబ్బులు వసూలు
- ఇద్దరు కి'లేడీ'ల అరెస్ట్


పోలీసుల అదుపులో నిందితులు

అడ్డగుట్ట: వాహనదారులను లిఫ్ట్ అడిగి నిర్మానుష్య ప్రాంతాలకు తీసుకెళ్లి వారిని బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్న ఇద్దరు మహిళలను లాలాగూడ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ రఘు బాబు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మల్కాజ్‌గిరి ప్రాంతానికి చెందిన భాగ్య, సఫీల్‌గూడకు చెందిన వెన్నెల బంధువులు. గత కొంతకాలంగా వీరు వాహనాలపై వెళ్తున్న వారిని లిఫ్ట్ అడిగి నిర్మానుష్య ప్రాంతాలకు తీసుకెళ్లి డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. సదరు వాహనదారుడు డబ్బులివ్వకపోతే తమపై లైంగికదాడికి యత్నించాడని కేసు పెడతామని బెదిరించి డబ్బులు లాక్కునే వారు. నవంబర్ 6న సాయంత్రం జెన్‌కోలో పని చేస్తున్న వ్యక్తి బైక్‌పై నాగారంలోని తన ఇంటికి వెళ్తున్నాడు. తార్నాక బస్టాండ్ వద్ద నిలుచుని ఉన్న భాగ్య అతడిని లిఫ్ట్ అడిగింది. లాలాపేటలోని జీహెచ్ఎంసీ గ్రౌండ్ వద్దకు తీసుకెళ్లి డబ్బులు డిమాండ్ చేసింది. అతను డబ్బులు ఇచ్చేందుకు నిరాకరించగా తనను బలవంతం చేసి ఇక్కడికి తీసుకొచ్చావని పోలీసులకు ఫిర్యాదు చేస్తానని బెదిరించి ఫోన్‌పే ద్వారా రూ. 95 వేలు బదిలీ చేయించుకుంది. అనంతరం అతడితో పాటు కుషాయిగూడకు వెళ్లి ఏటీఎం ద్వారా రూ. 55 వేలు విత్‌డ్రా చేయించి లాక్కుంది. అంతే కాకుండా ఈ నెల 3న ఆమె తన బంధువు వెన్నెలతో సదరు వ్యక్తికి ఫోన్ చేయించి డీటీడీసీ కొరియర్ వచ్చిందని, కుషాయిగూడ డీమార్ట్ వద్దకు వచ్చి తీసుకెళ్లమని కోరింది. ఆమె మాటలు నమ్మి అక్కడికి వెళ్లిన అతడిని వారిద్దరు మళ్లీ బెదిరించి రూ. 1.7లక్షలు వసూలు చేశారు. సదరు వ్యక్తిని టార్గెట్ చేసిన వీరు ఈ నెల 23న అతని ఇంటి వద్ద రెక్కీ నిర్వహిస్తుండగా గుర్తించిన బాధితుడు లాలాగూడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకుని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. వీరిపై ఇది వరకే పలు పోలీస్‌స్టేషన్లలో ఇదే తరహా కేసులు నమోదై ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

హుస్సేన్‌సాగర్ వద్ద ప్రత్యేక పార్కింగ్స్

సిటీ ట్రాఫిక్ చీఫ్ విశ్వప్రసాద్ వెల్లడి

సాక్షి, సిటీబ్యూరో: న్యూ ఇయర్ వేడుల నేపథ్యంలో మంగళవారం రాత్రి ట్యాంక్‌బండ్, పీవీ నర్సింహారావు మార్గ్, ఎన్టీఆర్ మార్గ్‌లకు వచ్చే వారి కోసం ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు సిటీ ట్రాఫిక్ చీఫ్ పి.విశ్వప్రసాద్ తెలిపారు. సచివాలయం విజిటర్స్ పార్కింగ్, ఐమాక్స్ పక్కన ఉన్న పార్కింగ్ స్థలం, జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీస్ లైన్, ఎన్టీఆర్ ఘాట్ పక్కన ఉన్న రేస్ కోర్స్ రోడ్, ఆదర్శ్ నగర్ లైన్ (ద్విచక్ర వాహనాలు మాత్రమే), ఎన్టీఆర్ స్టేడియం ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేశామన్నారు. మంగళవారం రాత్రి 10 గంటల నుంచి బుధవారం తెల్లవారుజామున 2 గంటల వరకు నగరంలోని కమర్షియల్, భారీ వాహనాలకు ప్రవేశం లేదని స్పష్టం చేశారు. నగర వ్యాప్తంగా 172 చోట్ల తనిఖీలు నిర్వహించడానికి ప్రత్యేక బృందాలు పని చేస్తాయని, ఎవరూ మద్యం తాగి వాహనాలు నడపవద్దని ఆయన పేర్కొన్నారు.

టీవీ సీరియల్ నటికి వేధింపులు...

నిందితుడిపై కేసు నమోదు

బంజారాహిల్స్: నా మాట వినకున్నా..నాతో కలవకున్నా..నన్ను పెళ్లి చేసుకోకున్నా..ఈ సంక్రాంతికి నీ ఫొటోలన్నీ బ్యానర్లుగా చేసి ఊరంతా కడతానంటూ టీవీ సీరియల్ నటిని వేధిస్తున్న వ్యక్తిపై జూబ్లీహిల్స్ పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే..వెస్ట్ గోదావరి జిల్లా, కవటం గ్రామానికి చెందిన మహిళ (29) శ్రీకృష్ణానగర్‌లో ఉంటుంది. ఆమెకు 2012లో కృష్ణమోహన్ అనే వ్యక్తితో పెళ్లి కాగా కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో గత రెండేళ్లుగా భర్తకు దూరంగా పిల్లలతో కలిసి కృష్ణానగర్‌లో ఉంటోంది. గత సెప్టెంబర్ నుంచి శ్రావణ సంధ్య అనే సీరియల్‌లో నటిస్తుంది. ఈ సందర్భంగా బత్తుళ్ల ఫణితేజ అనే వ్యక్తితో ఆమెకు పరిచయం ఏర్పడింది. గత నెలలో పెళ్లి చేసుకుంటానని చెప్పగా, అందుకు ఆమె నిరాకరించింది. అప్పటి నుంచి అసభ్యకరమైన మెసేజ్‌లు, వీడియోలు పెట్టడమే కాకుండా టీవీ ఇండస్ట్రీలో తాను వివిధ వ్యక్తులతో దిగిన ఫొటోలను చెడుగా ప్రచారం చేస్తున్నాడు. తనతో ఉండడానికి ఒప్పుకోకపోతే ఈ ఫొటోలతో సంక్రాంతికి ఆమె స్వ గ్రామంలో బ్యానర్లు కడతానని బెదిరిస్తున్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు ఫణితేజపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భర్త వేధింపులు భరించలేక మహిళ ఆత్మహత్య

మణికొండ: భర్త వేధింపులు భరించలేక ఓ మహిళ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని హిమగిరినగర్ కాలనీలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వికారాబాద్ జిల్లా దోమ మండలం, బద్దులాపూర్ గ్రామానికి చెందిన రాజు, సుశీల దంపతులు నగరానికి వలస వచ్చి హైదర్‌షాకోట్‌లో నివాసం ఉంటున్నారు. రాజు ఓ హోటల్‌లో పనిచేస్తుండగా సుశీల సూపర్ మార్కెట్‌లో పని చేసేది. వారికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. రాజు తరచూ భార్యను కొట్టేవాడు. సోమవారం భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో మనస్తాపానికి లోనైన సుశీల ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సుశీల తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

శంషాబాద్ నుంచి తుక్కుగూడకు ఏరో రైడర్ బస్సులు

సాక్షి, సిటీబ్యూరో: శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌తో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో పని చేసే ఉద్యోగుల కోసం జనవరి 1 నుంచి శంషాబాద్ బస్‌స్టేషన్ నుంచి తుక్కుగూడ వరకు ఏరో రైడర్ ఆర్డినరీ బస్సులను నడుపనున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఈ బస్సులు ఎయిర్‌పోర్టు మీదుగా రాకపోకలు సాగించనున్నాయి. ఎయిర్‌పోర్టులో పనిచేసే ఉద్యోగులు, కార్గోసంస్థలు, ఫార్మాసంస్థల్లో పని చేసే వారు ఈ బస్సులను వినియోగించుకోవచ్చు. రూ.1150కు నెలవారీ బస్‌పాస్‌లు పొందవచ్చు. ఈ పాస్‌లు ఏరోరైడర్ బస్సులతో పాటు అన్ని సిటీ ఆర్డినరీ, సబర్బన్ బస్సుల్లో చెల్లుబాటవుతాయి.శంషాబాద్ బస్‌స్టేషన్ నుంచి మొదటి బస్సు ఉదయం 6 గంటలకు , చివరి బస్సు సాయంత్రం 6.15 గంటలకు బయలుదేరుతుంది.అదే విధంగా తుక్కుగూడ నుంచి కూడా మొదటి బస్సు ఉదయం 6 గంటలకు, , చివరి బస్సు సాయంత్రం 6.15 గంటలకు బయలుదేరుతుందని అధికారులు తెలిపారు.

'సుప్రీం' ఉత్తర్వులంటూ బురిడీ!

- డిజిటల్ అరెస్టు స్కామ్‌లో కొత్త పంథా
- నగరానికి చెందిన వృద్ధుడికి టోకరా
- రూ.9.55 లక్షలు కాజేసిన ఈ-నేరగాళ్లు

సాక్షి, సిటీబ్యూరో: డ్రగ్ పార్శిల్స్, మనీ లాండరింగ్ అంటూ భయపెట్టి, వీడియో కాల్ ద్వారానే డిజిటల్ అరెస్టు చేస్తూ, బాధితుల నుంచి అందినకాడికి దండుకునే సైబర్ నేరగాళ్లు ఇప్పుడు కొత్త పంథా అనుసరిస్తున్నారు. ఏకంగా సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సంతకం చేసి ఇచ్చినట్లు నకిలీ ఉత్తర్వులను చూపించి డబ్బు దండుకున్నారు. వీరి చేతిలో రూ.9.55 లక్షలు మోసపోయి, సోమవారం సిటీ సైబర్ క్రైమ్ ఠాణాను ఆశ్రయించిన వృద్ధుడి ఫిర్యాదుతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. నగరానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగికి (89) ముంబై పోలీసుల పేరుతో ఓ గుర్తుతెలియని వ్యక్తి వాట్సాప్ ద్వారా కాల్ చేశాడు. బాధితుడి ఆధార్ కార్డు సైతం చెప్పిన కేటుగాళ్లు ముంబైలోని కెనరా బ్యాంక్‌లో బాధితుడి పేరుతో ఖాతా ఉందని చెప్పారు. దాని ద్వారా మనీ లాండరింగ్ జరిగిందని, దీనిపై కేసు నమోదైందని, దర్యాప్తునకు సహకరించకుంటే అరెస్టు చేస్తామని బెదిరించారు. దీంతో భయపడిన బాధితుడు సహకరిస్తానని చెప్పడంతో పోలీసు యూనిఫామ్‌లో ఉన్న మరో వ్యక్తి వాట్సాప్ ద్వారా వీడియో కాల్ చేశాడు. మీపై నిఘా ఉంచామని, ఈ విషయం ఎవరికీ చెప్పొద్దని పేర్కొన్నాడు. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సంతకం చేసి, బాధితుడి పేరుతో ఇచ్చిన ఉత్తర్వులంటూ ఓ నకిలీ ఆర్డర్ కాపీని పంపాడు. అందులో సెక్యూరిటీ డిపాజిట్‌గా నిర్ణీత మొత్తం తీసుకోవడానికి ముంబై పోలీసులుగా చెప్పుకున్న వారిని కోర్టు అనుమతించినట్లు ఉంది. ఇది చూసిన బాధితుడు నిజమని నమ్మి ఆర్టీజీఎస్ ద్వారా రూ.9.55 లక్షలు చెల్లించాడు. మిగిలిన సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించడానికి తన వద్ద డబ్బు లేదని బాధితుడు చెప్పడంతో.. స్నేహితులు, ఫైనాన్షియర్ల దగ్గర అప్పు అయినా తీసుకుని చెల్లించాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని నేరగాళ్లు హెచ్చరించారు. ఓ దశలో వారి వ్యవహారశైలి చూసి అనుమానించిన బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించాడు. ఈ మేరకు సోమవారం సిటీ సైబర్ క్రైమ్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది.

రియల్‌ఎస్టేట్ వ్యాపారిపై దాడి

సీసీ కెమెరాలు ధ్వంసం

- 'డీవీఆర్, బంగారు ఆభరణాలు, డాక్యుమెంట్స్ చోరీ
- పోలీసుల అదుపులో ముగ్గురు అనుమానితులు


మాట్లాడుతున్న బాధితుడు మల్లికార్జున్

మల్కాజిగిరి: ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారిపై గుర్తుతెలియని వ్యక్తులు దాడికి పాల్పడిన సంఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. బాధితుడు, పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఆనంద్‌బాగ్‌కు చెందిన చల్లపల్లి మల్లికార్జున్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేవాడు. ఈ నెల 29న రాత్రి మాస్కులు ధరించి వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు ఆయన ఇంట్లో చొరబడి అతనిపై దాడి చేసి గాయపరచడమే కాకుండా బీరువాలో ఉన్న నగలతో పాటు అతడి ఒంటిపైన ఉన్న ఆభరణాలతో సహా 52 తులాల బంగారం, విలువైన డాక్యుమెంట్స్, రూ.8 లక్షల నగదు చోరీ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. అంతేగాక పథకం ప్రకారం వీధిదీపాలు, సీసీ కెమెరాలను ధ్వంసం చేయడమే కాకుండా డీవీఆర్ సైతం ఎత్తుకెళ్లినట్లు తెలిపాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు మల్కాజిగిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. యాప్రాల్‌కు చెందిన రాజేష్, కీసర మండలం నర్సంపల్లికి చెందిన ప్రవీణ్, సైనిక్‌పురికి చెందిన నాగదుర్గాప్రసాద్ అనే వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపారు.

టార్గెట్ 2025 అన్ని సమస్యలకు పరిష్కారం చూపుతా

ఫోర్త్‌సిటీ, గ్రీన్‌ఫీల్డ్‌రోడ్డు, ఆర్‌ఆర్‌ఆర్ కీలకం

- భూ వివాదాల పరిష్కారానికి ప్రాధాన్యం
- పేదలకు నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యమే లక్ష్యం
- ప్రభుత్వ భూముల పరిరక్షణకు పెద్దపీట..
- 'సాక్షి'తో జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి


రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: 'ప్రభుత్వ ఉద్దేశాలు, సంక్షేమ పథకాలను మరింత పకడ్బందీగా ప్రజల్లోకి తీసుకెళ్లడమే జిల్లా కలెక్టర్‌గా నా ప్రథమ కర్తవ్యం. ఇందులో భాగంగా ఫోర్త్‌సిటీ అభివృద్ధి, గ్రీన్‌ఫీల్డ్‌రోడ్డు, ఆర్‌ఆర్‌ఆర్‌లకు భూ సేకరణ, భూ వివాదాల పరి ష్కారం, వంటి అంశాలకు మొదటి ప్రాధాన్యత ఇస్తా' అని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన 'సాక్షి ప్రతినిధి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా మిగిలి పోయిన అనేక భూ సమస్యలకు 2025 ఓ పరిష్కార మార్గం చూపుతుందని కలెక్టర్‌గా ఆశిస్తున్నా. ఆ దిశగా కార్యాచరణ సిద్ధం చేసుకుంటున్నా. పేదలకు నాణ్యమైన విద్య, మెరుగైన వైద్య సేవలు అందించాలన్నదే ప్రభుత్వ సంకల్పం. నిరంతర పర్యవేక్షణ ద్వారా ఈ రెండు అంశాల్లోనూ జిల్లాకు మంచి గుర్తింపు తీసుకురావాలన్నదే నా భావన.

మెప్పించి..ఒప్పించిన తర్వాతే..

ప్రభుత్వం తీసుకురాబోయే ప్రాజెక్టులకు భూ సేకరణ కీలకం. ఇతర జిల్లాలతో పోలిస్తే ఇక్కడ భూముల ధరలు అధికం. విలువైన ఈ భూములు ఇచ్చేందుకు రైతులు నిరాకరిస్తుంటారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వారి నుంచి భూములను బల వంతంగా తీసుకోబోం. సాధ్యమైనంత వరకు వారితో చర్చించి, వారు ఆశించిన స్థాయిలో నష్ట పరిహారం ఇప్పించి, వారిని ఒప్పించిన తర్వాతే భూ సేకరణ విషయంలో ముందుకు వెళ్తాం. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన ఓ కలెక్టర్‌గా రైతుల అభిప్రాయానికే ఎక్కువ ప్రయారిటీ ఇస్తా. ఫార్మాసిటీ కోసం ఇప్పటికే భూములు ఇచ్చిన రైతులకు మీర్‌ఖాన్‌పేటలో ఇళ్లస్థలాలు సిద్ధం చేస్తున్నాం. పైసా ఖర్చు లేకుండా జనవరిలో వారి పేరున రిజిస్ట్రేషన్ చేయడంతో పాటు పొజిషన్ చూపిస్తాం.

కోర్టుల్లోనూ కొట్లాడతాం..

జిల్లాలో అనేక భూ వివాదాలు నెలకొని ఉన్నాయి. ఈ లిటిగేషన్లను చాలా జాగ్రత్తగా హ్యాండిల్ చేయాల్సి ఉంది. కోర్టు కేసుల్లో ఉన్నవాటిని ఏమీ చేయలేం. జిల్లా అధికారిగా నా పరిధిలో ఉన్న ప్రతి అంశానికి పరిష్కార మార్గం చూపుతా. అంతేకాదు ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం ప్రత్యేక చర్యలు చేపడుతా. జిల్లా స్థాయిలోనే కాదు ఆర్డీఓ స్థాయిలోనూ లీగల్ సెల్‌ను మరింత యాక్టివ్ చేస్తా. ఇటు క్షేత్రస్థాయిలో కబ్జాలను ప్రత్యక్షంగా అడ్డుకోవడమే కాదు.. అటు కోర్టుల్లోనూ బలంగా కొట్లాడతాం. ప్రభుత్వ భూములుగా నిరూపించేందుకు అవసరమైన అన్ని ధ్రువీకరణ పత్రాలను కోర్టు ముందు ఉంచుతాం.

'భూ భారతి'తో అన్ని సమస్యలకు చెక్

ప్రస్తుతం ధరణి పోర్టల్ 17,000కుపైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లా స్థాయిలోనే కాకుండా ఆర్డీఓ స్థాయిలో నిర్వహించే 'ప్రజావాణి'లోనూ ఈ సమస్యలు ప్రధానంగా వస్తున్నాయి. ఆన్‌లైన్‌లో దరఖాస్తులతో పాటు ప్రజావాణిలో వచ్చిన ఆర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి వాటికి పరిష్కార మార్గం చూపిస్తా. అంతేకాదు ఏ సమస్యకు? ఏ అధికారి స్థాయిలో పరిష్కారం లభిస్తుందో? గుర్తించి ఆ మేరకు వాటికి ఆయా స్థాయిల్లోనే పరిష్కారమార్గం చూపేందుకు యత్నిస్తా. ధరణి స్థానంలో భూమాతను తీసుకువస్తున్నాం. చాలా సమస్యలకు ఇందులో పరిష్కారమార్గం లభిస్తుంది. ఎట్టి పరిస్థితుల్లోనూ అవినీతి/అక్రమాలకు ఆస్కారం ఇవ్వబోం.

అన్ని హంగులతో ఫోర్త్‌సిటీని నిర్మిస్తాం

హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌లకు దీటుగా మీర్‌ఖాన్‌పేట వేదికగా నాలుగో నగరాన్ని తీర్చిదిద్దాలని ప్రభుత్వం భావిస్తుంది. విశాలమైన రోడ్లు, పార్కులు, ఆటస్థలాలు, కమ్యూనిటీ భవనాలు, విద్యా, శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ప్రభుత్వ ఉద్దేశాన్ని మరింత బలంగా ప్రజల్లోకి తీసుకెళ్తాను. ఎలాంటి వివాదాలు తలెత్తకుండా జాగ్రత్తగా ముందుకు వెళ్లాను. గ్రీన్‌ఫీల్డ్‌రోడ్డు, ఆర్‌ఆర్‌ఆర్ రోడ్డుకు భూసేకరణ విషయంలోనూ ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ ఆలోచన మేరకు నూతన సంవత్సరంలో మరో నూతన నగరాన్ని కళ్లముందు ఆవిష్కరించే ప్రయత్నం చేస్తాను.

వేతనం కోసం పని చేస్తున్నా.. అనేక మందికి మేలు

ప్రభుత్వ అధికారిగా పని చేయడం ఉద్యోగులు తమ అదృష్టంగా భావించాలి. తాము తీసుకునే నిర్ణయాలు, వేతనం కోసం పని చేస్తున్నప్పటికీ.. చేసే పనులు ఎంతో మందికి మేలు జరుగుతుంది. నిత్యం పని చేయాలి. పాజిటీవ్ ఆలోచ నతో పని చేయాలి. విద్యార్థి జీవితానికి షార్ట్‌కట్ అంటూ ఏమీ ఉండదు. లక్ష్యా న్ని నిర్ధేశించుకుని, ఆ మేరకు కష్టపడితే మంచి ఫలితాలు వస్తాయి. ప్రభుత్వం కూడా అనేక నోటిఫికేషన్లు ఇస్తుంది, వాటిని అందిపుచ్చుకునే దిశగా కష్టపడా లి. కొత్త ఏడాది కొత్త లక్ష్యంతో ముందుకు వెళ్లినప్పుడే ఎవరికైనా విజయం సిద్ధిస్తుంది.

దివ్యాంగులకు ప్రత్యేక వసతులు కల్పించాలి


అవగాహన యాత్ర చేస్తున్న బృందం

పంజగుట్ట: దివ్యాంగులను సర్వాంగులతో సమానంగా చూడాలని చెబుతున్నారనే తప్ప ఆచరణలో చూపడం లేదని సంఘటి ఫౌండేషన్ ట్రస్టీ సుధీర్ ధీర్ అన్నారు. దివ్యాంగులపై అవగాహన కల్పించేందుకు సంఘటి ఫౌండేషన్ ప్రతినిధులు దేశవ్యాప్త యాత్ర చేస్తున్నారు. వీరి యాత్ర సోమవారం హైదరాబాద్‌కు చేరుకోవడంతో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ఫౌండర్ ట్రస్టీ సుధీర్ ధీర్ మాట్లాడుతూ డిసెంబర్ 15వ తేదీన ఢిల్లీలోని ఇండియా గేట్ వద్ద ఆరుగురు సభ్యులతో ఈ యాత్రను ప్రారంభించామన్నారు. మొత్తం 12 రాష్ట్రలను ఎంపిక చేసుకొని యాత్ర సాగించామన్నారు. జనవరి 3వ తేదీన ఢిల్లీలో యాత్ర ముగుస్తుందన్నారు. మొత్తం 7 వేల కిలోమీటర్లు నాలుగు ప్రత్యేకంగా తయారు చేయించిన మోటార్ సైకిల్, ఒక కారులో యాత్ర సాగిందన్నారు. 2016 దివ్యాంగుల చట్టం ప్రకారం ప్రతీచోట దివ్యాంగులు, సీనియర్ సిటీజన్స్ వెళ్లేందుకు మెట్లతో పాటు ర్యాంప్ కూడా ఉండాలని, ప్రతీ హోటల్‌లో లిఫ్ట్ ఎక్కాలంటే ముందుగా కొన్ని మెట్లు ఎక్కాల్సిన పరిస్థితి ఉందని, అక్కడ ర్యాంప్ లేకపోవడంతో దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. కేవలం హోటల్స్‌లో కాకుండా పర్యాటక ప్రాంతాలు, దేవాలయాలు, షాపింగ్ మాల్స్ అన్నిచోట్ల దివ్యాంగులకు ప్రత్యేక వసతులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇదే విషయంపై దివ్యాంగ కమిషనర్‌కు, స్థానిక ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు ఇచ్చామన్నారు.

ఆంజనేయ స్వామి కృపతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి

రాష్ట్ర బీసీ కమిషన్ ఛైర్మన్ నిరంజన్


వేడుకల్లో కమిషన్ ఛైర్మన్ నిరంజన్, సీఎన్‌రెడ్డి

రహమత్‌నగర్: ఆంజనేయస్వామి దయతో తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని రాష్ట్ర బీసీ కమిషన్ ఛైర్మన్ నిరంజన్ ఆకాంక్షించారు. సోమవారం ఎస్పీఆర్‌హిల్స్ ఇందిరానగర్ ఫేజ్–1 బస్తీలోని హనుమాన్ ఆలయ 15 వార్షికోత్సవ పూజల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మనిషి భక్తిభావం కలిగి ఉండాలని అన్నారు. 15 సంవత్సరాలుగా ఆలయ వార్షికోత్సవాలు నిర్వహిస్తున్న ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎత్తరి అంతయ్యను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సీఎన్ రెడ్డి, వడ్డెర ఆత్మగౌరవ ట్రస్టు డైరెక్టర్ డా.ఓర్సు కృష్ణయ్య, వడ్డెర సంఘం నాయకులు వెంకటేశ్, పల్లెపు లక్ష్మీనారాయణలతో పాటు డివిజన్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ....

రహమత్‌నగర్ డివిజన్‌లోని హెచ్‌ఎఫ్‌నగర్‌లో సెంట్రింగ్ కాంట్రాక్టర్ అసోసియేషన్ వారు రూపొందించిన కేలండర్‌ను కార్పొరేటర్ సీఎన్ రెడ్డి ఆవిష్కరించారు. కార్మికులకు తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ అహ్మద్, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ పూర్వ విద్యార్థుల సందడి


జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో సందడి చేస్తున్న పూర్వ విద్యార్థులు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ పూర్వ 10, 12వ తరగతి విద్యార్థుల ఆత్మీయ సమావేశం సోమవారం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులకు పాఠశాల విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. విద్యార్థులు చదువుకున్న తరగతి గదులు, తిరిగిన కారిడార్ ప్రాంతాలను సందర్శిస్తూ పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తాము ఆడుకున్న మైదానంలో మరోసారి ఆటలాడి ముచ్చట తీర్చుకున్నారు. విద్యార్థులందరూ ఒకరికొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ తన్మయత్వానికి లోనయ్యారు. ఈ సందర్భంగా పాఠశాలలకు తమ అనుభవాలను విద్యార్థులు పంచుకున్నారు. చదువు చెప్పిన ఉపాధ్యాయులను కొనియాడారు. వారి కుటుంబాల గురించిన విషయాలను, ఎన్నో మధుర జ్ఞాపకాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ ఎం.వరలక్ష్మి, ప్రిన్సిపాల్ కాంచనవల్లిలు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ ఈ సమావేశంలో పాల్గొన్న విద్యార్థులను అభినందించారు. భవిష్యత్తులో ఎన్నో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు.

'తీరం చేరని కెరటాలు' కవితా సంపుటి ఆవిష్కరణ


కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ కోదండరామ్

కాచిగూడ: జీవిత సారాంశాన్ని డాక్టర్ చిలుక భాస్కర్ తన రచనల ద్వారా సమాజానికి విపులంగా తెలియజెప్పారని ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ అన్నారు. చిలుక బ్రదర్స్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నందికొట్కూర్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ చిలుక భాస్కర్ పదవీ విరమణ సందర్భంగా సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ చిలుక భాస్కర్ రచనలో వెలువడిన 'తీరం చేరని కెరటాలు' కవితా సంపుటిని కోదండరామ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడి చదివి అందరు మెచ్చిన కవిగా రాణించడానికి తెలుగు భాషపై మంచి పట్టు సాధించారని ఆయన పేర్కొన్నారు. కరోనా సమయంలో ఆయన రాసిన కవిత అందరినీ ఆకర్షించిందన్నారు. నిజజీవిత సత్యాలను లోతుగా అధ్యయనం చేసి కవిత్వాలుగా అందించారని అన్నారు. నేటి తరానికి చిలుక భాస్కర్ రచనలు చాలా అవసరం అన్నారు. రిటైర్డ్ అయిన తర్వాత కూడా విద్యార్థులకు బోధన చేసి వారి జీవితాలలో వెలుగులు నింపాలని కోరారు. అంతకుముందు భాగ్యనగరంలో భాస్కరుడు అభినందన సంచికను హైదరాబాద్ జిల్లా డీఈఓ రోహిణి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ప్రొఫెసర్ గుండెడప్పు కనకయ్య, రాపోలు రాములు, దాస్యం సేనాపతి, గాజుల శ్రీధర్, ఎస్.గుండప్ప, డాక్టర్ మంథని శంకర్, డాక్టర్ పసునూరి రవీందర్, డాక్టర్ చిలుక భాస్కర్, డాక్టర్ ఎస్.విజయ భాస్కర్, చిలుక సంజీవరావు, చిలుక మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

ఈ స్తంభం ఎవరి నెత్తిన కూలునో..?



ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని జూబ్లీహిల్స్ రోడ్ నెం 92లో ఓ విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారింది. స్థానికులు ఈ ప్రమాదకరంగా ఉన్న స్తంభం గురించి శాఖాధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గత 20 రోజులుగా ఈ స్తంభం ఎవరి నెత్తిన కూలుతుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ దారిగుండా రోజూ వాహనదారులు, స్థానికులు పెద్ద ఎత్తున ప్రయాణిస్తుంటారు. ఇక్కడే ఆస్పత్రులతో పాటు దేవాలయాలు ఉండటంతో ప్రజలు నిత్యం వస్తూపోతుంటారు. ఈ స్తంభం వల్ల ప్రమాదం జరగకముందే సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న స్తంభాన్ని తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఇందిరమ్మ ఇళ్ల సర్వేకు 50 బృందాలు

- వేగం పెంచిన అధికారులు
- మరో 10 రోజుల్లో సర్వే పూర్తి చేయాలని లక్ష్యం
- రోజుకు 2,500 మందిని సర్వే చేయాలని నిర్ణయం
- ఎప్పటికప్పుడు యాప్‌లో నమోదు



బంజారాహిల్స్ రోడ్–12లో ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో సిబ్బంది

బంజారాహిల్స్: ఇందిరమ్మ ఇళ్ల అర్హుల ఎంపిక ప్రక్రియ మందకొడిగా సాగుతున్న తరుణంలో మరింత వేగవంతం చేయాలని అధికారులు నిర్ణయించారు. జీహెచ్‌ఎంసీ జూబ్లీహిల్స్ సర్కిల్–18 పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, షేక్‌పేట తదితర నాలుగు డివిజన్ల పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని భావించారు. సర్కిల్‌లో మొత్తం 28,421 మందిని ఈ పథకం కోసం ఎంపిక చేశారు. ఐదురోజుల క్రితం సర్వే ప్రారంభం కాగా 12 బృందాలను నియమించి ప్రత్యేక యాప్ ద్వారా అర్హుల వివరాలను అందులో పొందుపరుస్తున్నారు. అయితే రోజూ ఒక్కో బృందం 5–10 మందిని మాత్రమే సర్వే చేస్తుండడంతో ఇప్పటి వరకు 10 శాతం కూడా పూర్తి కాలేదు. దీంతో సోమవారం నుంచి మరో 18 మందిని పెంచి 30 మందితో సర్వే చేస్తున్నారు. అప్పటికీ అనుకున్న గడువులోగా సర్వే పూర్తయ్యే అవకాశాలు కనిపించకపోవడంతో మొత్తం 50 బృందాలు ఏర్పాటు చేయాలని తలపెట్టారు. మంగళవారం నుంచి 50 బృందాలతో సర్వే చేపట్టనున్నారు. ప్రతి రోజూ 50 బృందాలు 2,500 మందిని సర్వే చేసే దిశగా ప్రణాళికలు రూపొందించారు. ఇప్పటి వరకు 4,030 మందిని మాత్రమే సర్వే చేయగలిగారు. ఇంకో 24,000 మందిని సర్వే చేయాల్సి ఉండగా గడువు ముంచుకొస్తుండడంతో బృందాలను పెంచారు. అయితే సర్వే చేసే మహిళను ఫొటోలు తీసి యాప్‌లో పొందుపరిచే క్రమంలో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయని సర్వే చేస్తున్న సిబ్బంది వాపోతున్నారు. ఈ సర్వే ఆషామాషీగా లేదని, పకడ్బందీగా ఎన్నో వివరాలను నమోదు చేయాల్సి ఉందని, వీటిని యాప్‌లో నమోదు చేసే క్రమంలో కూడా చాలా సమయం తీసుకుంటుందని సిబ్బంది అంటున్నారు. మొత్తానికి మరో రెండు వారాల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పూర్తి చేసే దిశలో జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రణాళికలు రూపొందించారు. మరి కొన్ని చోట్ల ఇళ్లకు తాళాలు వేసి ఉండడంతో మరో రోజు వెళ్లాల్సి వస్తుంది. చాలామంది ఉదయమే బయటకు పనులకు వెళ్తుండడంతో సర్వే చేస్తున్న సిబ్బందికి వారు అందుబాటులోకి రావడం లేదు. సర్వే మందకొడిగా సాగడానికి ఇది కూడా ఒక కారణంగా సిబ్బంది పేర్కొంటున్నారు.

బ్రోచర్ ఆవిష్కరణ



బంజారాహిల్స్: దశాబ్దాలుగా తెలుగు సినిమా వెలుగులను, ఔన్నత్యాన్ని తెలిపేలా దేశ విదేశాల్లో విశిష్ట కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఫిలిం ఎనలిటికల్ అపరిషియేషన్ (ఫాస్), అంతర్జాతీయ తెలుగు మూవీ అసోసియేషన్ (ఇట్మా)లు నూతన సంవత్సర కార్యక్రమాల బ్రోచర్‌ను సోమవారం విడుదల చేశారు. ఫిలింఛాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో తెలుగు ఫిలిం నిర్మాతల మండలి అధ్యక్షులు, తెలుగు ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శి దామోదర ప్రసాద్‌లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆయా సంస్థల వ్యవస్థాపక అధ్యక్షులు, సంస్కృతి రత్న ధర్మారావు, నిర్మాతల మండలి కోశాధికారి, శత చిత్ర నిర్మాత తుమ్మలపల్లి రామ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ



బంజారాహిల్స్: సుల్తాన్–ఉల్–ఉలూమ్ ఎడ్యుకేషన్ సొసైటీ (ఎస్‌యూఈఎస్) ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఎస్‌యూఈఎస్ చైర్మన్ వలియుల్లా, సెక్రటరీ జాఫర్ జావిద్ తదితరులు హాజరై కేలండర్‌ను విడుదల చేశారు.

దివ్యాంగులపై వివక్ష చూపొద్దు

లిబర్టీ: దివ్యాంగులపై వివక్ష చూపుతున్నారని దాన్ని విడనాడాలని తెలంగాణ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్‌రావు, ఇండియన్ ప్రజా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు కే.బి.శ్రీధర్‌లు అన్నారు. దివ్యాంగులు అన్ని రంగాల్లో ప్రతిభ చూపుతున్నప్పటికీ ఏ రంగంలో సరైన ప్రాధాన్యత లేదని ఒకింత ఆందోళన వ్యక్తం చేశారు. వరల్డ్ డిసబుల్‌డేను పురస్కరించుకొని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ దివ్యాంగుల విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో దివ్యాంగులకు వాటా, కోటా దక్కాలని అన్నారు. దివ్యాంగులకు రాజకీయ ఆర్థిక సాధికారిత కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఇండియన్ ప్రజా కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, జస్టిస్ ఫ్రింట్ చైర్మన్ నారగోని సూర్య ప్రకాష్‌రావు, ఉదయలక్ష్మి పాల్గొన్నారు.

వేడుకల్లో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

బోరబండ ఎస్‌హెచ్‌ఓ వీరశేఖర్



రహమత్‌నగర్: కొత్త సంవత్సర వేడుకల్లో నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని బోరబండ ఎస్‌హెచ్‌ఓ వీరశేఖర్ హెచ్చరించారు. బోరబండ పోలీస్‌స్టేషన్‌లో ఆయన సోమవారం మాట్లాడుతూ వేడుకల్లో డీజేలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. అలాగే రోడ్లపై కేక్‌కట్ చేయడం, అర్ధనగ్నంగా హంగామా చేసేవారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. సోమవారం సాయంత్రం నుంచే వాహనాల తనిఖీలు, డ్రంకన్ అండ్ డ్రైవ్‌లు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అర్ధరాత్రి వాహనాలపై యువత తిరగకూడదని పేర్కొన్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగించేవారిని వదిలిపెట్టే ప్రసక్తిలేదని హెచ్చరించారు. నూతన సంవత్సరం వేడుకల తమ సిబ్బందితో గస్తీ ముమ్మరం చేయడం జరిగిందన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో బెల్ట్ షాపులు నడపరాదని పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం నుంచి తెల్లవారే వరకు తమ సిబ్బంది పెట్రోలింగ్ నిర్వహిస్తుందని చెప్పారు. ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగితే తమకు సమాచారం అందించాలని ఆయన సూచించారు. ప్రధానంగా మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

'స్టాప్ రోడ్ యాక్సిడెంట్' పేరుతో క్యాంపెయిన్

వంద స్కూళ్లను ఎంపిక చేసి నగదు ప్రోత్సాహకాలు : డాక్టర్ గురవారెడ్డి



ఖైరతాబాద్: సర్వేజనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థి దశ నుంచే రోడ్డు సేఫ్టీ మార్గదర్శకాలపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా 41 వేల స్కూళ్లను ఎడ్యుకేట్ చేయాలనే సామాజిక సేవా దృక్పథంతో "స్టాప్ రోడ్ యాక్సిడెంట్స్" థీంతో క్యాంపెయిన్ నిర్వహిస్తున్నట్లు సర్వేజనా ఫౌండేషన్ చైర్మన్, కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్స్ ఎండీ డాక్టర్ ఎ.వి. గురవారెడ్డి తెలిపారు. దేశంలో ప్రతి యేటా 5 లక్షల యాక్సిడెంట్స్ జరుగుతుంటే దాదాపు 1.5 లక్షల మంది చనిపోతున్నట్లు తెలిపారు. మరి కొంత మంది క్షతగాత్రులు అయితే, మరికొంత మంది జీవితాంతం అంగవైకల్యంతో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వాహనాల సంఖ్యలో ఒకశాతం మాత్రమే భారతదేశంలో ఉంటే, రోడ్డు ప్రమాదాలు మాత్రం 11 శాతం జరుగుతున్నాయన్నారు. స్టాప్ రోడ్ యాక్సిడెంట్స్ థీంను ప్రతి విద్యార్థికి, పాఠశాలకు చేర్చి అవగాహన కల్పించాలనే లక్ష్యంతో ఇప్పటికే అన్ని పాఠశాలలకు స్టాప్ రోడ్ యాక్సిడెంట్స్‌పై క్విజ్, ఎస్సె రైటింగ్, డ్రాయింగ్, స్లోగన్స్ తదితర వాటిని నిర్వహించాలని సూచించామన్నారు. వీటన్నింటిని ఫౌండేషన్ జూరీ కమిటీ పర్యవేక్షించి ఉగాది పర్వదినాన 100 ఉత్తమ పాఠశాలలను ఎంపిక చేసి రూ. లక్ష, రూ. 50 వేలు, రూ. 10వేలతోపాటు మెరిట్ సర్టిఫికెట్లు ప్రదానం చేస్తామని గురవారెడ్డి తెలిపారు. జనవరి 11 నుంచి 17 వరకు జరిగే రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా 2025 సంవత్సరానికి ప్రకటించిన నీవే రోడ్డు సేఫ్టీ హీరో అనే థీంను అందరిలోకి తీసుకువెళ్లడానికి కృషి చేస్తున్నామని తెలిపారు.

జేహెచ్‌ఈఎస్ మేనేజింగ్ కమిటీ గౌరవ సభ్యుడిగా కిరణ్‌కుమార్‌రెడ్డి


చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని అభినందిస్తున్న మురళీముకుంద్

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ (జేహెచ్‌ఈఎస్) మేనేజింగ్ కమిటీ గౌరవ సభ్యులుగా భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, విల్లామేరీ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ జాయింట్ సెక్రటరీ చదలవాడ శ్రీనివాసరావు ఎంపికయ్యారు. జేహెచ్‌ఈఎస్ కార్యాలయంలో జరిగిన మేనేజింగ్ కమిటీ సమావేశంలో ఈ మేరకు ఈ ఇద్దరిని గౌరవ సభ్యులుగా ఎన్నుకున్నారు. సొసైటీ అధ్యక్షుడు ఏ.మురళీముకుంద్, ఉపాధ్యక్షుడు ఆర్.బాలమురళీకృష్ణ, కార్యదర్శి ఏ.దినకర్‌బాబులు ఈ సందర్భంగా వీరిద్దరినీ కమిటీలోకి ఆహ్వానించారు. ఈ సొసైటీ 1986లో స్థాపించబడిందని, తెలంగాణలో రెండు ప్రతిష్టాత్మక పాఠశాలలను నడుపుతున్నదని, రాబోయే రోజుల్లో మరిన్ని పాఠశాలలను స్థాపించాలని యోచిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రజలకు నాణ్యమైన విద్యను అందించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రాష్ట్ర ప్రగతికి విద్య, ఆరోగ్యం ముఖ్యమైన అంశాలు కాబట్టి తెలంగాణ అంతటా విద్యను వ్యాప్తి చేయడానికి జేహెచ్‌ఈఎస్‌కు సంపూర్ణ సహకారం అందిస్తామని ఆయన హామీనిచ్చారు.

10న భక్తులకు వైకుంఠద్వార దర్శనం


మీడియాతో మాట్లాడుతున్న టీటీడీ ఏఈఓ ఉమ్మిగారి రమేష్

కాచిగూడ: జనవరి 10వ తేదీన వైకుంఠ ఏకాదశి సందర్భంగా హిమాయత్‌నగర్, జూబ్లీహిల్స్‌లోని టీటీడీ శ్రీవారి ఆలయాల్లో భక్తులకు వైకుంఠ ద్వారా దర్శనం కలిగించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు టీటీడీ హైదరాబాద్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఉమ్మిగారి రమేష్ తెలిపారు. సోమవారం హిమాయత్‌నగర్‌లోని టీటీడీ బాలాజీ మందిర్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైకుంఠ ద్వారా దర్శనం జనవరి 10వ తేదీన తెల్లవారు జామున 3.30 గంటలకు ప్రారంభమై అర్ధరాత్రికి ముగుస్తుందన్నారు. జనవరి 10, 11, 12 తేదీల్లో మూడు రోజులపాటు వైకుంఠ ద్వారా దర్శనం ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. దర్శనానికి వచ్చే భక్తులకు ప్రత్యేక క్యూ లైన్లు, బారికేడ్లు, తాగునీటి సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. పురాణం ప్రకారం శ్రీ మహావిష్ణువు వైకుంఠంలో ఉండే ఒకరోజు భూమిపై ఒక సంవత్సరంగా పరిగణించబడుతుందన్నారు. ఆలయాలకు వచ్చే భక్తులు తమ వాహనాలను నిర్దేశించిన స్థలంలో పార్కింగ్ చేసి, ట్రాఫిక్ పోలీసులకు సహకారించాలని సూచించారు. అలాగే ఆంగ్ల నూతన సంవత్సరం జనవరి 1వ తేదీన వేంకటేశ్వరస్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీటీడీ టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస ప్రభు, హరిక్రిష్ణ, సత్యనారాయణ, నిరంజన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'సయోనరా'


కార్యక్రమంలో విద్యార్థినులు



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 7లోని మెరీడియన్ స్కూల్‌లో సోమవారం ఇంటర్మీడియట్ విద్యార్థులు సయోనరా పేరుతో నిర్వహించిన ఫేర్‌వెల్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు ఆట పాటలతో సందడి చేశారు. విద్యార్థినులు చేసిన ఫ్యాషన్ వాక్ ఆకట్టుకుంది. ఇంటర్ తర్వాత ఉన్నత చదువులకు వెళ్లే విద్యార్థులకు మెరీడియన్ స్కూల్ ప్రిన్సిపాల్ నిషిరానా అభినందనలు తెలిపారు. క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు అందుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రహత్ రషీద్, ఇన్‌చార్జి రీతానాథ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఖైరతాబాద్: సైఫాబాద్ డివిజన్ పరిధిలో జవహర్‌నగర్ సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్ పనుల్లో భాగంగా మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జవహర్‌నగర్ ఏరియా, టీఆర్‌టీ క్వార్టర్స్, గణేష్ టెంపుల్ ఏరియా, ఆర్టీసీ క్రాస్ రోడ్సు, సప్తగిరి టాకీస్, చిక్కడపల్లి పోలీస్ స్టేషన్, సహారా బేకరీ, ప్రజాసాయి ఎస్‌ఆర్‌టీ క్వార్టర్స్‌లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందన్నారు. అదే విధంగా మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు గాంధీనగర్, జగదంబా నర్సింగ్ హోం, ఆంధ్ర కేఫ్, ఎస్‌బీఐ బ్యాంక్ గల్లీ, జవహర్‌నగర్ ఏరియా, గాంధీనగర్ ఏరియా, హెరిటేజ్ సూపర్ మార్కెట్ ఏరియాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, దీనిని గమనించి సహకరించాలని కోరారు.

జెడ్సీకి కార్పొరేటర్ వినతి


జెడ్సీకి వినతిపత్రం సమర్పిస్తున్న వెంకటేష్

ఫిలింనగర్: ఫిలింనగర్ 18 బస్తీల్లో పెండింగ్‌లోని వివిధ అభివృద్ధి పనులను వేగవంతంగా అయ్యేలా చూడాలని జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ సోమవారం ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతికి వినతి పత్రం సమర్పించారు. అదేవిధంగా జ్ఞానీజైల్ సింగ్‌నగర్‌లో రూ.18 లక్షల వ్యయంతో నిర్మించ తలపెట్టిన నూతన సీసీ రోడ్డు పనులను త్వరగా ప్రారంభించాలని కోరారు. ఇంకా చాలాచోట్ల పనులు ప్రారంభ దశలో ఉన్నాయని వాటిని కూడా పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా జెడ్సీ స్పందిస్తూ త్వరలోనే పనులను ప్రారంభిస్తామని హామీనిచ్చారు.

కొనసాగుతున్న ధనుర్మాసోత్సవాలు


తిరుప్పావై ప్రవచనాలు వినిపిస్తున్న అర్చకులు

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్డునెంబర్–14లోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం విష్వక్సేన ఆరాధన, వాసుదేవ పుణ్యాహవచనం, ధనుర్మాస వ్రత దీక్షలు, తిరుప్పావై సేవాకాలం అత్యంత వైభవంగా నిర్వహించారు. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీ గోదా రంగనాథస్వామిని దర్శించుకుని విశేష పూజలు నిర్వహించారు.

'లోపాయికారి ఒప్పందాలతో ప్రజాధనం వృథా'

కాచిగూడ: లోపాయికారి ఒప్పందాలతో ప్రజాధనం లూటీ చేసిన బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌లపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టాలని బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ ఈడీని కోరారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కార్యాలయంలో జాయింట్ డైరెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. ఔటర్‌రింగ్ రోడ్డు టోల్ లీజును ఐఆర్‌బీ సంస్థకు ఇవ్వడంలో, వరంగల్, రంగారెడ్డి కైటెక్స్ యూనిట్ల స్థాపనలోనూ అక్రమాలు జరిగాయన్నారు. క్విడ్ ప్రోకో పద్ధతిలో ఎలక్టోరల్ బాండ్లు కొనుగోలు చేసిన కంపెనీలు టెండర్ లేదా లీజు అగ్రిమెంట్ అయిన వెంటనే బీఆర్‌ఎస్ పార్టీకి ఇచ్చాయని, ఆ వెంటనే బీఆర్‌ఎస్ ఆ బాండ్లను ఎన్‌క్యాష్‌మెంట్ చేసుకున్నదని ఆరోపించారు. అప్పటి పరిశ్రమలు, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్‌కు ఈ క్విడ్‌ప్రోకో తతంగంతో నేరుగా ఒప్పందం ఉందని ఆరోపించారు. ఇప్పటికైనా బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఫర్ సోషల్ అడిట్ అధ్యక్షులు గాలిగల్ల సాయిబాబా పాల్గొన్నారు.

విదేశాల్లో ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

బంజారాహిల్స్: విదేశాలకు పంపించి మంచి ఉద్యోగం ఇప్పిస్తామంటూ నమ్మబలికి సుమారు రూ.5 లక్షలు వసూలు చేసి మోసం చేసిన దంపతులపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గడ్డం రమేష్, ఉమారాణిలు తాము యూరప్‌లో పనిచేశానని, చాలా మందిని యూరప్ దేశాలకు తీసుకువెళ్లి ఉద్యోగాలు ఇప్పించడం జరిగిందని పలువురి వద్ద నమ్మబలికారు. దీనిని నమ్మిన జూబ్లీహిల్స్ వెంకటగిరికి చెందిన సిబా ప్రసాద్ పలు దఫాలుగా రూ.5 లక్షల వరకు చెల్లించాడు. ఆ తరువాత ఉద్యోగ ప్రస్తావన తేవడంతో వారు స్పందించడం మానేశారు. దీంతో మోసపోయాయనని తెలుసుకుని జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దంపతులపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి తండ్రికి కేటీఆర్ పరామర్శ



ఏఐజీ హాస్పిటల్‌లో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి తండ్రి సాయినాథ్ రెడ్డిని పరామర్శిస్తున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

గచ్చిబౌలి: హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి తండ్రి సాయినాథ్‌రెడ్డిని గచ్చిబౌలిలోని ఏఐజీ హాస్పిటల్‌లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సోమవారం పరామర్శించారు. గుండెపోటుకు గురైన సాయినాథ్ రెడ్డి హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి కేటీఆర్ అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

'ప్రజావాణి'కి విశేష స్పందన

- మొత్తం 1,630 దరఖాస్తులు.. వాటిలో డబుల్ ఇళ్లకు 1,571 అర్జీలు

లక్డీకాపూల్: ప్రజావాణికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. నగర ప్రజలు అత్యధికంగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 1,630 మంది తమ సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తు చేసుకున్నారు. వాటిని స్వీకరించిన కలెక్టర్ ఆయా అర్జీలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మొత్తం దరఖాస్తుల్లో గృహ నిర్మాణ శాఖకు 1,571, పెన్షన్ 27, ఇతర శాఖలకు సంబంధించిన 32 దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు కదిరవన్, పి.ముకుందరెడ్డి, ఆర్డీవోలు రామకృష్ణ, జిల్లా అధికారులు జి.ఆశన్న, ఆర్. రోహిణి, పవన్ కుమార్, సుబ్రహ్మణ్యం, ఇలియాజ్ అహ్మద్, రాజేందర్ ,శ్రీరామ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రాణించిన వేద్‌రెడ్డి

– హైదరాబాద్, ఆంధ్ర క్రికెట్ మ్యాచ్ 'టై'



సాక్షి, హైదరాబాద్: విజయ్ మర్చంట్ ట్రోఫీ జాతీయ అండర్–16 క్రికెట్ టోర్నీలో భాగంగా లక్నోలో హైదరాబాద్, ఆంధ్ర జట్ల మధ్య జరిగిన గ్రూప్ 'ఎ'చివరి లీగ్ మ్యాచ్ 'టై'గా ముగిసింది. ఆంధ్ర జట్టు నిర్దేశించిన 85 పరుగుల స్వల్ప విజయలక్ష్యాన్ని ఛేదించే క్రమంలో హైదరాబాద్ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 34.3 ఓవర్లలో 84 పరుగులకు ఆలౌట్ కావడంతో మ్యాచ్ 'టై'అయింది. దాంతో రెండు జట్లకు 3 పాయింట్ల చొప్పున లభించాయి. హైదరాబాద్ బౌలర్ వేద్‌రెడ్డి ఈ మ్యాచ్‌లో తొమ్మిది వికెట్లు పడగొట్టి అద్భుత ప్రదర్శన చేశాడు. తొలి ఇన్నింగ్స్‌లో 15.3 ఓవర్లు వేసిన వేద్‌రెడ్డి 25 పరుగులిచ్చి 5 వికెట్లు తీశాడు. మరో బౌలర్ రోహన్ బోపన్న 16 పరుగులిచ్చి 3 వికెట్లు తీసుకున్నాడు. దాంతో ఆంధ్ర జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 64.3 ఓవర్లలో 154 పరుగులకు ఆలౌటైంది. హైదరాబాద్ జట్టు తొలి ఇన్నింగ్స్ 54.3 ఓవర్లలో 132 పరుగులకు ముగిసింది. వేద్‌రెడ్డి 20 పరుగులు, నితిన్ నాయక్ 33 పరుగులు సాధించారు. 22 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం పొందిన ఆంధ్ర రెండో ఇన్నింగ్స్‌లో 22.3 ఓవర్లలో 62 పరుగులకే కుప్పకూలింది. వేద్ రెడ్డి 23 పరుగులిచ్చి 4 వికెట్లు, రోహన్ బోపన్న 3 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టారు. ఈ మ్యాచ్‌తో ఆంధ్ర, హైదరాబాద్ లీగ్ మ్యాచ్‌లు ముగిశాయి. ఆరు జట్లున్న గ్రూప్ 'ఎ'లో హైదరాబాద్ 13 పాయింట్లతో నాలుగో స్థానంలో, ఆంధ్ర 12 పాయింట్లతో ఐదో స్థానంలో నిలిచాయి.

నగరంలో నేడు

- నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా వేదికగా వింటర్ ఉత్సవ్ మేళా సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతుంది.
- సికింద్రాబాద్ ఆర్పీ రోడ్డులోని ప్యారడైజ్ ఫుడ్ కోర్టు ఆధ్వర్యంలో మధ్యాహ్నం 12 నుంచి రాత్రి 10 గంటల వరకు రాయల్ ఫుడ్ ఫెస్టివల్ జరుగుతుంది.
- మాదాపూర్‌లోని పల్లెటూరి వాతావరణంతో కూడిన శిల్పారామం సందర్శనకు ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఉదయం 10.30 నుంచి రాత్రి 7 గంటలకు ఇండియన్ ఫొటో ఫెస్టివల్ జరుగుతుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో అంతర్జాతీయ హస్తకళామేళా ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

నేరాల నియంత్రణకు పక్కా నిఘా

- రైల్వే ఎస్పీ చందన దీప్తి వెల్లడి
- సికింద్రాబాద్ జీఆర్పీ పరిధిలో వార్షిక సమీక్ష



సమావేశంలో పాల్గొన్న రైల్వే ఎస్పీ చందన దీప్తి, డీఎస్పీ జావెద్, ఇన్‌స్పెక్టర్లు

అడ్డగుట్ట: రైల్వే ప్రయాణికుల రక్షణతోపాటు నేరాల నియంత్రణకై జీఆర్పీ పోలీసులు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని రైల్వే ఎస్పీ చందన దీప్తి అన్నారు. సోమవారం లాలాగూడలోని రైల్వే ఎస్పీ కార్యాలయంలో జీఆర్పీ వార్షిక సమావేశం నిర్వహించారు. 2024వ సంవత్సరంలో జరిగిన నేరాలు, రికవరీలు, నేరస్తుల అరెస్టులకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ప్రాపర్టీ నేరాలు, ఎన్‌డీపీఎస్ యాక్ట్, మొబైల్ ఫోన్‌ల చోరీ, కిడ్నాప్‌లు తదితర నేరాలు జరగకుండా నిఘా ముమ్మరం చేసినట్లు తెలిపారు. ఇటీవల దేశంలోని అన్ని జీఆర్పీ పోలీసులతో నేషనల్ జీఆర్పీ సమావేశం జరిగిందని, నేరాల నియంత్రణకు తీసుకోవాల్సిన మరిన్ని జాగ్రత్తలతోపాటు రైల్వే ప్రయాణికుల రక్షణపై సమీక్ష చేశారని వివరించారు. సమావేశంలో డీఎస్పీలు జావెద్, కృపాకర్, శ్రీనివాస్‌రావు, ఇన్‌స్పెక్టర్లు సాయి ఈశ్వర్‌గౌడ్, ఆర్. ఎల్లప్ప, ప్రవీణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

2024లో నేరాలు, రికవరీల వివరాలు...

- ప్రాపర్టీ అఫెన్సులు: ఆర్పీ డిస్ట్రిక్ట్ సికింద్రాబాద్ పరిధిలో మొత్తం 901 ప్రాపర్టీ అఫెన్స్ కేసులు నమోదుకాగా, 142 కేసులు ఛేదించారు. 121 మంది అఫెండర్లను అదుపులోకి తీసుకొని రూ. 37 లక్షల విలువ గల ఆస్తులను రికవరీ చేశారు.
- ఎన్‌డీపీఎస్ యాక్ట్ కేసులు: ఎన్‌డీపీఎస్ యాక్ట్‌లో 56 కేసులు నమోదయ్యాయి. 38 కేసుల్లో 53 మంది నిందితులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ. 2.98 కోట్ల విలువ గల 1194 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.
- మొబైల్ ఫోన్ల రికవరీ: 2023వ సంవత్సరం నవంబర్ నుంచి ఈ ఏడాది నవంబర్ వరకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా 870 సెల్‌ఫోన్లను గుర్తించి సంబంధిత యజమానులకు అందజేశారు.
- చిల్డ్రన్స్ రెస్క్యూ : ఆపరేషన్ స్మైల్ అండ్ ముస్కాన్‌లో భాగంగా 59 మంది బాలురు, 25 మంది బాలికలు, మొత్తం 84 మంది బాలలను రెస్క్యూ చేసి సీడబ్ల్యూసీలోని రిహాబిలిటేషన్ సెంటర్‌కు తరలించారు.
- ఆత్మహత్యలు, యాక్సిడెంట్లు : సికింద్రాబాద్ జిల్లా ఆర్పీ పరిధిలో రైలు ప్రమాదాల్లో మరణించినవారు, రైలు కిందపడి ఆత్మహత్యలు చేసుకున్నవారు మొత్తం 1,468 మంది ఉన్నారు. అందులో గుర్తు తెలియనివారు 193 మంది ఉన్నారు.

ఇతర కేసులు...

లాభం ఆశించి చేసిన హత్య కేసులు 3 నమోదు కాగా ముగ్గురిని అరెస్ట్ చేశారు. మర్డర్ కేసులు 2 నమోదుకాగా, ఒకరిని రిమాండ్ చేశారు. చోరీ కేసులు 16 నమోదుకాగా, 14 కేసులను ఛేదించారు. హత్యాయత్నం కేసులు 3 నమోదయ్యాయి. 2 రేప్ కేసులు నమోదు కాగా, ఒకదానిని, 7 కిడ్నాప్ కేసుల్లో రెండింటిని ఛేదించారు. 9 చీటింగ్ కేసుల్లో 5 కేసులు, 903 దొంగతనం కేసుల్లో 142, 58 ఐపీసీ కేసుల్లో 26 కేసులను ఛేదించారు. మొత్తం ఆస్తులను కోల్పోయిన కేసుల్లో రూ. 3.43 కోట్లకుగాను రూ. 37.19 లక్షల ప్రాపర్టీ రికవరీ చేశారు.

అక్రమ నిర్మాణాలకు నోటీసులు

'ప్రజావాణి' ఫిర్యాదులకు ప్రాధాన్యం: ఇలంబర్తి



అర్జీలు స్వీకరిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీలతా శోభన్ రెడ్డి, కమిషనర్ ఇలంబర్తి

సాక్షి, హైదరాబాద్: 'ప్రజావాణి'ఫిర్యాదులకు ప్రాధాన్యమిచ్చి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి అధికారులను ఆదేశించారు. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్‌రెడ్డితో కలిసి కమిషనర్ స్వీకరించారు. కమిషనర్ మాట్లాడుతూ టౌన్‌ప్లానింగ్ ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి అక్రమ నిర్మాణాలకు నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. టౌన్ ప్లానింగ్ ఫిర్యాదులపై ఇప్పటి వరకు తీసుకున్న చర్యలపై నివేదిక అందించాలని సూచించారు. ప్రత్యేక అడిషనల్ సీసీపీ పర్యవేక్షణలో సమస్యలు పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. టౌన్ ప్లానింగ్ అర్జీలపై ప్రతివారం సమీక్షిస్తానని, నిర్లక్ష్యం వహించిన అధికారులపై క్రమశిక్షణ చర్యలు తప్పవని స్పష్టం చేశారు. జీహెచ్‌ఎంసీకి మొత్తం 48 విన్నపాలు రాగా, అందులో టౌన్ ప్లానింగ్ విభాగానికి 29, ట్యాక్స్ విభాగం 9, ఫైనాన్స్, హెల్త్, భూసేకరణ 2 ఫిర్యాదుల చొప్పున, హౌసింగ్, వెటర్నరీ విభాగాలకు ఒకటి చొప్పున ఫిర్యాదులు అందాయి. ప్రజావాణి ఫోన్ ఇన్ ప్రోగ్రాం ద్వారా 3 విన్నపాలు వచ్చాయి. జీహెచ్‌ఎంసీ పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 82 అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు శివకుమార్ నాయుడు, సుభద్ర దేవి, నళిని పద్మావతి, పంకజ, గీతా రాధిక, సరోజ, సత్యనారాయణ, రఘు ప్రసాద్, యాదగిరి రావు, సీసీపీ శ్రీనివాస్, అడిషనల్ సీసీపీ గంగాధర్, ఎస్టేట్ అధికారి ఉమా ప్రకాష్, వాటర్ వర్క్స్ డీజీఎం.సాయి రమణ, హౌసింగ్ ఈఈ పీపీ రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సంస్కరణల రూపశిల్పి మన్మోహన్‌సింగ్

- ప్లానింగ్ కమిషన్ మాజీ సభ్యుడు సీహెచ్ హనుమంతరావు



మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సీహెచ్ హనుమంతరావు

సనత్‌నగర్: మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ ఆర్థిక సంస్కరణల రూపశిల్పి అని, దేశ ఆర్థిక స్థితిగతులను సమూలంగా మార్చారని ప్లానింగ్ కమిషన్ మాజీ సభ్యుడు, సెస్ వ్యవస్థాపక సభ్యుడు సీహెచ్ హనుమంతరావు కొనియాడారు. సెస్ డైరెక్టర్ రేవతి అధ్యక్షతన సోమవారం ఇక్కడ జరిగిన మన్మోహన్‌సింగ్ స్మారక సమావేశంలో ఆయన మాట్లాడారు. మన్మోహన్‌సింగ్ డిప్యూటీ చైర్మన్‌గా ఉన్న ప్లానింగ్ కమిషన్‌లో సభ్యుడిగా రెండుసార్లు ఆయనతో కలిసి పనిచేసే అవకాశం తనకు లభించిందన్నారు. అప్పటి ప్రధానమంత్రి పీవీ నరసింహారావు కేబినెట్‌లో ఆర్థికమంత్రిగా మన్మోహన్‌సింగ్ పెట్టుబడి, వాణిజ్య విధానాల సరళీకృతం ద్వారా దేశంలో ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టారని అన్నారు. వృద్ధిలో సమ్మిళితత్వాన్ని నిర్ధారించే క్రమంలో జాతీయ సలహామండలిని ఏర్పాటు చేసిన ఘనత కూడా మన్మోహన్‌సింగ్‌కే దక్కుతుందని పేర్కొన్నారు. ఉపాధి హామీ చట్టం, సమాచార హక్కు చట్టం, ఆహార భద్రతా చట్టం, అటవీ హక్కుల చట్టం తదితర చట్టాల సిఫార్సులను ప్రధానమంత్రిగా ఆయన వెంటనే ఆమోదించి అమలు చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో సెస్ ఫౌండర్ మెంబర్లు మహేందర్‌రెడ్డి, జీఆర్‌రెడ్డి, మణిపూర్ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్స్‌లర్ అమర్ యమ్నం , కాంగ్రెస్ పార్టీ ఇంటలెక్చువల్ సెల్ నేత శ్యాం మోహన్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల్లో విద్యను మెరుగుపర్చాలి

– ఎమ్మెల్సీ కోదండరాం



సదస్సులో పాల్గొన్న ఎమ్మెల్సీ కోదండరాం తదితరులు

కాచిగూడ: గిరిజన విద్యను మెరుగుపర్చాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం. కోదండరాం అన్నారు. గిరిజనుల జీవనశైలి, సంస్కృతి, విద్యాభివృద్ధిపై ప్రభుత్వానికి, అధికారులకు లోతైన అవగాహన ఉండాలని, అప్పుడే వారికి నాణ్యమైన విద్య అందించడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఐటీడీఎస్, ఆర్‌బీవీఆర్‌ఆర్ మహిళా కళాశాల బిజినెస్ మేనేజ్‌మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం నారాయణగూడలోని మాడపాటి హనుమంత రావు హైస్కూల్‌లో తెలంగాణలో గిరిజన విద్యపై సదస్సు నిర్వహించారు. గిరిజన పిల్లల విద్యలో నాణ్యతను మెరుగుపరచడానికి ప్రభుత్వం మరింత కృషి చేయాలన్నారు. గిరిజనుల సూక్ష్మ నైపుణ్యాలను తెలుసుకొని ప్రోత్సహించాలని సూచించారు. గిరిజన విద్య ఎదుర్కొంటున్న సవాళ్లపై అర్థవంతమైన చర్చలకు ఈ సదస్సు వేదికగా నిలిచిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ వీఎం మనోహర్ ప్రసాద్, ట్రైబల్ వెల్ఫేర్ విభాగం అడిషనల్ డైరెక్టర్ వి.సర్వేశ్వర్ రెడ్డి, ఐటీడీఎస్ చైర్మన్ ప్రొఫెసర్ కె.ముత్యంరెడ్డి, ఐటీడీఎస్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.శివారెడ్డి, ప్రొఫెసర్ డాక్టర్ రేణుసాగర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే వికాసం

– గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్

సాక్షి, సిటీబ్యూరో: విద్యతోనే సమాజం వికసిస్తుందని గోషామహల్ ఎమ్మెల్యే టి.రాజాసింగ్ అన్నారు. ఆదర్శ రజక వెల్ఫేర్ ఫోరం 34వ వార్షికోత్సవాల్లో భాగంగాపాతబస్తీ పురానాపూల్‌లోని ఎస్ఎస్‌కే సమాజ్ భవన్‌లో ప్రతిభావంతులైన విద్యార్థులకు అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రాజాసింగ్ మాట్లాడుతూ పదో తరగతి నుంచి పీజీ వరకు ప్రతిభ చూపిన సుమారు 500 మంది విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు, అవార్డులను ఆదర్శ రజక వెల్ఫేర్ ఫోరం ప్రదానం చేయడం అభినందనీయమన్నారు. ఆదర్శ రజక ఫోరం ముందు కూడా ఇదే విధమైన కార్యక్రమాలు చేపట్టి విద్యార్థులకు ప్రేరణ కల్పించాలని సూచించారు. ప్రేరణ, ప్రోత్సాహంతోనే విద్యార్థుల్లోని ప్రతిభ వెలుగు చూస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించిన రాసముల్ల అఖిల్‌ను ఘనంగా సత్కరించి బహుమతి ప్రదానం చేశారు. అఖిల్ మరిన్ని పర్వతాలు అధిరోహించి రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతలు తేవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు లాల్‌సింగ్, శశికళ కృష్ణ, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఫోరం అధ్యక్షుడు శామల గోవింద్‌వాలే నేతృత్వంలో ఈ వేడుకలు జరిగాయి. రజక సామాజిక వర్గం సంక్షేమం కోసం పాతబస్తీ కేంద్రంగా తమ సంస్థ పనిచేస్తున్నట్లు అధ్యక్షుడు తెలిపారు.



ప్రజ్ఞాశాలి 'కట్టమంచి'

- శాసనమండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి



మాట్లాడుతున్న మధుసూదనాచారి

చిక్కడపల్లి: సీఆర్‌గా ఖ్యాతి గాంచిన కట్టమంచి రామలింగారెడ్డి సాహిత్య, విద్యారంగాలలో ప్రజ్ఞాశాలి అని శాసనమండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి అన్నారు. సోమవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలోని కళా సుబ్బారావు కళావేదిక నిర్వహణలో జరుగుతున్న 'ఎందరో మహానుభావులు– మధుర స్మృతుల పరంపర'లో భాగంగా 'బహుముఖ ప్రజ్ఞాశాలి కట్టమచి రామలింగారెడ్డి యాదిలో'కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన మధుసూదనాచారి మాట్లాడుతూ కవిగా కట్టమంచిది విశిష్టమైన శైలి అని, 19 ఏళ్ల వయసులోనే 'ముసలమ్మ మరణం'అనే ఖండకావ్యం రచించి నాటి సాహితీవేత్తల మన్ననలు అందుకున్నారని కొనియాడారు. ఆయన తన రచనల ద్వారా అన్ని తరాలకు ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయానికి తొలి వైస్ చాన్స్‌లర్ గా నియమితులై ఆ వర్సిటీకి మంచి పేరు సంపాదించి పెట్టారన్నారు. గానసభ అధ్యక్షుడు కళాజనార్దన మూర్తి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో సాహితీవేత్త రఘుశ్రీ, మానస ఆర్ట్స్ థియేటర్స్ అధ్యక్షుడు బండారుపల్లి రామచంద్రమూర్తి, త్యాగరాయగానసభ ఉపాధ్యక్షులు కళాసుబ్బారావు మేడ తదితరులు పాల్గొన్నారు.

చేనేత సమస్యలపై 20న కలెక్టరేట్ల వద్ద ధర్నా

– ఎమ్మెల్సీ ఎల్.రమణ



చేనేత కార్మిక సంఘం సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రమణ

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: చేనేత కార్మికుల సమస్యలను ప్రభుత్వం చిత్తశుద్ధితో పరిష్కరించాలని ఎమ్మెల్సీ ఎల్.రమణ కోరారు. చేనేత కార్మికుల సమస్యలపై ఫిబ్రవరి 25న హైదరాబాద్‌లో చేనేత గర్జన, జనవరి 20న కలెక్టరేట్ల వద్ద ధర్నాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. చేనేత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఐక్య కార్యాచరణ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆర్థిక సమస్యలతో ఆత్మహత్య చేసుకున్నవారి కుటుంబాలకు ప్రభుత్వం సాయం చేయాలని కోరారు. బీఆర్‌ఎస్ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కొనసాగించాలని డిమాండ్ చేశారు. చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు వనం శాంతికుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, సలహాదారుడు కూరపాటి రమేష్, ప్రొఫెసర్ నర్సింహారెడ్డి, గంజి మురళీధర్, నరహరి, చంద్రశేఖర్, ఆప్కో మాజీ డైరెక్టర్ వీరన్న, చిక్కా దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

'ఈఎన్‌టీ' సమస్యలు పరిష్కరించాలని ధర్నా



ఈఎన్‌టీ ఆసుపత్రి ముందు ధర్నా చేస్తున్న పీవైఎల్, పీవోడబ్ల్యూ నాయకులు

సుల్తాన్‌బజార్: కోఠిలోని చెవి, ముక్కు, గొంతు(ఈఎన్‌టీ) ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రోగ్రెసివ్ యూత్ లీగ్(పీవైఎల్), ప్రగతిశీల మహిళా సంఘం(పీవోడబ్ల్యూ) ఆందోళన చేపట్టారు. సోమవారం ఆసుపత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్ ప్రదీప్, పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు స్వరూప మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎంతో ప్రతిష్టాత్మకమైన ఈఎన్‌టీ ఆసుపత్రి మౌలిక సౌకర్యాలలేమితో కొట్టుమిట్టాడుతోందన్నారు. సరిపడా వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. మందుల కోసం గంటల తరబడి లైన్‌లో వేచి చూడాల్సిన దుస్థితి ఏర్పడిందని, కొన్ని మందులను బయట కొనాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఆసుపత్రిలో వైద్యుల సంఖ్య పెంచాలని, ఫార్మసీ విభాగంలో ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో నేతలు లక్ష్మీభాయి, వరలక్ష్మీ, కృష్ణ, కిరణ్, భీమేష్, శ్రీనివాస్, సురేష్, వైశాలి తదితరులు పాల్గొన్నారు.

సీఎం దృష్టికి కాంట్రాక్ట్ అధ్యాపకుల సమస్యలు

- ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి

నాంపల్లి/విజయనగర్ కాలనీ: వివిధ విశ్వవిద్యాలయాల్లో కాంట్రాక్టు అధ్యాపకుల సమస్యలను వారంలోగా సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి అన్నారు. కాంట్రాక్ట్ అధ్యాపకులు తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కోరుతూ సోమవారం చేపట్టిన ఆందోళనను బాలకిష్టారెడ్డి ఇచ్చిన హామీతో విరమించారు. మాసబ్‌ట్యాంక్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయం ఎదుట అధ్యాపకులు బైఠాయించి నిరసనకు దిగారు. రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాలయాలకు చెందిన కాంట్రాక్ట్ సహాయ అధ్యాపకులు భారీగా తరలివచ్చారు. గతంలో సీఎం ఇచ్చిన హామీని వెంటనే నిలబెట్టుకోవాలంటూ ప్లకార్డులను ప్రదర్శించారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన ధర్నా రాత్రి 9 గంటల వరకు కొనసాగింది. కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరణ చేసిన తరువాతే ఆయా ఖాళీల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల చేయాలని తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్ట్ టీచర్స్ జేఏసీ ప్రతినిధి పి.కోటయ్య డిమాండ్ చేశారు. ఆందోళన నేపథ్యంలో నాంపల్లి పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న బాలకిష్టారెడ్డి రాత్రి 8 గంటలకు ఉపాధ్యక్షుడు–1 ప్రొఫెసర్ ఇ.పురుషోత్తం, ప్రొఫెసర్ ఎస్.కె. మహమూద్, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్‌తో కలిసి ధర్నా వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ అధ్యాపకుల సమస్యలేమిటో తనకు తెలుసని, వాటిని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు.

జనవరి 6న భైరవపురిలో సువాసినీ పూజలు



సువాసినీ పూజ కరప్రతాలను ఆవిష్కరిస్తున్న ప్రవచనకర్త అనంత లక్ష్మి తదితరులు

దిల్‌సుఖ్‌నగర్: కుర్తాళం పీఠాధిపతులు జగద్గురు శ్రీ సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి దివ్య సమక్షంలో, శ్రీ శక్తి పీఠాధీశ్వరి మాతాజీ శ్రీ రమ్యానందభారతీ స్వామిని వారి ఆధ్వర్యంలో జనవరి 6వ తేదీన యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ సమీపంలోని మగ్దూంపల్లి– భైరవపురిలో 2 వేల మంది మహిళలతో ద్విసహస్ర సువాసినీ పూజ నిర్వహిస్తున్నట్లు ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త అనంత లక్ష్మి పేర్కొన్నారు. సోమవారం ఆమె సువాసినీ పూజలకు సంబంధించిన కరపత్రాన్ని ఆర్‌కేపురం శ్రీ ప్రత్యంగిరా దేవాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీ మన్యానంద భారతిస్వామి మాతాజీ గత కొన్నేళ్లుగా ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో అనేకచోట్ల సువాసినీ పూజలు నిర్వహించారని చెప్పారు. లోక కల్యాణంతో పాటు మహిళలకు నిత్య సుమంగళి యోగం, ఐశ్వర్యాభివృద్ధిని కాంక్షిస్తూ ఈ సువాసినీ పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. దేవాలయ నిర్వాహకులు మునిపల్లె సువర్ణలత మాట్లాడుతూ జనవరి 6న ఉదయం 9.00 గంటలకు పూజ ప్రారంభమవుతుందని, రిజిస్టర్ చేసుకున్న వారికి పూజలో పాల్గొనే అవకాశం లభిస్తుందని చెప్పారు. వివరాలకు 7997990023, 8858853690 నెంబర్లలో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ భక్త సంఘం ప్రతినిధులు సువర్ణలత, అరుణ, హేమ, రాజ్యలక్ష్మి, పద్మ, శ్రీదేవి, దివ్య, సంజన, ప్రశాంతి, మల్లిక తదితరులు పాల్గొన్నారు.

బధిరులకు ఈ-ట్యాబ్‌ల పంపిణీ



సనత్‌నగర్: బధిరుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దేలా సైన్ ఈ–లెర్న్ యాప్ ట్యాబ్‌లు ఉపయోగపడతాయని వికలాంగులు, సీనియర్ సిటిజన్స్ శాఖ కమిషనర్ శైలజ అన్నారు. నెట్‌వర్క్ ఆఫ్ పర్సన్స్ విత్ డిజబిలిటీస్ ఆర్గనైజేషన్స్(ఎన్‌పీడీవో) ఆధ్వర్యంలో బేగంపేటలోని టూరిజం ప్లాజా హోటల్‌లో బధిర విద్యార్థులకు సైగల భాష ఈ–ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎన్‌పీడీవో అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శైలజ మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం తరఫున అన్ని రకాల సహాయ సహకారాలను అందించనున్నట్లు చెప్పారు. తమకిచ్చిన బడ్జెట్‌లో బధిరులకు న్యాయం జరిగేలా చూస్తానన్నారు. బధిర విద్యార్థులు తరగతిలో చెప్పిన పాఠాలను మరింత సులువుగా అర్థం చేసుకునేవిధంగా సైగలతో కూడిన ఈ–ట్యాబ్‌లు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. హైకోర్టు సీనియర్ న్యాయవాది రాపోలు భాస్కర్ మాట్లాడుతూ వికలాంగులను కొట్టినా, తిట్టినా కేసులు నమోదు చేసే చట్టాలు ఉన్నాయని చెప్పారు. వారిని విచారించడానికి ప్రత్యేక న్యాయస్థానాల ఏర్పాటు అవసరముందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిజేబుల్డ్ ఫౌండేషన్ ట్రస్ట్ ప్రతినిధి డాక్టర్ విజయ్ భాస్కర్, ఫిన్ ఎన్‌జీవో ప్రధాన కార్యదర్శి బాలకృష్ణారెడ్డి, సూర్యాపేట సెర్డ్ ఎన్‌జీవో ప్రతినిధి మదనాచారి, మల్లేపల్లి సాలిడీ ట్రస్ట్ దార్ల భాస్కర్ పాల్గొన్నారు.

విద్యతోనే సమాజాభివృద్ధి

– ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం కురుమ



విద్యార్థులను అభినందిస్తున్న యెగ్గె మల్లేశం కురుమ తదితరులు

అఫ్జల్‌గంజ్: రాష్ట్రంలోని కురుమ కులస్తులు విద్యారంగంలో అభివృద్ధి చెందాలని రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడు, ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం కురుమ అన్నారు. ఈ మేరకు సోమవారం అఫ్జల్‌గంజ్‌లోని ముస్లింపూల్ వద్ద ఉన్న కురుమ సంఘం భవనంలో రాష్ట్ర కురుమ సంఘం, కురుమ స్కిల్స్ ఎడ్యుకేషన్ కమిటీ చైర్మన్ వెంకటేశ్వర్ గీతగోటి నేతృత్వంలో విద్యార్థులకు అవార్డుల ప్రదాన కార్యక్రమం జరిగింది. 10వ తరగతి నుంచి పీజీ వరకు వివిధ విభాగాల్లో అత్యధిక మార్కులతో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెరిట్ అవార్డులు, నగదు పురస్కారాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ విద్యార్థులు విద్యకు మొదటి ప్రాధాన్యం ఇచ్చి కలలు సాకారం చేసే దిశగా ముందుకు సాగాలని సూచించారు. త్వరలో కోకాపేట్‌లో కూడా ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేసుకొని పేద కురుమ విద్యార్థులకు సీట్లు కేటాయించే విధంగా కృషి చేస్తామన్నారు. అనంతరం గీతాగోటి మాట్లాడుతూ త్వరలో జాబ్‌మేళా కూడా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి రెక్కల మురళీధర్, కోశాధికారి చిగుమల్ల రాఘవేందర్, గౌరవ సలహాదారులు కట్ట మల్లేశం, దేవర రాజేశ్వర్, కొలుపుల నరసింహ, నర్స విశాల్, దేవర కృపాకర్, మా ఊరి రాజేందర్, సి.కిషోర్, చిందం విక్రమ్, మందుల నవీన్, ఎ.సాయికాంత్, అమర్నాథ్, రాష్ట్ర యూత్ అధ్యక్షుడు తూంకుంట అరుణ్‌కుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఏఐ ఆధారిత సాంకేతికతలపై అంతర్జాతీయ సదస్సు



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని అజీజ్‌నగర్ క్యాంపస్‌లో కేఎల్‌హెచ్ అకడమిక్ ఆధ్వర్యంలో ఏఐ –ఆధారిత సాంకేతికతలు– ఇటీవలి పోకడలపై 2వ అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమం అంతర్జాతీయ విజ్ఞాన మార్పిడికి వేదికగా మారిందని, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, సంబంధిత రంగాల ప్రముఖులను ఒకే చోటకు చేర్చిందని వక్తలు పేర్కొన్నారు. ఫిన్‌లాండ్‌లోని ఆల్టో యూనివర్సిటీకి చెందిన డాక్టర్ మహమ్మద్ హసన్ వలీ, కేఎల్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ జి.పార్థ సారథి వర్మ మాట్లాడారు. ఇటువంటి అంతర్జాతీయ సదస్సుల ద్వారా కృత్రిమ మేధస్సు ఆవశ్యకతను, అధునాతన పోకడలను అన్వేషించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పుణెలోని డిఫెన్స్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన డాక్టర్ భరత్ రామకృష్ణ, డాక్టర్ నరేంద్రబాబు ఉన్నమ్, ఐఐటీ హైదరాబాద్‌కు చెందిన ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, మంగళవారం, 31, డిసెంబర్, 2024

నగరం న్యూ బీట్స్‌తో హీటెక్కిపోనుంది. మ్యూజిక్ కిక్‌తో ఊగిపోనుంది. దేశవ్యాప్తంగా పేరొందిన డీజేలు, సెలబ్రిటీ బ్యాండ్స్, గజల్ గాయకులు మరెందరో సెలబ్రిటీలు నగరానికి తరలిరానున్నారు. లోకల్ రాక్ బ్యాండ్స్, డీజేలు, టాలీవుడ్ ఔత్సాహిక తారలు.. ఈ కొత్త సంవత్సర వేడుకలకు కొత్త అందాలను తీసుకురానున్నారు. సంగీతం చుట్టే పరిభ్రమిస్తున్న వేడుకలు.. వేదికల సాక్షిగా నగరంలో వెల్‌కమ్ చెప్పనున్న కొన్ని బ్యాండ్స్, సెలబ్రిటీ డీజేలు, సింగర్స్ గురించిన విశేషాలపై 'సాక్షి' అందిస్తున్న సమాహారం ఇది.. - సాక్షి, సిటీబ్యూరో

- హీటెక్కించే ట్రాక్స్‌తో డీజే ప్లేయర్లు
- నగరానికి తరలివస్తున్న సెలిబ్రిటీలు
- బాలీవుడ్ డీజేలతో లోకల్ సింగర్స్ జోడీ
- పోటా పోటీ ఈవెంట్లతో మెప్పించనున్న ఆర్గనైజర్లు
- ఇప్పటికే బుకింగ్స్ పూర్తి చేసుకున్న అభిమానులు
- లోకల్ టు గ్లోబల్ అన్న రీతిలో వేడుకలు



నగరంలో.. నయా బీట్..

మ్యూజిక్ బాష్‌కు సర్వం సిద్ధం..

సంగీతంతో నగరంలో మ్యూజిక్ సెన్స్ నిరంతరం కదం తొక్కించే డీజేలు పార్టీలకు పెద్దన్న లాంటి న్యూ ఇయర్ సందడికి రెడీ అంటున్నారు. నగరంలో న్యూ ఇయర్ ఈవెంట్స్ నిర్వహించే విభిన్న వేదికలు ఇప్పటికే పోటాపోటీ డీజేలను ఎంచుకున్నాయి. యేటి యేడు పార్టీ పీపుల్‌ని మెప్పించడంలో తామే బెస్ట్ అనిపించుకోవాలనే తపనతో డిస్క్ జాకీలు సంగీతాస్త్రాలతో సిద్ధమైపోయారు. ఈ నేపథ్యంలో వీరిలో కొందరితో సాక్షి సంభాషించినప్పుడు..

'మిరియాల'తో దుబాయ్ షాడో..



టాలీవుడ్ గాయకుడు రామ్ మిరియాలతో దుబాయ్ డీజే షాడో జట్టు కట్టనున్నారు. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఉన్న ప్రిజమ్ క్లబ్ అండ్ కిచెన్‌లో న్యూ ఇయర్ ఈవెంట్‌ను ప్రిజమ్ సర్కస్ పేరుతో నిర్వహిస్తున్నారు. ఈ పార్టీలో టాలీవుడ్ లేటెస్ట్ సెన్సేషన్ రామ్ మిరియాల ప్రధాన ఆకర్షణ కాగా జన్మతహ భారతీయుడై దుబాయ్‌లో నివసిస్తున్న ప్రపంచ టాప్ డీజేలలో ఒకరైన డీజే షాడో దుబాయ్‌తో స్టేజ్ పంచుకోనున్నారు. రాత్రి 8గంటల నుంచి దాదాపు 5గంటల పాటు నిర్విరామంగా అలరించనున్న కార్యక్రమంలో రాజస్థాన్ రాయల్స్ ఐపీఎల్ టీమ్‌కి అఫీషియల్ డీజేగా పనిచేస్తున్న టాప్ 10 బాలీవుడ్ డీజేలలో ఒకడైన డీజే రావిష్ కూడా పాల్గొంటున్నారు.

పవర్ పఫ్ గాల్స్‌తో ఛీర్స్..

మాదాపూర్‌లోని శిల్పారామం ఎదురుగా ఉన్న హైటెక్ ఎరీనాలోని ఈవెంట్‌లో ఢిల్లీకి చెందిన పవర్ పఫ్ గాల్స్ బృందం ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. ఈ డీజే బెస్ట్ బ్యాండ్‌లో ఏడుగురు యువతులు విభిన్న రకాల మ్యూజిక్‌తో కదం తొక్కించనున్నారు. ఈ బృందంలో పెర్క్యూషనిస్ట్స్, సింగర్స్.. ఉన్నారు. వీరికి యాంకర్ నేహా ఆర్ ధూపియా, బాలీవుడ్ నటుడు, డీజే జీ టూ కూడా జతకలవనున్నారు.



డ్యాన్స్ విత్ కాప్రిషియో..

సిటీ బ్యాండ్‌గా సంగీత ప్రియులకు సుపరిచితమైన కాప్రిషియో.. న్యూ ఇయర్‌లో మరింత ఉర్రూతలూగించనుంది. నాగార్జున సాగర్ రోడ్‌లోని బీఎమ్ఆర్ సార్తా కన్వెన్షన్‌లో ఈ బ్యాండ్ సందడి చేయనుంది.

తారాతో'రణం'..

ప్రముఖ బ్యాండ్ తారా.. నూతన వేడుకల్లో సంగీత రణాన్ని తలపించనుంది.. జూబ్లీహిల్స్‌లోని గ్రీస్ మంకీలో ఈ బ్యాండ్ ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది.

ఆటాడుకుందాంరా.. ఆషురెడ్డి..

సోషల్ మీడియా ద్వారా పాపులర్ అయిన అషురెడ్డి.. గచ్చిబౌలిలోని సంధ్యా జంక్షన్‌లో సందడి చేయనున్నారు. రాత్రి 8గంటల నుంచి ప్రారంభం కానున్న న్యూ ఇయర్ ఈవెంట్‌లో ఆమెకు జోడీగా మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ ప్రాంతానికి చెందిన టాప్ లేడీ డీజే ఎమ్లీ విల్సన్ మ్యూజిక్‌ని సమర్పించనున్నారు.

యాంటీ రిజల్యూషన్ పార్టీ..

కొత్త సంవత్సరం అంటే రిజల్యూషన్స్ తీసుకోవాలనుకోవడం సాధారణమే. రేపెలాగూ తీర్మానాలు అమలు చేయబోతున్నాం కదా అని ముందు రోజు తీన్‌మార్‌లూ సాధారణమే. ఈ నేపథ్యంలో తీర్మానాలన్నీ ఇంటి గుమ్మం దగ్గరే వదిలేసి తమ తీన్‌మార్‌కు రమ్మంటూ ఆహ్వానిస్తోందో మాదాపూర్‌లోని 'మైండ్ స్పేస్ సోషల్'. ఈ న్యూ ఇయర్ ఈవెంట్ పేరే 'యాంటీ రిజల్యూషన్' కావడం విశేషం. రహేజా ఐటీ పార్క్ ఆవరణలోని ఈ వేదికలో న్యూ ఇయర్ సందడి రాత్రి 7గంటల నుంచి షురూ అవుతుంది.

మోహన.. రాగం..



నీ బుల్లెట్టు బండెక్కి వచ్చేస్తపా.. అంటూ తెలుగు వారిని ఉర్రూతలూగించిన మోహన భోగరాజు నూతన వేడుకల్లో భాగస్వామ్యవుతున్నారు. మాదాపూర్‌లోని నాలెడ్జ్ సిటీలో రాస్తా ఆవరణలో ఆమె ప్రదర్శన ఉంటుంది. ఆమెకు జోడీగా డీజే క్వీన్ కిరూ చౌదరి సంగీతాన్ని సమర్పించనున్నారు.

మధుర్.. మధురం..



బాలీవుడ్ గాయకుడిగా పలు పాటల ద్వారా పాపులర్ అయిన మధుర్ శర్మ సుఫీ గాయకుడిగానూ సుపరిచితులు. మాదాపూర్‌లోని యోలో ఎరీనా వేడుకలకు తన దైన శైలిలో గానాభిషేకం చేయనున్నారు.

గ్రీస్ మంకీ.. మ్యూజిక్ కీ..

వెల్‌కమ్ టు గ్రీస్ మంకీ అంటున్నాడు సిటీ డీజే పీయూష్. నగరంలో అత్యంత అనుభవజ్ఞుడైన డీజేగా పేరున్న పీయూష్ బజాజ్.. జూబ్లీహిల్స్‌లోని గ్రీస్ మంకీలో మ్యూజిక్ సమర్పిస్తున్నానని చెబుతున్నారు. ది గ్రాండ్ వేర్ హౌజ్ గాలా పేరుతో తనదైన శైలిలో వెస్టన్, బాలీవుడ్ సంగీతాన్ని అందించనున్నట్టు తెలిపాడు.

సుఫీతో ట్రాక్ కలిపిన సిటీ..

నగరంలో ఈ ఏడాది జరిగే బిగ్గెస్ట్ పార్టీలో మ్యూజిక్ ప్లే చేస్తున్నందుకు ఆనందంగా ఉందని చెప్పాడు మార్క్. సిటీలో టాప్ డీజేలలో ఒకరిగా ఉన్న మార్క్.. గత దశాబ్దంన్నరపాటు మ్యూజిక్ సీన్‌లో హల్‌చల్ చేస్తున్నాడు. ప్రతి న్యూ ఇయర్‌కూ మరో మ్యూజిక్ స్టైల్ కలుపుకుని వెరైటీ బీట్స్‌ను అందించే అలవాటున్న మార్క్ ఈ సారి మాదాపూర్‌లోని యోలో ఎరీనా లో సుఫీ సంగీతంతో జతకడుతున్నాడు. ప్రముఖ సుఫీ గాయకుడు మధుర్ శర్మ కూడా ఈ ఈవెంట్‌లో పాల్గొంటున్నారని మార్క్ చెప్పాడు.

సంగీతంతో కనెక్ట్..

కనెక్ట్ అవుదాం రా అంటూ ఆహ్వానిస్తోంది సిటీ లేడీ డీజే లీనా. జూబ్లీహిల్స్‌లోని రోడ్ నెం 92లోని కనెక్ట్ పబ్‌లో నిర్వహిస్తున్న న్యూ ఇయర్ నైట్‌లో లీనా మ్యూజిక్‌తో కిక్ అందించనుంది. ఎన్నిసార్లు న్యూ ఇయర్ ఈవెంట్స్‌లో ప్లే చేసినా ఎప్పుడూ ఒక కొత్త ఎగ్జయిట్‌మెంట్ ఉంటుంది అంటూ ఉత్సాహంగా చెబుతున్న లీనా.. బాలీవుడ్, వెస్టన్ బీట్స్‌తో అలరించనున్నట్టు వెల్లడించింది.

రోస్ట్‌లో నో రెస్ట్..

జన్వాడలోని శంకర్‌పల్లి రోడ్‌లోని రోస్ట్ అండ్ క్రంచ్ కేఫ్‌లో ఓపెన్ ఎయిర్ ఈవెంట్లో సంగీతంతో సిటీ డీజే ప్రత్యూష మెప్పించనున్నారు. అమిగోస్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ న్యూ ఇయర్ పార్టీలో మరో డీజే అంజాద్ ఖాన్‌తో కలిసి ట్రాక్స్‌ను షేర్ చేసుకోనుంది. న్యూ ఇయర్ అంటే ఓ ఎమోషన్.. ఆ ఎమోషన్ సెలబ్రేట్ చేసుకోవాలనుకునే మ్యూజిక్‌ని అందించడం ప్రొఫెషనల్ జాయ్‌ని అందిస్తుంది అంటోంది ప్రత్యూష.

ప్రతీ పార్టీ ప్రత్యేకమే..

సాగర్ రోడ్‌లోని హస్తినాపురంలోని జీఎస్ఆర్ కన్వెన్షన్‌లో జరగనున్న ఈవెంట్ కోసం సిద్ధమవుతోంది సిటీ డీజే అపూర్వ.. వైబ్రోటో బ్యాండ్‌తో కలిసి తన మ్యూజిక్‌ని అందిస్తున్నానని చెప్తున్న డీజే అపూర్వ కొత్త ట్రాక్ మిక్సింగ్స్‌తో పార్టీ నైట్‌ను రంజింపచేయనుంది.

మరికొన్ని..

- బేగంపేట్ హాకీ గ్రౌండ్స్ వేదికగా నిర్వహిస్తున్న ఆసియాస్ బిగ్గెస్ట్ న్యూ ఇయర్ భాష్ వేడుకల్లో సినీతార దక్ష నాగర్కర్ తన స్టెప్పులతో సందడి చేయనున్నారు.
- బోల్డర్ హిల్స్‌లోని ప్రిజమ్ ఔట్ డోర్స్‌లో న్యూ ఇయర్ కార్నివాల్‌లో ప్రముఖ సింగర్స్ కార్తీక్, సునీత ద్వయం తమ సంగీత స్వరాలతో హోరెత్తించనున్నారు. ఈ వేడుకల్లో పాల్గొని తెలుగు స్టార్ సింగర్ల ప్రదర్శనను ఆస్వాదించేందుకు నగరవాసులు ఆసక్తిని కనబరుస్తున్నారు.
- నగరం నడిబొడ్డున సోమాజీగూడ రాజ్‌భవన్ రోడ్‌లోని కత్రియా హోటల్స్ అండ్ టవర్స్ వేదికగా ఇయర్ ఎండ్ వేడుకల్లో నటి నిషా సింగ్ రాజ్‌పుత్ తళుక్కున మెరవనుంది.



మధురమైన ప్రేమ ప్రయాణం..

సినీ దిగ్గజం రాజేష్ ఖన్నాపై పుస్తకాన్ని రచించిన అనితా అద్వానీ..

సాక్షి, సిటీబ్యూరో : ప్రముఖ సినీ దిగ్గజం రాజేష్ ఖన్నా చివరి రోజుల్లో అతనితో కలిసున్న ప్రతి క్షణం, ప్రేమ ప్రయాణం ఇప్పటికీ తన కళ్లముందు కదలాడుతోందని ఆయన సన్నిహితురాలు అనితా అద్వానీ గుర్తుచేసుకున్నారు. రాజేష్ ఖన్నా జయంతి సందర్భంగా 'ది ఎనీడియరింగ్లీ వికెడ్ వేస్ ఆఫ్ రాజేష్ ఖన్నా' పేరుతో అనితా అద్వానీ రాసిన పుస్తకాన్ని నగరంలోని సాలార్ జంగ్ మ్యూజియం వేదికగా ఆవిష్కరించారు. నగరంలో మొదటగా నిర్వహించిన ఈ ఆవిష్కరణలో అసఫ్ జాహీ వంశానికి చెందిన 9వ నిజాంగా పరిగణింపబడుతున్న హైనెస్ రౌనక్ యార్ ఖాన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనితా అద్వానీ మాట్లాడుతూ.. ఇది తన మొదటి పుస్తకమని, రాజేష్ చివరి క్షణాల్లో అతనితో చేసిన ప్రయాణం మధుర జ్ఞాపకాలుగా నిలిచిపోతాయని అన్నారు. ఈ పుస్తకాన్ని నాలుగు సంవత్సరాల క్రితం రాయడం ప్రారంభించానని, హైదరాబాద్ నుంచి ఈ ఆవిష్కరణలను ప్రారంభించామని తెలిపారు. ఈ క్రమంలో ముంబై, ఢిల్లీ వరకూ ఆవిష్కరణలను కొనసాగించనున్నామని పేర్కొన్నారు. సినిమా మాధ్యమం వేదికగా తను ప్రేరణ పొందిన ఏకైక నటుడు రాజేష్ ఖన్నా ముఖ్య అతిథి రౌనక్ యార్ ఖాన్ తెలిపారు. ప్రత్యేకంగా నిర్వహించిన ఉర్దూ మ్యూజికల్ ముషైరా విశేషంగా ఆకట్టుకోవడంతో పాటు సాంస్కృతిక గొప్పతనాన్ని ప్రదర్శించింది.



వృత్తిరీత్యా పోలీసు ఉన్నతాధికారి.. ప్రవృత్తి టెన్నిస్ క్రీడాకారుడు. లాఠీ పట్టిన చేతులు రాకెట్ పట్టుకుంటే ప్రత్యర్థులకు చెమటలు పట్టాల్సిందే. శిక్షణ ఇచ్చే గురువు లేకున్నా ఏకలవ్యుడిలా ఎదిగారు. ఒక వైపు విధులు సమర్థవంతంగా నిర్వహిస్తూనే.. సమయం సర్దుబాటు చేసుకుని టెన్నిస్‌లో ఆల్ ఇండియా స్థాయిలో రాణిస్తున్నారు. ఆయనే మల్టీ జోన్-1 ఐజీ సంపత్ చంద్రశేఖర్‌రెడ్డి. ఇటీవల బెంగళూరులో జరిగిన ఆల్ ఇండియా పోలీస్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్ డబుల్స్‌లో తెలంగాణ పోలీసు జట్టు విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డితో సాక్షి ముచ్చటించింది. మరికొన్ని విశేషాలు ఆయన మాటల్లోనే..
- సాక్షి, సిటీబ్యూరో

మరో ఏకలవ్యుడు..



- మొదట్లో ఫిట్‌నెస్ కోసం ఆట మొదలుపెట్టి..
- తెలంగాణ పోలీస్ శాఖకు టెన్నిస్ ఆఫీసర్స్ విభాగంలో తొలి గోల్డ్ మెడల్
- ఆల్ ఇండియా పోలీస్ టెన్నిస్ చాంపియన్‌షిప్ డబుల్స్ విన్నర్‌గా తెలంగాణ
- ఎయిర్ పోర్టులో చెక్ ఇన్ అయ్యి.. మళ్లీ వెనక్కి వెళ్లి..
- 'సాక్షి'తో మల్టీజోన్-1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి

జనగాం డీఎస్పీగా 1997లో ఉద్యోగంలో చేరిన తరువాత ఫిట్‌నెస్ కోసం ప్రతి రోజూ సాయంత్రం షటిల్ ఆడే వాడిని. మానసికంగా ప్రశాంతత, శారీరకంగా ఫిట్‌నెస్ కోసం ఎప్పుడూ ఆలోచించేవాడిని. 2001లో ఒంగోలు అదనపు ఎస్పీగా ఉన్నప్పుడు మేం షటిల్ ఆడుతుంటే.. ఆ పక్కనే కొందరు టెన్నిస్ ఆడేవారు. కొత్తగా ట్రై చేద్దామని టెన్నిస్‌కు వెళ్లాను. ఆసక్తిగా అనిపించింది. అక్కడి నుంచి టెన్నిస్ ఆడటం మొదలు పెట్టాను. కొంత మంది సిబ్బంది, స్థానికులతో కలసి ప్రతి రోజూ టెన్నిస్ ఆడేవాడిని. తిరుపతి అదనపు ఎస్పీగా, కర్నూలు, హైదరాబాద్, నిజామాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో ఎస్పీగా చేసినపుడు టెన్నిస్ కోర్టు ఏర్పాటు చేసి, గంటన్నర నుంచి రెండు గంటల పాటు సమయం కేటాయించేవాడిని.

నగరంలో జరిగిన పోటీల్లో..

గతంలోనూ హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ పోటీల్లో సింగిల్స్, డబుల్స్‌లోనూ విన్నర్‌గా నిలిచాను. 2024 భువనగిరిలో జరిగి ఇంటర్నేషనల్ టెన్నిస్ ఫెడరేషన్ డబుల్స్ విన్నర్‌గా నిలిచాం. 2024 బెంగళూరులో ఏఐపీటీ చాంపియన్‌షిప్ పోటీల్లో సింగిల్స్‌లో క్వార్టర్ ఫైనల్స్‌కు చేరాను. డబుల్స్‌లో రియాజ్‌తో కలసి విన్నర్‌గా నిలిచాం. గతంలో విశాఖలో జరిగిన పోటీల్లో నగర సీపీ సీవీ ఆనంద్ సీఐఎస్ఎఫ్ నుంచి టెన్నిస్ సింగిల్స్‌లో విజేతగా నిలిచారు.



అదే మలుపు తిప్పింది..

సంగారెడ్డి ఎస్పీగా 2016లో బదిలీపై వచ్చిన తరువాత ఇంటి ఆవరణలోనే టెన్నిస్ కోర్టు ఉండేది. ప్రొఫెషనల్ టెన్నిస్ క్రీడాకారుడిగా మారింది కూడా ఇక్కడి నుంచే. అంతకు ఆట అంటే ఇష్టం. మొదట్లో టోర్నమెంట్లలో పాల్గొన్నా, అనుకున్న ఫలితాలు సాధించలేపోయాను. 2009 నుంచి ఆల్ ఇండియా పోలీస్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్ పోటల్లో పాల్గొంటున్నాను. 2009 భువనేశ్వర్ సింగిల్స్ సెమీ ఫైనల్, 2013 చండీఘర్ సింగిల్స్, డబుల్స్‌లో సెమీ ఫైనల్స్, 2022 ఢిల్లీ, 2023 అహ్మదాబాద్‌లో జరిగిన టెన్నిస్ సింగిల్స్ పోటీల్లో సెమీ ఫైనల్స్‌కు చేరాను.

తీవ్ర ఒత్తిడి మధ్య విజయం..

రాష్ట్రంలో దిలావల్‌పూర్ సంఘటన సమయంలో నేను బెంగళూరులో ఉన్నాను. టెన్నిస్ డబుల్స్ గేమ్ ఆడాల్సి ఉంది. ఇక్కడి పరిస్థితులు బాగాలేవని ఫోన్ వచ్చిన వెంటనే ఎయిర్ పోర్టుకు వచ్చేశాను. చెక్ ఇన్ అయిన తరువాత పరిస్థితి కాస్త చక్కదిద్దారని తెలిసింది. ఉన్నతాధికారుల అనుమతి తీసుకుని తిరిగి వెనక్కి వెళ్లాను. తీవ్ర ఒత్తిడి మధ్య ఆడి విజయం సాధించాం. తెలంగాణ పోలీసు శాఖ ఆఫీసర్స్ విభాగం టెన్నిస్ డబుల్స్‌లో తొలి బంగారు పతకం సొంతం చేసుకున్నాం. బెంగళూరు సీపీ చేతుల మీదుగా పతకాలు తీసుకున్నాం.

ప్రభుత్వ ప్రోత్సాహకం..

టెన్నిస్ డబుల్స్‌లో విజయం సాధించినందుకు మల్టీజోన్-1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, నారాయణపేట్ అదనపు ఎస్పీ రియాజ్‌లకు తెలంగాణ పోలీసు శాఖ రూ.3 లక్షల రివార్డు, మూడు ఇంక్రిమెంట్లను అందిస్తుంది. ఈ చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతి రాష్ట్రం నుంచి ఆరుగురు చొప్పున పోలీసులు, సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్, ఎన్ఎస్‌జీ, ఐటీబీపీ, తదితర విభాగాల నుంచి పోలీసు సిబ్బంది పాల్గొంటారు.



ఆడింది అండర్.. ఆటలో వండర్..

- చెస్ టోర్నమెంట్‌లో పట్లోళ్ల ఇంద్రారెడ్డి ప్రతిభ
- ఇంటర్నేషనల్ రేటింగ్ చెస్‌లో అండర్-11 చాంపియన్
- ఫిడే రేటింగ్స్‌లో తన పాయింట్స్ మెరుగుదల
- గ్రాండ్‌మాస్టర్స్ అవ్వడమే లక్ష్యంగా ప్రాక్టీస్

శ్రీనగర్‌కాలనీ: మాజీ మంత్రి పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి మనవడు, పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి, విశాలి స్రవంతిల కుమారుడు పట్లోళ్ల ఇంద్రారెడ్డి ఇంటర్నేషనల్ రేటింగ్ చెస్ టోర్నమెంట్‌లో అండర్-11 పురుషుల విభాగంలో చాంపియన్‌గా నిలిచాడు. జూబ్లీహిల్స్ రోడ్ నెం-11లోని ఏకాగ్ర చెస్ అకాడమీలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్‌కు సంబంధించిన వివరాలను అకాడమీ సీఈఓ సందీప్‌నాయుడు వెల్లడించారు. కాన్పూర్‌లో గతవారం క్రిష్ణ గోపాల్ కపూర్ మెమోరియల్ ఇంటర్నేషనల్ రేటింగ్ చెస్ టోర్నమెంట్‌ను ఐదు రోజుల పాటు నిర్వహించారు. టోర్నమెంట్‌లో అకాడమీకి చెందిన ఇంద్రారెడ్డి, భరత్‌కుమార్‌రెడ్డిలు పాల్గొన్నారని, అండర్-11 పురుషుల విభాగంలో ఇంద్రారెడ్డి చాంపియన్‌గా నిలిచాడని, ఓపెన్ కేటగిరీలో భరత్‌కుమార్‌రెడ్డి అన్ని ఆటల్లో విజేతగా నిలిచి చాంపియన్‌గా లక్షరూపాల ప్రైజ్‌ను గెలిచాడని తెలిపారు. పట్లోళ్ల ఇంద్రారెడ్డి ఫిడే రేటింగ్స్‌లో తన పాయింట్స్‌ను మెరుగుపరుచుకున్నాడని సందీప్‌నాయుడు తెలిపారు. గ్రాండ్‌మాస్టర్స్ అవ్వడమే తమ లక్ష్యమని విజేతలు పేర్కొన్నారు.

రూ.24 కోట్ల ఆస్తిపై రూ.91 కోట్ల రుణం


చట్టవిరుద్ధంగా సుజనా చౌదరికి రుణం.. ప్రజా ఆస్తుల దుర్వినియోగం

హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన హైదరాబాద్ వాసి

సాక్షి, హైదరాబాద్: ''సుజనా ఇండస్ట్రీస్, వోల్టాస్, వర్మ రియల్టర్స్ కంపెనీలు, రెవెన్యూ అధికారులు కుమ్మక్కయ్యారు. నిబంధనలకు విరుద్ధంగా లీజు ఆస్తిని తాకట్టుపెట్టారు. అదికూడా రూ.24 కోట్ల విలువైన ఆస్తిని తనఖా చూపి బ్యాంకు నుంచి రూ.91 కోట్లు రుణాన్ని పొందారు. ప్రజా ఆస్తులను దుర్వినియోగం చేశారు. చట్టవిరుద్ధంగా జరిగిన ఈ లావాదేవీపై విచారణ జరిపించాలి..'' అని కోరుతూ హైదరాబాద్‌కు చెందిన వ్యాపారవేత్త హబీబ్ అల్లాద్దీన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ఫిబ్రవరి 1న పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు విచారణ ప్రారంభించలేదని కోర్టుకు వివరించారు. బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 193 ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదు చేసిన 90 రోజుల్లో చార్జిషీట్ దాఖలు చేయాలని.. కానీ 11 నెలలు అవుతున్నా దర్యాప్తు ప్రారంభించలేదని, దీని వెనుక సుజానా చౌదరి ఒత్తిడి ఉందని ఆరోపించారు. ప్రతివాదుల బ్యాంకు ఖాతాలను అటాచ్ చేయాల్సిందిగా, సమన్లు జారీ చేసి విచారణ జరపాల్సిందిగా సీసీఎస్ పోలీసులను ఆదేశించాలని కోర్టును కోరారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి సోమవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున ఎస్.ప్రభాకర్ వాదనలు వినిపించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. పోలీస్ అధికారుల నుంచి వివరాలు తెలుసుకుని చెప్పాలని హోంశాఖ జీపీ (ప్రభుత్వ న్యాయవాది)ని ఆదేశిస్తూ, విచారణను జనవరి 20వ తేదీకి వాయిదా వేశారు.

చట్టవిరుద్ధంగా తనఖా పెట్టారు..

''హైదరాబాద్ అమీర్‌పేట్ మండలం బహ్లూఖాన్ గూడ సర్వే నంబర్ 129/3లోని 26,436.36 చదరపు గజాల మాకు (హబీబ్ అల్లాద్దీన్‌కు) చెందిన భూమిని వర్మ రియల్టర్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన పీవీ రమణారెడ్డి 2013లో ఎక్స్‌పోర్టు-ఇంపోర్టు బ్యాంక్ ఆఫ్ ఇండియాలో చట్టవిరుద్ధంగా తాకట్టు పెట్టారు. నిజానికి ఆ భూమిని మేం 1963లో వోల్టాస్ లిమిటెడ్‌కు లీజుకు ఇచ్చాం. లీజుకు ఇచ్చిన వారిలో నేను భాగస్వామిని. ఈ భూమిని పారిశ్రామిక అవసరాలకు మాత్రమే వినియోగించాలనేది ఒప్పందం. లీజు ఒప్పందాన్ని ఉల్లంఘించిన వోల్టాస్ 26,436 చదరపు గజాల భూమిని వర్మ రియల్టర్స్‌కు కేటాయించింది. సుజనాచౌదరి చైర్మన్‌గా ఉన్న సుజనా యూనివర్సల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ తీసుకున్న రుణానికి వర్మ రియల్టర్స్ ఈ భూమిని తనఖాగా చూపి గ్యారంటర్‌గా వ్యవహరించింది. లీజు భూమిని తనఖా పెట్టకూడదని తెలిసినా బ్యాంకులో తనఖా పెట్టి రుణం పొందారు. సుజనా చౌదరి గతంలో టీడీపీ ఎంపీగా, ప్రస్తుతం



బీజేపీ తరఫున విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యేగా ఉన్నారు. సుజనా ఇండస్ట్రీస్ రుణాల చెల్లింపులో విఫలం కావడంతో.. బకాయిలు రాబట్టడం కోసం రూ.400 కోట్ల విలువైన నా ఆస్తి మొత్తాన్ని అటాచ్ చేసి.. వేలానికి పెట్టేలా ఉన్నారు'' అని కోర్టుకు పిటిషనర్ వివరించారు.

కోర్టు ఉత్తర్వులను పట్టించుకోకుండా..

''ఒప్పందానికి విరుద్ధంగా వ్యవహరించడంతో.. లీజ్ డీడ్ రద్దు కోరుతూ 2013లో మేం రంగారెడ్డి జిల్లా కోర్టును ఆశ్రయించాం. మా భూమిని ఇతరుల పేరుపైకి మార్చకుండా, తనఖా పెట్టకుండా ఆదేశాలివ్వాలని కోరగా.. మాకు అనుకూలంగా తీర్పు వచ్చింది. జిల్లా కోర్టు తీర్పును సవాల్ చేస్తూ వర్మ రియల్టర్ సంస్థ హైకోర్టును, సుప్రీంకోర్టును ఆశ్రయించినా ఆ పిటిషన్లను కొట్టివేశాయి. నిజానికి ఆ రుణం మంజూరు చేసే నాటికే సుజనా చౌదరి రుణ ఎగవేతదారుగా ఉన్నారు. అయినా బ్యాంకు నుంచి సుజనా ఇండస్ట్రీస్‌కు రుణం మంజూరైంది. వర్మ రియల్టర్స్‌కు చెందిన 96.64 శాతం షేర్లను సుజనా హోల్డింగ్స్ నిర్వహించడం ఆశ్చర్యకరం. ఈ రెండు సంస్థల్లోనూ గొట్టుముక్కల శ్రీనివాసరాజు డైరెక్టర్‌గా ఉన్నారు. ఇది గమనిస్తే సుజనా హోల్డింగ్స్‌కు వర్మ రియల్టర్స్ బినామీ లాంటి (ప్రాక్సీ) కంపెనీ అని తెలుస్తోంది'' అని పిటిషనర్ కోర్టుకు తెలిపారు.

సుజనా ఒత్తిడితోనే ప్రారంభంకాని విచారణ..

''మా ఆస్తిని తనఖా పెట్టి సుజనా ఇండస్ట్రీస్ రుణం పొందేలా చేయడంలో వర్మ రియల్టర్స్‌కు అనుకూలంగా వోల్టాస్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ ప్రశాంత్ ఎల్. కర్కరే వ్యవహరించారు. వర్మ రియల్టర్స్‌కు గ్యారంటీ ఇవ్వాల్సిన అవసరమే లేదు. ఈ మొత్తం లావాదేవీ మోసపూరితంగా, నేరపూరితంగా జరిగింది. అసలు వర్మ రియల్టర్స్ ఆస్తిని లీజుకు మాత్రమే తీసుకుంది. దాని విలువ రూ.24 కోట్లే అయినా.. రూ.91 కోట్లను ఎక్స్‌పోర్ట్-ఇంపోర్ట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎలా ఇచ్చిందో అర్థంకావడం లేదు. ఆ సమయంలో రాజ్యసభ సభ్యుడైన సుజనా చౌదరి బ్యాంకు అధికారులను ఏమార్చి ఉండవచ్చు. రుణ లావాదేవీ అనుమానాస్పదంగా, అస్పష్టంగా, అపారదర్శకంగా ఉంది. దీనిపై ఫిర్యాదు చేసినా సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ ఏదో లెక్క కోసం మాత్రమే ఎఫ్ఐఆర్ చేసినట్లున్నారు. ఇప్పటివరకు ఎలాంటి విచారణ చేపట్టలేదు. సుజనా చౌదరి ఒత్తిడి కారణంగానే దర్యాప్తు ముందుకు సాగడం లేదు. సుజనా ఆస్తులను, వర్మ రియల్టర్స్ ఆస్తులను అటాచ్ చేయకుండా బ్యాంకు నా ఆస్తిని అటాచ్ చేయడం చట్టప్రకారం చెల్లదు. సుజనా చౌదరిపై, సుజనా ఇండస్ట్రీస్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కేసులు నమోదు చేసినా.. ఇప్పటి వరకు వారిని టచ్ కూడా చేయలేదు. అక్రమార్కులతో కుమ్మక్కైన రిజిస్ట్రేషన్ అధికారులు కూడా.. నేను ఆ భూమి ఈసీ సర్టిఫికెట్‌కోసం దరఖాస్తు చేస్తే మార్టిగేజ్ వివరాలు లేకుండా ఇచ్చారు. ప్రతివాదుల బ్యాంకు ఖాతాలను అటాచ్ చేయాల్సిందిగా సీసీఎస్ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించండి. ప్రతివాదులకు సమన్లు జారీ చేసి, విచారణ జరపాలి. చట్టవిరుద్ధంగా ప్రజానిధుల నుంచి రూ.91 కోట్లు పొంది దుర్వినియోగం చేశారు. మా పిటిషన్‌ను అనుమతించండి'' అని కోర్టుకు విజ్ఞప్తి చేశారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. పోలీసుల నుంచి వివరాలు తెలుసుకుని చెప్పాలని హోంశాఖ న్యాయవాదిని ఆదేశించారు.

పిటిషన్‌లో పేర్కొన్న ప్రతివాదులు వీరే..

పిటిషన్‌లో హోంశాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీ, హైదరాబాద్ సీపీ, బషీర్‌బాగ్ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్‌తోపాటు ప్రతివాదులుగా సుజనా యూనివర్సల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, సుజనాచౌదరి, 'సుజన' డైరెక్టర్లు గొట్టుముక్కల శ్రీనివాస్‌రాజు, నటరాజన్ సుబ్బరత్నం, కిరణ్ కుమార్ వీరమాచినేని, ఓల్టాస్ లిమిటెడ్ ఎండీ, డైరెక్టర్లు బహ్రాం నవ్రోజ్ వాకిల్, జుబిన్ సోలి దుబాష్, వినాయక్ కాశీనాథ్ దేశ్‌పాండే, ప్రదీప్‌కుమార్, దేబేంద్రనాథ్ సారంగి, వర్మ రియల్టర్స్ అండ్ ట్రేడింగ్ ప్రైవేట్ లిమిటెడ్, 'వర్మ' డైరెక్టర్లు రమణారెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి దేవిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి కంచర్ల, శ్రీరామ్ కంభంపాటి, ఎక్స్‌పోర్టు-ఇంపోర్టు బ్యాంక్ ఆఫ్ ఇండియాలను ప్రతివాదులుగా పేర్కొన్నారు.

తప్పే.. 'పుష్ప'..

థియేటర్‌కు వెళ్లేముందు జాగ్రత్తలేవీ?: ఏపీ డిప్యూటీ సీఎం పవన్

సాక్షి, అమరావతి: గోటితో పోయే దానిని గొడ్డలి దాకా తెచ్చారని పుష్ప 2 సినిమా విడుదల సందర్భంగా హైదరాబాద్ సంధ్యా థియేటర్ వద్ద జరిగిన ఘటనలపై ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యానించారు. 'అన్నీ చూస్తే ఎక్కడో మానవతా దృక్పథం లోపించిందనిపిస్తోంది. సినిమా టీమ్ ఫాల్ట్ ఉంది' అని పేర్కొన్నారు. సోమవారం జనసేన పార్టీ కార్యాలయంలో కొందరు మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్ సందర్భంగా ఆయన దీనిపై స్పందించారు. సినిమా థియేటర్‌కు వెళ్లే ముందు జాగ్రత్తలు తీసుకోవాల్సిందన్నారు.

దటీజ్ రేవంత్‌రెడ్డి: అల్లు అర్జున్ అరెస్టు జరిగిన తీరును ప్రస్తావిస్తూ గతంలో ఎప్పుడూ, ఎవరూ అలా అరెస్టు చేయలేదన్న చర్చ సాగుతోందని మీడియా పేర్కొనగా 'దటీజ్ రేవంత్‌రెడ్డి.. ఆస్థానంలో నేను ఉన్నా అలాగే చేసేవాడిని'అని పవన్ చెప్పారు. 'రేవంత్ వెరీ టఫ్ లీడర్. ఆయన బాగా పనిచేస్తున్నారు' అని ప్రశంసించారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తమకు చాలా కాలంగా తెలిసినవారేనని, రాంచరణ్‌కు ఆయన కొంత సూపర్ సీనియర్ అని చెప్పుకొచ్చారు. తన సోదరుడు నాగబాబు తొలుత ఎమ్మెల్సీగా ఎన్నికైన అనంతరమే మంత్రి పదవిని కోరడంపై చర్చిస్తామన్నారు. నెలలో కనీసం 14 రోజులు పాటు తన పేషీ అధికారులందరితో కలిసి రాత్రి వేళల్లో కూడ ఉండేలా జిల్లాల్లో పర్యటించాలని ఆలోచన చేస్తున్నట్లు చెప్పారు.

నేషనల్ హైవేస్ ఒరిజినల్ జాబితాలో 'ఉత్తర రింగు'

ప్రాధాన్య ప్రాజెక్టుగా గుర్తించిన కేంద్రం

సాక్షి, హైదరాబాద్: రీజినల్ రింగురోడ్డు ఉత్తర భాగాన్ని కేంద్ర ప్రభుత్వం నేషనల్ హైవేస్ ఒరిజినల్ జాబితాలో చేర్చింది. కేంద్రం తన బడ్జెట్ కేటాయింపులతో చేపట్టే ప్రాజెక్టుల్లో త్వరితగతిన చేపట్టే ప్రాజెక్టులను ఈ జాబితాలో చేరుస్తుంది. దీంతో ఈ ప్రాజెక్టును ప్రాధాన్యత ఉన్న ప్రాజెక్టుగా గుర్తించినట్టయింది. వాస్తవానికి దేశవ్యాప్తంగా ప్రధాన రోడ్డు ప్రాజెక్టులను కేంద్రం భారత్‌మాల పరియోజనలో చేర్చేది. ట్రిపుల్ ఆర్‌ను కూడా తొలుత ఆ జాబితాలో చేర్చింది. కానీ గత బీఆర్ఎస్ ప్రభుత్వంతో కేంద్రానికి కొన్ని ఇబ్బందులు ఏర్పడటం.. భూసేకరణలో రాష్ట్ర ప్రభుత్వ వాటాను చెల్లించాలని కేంద్రం కోరగా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడంతో ఈలోగా భారత్‌మాల పరియోజన గడువు ముగిసింది. ఫలితంగా కేంద్రం దాన్ని ఆ జాబితా నుంచి తొలగించింది. మరోవైపు ఇటీవల కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సఖ్యత ఏర్పడటం, పలుమార్లు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరడంతో మళ్లీ రీజినల్ రింగురోడ్డులో కదలిక వచ్చింది. బడ్జెట్ కేటాయింపుల నుంచి ప్రాధాన్యతగా భావిస్తూ నిధులు కేటాయించే నేషనల్ హైవేస్ ఒరిజినల్ జాబితాలోకి తాజాగా రీజినల్ రింగురోడ్డు ఉత్తర భాగాన్ని చేర్చింది.

10 మంది ఐపీఎస్‌ల బదిలీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తున్న పదిమంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారిలో 2021-22 బ్యాచ్‌కు చెందిన అధికారులు ఉన్నారు. ప్రస్తుతం గ్రేహౌండ్స్‌లో ఉండి వివిధ జిల్లాలకు అడిషనల్ ఎస్పీలుగా బదిలీ అయ్యారు. వీరిలో కాజల్-ఉట్నూర్‌కు, కె.రాహుల్‌రెడ్డి-భువనగిరి, ఎస్.చిత్తరంజన్-ఆసిఫాబాద్. బి.చైతన్యరెడ్డి-కామారెడ్డి, పందెర చేతన్ నితిన్-జనగాం, విక్రాంత్ కుమార్ సింగ్- భద్రాచలం, ఎస్.శుభం ప్రకాశ్- కరీంనగర్, రాజేశ్ మీనా-నిర్మల్, పి.మౌనిక- దేవరకొండకు బదిలీ అయ్యారు. భద్రాచలం ఏఎస్పీగా ఉన్న అంకిత్‌కుమార్‌ను డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బిల్లుల మంజూరుకు 14% కమీషన్!

- కాంగ్రెస్ సర్కార్‌పై బండి సంజయ్ ఫైర్
- కమీషన్లపై ఆ పార్టీలో అంతర్యుద్ధం నడుస్తోందని వ్యాఖ్య
- మాజీ సర్పంచులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శ



కరీంనగర్ టౌన్: రాష్ట్రంలో ఏ బిల్లు మంజూరు కావాలన్నా కాంగ్రెస్ ప్రభుత్వం 8 నుంచి 14 శాతం కమీషన్లు దండుకుంటోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే కాంగ్రెస్ కేబినెట్‌లో కొందరు నిజాయితీపరులైన మంత్రులున్నారని, కమీషన్ల విషయం వారికి ఏమాత్రం నచ్చడం లేదని అన్నారు. కమీషన్లపై కాంగ్రెస్‌లో అంతర్యుద్ధం నడుస్తోందని, ఎప్పుడైనా బాగోతం బద్దలు కావొచ్చని చెప్పారు. సోమవారం రాష్ట్ర సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు అక్కినపల్లి కరుణాకర్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో సర్పంచులు కరీంనగర్‌లోని ఎంపీ కార్యాలయానికి తరలివచ్చారు. కేంద్రమంత్రికి తమ సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడారు.

ఢిల్లీ నేతలకు కప్పం కట్టడానికే పరిమితం: రాష్ట్రంలో పెండింగ్ బిల్లులు మంజూరు కాక 12 వేల మంది మాజీ సర్పంచులు రోడ్డున పడ్డా రేవంత్‌రెడ్డి సర్కార్‌కు చీమ కుట్టినట్లయినా లేదని కేంద్రమంత్రి మండిపడ్డారు. కమీషన్లతో ఢిల్లీ కాంగ్రెస్ నేతలకు కప్పం కడుతూ తమ సీటును కాపాడుకోవడానికే పాలకులు పరిమితం అయ్యారని విమర్శించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడలేని చేతగాని ప్రభుత్వం నడుస్తోందని ధ్వజమెత్తారు. ఏడాదిలో క్రైమ్ రేటు 22 శాతం పెరిగితే, మహిళలపై అఘాయిత్యాలు 28 శాతం పెరిగాయని అన్నారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంపై పవన్‌కల్యాణ్ ఏమన్నారో తనకు తెలియదన్నారు. సంధ్య థియేటర్ ఘటనలో అల్లు అర్జున్ అరెస్టయి జైలుకు వెళ్లి బెయిల్‌పై బయటకు వచ్చాడని, ఆ అంశం ముగిసిందని వ్యాఖ్యానించారు. అసెంబ్లీలో ఈ అంశంపై గంటల తరబడి చర్చ జరపాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. మాజీ సర్పంచులకు బీజేపీ అండగా నిలుస్తుందని సంజయ్ చెప్పారు.

కొత్త సంవత్సరం రోజు దర్శనాలకు ప్రత్యేక ఏర్పాట్లు

- యాదగిరిగుట్ట ఆలయ ఈవో భాస్కర్‌రావు



యాదగిరిగుట్ట: నూతన సంవత్సరం ఆరంభం కాబోతున్న సందర్భంగా యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకునే భక్తులకు ఇబ్బంది కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు. సోమవారం ఆయన యాదగిరి కొండపైన తన కార్యాలయంలో అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తితో కలసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొత్త సంవత్సరం తొలి రోజున పెద్ద ఎత్తున భక్తులు వచ్చినప్పటికీ స్వామి దర్శనం సాఫీగా జరిగేలా చూస్తామన్నారు. ప్రసాదం కౌంటర్లు, వీఐపీ, బ్రేక్ దర్శనాల వద్ద ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని వివరించారు. అలాగే జనవరి 10వ తేదీన ముక్కోటి ఏకాదశికి సంబంధించిన ఏర్పాట్లను సైతం ప్రారంభించామన్నారు. ఆ రోజు ఉదయం 5.15 గంటలకు శ్రీస్వామి వారు ఉత్తర ద్వారం నుంచి భక్తులకు దర్శనం ఇస్తారని చెప్పారు. వైకుంఠ ఏకాదశి రోజు ఉదయం, సాయంత్రం బ్రేక్ దర్శనాలను రద్దుచేశామని తెలిపారు. రూ.150 దర్శనాలు, ధర్మదర్శనాలు మాత్రమే ఉంటాయన్నారు. నూతన అన్నదాన భవనాన్ని జనవరి 15వ తేదీ వరకు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. కాగా, శ్రీస్వామి వారి దివ్య విమాన గోపురానికి బంగారు తాపడం పనులు త్వరలోనే పూర్తి అవుతాయన్నారు. 2024 సంవత్సరంలో కోటీ 17 లక్షల మంది భక్తులు శ్రీస్వామిని దర్శించుకున్నారని ఈవో చెప్పారు.

బీజేపీ నుంచి దేశానికి విముక్తి కల్పించాలి

- రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాలి
- లౌకిక, వామపక్ష శక్తులన్నీ ఐక్య పోరాటం చేయాలి
- సీపీఐ శత వసంతాల సభలో డి.రాజా





నల్లగొండలో సీపీఐ భారీ ర్యాలీ, సభా వేదికపై డి.రాజాతో కరచాలనం చేస్తున్న సురవరం, చిత్రంలో కూనంనేని

నల్లగొండ టౌన్: భారతదేశ రాజ్యాంగ, ప్రజాస్వామ్య పరిరక్షణకు మతతత్వ.. ఫాసిస్టు బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ల నుంచి భారతదేశానికి విముక్తి కల్పించాల్సిన అవసరం ఉందని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా పిలుపునిచ్చారు. ఇందుకోసం దేశంలోని ప్రజాస్వామ్య, లౌకిక, వామపక్ష శక్తులన్నీ ఐక్యంగా పోరాటం చేయాలని అన్నారు. సోమవారం భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) శత వసంతాల ఉత్సవాల సందర్భంగా నల్లగొండలోని ఎన్జీ కాలేజీ మైదానంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

సుదూరంగానే సమానత్వం

వందేళ్ల క్రితం స్థాపించబడిన సీపీఐ, దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని నినదించిన మొట్టమొదటి పార్టీ అని రాజా గుర్తుచేశారు. అదే వందేళ్ల క్రితం ఏర్పాటైన ఆర్ఎస్ఎస్ మాత్రం స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొనలేదని తెలిపారు. 75 సంవత్సరాల రాజ్యాంగ వారోత్సవాలు జరుపుకుంటున్నప్పటికీ.. దేశంలో సమానత్వం లోపించిందని, పేదలకు, సామాన్యులకు ఇప్పటికీ సమానత్వం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్లయిన అదానీ, అంబానీలు బిలియనీర్లుగా మారారని, వారికి అండగా నిలిచిన ప్రధాని మోదీ పేదల సంక్షేమాన్ని విస్మరించారని విమర్శించారు. క్రైస్తవులు, ముస్లింలు, దళితులు, ఆదివాసీల హత్యలు, వారిపై అత్యాచారాలు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి పల్లె, పట్టణాల్లో ఎర్ర జెండా ఎగరాలని, ప్రజల పక్షాన మరింత ఉత్సాహంతో ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు సరికాదని, ఆయన వెంటనే దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

వామపక్షాల ఐక్యతతోనే శాంతి: సురవరం

వామపక్ష పార్టీల ఐక్యతతోనే దేశంలో శాంతి నెలకొంటుందని సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి అన్నారు. దేశ ప్రజలను భయానికి గురిచేస్తూ.. శ్రామికవర్గ వ్యతిరేక అభివృద్ధి నిరోధక చట్టాలు చేస్తున్న ఆర్ఎస్ఎస్, కార్పొరేట్ శక్తుల కీలుబొమ్మ ప్రభుత్వం నుంచి రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడానికి కలిసివచ్చే అన్ని శక్తులతో ఐక్య పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ..అనేక పోరాటాలు చేసి ప్రజల గుండెల్లో నిలిచిన ఎర్ర జెండాను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. మాజీ ఎంపీ అజీజ్ పాషా, సీపీఐ రాష్ట్ర నాయకుడు పల్లా వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సుధాకర్‌రెడ్డి.. వైద్యుల అనుమతితో వీల్ చైర్‌పై ఆక్సిజన్ సిలిండర్‌తో సభకు హాజరై ప్రసంగించారు. ఆయన్ను డి.రాజాతోపాటు రాష్ట్ర, జిల్లా నాయకులు జ్ఞాపిక, శాలువాతో సన్మానించారు.

3 'ఎమ్మెల్సీ' ఎన్నికలకు ఓటర్లు సిద్ధం

ఓటర్ల జాబితాను ప్రకటించిన సీఈఓ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఇద్దరు ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు, మరో పట్టభద్రుల ఎమ్మెల్సీ పదవీకాలం వచ్చే మార్చి 29తో ముగియనుండగా ఆలోగా మళ్లీ ఎన్నికలు నిర్వహించడానికి కేంద్ర ఎన్నికల సంఘం కసరత్తు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) సుదర్శన్‌రెడ్డి సోమవారం ఓటర్ల జాబితాలను ప్రకటించారు. మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో 3,41,313 మంది ఓటర్లు, మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ టీచర్స్ ఎమ్మెల్సీ స్థానంలో 25,921 మంది ఓటర్లు, వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానంలో 24,905 మంది ఓటర్లు ఉన్నారు. ఈ మూడు ఎమ్మెల్సీ స్థానాలకు ఫిబ్రవరి లేదా మార్చిలో ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఓటర్ల వివరాలను ఈ కింది పట్టికలో చూడవచ్చు.

ఎమ్మెల్సీ స్థానం	పోలింగ్ కేంద్రాలు	పురుష ఓటర్లు	మహిళా ఓటర్లు	ట్రాన్స్ జెండర్లు	మొత్తం
'మెదక్'పట్టభద్రుల స్థానం	499	2,18,060	1,23,250	3	3,41,313
'మెదక్'ఉపాధ్యాయుల స్థానం	274	16,364	9,557	-	25,921
'వరంగల్'ఉపాధ్యాయుల స్థానం	200	14,940	9,965	-	24,905

అవినీతి లేకున్నా ఏసీబీ కేసు.. ఈడీది అత్యుత్సాహం

ఈసీఐఆర్ నమోదైనట్టు ఈడీ నుంచి నోటీసు వచ్చింది నిజమే: కేటీఆర్

- ఫార్ములా-ఈ ప్రతినిధులతో భేటీని రేవంత్ ఏడాదిగా దాచిపెట్టారు
- డిస్ట్రాక్షన్, డిస్ట్రక్షన్, డైవర్షన్.. ఇదే సీఎం రేవంత్ త్రిముఖ వ్యూహం
- స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై చిత్తశుద్ధి లేదు
- ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే అల్లు అర్జున్ అంశం..
- సినిమా వాళ్లతో సెటిల్మెంట్ చేసుకుని సైలెంట్ అయ్యారు
- ప్రభుత్వం చేసే బౌలింగ్‌కు అనుగుణంగా తమ బ్యాటింగ్ ఉంటుందని వ్యాఖ్య
- 2025లో బీఆర్ఎస్‌ను సంస్థాగతంగా చక్కదిద్దుకోవడంపై దృష్టిపెడతామని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ఫార్ములా-ఈ రేసు అంశంలో రాష్ట్ర ప్రభుత్వం పసలేని, పనిలేని కేసులు పెడుతోందని.. మనీ లేనప్పుడు లాండరింగ్ ఎలా సాధ్యమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు పేర్కొన్నారు. అవినీతి జరగని చోట అవినీతి నిరోధక శాఖ కేసులు పెట్టడం విడ్డూరమన్నారు. ఈ అంశంలో ఈసీఐఆర్ (ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్టు) నమోదైనట్లు ఈడీ నుంచి నోటీసు అందిందని చెప్పారు. ప్రభుత్వ యంత్రాంగాన్ని చేతిలో పెట్టుకుని ఎన్ని అక్రమ కేసులు పెట్టినా భయపడే ప్రసక్తే లేదని, న్యాయపరంగా ఎదుర్కొంటామని పేర్కొన్నారు. సీఎం రేవంత్ ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే అల్లు అర్జున్ వ్యవహారాన్ని లేవనెత్తారని.. సినిమా వాళ్ల నుంచి సెటిల్మెంట్ చేసుకుని సైలెంట్ అయ్యారని ఆరోపించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో మీడియా ప్రతినిధులతో కేటీఆర్ ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే...

''ఫార్ములా-ఈ ప్రతినిధులను సీఎం కలిసిన ఫొటోను బయటపెట్టడంతో అధికారులను సస్పెండ్ చేస్తానంటూ రేవంత్ బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు. ఫార్ములా-ఈ ప్రతినిధులతో భేటీ అంశాన్ని రేవంత్ ఏడాది పాటు దాచిపెట్టారు. అసలు ఆ రేసులో ఏం అవినీతి జరిగిందని సీఎంను అడిగితే ఏమీ చెప్పలేని స్థితిలో ఉన్నారు. డబ్బులు ముట్టాయని రశీదు ఇచ్చినవారిపై ఎందుకు కేసు పెట్టడం లేదు? వారి నుంచి డబ్బులేమైనా అందాయా? అదానీతో కాంట్రాక్టును ఆషామాషీగా రద్దు చేసుకోలేమని చెప్పిన రేవంత్.. 'ఫార్ములా-ఈ'ఒప్పందం రద్దు కోసం మంత్రివర్గం ఆమోదం తీసుకున్నారా? ఈ అంశంలో ఈడీ అత్యుత్సాహం చూపుతోంది. ఏసీబీ కేసు అంశంలో మంగళవారం కోర్టులో జరిగే పరిణామాల ఆధారంగా ఈడీ నోటీసుల అంశంపై స్పందిస్తా..



అజ్మీర్ దర్గా ఉర్సు సందర్భంగా ప్రతి ఏడాది సమర్పించే చాదర్‌ను సోమవారం బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు తెలంగాణ భవన్‌లో అందజేశారు

సర్కారు బౌలింగ్‌కు అనుగుణంగా మా బ్యాటింగ్..

నాపై పెట్టిన కేసులు తప్పుడువని తేలితే తర్వాతి పర్యవసానాలకు ప్రభుత్వం సిద్ధంగా ఉండాలి. ఔటర్ రింగు రోడ్డు లీజుపై ఆరోపణలు చేస్తున్న ప్రభుత్వం వెంటనే ఆ ఒప్పందాన్ని రద్దు చేయాలి. నాపై రకరకాల కేసులు పెట్టి జైలుకు పంపాలని రేవంత్ ప్రయత్నాలు చేస్తున్నారు. అసెంబ్లీ వేదికగా అబద్ధాలు చెబుతూ నీచబుద్ధిని బయటపెట్టుకుంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసే బౌలింగ్‌కు అనుగుణంగా మా బ్యాటింగ్ వ్యూహం ఉంటుంది.

పార్టీని చక్కదిద్దుకోవడంపై దృష్టి..

2025లో బీఆర్ఎస్ సొంత ఇంటిని చక్కదిద్దుకోవడంపై ఎక్కువ దృష్టి పెడతాం. వచ్చే అక్టోబర్‌లో పార్టీ అధ్యక్షుడి ఎన్నిక, సభ్యత్వ నమోదు, సంస్థాగత శిక్షణ, వార్డు స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీ కార్యవర్గాల ఏర్పాటు వంటి అంశాలపై దృష్టి పెడతాం. ఏప్రిల్‌లో పార్టీ ప్లీనరీతోపాటు భారీ బహిరంగ సభ నిర్వహణపై సరైన సమయంలో వివరాలు వెల్లడిస్తాం. కేసీఆర్‌ను మిస్సవుతున్నామనే భావన ఏడాది కాలంలోనే ప్రజల్లో కనిపిస్తోంది. ఆయన అనువైన, అవసరమైన సమయంలో అసెంబ్లీకి వస్తారు. శాసన మండలి ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎన్నికల్లో పోటీపై పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం.

ఏడాదిలోనే రూ.1.39 లక్షల కోట్ల అప్పు..

కాంగ్రెస్ సర్కారు రైతు భరోసా ఇవ్వకుండా ఏడాదిలో 70 లక్షల మంది రైతులకు రూ.26 వేల కోట్లు ఎగవేసింది. సంక్రాంతి నాటికి రైతు భరోసా ఇస్తామని బుకాయిస్తున్నా.. ఎవరికి ఇస్తారో చెప్పకుండా మోసగిస్తోంది. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏడాదికి రూ.40 వేల కోట్లు అప్పు చేస్తే.. రేవంత్‌సర్కారు ఏడాదిలోనే రూ.1.39 లక్షల కోట్లు అప్పు చేసింది. పైగా ఒక్క హామీ కూడా నెరవేర్చలేదు. మేం 'నీళ్లు, నిధులు, నియామకాలు'నినాదంతో పాలన సాగిస్తే రేవంత్ మాత్రం విధ్వంసం (డిస్ట్రక్షన్), పక్కదారి పట్టించడం (డిస్ట్రాక్షన్), తప్పుదారి పట్టించడం (డైవర్షన్) అంటూ 3డీ పాలన చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ 2024ను 'ధోకా నామ సంవత్సరం'గా చెప్పుకుంటే బాగుంటుంది. బీసీలకు హామీ ఇచ్చిన 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయకుండానే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్తుండటం దారుణం.

కాంగ్రెస్‌కు బీజేపీ రక్షణ

మేం కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతి అరాచకాలను ఢిల్లీ సాక్షిగా ఎండగట్టాం. సివిల్ సప్లైస్, అమృత్ టెండర్ల కుంభకోణం, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపై ఈడీ దాడుల అంశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి బీజేపీ ఒక రక్షణ కవచంలా నిలుస్తోంది. బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు కూడా రేవంత్‌కు రక్షణ గోడలా నిలబడ్డారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం 'వన్ నేషన్ వన్ ఎలక్షన్'ఎప్పుడు పెట్టినా ఎదుర్కొనేందుకు బీఆర్ఎస్ సిద్ధం. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎవరికి ఓటేయాలో ప్రజలకు స్పష్టత ఉంది..''అని కేటీఆర్ పేర్కొన్నారు.

ప్రజల దృష్టి మళ్లించేందుకే అల్లు అర్జున్ అంశం

''సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు అల్లు అర్జున్ అంశాన్ని రేవంత్ తెరమీదకు తెచ్చారు. సినిమా వాళ్ల నుంచి సెటిల్‌మెంట్ చేసుకుని సైలెంట్‌గా ఉన్నారు. రేవంత్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే చనిపోయిన గురుకుల విద్యార్థులు, ఆత్మహత్యలు చేసుకున్న ఆటోడ్రైవర్లు, రైతులు, నేత కార్మికుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలి.''

కలసి పాడుదాం బతుకు పాట...
కలసి సాగుదాం వెలుగు బాట... అన్నట్టు ప్రతి దంపతులు ఒకరికి ఒకరై ముందుకు సాగితే ఏ కాలమైనా మంచికాలంగానే ఉంటుంది. భార్య భర్త జీవననౌకకు ఉమ్మడి చుక్కానిగా మారాలి. కలతలు చిన్నవయ్యి ఆనందాలు పెద్దవవ్వాలి. కుటుంబం బాగుంటే సమాజం, దేశం బాగుంటాయి. మనకు తెలిసిన ఈ సెలబ్రిటీ జంటలు ఆ మాటే చెబుతున్నారు. నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతున్నారు.

సంవత్సరమంతా జంట స్వరంగా...

మనవాళ్లెవ్వరో తెలిసింది



● మలయజ – ప్రభాకర్

■ **ప్రభాకర్:** మాకు పెళ్లై 25 ఏళ్లయింది. ఎవరి ఫ్యామిలీ లైఫ్ అయినా బాగుండాలంటే భార్య సహకారం, తను అర్థం చేసుకునే విధానం మీదనే ఆధారపడి ఉంటుందని నేను నమ్ముతున్నాను. ఆ విషయంలో మా ఆవిడకి సహనం, ఓపిక చాలా ఎక్కువ. మమ్మల్ని చాలా బాగా కేర్ చేస్తుంది. జనరల్‌గా మగవాళ్లకి చాలా ప్రపంచాలుంటాయి. ప్రొఫెషన్, మదర్స్ ఫ్యామిలీ, బిజినెస్, కెరీర్... ఇలా. కానీ భార్యకు మాత్రం ఎప్పుడూ ఒకే ఒక ఆలోచన మా ఆయన తిన్నారా? నా పిల్లలు టైమ్‌కి తిన్నారా? అందర్నీ ఆరోగ్యంగా చూసుకుంటున్నానా? అని! ఆ విషయంలో మేము రియల్లీ బ్లెస్డ్. 2025కి నావి రెండు ప్రాజెక్ట్స్ స్టార్ట్ అయ్యాయి. ఆ రెండు సీరియల్స్‌తో నేను బిజీగా ఉన్నాను. ఒకటి 'ఇల్లు ఇల్లాలు పిల్లలు' అనే సూపర్ సీరియల్ ఇప్పటికే లీడ్‌లో ఉంది. అలాగే 'చామంతి' అనే మరో సీరియల్‌లో చేస్తున్నాను. మా మలయజ కూడా 2024లో వెబ్ సిరీస్‌తో పాటు రెండు సినిమాల్లో నటించింది. మా అబ్బాయి చంద్రహాస్ 'రామ్‌నగర్ బన్నీ' కోసం చాలా ఎఫర్ట్స్ పెట్టి బాగా నటించాడు. అది మేం కళ్లారా చూశాం కాబట్టే మా స్థాయికి మించి ఆ సినిమా కోసం పెట్టుబడి పెట్టాం. మా అబ్బాయి సంతోషం కోసం ఆలస్యం చేయకుండా త్వరగా రిలీజ్ చేయాల్సి వచ్చింది. ఆ ప్రాసెస్‌లో డబ్బుల గురించి ఎక్కడా ఆలోచించలేదు. 'రామ్‌నగర్ బన్నీ'తో చంద్రహాస్ తనని తాను నిరూపించుకున్నాడు. మా అమ్మాయి దివిజ ప్రస్తుతం డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతోంది. లండన్ వెళ్లి బిజినెస్ మేనేజ్‌మెంట్ కోర్స్ చేయాలని, ఒక వ్యాపారవేత్తగా ఉండాలన్నది తన కల. తను ఇప్పటికే బాల నటిగా నంది అవార్డు అందుకుంది. ప్రస్తుతం రెండు సినిమాలు చేస్తోంది. ఈ రెండూ పూర్తయ్యాక తను ఎలా సెటిల్ అవ్వాలనుంటే అలా మేం సంతోషంగా సపోర్ట్ చేస్తాం.

■ **మలయజ:** 2024లో నేను నిర్మాతగా షూటింగ్ లొకేషన్‌కి రావటం, మా అబ్బాయి చంద్రహాస్ మూవీ (రామ్‌నగర్ బన్నీ) కోసం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ అన్నీ చూసుకోవడం ఒక కొత్త అనుభవం అని చెప్పగలను. కానీ, ఈ ఏడాది చాలా నేర్చుకున్నాను మా అబ్బాయి మూవీ 'రామ్‌నగర్ బన్నీ' పోస్ట్ ప్రొడక్షన్ అవుతున్న సమయంలో డబ్బులు అయిపోయి, మేం ఎదుర్కొన్న సవాళ్లలో ఎవరు మనవాళ్లో, ఎవరు కాదో అనేది తెలుసుకున్నాం. మనకేదైనా అవసరం వస్తే మనకంటూ తోడుగా వీళ్లందరూ ఉన్నారని అని కొంతమంది గురించి ఒక తప్పుడు అంచనాలతో ఉంటాం. కానీ, అది నిజం కాదు. ఈ సంవత్సరం మేం నేర్చుకున్న గుణపాఠం ఇది. అయితే అదే సమయంలో మేం ఎక్స్‌పెక్ట్ చేయని విధంగా కొత్తవాళ్లు కొంతమంది సమయానికి సహాయం చేశారు. మా అబ్బాయి నటించిన 'బరాబర్ ప్రేమిస్తా' అనే సినిమా 2025లో రిలీజ్ అవుతుంది. అలాగే ఇంకో సినిమా షూటింగ్ చేస్తున్నాడు. అలాగే మా అమ్మాయి దివిజ కూడా రెండు సినిమాలు సైన్ చేసింది. చాలా మంచి ప్రాజెక్ట్స్ అవి. వాటి షూటింగ్స్ కూడా జరుగుతున్నాయి. అందులో ఒకటి బ్రహ్మానందంగారి సినిమాలో ఆయన కూతురుగా, హీరో చెల్లెలిగా మంచి పాత్ర వచ్చింది. అలాగే ఇంకో సినిమాలో హీరోయిన్‌గా చేస్తోంది. అలా మా అమ్మాయి కెరీర్ పరంగా కూడా బీజం పడింది 2024లోనే.

'మనుషులను' సంపాదించుకున్నాం

■ **రాకేష్:** 2024 విషయానికి వస్తే ఈ సంవత్సరం మా ఇద్దరికీ చాలా బ్యూటిఫుల్ ఇయర్. మేం సొంతంగా సినిమా ('కేసీఆర్'లో రాకేశ్ నటించి, నిర్మించారు) ఆరంభించాం. ఎన్నో సంవత్సరాలుగా నా డ్రీమ్ అది. 2023లోనే మేం 'కేసీఆర్' సినిమా అనుకొని షూటింగ్ స్టార్ట్ చేశాం. మేం తీసుకున్న మూవీ టైటిల్ కన్‌ఫర్మేషన్, కొన్ని కారణాల వల్ల అది మధ్యలోనే ఆగిపోవడం జరిగింది. ఇంత కష్టపడి, ప్రాణం పెట్టి చేసిన సినిమా ఎందుకు ఇలా ఆగిపోయిందో అని చాలా నిరుత్సాహంలో ఉన్న సంవత్సరం అది. కానీ 2024, ఆగస్ట్ 1న నా బంగారు తల్లి పుట్టింది. నిజంగానే మా అన్ని టెన్షన్స్‌లకీ, కష్టాలకీ ఫుల్‌స్టాప్ పడ్డట్టు, ప్రత్యక్షంగా లక్ష్మీ దేవి మా జీవితాల్లో అడుగు పెట్టినట్లు అయింది. సినిమా రిలీజైంది. 'దైవం మానుష రూపేణ' అని నేను నమ్ముతాను. నా చుట్టూ ఉన్న మనుషులు నా కోసమే అనే భావనతో మనుషుల్ని సంపాదించుకుంటూ, వాళ్లని కాపాడుకునేందుకై కష్టపడుతున్నాను. దీపా ఆర్ట్స్ శ్రీనివాస్‌గారు ఈ సంవత్సరం ఆహాలో మా మూవీని రిలీజ్ చేసి ఈ సంవత్సరానికి మమ్మల్ని ఇంకో మెట్టు పైకి ఎక్కించి, ఈ ఇయర్ ఎండ్ గిఫ్ట్‌గా ఇచ్చారు.

● అంతా బాగుండి మనం నడుస్తున్నప్పుడు మన వెనక చాలామంది వస్తారు. ఒకసారి కిందపడితేనే తెలుస్తుంది మనకి చెయ్యి అందించి పైకి లేపేది ఎవరు, మనల్ని చూసి ఎగతాళిగా నవ్వేది ఎవరు అనేది క్లియర్‌గా తెలుసుకున్నాం. అన్నీ సక్రమంగా బ్యాలెన్స్ చేసుకుంటూ మూవీ రిలీజ్ అయ్యి, సక్సెస్ అయ్యి మంచి గుర్తింపుతో చాలా హ్యాపీగా ఉన్నాం. ఒక సమయంలో హెక్టిక్ అయిపోయి తట్టుకోలేక ఏడ్చిన సందర్భాలు కూడా ఉన్నాయి. అలాంటి సమయంలో మా సుజాత నన్ను బిడ్డలాగా తోడు నీడగా ఉండి చాలా స్ట్రెంత్‌ను ఇచ్చింది. 2025లో ఇంకో న్యూ ప్రాజెక్ట్‌తో రాబోతున్నాం. మా సుజాతది కూడా 2025లో 'సేవ్ ది టైగర్–3' వెబ్ సిరీస్ రాబోతోంది. వర్క్‌లో, ప్రొఫెషన్‌లో ఇంకా ఇంకా బిజీ అవ్వాలని కోరుకుంటున్నాం.

■ **సుజాత:** నాకు 2023 డిసెంబర్‌లో ప్రెగ్నెన్సీ కన్‌ఫామ్ అయింది. 2024 జనవరి నుంచి ప్రొఫెషన్ పరంగా ఎన్నో టెన్షన్స్‌తో ఉన్నా రాకేష్‌గారు నన్ను చాలా కేర్ తీసుకుంటూ, హాస్పిటల్‌కి తీసుకెళ్లి రెగ్యులర్ చెకప్‌లు చేయిస్తూ, చివరికి నా డెలివరీ రూమ్‌లో బేబీని తన చేతులలో బయటికి తీసి బొడ్డు కోసే వరకు, స్పెసిమెన్ శాంపిల్స్ కలెక్ట్ చేసే వరకు కూడా అన్నీ ఆయన చేతుల్లోనే జరిగాయి.



● సుజాత – రాకేష్

మేము ముగ్గురం అక్కా, చెల్లెళ్లం కాబట్టి నాకు బాబు పుడితే బాగుండు అని ఉంది. కానీ మా ఆయన మాత్రం ఎవరైనా ఒకటే అనేవారు. ఫైనల్‌గా మా పాపాయి ఇంట్లోకి అడుగు పెట్టింది. అప్పటివరకు ఆగిపోయిన సినిమాకు ఉన్న అడ్డంకులు అన్నీ వాటంతటఅవే క్లియర్ అయిపోయి, మూవీ రిలీజ్ అయిపోయింది. మా పాప పుట్టుకతో మా ఆయన పేరు ప్రఖ్యాతులు తీసుకొచ్చినట్లు మేము ఫీలవుతున్నాం. అందుకే మా పాప పేరు కూడా 'ఖ్యాతిక' అని పెట్టుకున్నాం. ఆ పేరు కూడా బాగా కలిసొచ్చింది. మా ఇంటికి లక్ష్మీదేవి వచ్చింది.

మా రాకేష్ చాలా కష్టపడుతున్నాడు, మనవాడి కోసం మనం కూడా ఏదైనా చేయాలని స్వచ్ఛందంగా వచ్చి సినిమాలో పని చేసిన వాళ్లు ఎందరో ఉన్నారు. అందుకే మేం డబ్బు కంటే కూడా మనుషులను ఎక్కువగా సంపాదించుకున్నాం అనే తృప్తి 2024లో మాకు చాలా ఉంది.

కామెంట్లు చేసినా కామ్‌గా ఎదిగాం

ఇంద్ర నీల్: 'కాలచక్రం' అనే సీరియల్‌లో మేఘన, నేను కలిసి నటించాం. మా ఫ్రెండ్‌షిప్‌తో కలిపి మా రిలేషన్‌షిప్‌కు 25 ఏళ్లు. మా పెళ్లి జరిగి 19 ఏళ్లవుతోంది. మా ఇద్దరి లైఫ్‌లో జరిగిన బెస్ట్ థింగ్ ఏంటి? అని చెప్పాలంటే మా మ్యారేజ్ అనే చెప్తాను. 2005 మే 26న 'చక్రవాకం' సీరియల్ చేస్తున్నప్పుడు నాకు అత్త రోల్ చేశారు మేఘన. ఆ సీరియల్‌లో అత్తను ప్రేమించే క్యారెక్టర్ నాది..సో... రియల్ లైఫ్‌లో కూడా తనని ప్రేమించి, పెళ్లి చేసుకున్నాను. చాలా కష్టపడి, పెద్దల్ని ఒప్పించి, పెళ్లికి వచ్చేలా చేసుకుని, మా ఇద్దరి డబ్బుల్తోనే జూబ్లీ హిల్స్ పెద్దమ్మ టెంపుల్‌లో పెళ్లి చేసుకున్నాం. అది మాకు ఎప్పటికీ తీయని గుర్తు.

● నాకైతే 2024 గురించి చిన్న పశ్చాత్తాపం ఉంది. మా నాన్నకు మరీ మరీ జాగ్రత్తలు చెప్పి షోల కోసం అమెరికా వెళ్లాను. నేను వర్క్ చేయడానికి ఎక్కడికైనా వెళ్లి, కష్టపడుతుంటే నాన్నకు కూడా చాలా ఇష్టం. నేనున్నాను కదా... నువ్వు వెళ్లు అని ధైర్యం చెప్పి పంపారు. కానీ నేను ఇండియాకి తిరిగి వచ్చేసరికి, నా ధైర్యం అయిన ఆయనే మాకు దూరం అయిపోయారు. ఆ విషయంలో చాలా బాధపడుతున్నాను. ఈ రోజు ఆయన మాతో భౌతికంగా లేకపోవడం మాకు చాలా పెద్ద లాస్.

● 2025 పై మాకు ఎక్కువ ఎక్స్‌పెక్టేషన్స్ ఉన్నాయి. మా ఇద్దరికీ ఒక మంచి ప్లాన్ కూడా ఉంది. మంచి బిజినెస్ ప్లాన్స్‌తో పాటుగా కొన్ని సర్‌ప్రైజ్‌లు కూడా ఉన్నాయి. అయితే ఇప్పుడు రివీల్ చేస్తే సర్‌ప్రైజ్ అంతా పోతుందని చెప్పడంలేదు. ట్రిప్స్ అయితే చాలానే ప్లాన్ చేస్తున్నాం. మేం ఇద్దరం ఎక్కువగా రోడ్ ట్రిప్స్‌కి వెళ్లడానికే ఇష్టపడతాం. అయితే అన్నీ అన్‌ప్లాన్డ్ ట్రిప్సే ఉంటాయి. అప్పటికప్పుడు అనుకోవడం... వెళ్లిపోవడం.

మేఘన రామి: జీవితంలో ఓ మంచి పార్ట్‌నర్ దొరకడం అనేది చాలా ముఖ్యం. అప్పుడున్న ఆ ఏజ్‌లో అది కరెక్టో, కాదో అనేది పక్కన పెడితే... ఇప్పుడు మా 19 సంవత్సరాల వైవాహిక జీవితం తర్వాత అనిపిస్తోంది.... అప్పుడు మేం తీసుకున్నది చాలా మంచి నిర్ణయమని. 'ఏంటి, వాళ్లు ఇలా పెళ్లి చేసుకున్నారు?' అని వ్యతిరేకంగా మాట్లాడుకున్నవాళ్లూ కూడా ఉన్నారు. కానీ మేం తీసుకున్న ఈ మంచి నిర్ణయం వల్ల మా లైఫ్ అప్పట్నుంచి చేంజ్ కావడం ఆరంభమైంది.

● ఇక నా ఫుడ్ బిజినెస్‌లో నీల్ సపోర్ట్ చాలా చాలా ఉంది. లేదంటే... ఈ రోజు ఈ బిజినెస్ ఇంత సక్సెస్‌ఫుల్‌గా ఇంత దూరం రానే రాదు. వైఫ్‌తో పచ్చళ్లు అమ్మిస్తున్నాడనీ, ఇండస్ట్రీలో వర్క్ లేక పచ్చళ్లు అమ్ముకుంటున్నారనీ, బతుకుతెరువు కోసం ఇలా చేస్తున్నారనీ చాలా మంది నెగటివ్ కామెంట్స్ చేశారు. కానీ మేం ఇద్దరం చాలా చాలా మెమొరీస్‌ని బిల్డ్ చేసుకోగలిగాం. మంచి లైఫ్‌ని లీడ్ చేస్తూ, ఎంజాయ్ చేస్తున్నాం. ఇంకా 2025లో మా రిలేషన్‌షిప్‌కి సంబంధించి 25 సంవత్సరాల సిల్వర్ జూబ్లీని సెలబ్రేట్ చేసుకోబోతున్నాం.

● ఇక 2025 రిజల్యూషన్స్ అంటే... ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకుంటూ, చాలా ఆరోగ్యకరమైన పద్ధతిలో బరువు తగ్గించుకోవాలని ఫిక్స్ అయ్యాను. అందుకే న్యూ ఇయర్ రావడానికి రెండు వారాల ముందే యోగా సభ్యత్వం తీసుకున్నాను. అందరూ ఆరోగ్యంగా, సంతోషంగా, సేఫ్‌గా ఉండాలని కోరుకుంటున్నాం.
అందరికీ హ్యాపీ న్యూ ఇయర్.



● మేఘన రామి – ఇంద్ర నీల్

ఇంటర్వ్యూలు: శిరీష చల్లపల్లి

సాగుబడి
పూర్వాషాఢ కార్తె : డిసెంబర్ 30 నుంచి జనవరి 11 వరకు

విత్తనం రక్షితో రక్షితః!



తను సాగుచేస్తున్న దేశీ వరి, చిరుధాన్యాల వంగడాలను చూపిస్తున్న దార్లపూడి రవి



దేశీ వరి, చిరుధాన్యాల వంగడాలు

- కార్పొరేట్ ఉద్యోగం వదలి ప్రకృతి సేద్యం చేపట్టిన దార్లపూడి రవి
- 600 రకాల దేశీ వరి, చిరుధాన్యాల వంగడాల సేకరణ.. సాగు చేస్తూ సంరక్షణ..
- స్వచ్ఛంద సంస్థను స్థాపించి సీడ్ బ్యాంక్ నిర్వహణ

రసాయనిక ఎరువులు వాడితేనే అధిక దిగుబడి ఇచ్చేలా ఆధునిక వంగడాలను తయారు చేస్తున్నారు. ఈ ఆధునిక వంగడాల్లో పోషకాలు గత 50 ఏళ్లలో సగానికి సగం తగ్గిపోయాయని భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) అధ్యయనంలోనే తేలింది. అందువల్ల దిగుబడి తక్కువొచ్చినా పోషకాలతో కూడిన ఆహారోత్పత్తి కావాలనుకుంటే దేశీ వంగడాలే వాడుకోవాలి.

రసాయనాలు వాడకుండా ఆరోగ్యదాయకమైన వ్యవసాయం చేయాలంటే అందుకు తగిన వనరులు సమకూర్చుకోవాలి. అందులో ముఖ్యమైనది అనువైన విత్తనం. ప్రకృతి/సేంద్రియ సేద్యానికి అనువైన విత్తనం దేశీ విత్తనమే. అందుకే ప్రభుత్వాలు కూడా ప్రకృతి వ్యవసాయంతో పాటు దేశీ వంగడాలను ప్రోత్సహిస్తున్నాయి.

కార్పొరేట్ ఉద్యోగాన్ని వదిలిపెట్టి ప్రకృతి సేద్యం చేపట్టిన దార్లపూడి రవి కూడా దేశీ విత్తన పరిరక్షణ కోసం విశేష కృషి చేస్తున్నారు. దేశీ వరి, చిరుధాన్యాలు తదితర పంటలకు సంబంధించి ఏకంగా 600 రకాల దేశవాళీ విత్తనాల సేకరణ, సాగు, అదనపు విలువ జోడించి ఆహార ఉత్పత్తుల తయారీ, విక్రయం.. ఈ పనులన్నీ ఆయన ఒక తపస్సులా చేసుకుపోతున్నారు. ఇతరులకు మార్గదర్శకంగా నిలుస్తున్న రవి అనుభవాలు ఆయన మాటల్లోనే..



దార్లపూడి రవి

'విజయనగరం జిల్లా రేగిడి ఆమదాలవలస మండలంలోని ఉంగరాడ మా గ్రామం. పోస్టు గ్రాడ్యుయేషన్ (పర్యావరణ శాస్త్రం) చదివాక ఓ సిమెంట్ కంపెనీలో ఏజీఎంగా ఉద్యోగం చేశాను. సెలవులకో, శుభకార్యాలకో వచ్చినప్పుడు బంధుమిత్రులు చాలామందిలో ఒక విషయం గమనించాను. అజీర్తి అనో, బీపీ అనో, గ్యాస్ట్రిక్ అనో భోజనం తగ్గించేసేవారు. ఏదో వంటలు బాగున్నాయని జిహ్వా చాపల్యం ఆపులేక కాస్త ఎక్కువగా తింటే మాత్ర వేసుకోవాల్సి వస్తుందని చెప్పేవారు. దీనికి కారణం పంటల రసాయనీకరణ. రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందులు పరిమితికి మించి రైతులు వాడేస్తుండటం చూశాను. ఈ పరిస్థితి మారాలంటే మళ్లీ పూర్వపు ప్రకృతి వ్యవసాయమే సరైనదని భావించాను. అమ్మానాన్నలను దగ్గరుండి చూసుకోవాలని కూడా మనసు చెబుతుండటంతో ఉద్యోగానికి రాజీనామా చేసి ఇంటికి తిరిగొచ్చేశా.

మాది వ్యవసాయ కుటుంబం. రెండున్నర ఎకరాల భూమి ఉంది. పూర్తిగా వర్షాధారం. అందులో కొంతమేర మామిడి తోట ఉంది. అంతరపంటగా పెసలు, ఉలవలు, నువ్వులు సాగు చేస్తున్నాను. దాదాపు ఎకరా భూమిలో అరుదైన సంప్రదాయ వరి రకాలను సాగు చేస్తున్నాను. అవన్నీ పూర్తిగా విత్తనాల కోసమే. ఉత్తరాంధ్రలో పలువురు రైతులకు వాటిని ఇచ్చి సాగు చేయిస్తున్నా.

తెలుసుకుంటూనే 'సాగు'తూ..

పదేళ్ల క్రితం కాకినాడలో ప్రకృతి వ్యవసాయంపై శిక్షణా శిబిరంలో సుభాష్ పాలేకర్ చెప్పిన పద్ధతులను ఆచరణలో పెట్టాను. 80 సెంట్లలో వరి నాటాను. మామిడి తోటలో అంతర పంటగా పసుపు పెట్టాను. 30 సెంట్ల భూమిలో 30 కిలోల కస్తూరి పసుపు విత్తనం పెడితే 300 కిలోల పంట చేతికొచ్చింది. ఎండబెడితే 180 కేజీల పసుపు వచ్చింది. కొర్రలు వేస్తే మంచి దిగుబడి వచ్చింది. ఆ ఉత్సాహంతో ఐదేళ్ల క్రితం నుంచి మూడెకరాలు కౌలుకు తీసుకొని వరి, కొంతమేర కూరగాయలు, ఆకుకూరలు సాగు చేస్తున్నాను.

దేశవాళీ పంటల తియ్యదనం...

ఒకప్పుడు దేశవాళీ టమాటాను చూస్తే నోరూరేది. ఇప్పుడు మార్కెట్లో దొరుకుతున్న హైబ్రిడ్ టమాటా వంటకు తప్ప తినడానికి చప్పగా ఉంటోంది. అన్ని పంటలదీ అదే పరిస్థితి. ఇది మారాలంటే దేశవాళీ పంటల తియ్యదనం మళ్లీ తెచ్చుకోవాలి. అందుకే దేశవాళీ విత్తనాల సేకరణ ఒక అలవాటుగా మార్చుకున్నాను. 2016 నుంచి ప్రామాణిక పద్ధతి ప్రకారం వరి విత్తనాలను సేకరించి, సంరక్షిస్తున్నాను. ప్రతి విత్తన రకానికి ఒక రికార్డు కూడా నిర్వహిస్తున్నా.

సంప్రదాయ వరి విత్తనాలే గాకుండా కూరగాయలు, ఆకు కూరలు, అపరాల విత్తనాలు సేకరించాను. ఔషధ మొక్కలను, విత్తనాలనూ సేకరిస్తున్నాను. వరి వంగడాల్లో ముఖ్యంగా ఎర్రబుడమలు (రెడ్ రైస్), నెల్లూరు మొలకలు విత్తనాలు సేకరించాను. అరుదైన రాజుల చిక్కుడు (ఎరుపు, తెలుపు రంగులో ఉండే విత్తనం), తొక్క తీయకుండా వండుకోవడానికి వీలయ్యే గుత్తి బీర విత్తనాలు కూడా ఉన్నాయి.

ఒడిశా నుంచి తెచ్చిన శీలావతి, గాయత్రి అనే వరి విత్తనాలు, కెంపుసన్నా అనే బాస్మతి రకం విత్తనాలను కర్ణాటకలో సేకరించాను. గోదావరి ఇసుకరవ్వలు అనే రకం కూడా అన్నం వండుతుంటే మంచి సువాసన వస్తుంది. ఈ విత్తనాలనూ మూడేళ్ల నుంచి అభివృద్ధి చేస్తున్నాను. ఇలా సంప్రదాయ వరి రకాలు, చిరుధాన్యాలు కలిపి దాదాపు ఆరొందల రకాల విత్తనాలు ఇప్పటివరకూ సేకరించగలిగాను. వీటిలో చాలావరకూ తూర్పు కనుమల్లో పలువురు రైతులకు ఇచ్చి ప్రయోగాత్మకంగా సాగు చేయిస్తున్నాను. ఈ ప్రాంతంలో వ్యవసాయక జీవవైవిధ్యాన్ని ప్రోది చేయడానికి ఈ ప్రయత్నం దోహదపడుతుందనేది నా విశ్వాసం.

విత్తనాల సంరక్షణా ఓ సవాలే...

దేశవాళీ విత్తనాల సంరక్షణా ఒక సవాలు వంటిదే. పూర్వం వెదురుబుట్టల్లో, కుండల్లో విత్తనాలు భద్రపరిచేవారు. ముందుగా కాపుకొచ్చిన మొక్కజొన్న కంకులు, బీరకాయలు, సొరకాయలు, బెండకాయలు ప్రత్యేకంగా వేరుచేసి విత్తనాల కోసం వసారాలో వేలాడగట్టేవాళ్లు. ఆ విధానాలన్నీ ఇప్పుడు విత్తనాల నిల్వ కోసం పాటిస్తున్నాం. ఇలా ఓ సీడ్ బ్యాంక్‌ను నిర్వహించడానికి ఒక ఎన్జీవోను ప్రారంభించాను. దేశీయ పంటలకు విలువ పెంచేలా చిరుధాన్యాలు, పప్పుధాన్యాలతో గానుగ నూనె, బిస్కెట్లు, స్నాక్స్ తయారు చేయించి విక్రయిస్తున్నాం..'

(– దార్లపూడి రవి
మొబైల్: 86394 56848)

– అల్లు సూరిబాబు,
సాక్షి ప్రతినిధి, విజయనగరం
ఫోటోలు: డి.సత్యనారాయణమూర్తి

సేంద్రియ/ప్రకృతి సేద్యంపై ఫౌండేషన్ కోర్సు

ఆంధ్రప్రదేశ్ నూజివీడుకు సమీపంలోని కొండపర్వలో గల కృష్ణ సుధ అకాడమీ ఆఫ్ ఆగ్రోఎకాలజీలో 2025 జనవరి 27 నుంచి ఫిబ్రవరి 1 వరకు ప్రకృతి/ సేంద్రియ వ్యవసాయంలో రైతులకు ప్రాథమిక శిక్షణా శిబిరం జరగనుంది. మొదటి నుంచి అన్ని విషయాలూ నేర్చుకోదలచిన యువతకూ ఇది మంచి అవకాశమే. ప్రసిద్ధ శాస్త్రవేత్త, సుస్థిర వ్యవసాయ కేంద్రం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా. జీవీ రామాంజనేయులు తదితరులు శిక్షణ ఇస్తారు.
ఇతర వివరాలకు డా. లవకుశ 85002 83300.

పందెం కోళ్లతో స్వయం ఉపాధి

నాటు కోళ్లు, జాతి (పందెం) కోళ్ల పెంపకం మారుమూల గ్రామాల్లో సైతం రైతుకు ఆధారపడదగినంత స్థాయిలో నిరంతర ఆదాయాన్ని అందిస్తుందని ఓ యువజంట రుజువు చేస్తున్నారు. గత పదేళ్లుగా శ్రద్ధగా ఈ పని చేస్తే ప్రజలకు ఆరోగ్యదాయకమైన మాంసం, గుడ్లను అందించటంతో పాటు స్వగ్రామంలోనే స్వయం ఉపాధి కల్పించుకుంటున్నారు రైతు దంపతులు ఉపేందర్‌రావు, జ్యోతి.





ఉపేందర్‌రావు షెడ్డులో జాతి కోళ్లు



గుడ్లను పొదిగించే ఇంక్యుబేటర్



జాతి కోడి పిల్లలు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం బొజ్జాయిగూడేనికి చెందిన నిరుద్యోగులైన మూలగుండ్ల ఉపేందర్‌రావు, వజ్జా జ్యోతి పదేళ్ల క్రితం ఇంటి వద్ద ఒక షెడ్డును ఏర్పాటు చేసుకొని నాటు, పందెం కోళ్ల పెంపకం చేపట్టారు. చుట్టూ కోళ్ల ఎగిరిపోకుండా ఎత్తు జాలీ ఏర్పాటు చేశారు. నీడ కోసం పరిసర ప్రాంతం లో వివిధ రకాల చెట్లను పెంచారు. కోళ్ల మధ్యకు పాములు రాకుండా చూసేందుకు సీమ కోళ్లను, రెండు కుక్కలను పెంచారు. కొన్నేళ్ల క్రితం 20 జాతి (పందెం) కోడి పిల్లలను పలు ప్రాంతాల నుంచి సేకరించి పెంచటం మొదలుపెట్టారు. వీటి గుడ్లను సాధారణ కోళ్లకు వేసి పొదిగించి పిల్లలు తీసి సంతతిని పెంచారు. తదనంతరం ఇంక్యుబేటర్‌ను సమకూర్చుకొని పందెం కోడి పిల్లలను ఉత్పత్తి చేస్తున్నారు. పిల్లల సైజును బట్టి వివిధ ధరలకు అమ్ముతున్నారు.

8 రకాల జాతి కోళ్లు

కోళ్లను 24 గంటలూ కనిపెట్టుకొని ఉండి అన్ని పనులూ ఉపేందర్‌రావు, జ్యోతి చేసుకుంటారు. వీరి వద్ద మార్కెట్‌లో మార్కెట్‌లో గిరాకీ ఉన్న నెమలి, కాక, డేగ, రసంగి, అబ్రాస్, సీత్వాల్, కెక్కర, ఎర్ర కెక్కర వంటి అనేక రకాల జాతి కోళ్లను వీరు పెంచుతున్నారు. రెండు వందల పెట్టలు, పుంజులు ఉన్నాయి. ఇవి దాణా కంటే ఆకు కూరలను ఎక్కువగా తింటున్నాయి. ఇంటి పరిసరాల్లో పలు రకాల ఆకుకూరలను,మునగాను పెంచి వీటికి మేపుతున్నారు. ఫామ్ హౌస్ యజమానులు జాతి కోళ్లను ఆసక్తితో పెంచుతుండటంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చి కొనుగోలు చేసుకెళుతున్నారు. కిలో బరువు గల జాతి కోడి రూ. 4 నుంచి 5 వేలు పలుకుతోంది. నెలలోపు చిన్న పిల్లలైతే రూ. 300 వరకు పలుకుతోందని ఉపేందర్ రావు తెలిపారు.



ఉపేందర్‌రావు

మునగాకుతో జబ్బులకు చెక్!

మొదట్లో కడక్‌నాథ్ కోళ్ల పెంపకం చేపట్టాం. మారుమూల ప్రాంతం కావటంతో వాటికన్నా జాతి (పందెం) కోళ్ల పెంపకంతోనే అధిక ఆదాయం వస్తోంది. జాతి కోడిగుడ్లను ఇంక్యుబేటర్ ద్వారా పొదిగించి పిల్లలను అమ్మటం వల్ల మంచి ఆదాయం పొందుతున్నాం. రెండు, మూడు సార్లు మందులు వాడితే ఈ కోళ్లకు ఎలాంటి జబ్బులు రావు. ముఖ్యంగా మునగ ఆకు తినిపిస్తే కోళ్లకు జబ్బులు వచ్చే ఛాన్సే లేదని ఉపేందర్‌రావు(95023 48987) అనుభవపూర్వకంగా చెబుతున్నారు.

– ఇల్లెందుల నాగేశ్వరరావు, సాక్షి, ఇల్లెందు



కిర్మాణీ ఆత్మకథను ఆవిష్కరించిన డీకే శివకుమార్

1983 వన్డే వరల్డ్‌కప్ సాధించిన భారత క్రికెట్ జట్టు వికెట్ కీపర్ సయ్యద్ కిర్మాణీ ఆత్మకథ 'స్టంప్డ్: లైఫ్ బిహైండ్ అండ్ బియాండ్ ద ట్వంటీ టూ యార్డ్స్' పుస్తకాన్ని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆవిష్కరించారు. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమంలో కపిల్ దేవ్, రాహుల్ ద్రవిడ్, అనిల్ కుంబ్లే, వీవీఎస్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

3,73,691... ప్రేక్షకుల సంఖ్యలో కొత్త రికార్డు

భారత్, ఆస్ట్రేలియా మధ్య జరిగిన నాలుగో టెస్టుకు హాజరైన ప్రేక్షకుల సంఖ్య ఎంసీజీలో కొత్త రికార్డును సృష్టించింది. టెస్టు మ్యాచ్‌లో ఐదు రోజులకు కలిపి ఏకంగా 3 లక్షల 73 వేల 691 మంది ప్రేక్షకులు హాజరైనట్లు నిర్వాహకులు అధికారికంగా ప్రకటించారు. 1937లో ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ మధ్య ఇదే మైదానంలో జరిగిన ఆరు రోజుల టెస్టుకు 3,50,534 మంది ప్రేక్షకులు హాజరు కాగా... ఇప్పుడు ఆ రికార్డు బద్దలైంది.




రోహిత్

పోరాడినా... ఓటమి తప్పలేదు

భారత్ ముందు 340 పరుగుల భారీ లక్ష్యం... తొలి సెషన్‌లో 33/3 స్కోరుతో కాస్త ఆందోళన... అయితే రెండో సెషన్‌లో ఒక్క వికెట్ కూడా చేజార్చుకోలేదు... దాంతో ఓటమిని తప్పించుకోవడంపై ఆశలు... విరామం తర్వాత 121/3తో మెరుగైన స్థితి... అయితే అనూహ్యంగా 9 పరుగుల వ్యవధిలో 3 వికెట్లు పడ్డాయి... పంత్ ఆడిన తప్పుడు షాట్‌తో ఈ పతనం మొదలైంది... అయినా సరే జైస్వాల్ పట్టుదలగా ఆడుతుండటం, మరో నాలుగు వికెట్లు ఉండటంతో కొంత భరోసా... మరో 21.2 ఓవర్లు నిలబడిగలిగితే చాలు... మ్యాచ్‌ను 'డ్రా'గా ముగించవచ్చు... కానీ జైస్వాల్ అవుట్ కావడంతో అంతా మారిపోయింది... అతను వెనుదిరిగిన తర్వాత టీమిండియా ఆట ముగించేందుకు ఆసీస్‌కు 8.2 ఓవర్లు సరిపోయాయి... ఒక్క సెషన్‌లోనే 7 వికెట్లు చేజార్చుకున్న భారత్ మరో 12.5 ఓవర్లు మిగిలి ఉన్న దశలో ఓటమిని ఖరారు చేసుకుంది... వరుస మలుపులతో సాగుతూ వచ్చిన మెల్‌బోర్న్ టెస్టులో చివరకు ఆస్ట్రేలియానే గెలుపు బావుటా ఎగరవేసింది. వేర్వేరు సందర్భాల్లో పైచేయి సాధించే అవకాశాలు వచ్చినా... వాటిని సమర్థంగా ఉపయోగించుకోలేక రోహిత్ బృందం సిరీస్‌లో వెనుకబడిపోయింది. ఇప్పుడు బోర్డర్–గావస్కర్ ట్రోఫీని నిలబెట్టుకోవడంతో పాటు ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ)లో ఫైనల్ చేరే అవకాశాలు మిగిలి ఉండాలంటే చివరి టెస్టులో కచ్చితంగా గెలవాల్సిన స్థితిలో భారత్ నిలిచింది.

మెల్‌బోర్న్ టెస్టులో భారత్ పరాజయం

- 184 పరుగులతో గెలిచిన ఆస్ట్రేలియా
- యశస్వి జైస్వాల్ పోరాటం వృథా
- శుక్రవారం నుంచి సిడ్నీలో చివరి టెస్టు

మెల్‌బోర్న్: నాలుగేళ్ల క్రితం 'గాబా' మైదానం తరహాలో భారీ లక్ష్యాన్ని ఛేదించి మెల్‌బోర్న్‌లో భారత్ సంచలన విజయం సాధిస్తుందని ఆశించిన భారత అభిమానులకు నిరాశ తప్పలేదు. గెలుపు కాదు కదా ... ఓటమి నుంచి తప్పించుకొని 'డ్రా'గా ముగించే చాన్స్ కూడా ఆస్ట్రేలియా ఇవ్వలేదు. ఎంసీజీలో సోమవారం ముగిసిన నాలుగో టెస్టులో ఆస్ట్రేలియా 184 పరుగుల తేడాతో భారత్‌పై ఘన విజయం సాధించింది. 340 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన భారత్ 79.1 ఓవర్లలో 155 పరుగులకే ఆలౌటైంది. యశస్వి జైస్వాల్ (208 బంతుల్లో 84; 8 ఫోర్లు) ఒంటరి పోరాటం చేయగా, మిగతా బ్యాటర్లంతా విఫలమయ్యారు. కమిన్స్, బోలండ్ చెరో 3 వికెట్లు పడగొట్టగా, లయన్‌కు 3 వికెట్లు దక్కాయి. తాజా ఫలితంతో ఐదు టెస్టుల సిరీస్‌లో ఆస్ట్రేలియా 2–1తో ముందంజ వేసింది. చివరి టెస్టు జనవరి 3 నుంచి సిడ్నీలో జరుగుతుంది. మ్యాచ్‌లో కీలకమైన 90 పరుగులు చేయడంతో పాటు 6 వికెట్లు పడగొట్టిన ఆసీస్ కెప్టెన్ కమిన్స్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు.

జైస్వాల్ మినహా...

సిరీస్‌లో వరుస వైఫల్యాలతో విమర్శలు ఎదుర్కొంటున్న కెప్టెన్ రోహిత్ శర్మ (9) ఈసారి చాలా జాగ్రత్తగా ఇన్నింగ్స్‌ను ఆరంభించాడు. అయితే 40 బంతులు ఎదుర్కొన్న అతను తొలిసారి కమిన్స్ బౌలింగ్‌లో దూకుడైన షాట్ ఆడబోయి వెనుదిరిగాడు. అదే ఓవర్లో రాహుల్ (0) కూడా అవుట్ కాగా, స్టార్క్ పదునైన బంతిని డ్రైవ్ చేయబోయిన కోహ్లి (5) కూడా స్లిప్‌లో చిక్కడంతో తొలి సెషన్ ముగిసింది. లంచ్ తర్వాత జైస్వాల్, పంత్ (104 బంతుల్లో 30; 2 ఫోర్లు) సాధికారికంగా ఆడారు. 27.5 ఓవర్ల పాటు ఆసీస్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్నారు. అయితే టీ తర్వాత ఎట్టకేలకు పార్ట్‌టైమర్ హెడ్‌తో బౌలింగ్ చేయించిన వ్యూహం ఫలించింది. పంత్‌ను అవుట్ చేసి 88 పరుగుల భాగస్వామ్యాన్ని విడదీశాడు. అంతే... ఆ తర్వాత జట్టు పతనం వేగంగా సాగిపోయింది. 34 పరుగుల వ్యవధిలోనే జట్టు చివరి 7 వికెట్లు కోల్పోయింది. జడేజా (2), నితీశ్ రెడ్డి (1) విఫలం కాగా, సిరాజ్ (0)ను లయన్ ఎల్బీగా అవుట్ చేయడంతో ఆసీస్ సంబరాల్లో మునిగిపోయింది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 228/9తో ఆట కొనసాగించిన ఆసీస్ 234 పరుగులకు ఆలౌటైంది.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 474; భారత్ తొలి ఇన్నింగ్స్: 369; ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్: 234; భారత్ రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) కేరీ (బి) కమిన్స్ 84; రోహిత్ (సి) మార్ష్ (బి) కమిన్స్ 9; రాహుల్ (సి) ఖ్వాజా (బి) కమిన్స్ 0; కోహ్లి (సి) ఖ్వాజా (బి) స్టార్క్ 5; పంత్ (సి) మార్ష్ (బి) హెడ్ 30; జడేజా (సి) కేరీ (బి) బోలండ్ 2; నితీశ్ రెడ్డి (సి) స్మిత్ (బి) లయన్ 1; సుందర్ (నాటౌట్) 5; ఆకాశ్‌దీప్ (సి) హెడ్ (బి) బోలండ్ 7; బుమ్రా (సి) స్మిత్ (బి) బోలండ్ 0; సిరాజ్ (ఎల్బీ) (బి) లయన్ 0; ఎక్స్‌ట్రాలు 12; మొత్తం (79.1 ఓవర్లలో ఆలౌట్) 155. వికెట్ల పతనం: 1–25, 2–25, 3–33, 4–121, 5–127, 6–130, 7–140, 8–150, 9–154, 10–155. బౌలింగ్: స్టార్క్ 16–8–25–1, కమిన్స్ 18–5–28–3, బోలండ్ 16–7–39–3, మార్ష్ 3–2–2–0, లయన్ 20.1–6–37–2, హెడ్ 5–0–14–1, లబుషేన్ 1–1–0–0.

"చాలా నిరాశగా ఉంది. చివరి వరకు పోరాడాలనే ఉద్దేశంతోనే బరిలోకి దిగాం కానీ అది సాధ్యం కాలేదు. ఆఖర్లో అంతా మారిపోయింది. టెస్టు మొత్తాన్ని చూస్తే మాకూ కొన్ని అవకాశాలు వచ్చాయి కానీ మేం వాడుకోలేకపోయాం. వారి చివరి వికెట్ భాగస్వామ్యం కూడా దెబ్బ తీసింది. 340 పరుగులు ఎప్పుడైనా కష్టమే. చివరి రెండు సెషన్లలో ధాటిగా ఆడి లక్ష్యం చేరేందుకు ప్రయత్నించేందుకు కావాల్సిన పునాది వేయలేకపోయాం. తర్వాతి టెస్టుకు ముందు కొన్ని లోపాలు సరిదిద్దుకోవాల్సి ఉంది. గట్టిగా ప్రయత్నించి 2–2గా మార్చే ప్రయత్నం చేస్తాం. నా బ్యాటింగ్ గురించి చెప్పాలంటే మానసికంగా నేను సరైన స్థితిలో లేను. నేను ఏం చేయాలని ప్రయత్నించినా కలిసి రావడం లేదు. ఫలితం దక్కకపోవడం నిరాశ కలిగిస్తోందనేది మాత్రం వాస్తవం. –రోహిత్ శర్మ, భారత కెప్టెన్



జైస్వాల్ అవుట్‌పై వివాదం!



చక్కటి ఇన్నింగ్స్‌తో ఓటమి నుంచి తప్పించే ప్రయత్నం చేస్తున్న సమయంలో యశస్వి జైస్వాల్ అవుట్ కావడం జట్టును దెబ్బ తీసింది. కమిన్స్ బౌలింగ్‌లో లెగ్‌సైడ్ దిశగా వెళుతున్న బంతిని ఆడి కీపర్ కేరీకి అతను క్యాచ్ ఇచ్చాడు. అంపైర్ విల్సన్ స్పందించకపోవడంతో ఆసీస్ రివ్యూ కోరింది. ఇదే చివరకు చర్చకు దారి తీసింది. వరుస రీప్లేల తర్వాత స్పష్టత రాకపోగా, 'స్నికో'లో కూడా ఏదీ తేలలేదు. ఇక్కడా బంతి బ్యాట్‌ను తాకినట్లుగా కనిపించలేదు. అయితే ముందు భాగంనుంచి చూసిన రీప్లేలో బంతి బ్యాట్‌ను దాటిన తర్వాత దిశను మార్చుకున్నట్లుగా కనిపించింది. దీని ఆధారంగానే అది బ్యాట్‌కు తగిలిందని చెబుతూ థర్డ్ అంపైర్ షర్ఫుద్దౌలా 'అవుట్'గా ప్రకటించడంతో జైస్వాల్ నిరాశగా మైదానం వీడాడు. అయితే 'స్నికో'ను పరిగణనలోకి తీసుకోకపోవడాన్ని ప్రశ్నించిన సునీల్ గావస్కర్... ఇక సాంకేతికత ఎందుకని, కొన్నిసార్లు బ్యాట్‌కు తగలకపోయినా బంతి దిశ మార్చుకోవడం సహజమని విమర్శించాడు. మరోవైపు మాజీ అంపైర్ సైమన్ టఫెల్ కూడా ఇది 'అవుట్' అని నిర్ధారించాడు. అంపైరింగ్ ప్రొటోకాల్ ప్రకారం బంతి దిశ మార్చుకున్నట్లు కంటికి స్పష్టంగా కనిపిస్తున్నప్పుడు టెక్నాలజీ వాడాల్సిన అవసరం లేదని అన్నాడు. భారత కెప్టెన్ రోహిత్ శర్మ కూడా జైస్వాల్ బ్యాట్‌కి బంతి తాకిందని, అతను అవుట్ అని తేల్చి వివాదానికి ముగింపు పలకడం గమనార్హం.

మారని పంత్!



వైఫల్యాల నుంచి తాను గుణపాఠాలు నేర్చుకోనని రిషభ్ పంత్ మరోసారి నిరూపించాడు. పరిస్థితులకు తగిన ట్లుగా ఆడకుండా తనకు నచ్చిన షాట్లనే ఆడతానని అతను పరోక్షంగా చెప్పాడు. తొలి ఇన్నింగ్స్‌లో జట్టు 191/5తో కష్టాల్లో ఉన్న సమయంలో స్కూప్ షాట్ ఆడబోయి డీప్ థర్డ్‌మాన్ వద్ద క్యాచ్ ఇచ్చాడు. దీనిపైనే మాజీ కెప్టెన్ సునీల్ గావస్కర్ 'స్టుపిడ్, స్టుపిడ్, స్టుపిడ్' అంటూ తీవ్రంగా విమర్శించాడు. గతంలో ఇవే షాట్లు తనకు పరుగులు అందించినా... ఇది సమయం కాదని సన్నీ విమర్శించాడు. అయితే రెండో ఇన్నింగ్స్‌లోనూ పంత్ అదే పని చేశాడు. జైస్వాల్‌తో 88 పరుగుల భాగస్వామ్యంతో ఎలాంటి ఇబ్బంది లేకుండా సులువుగా ఓటమి నుంచి తప్పించుకునే స్థితిలో ఉన్న దశలో హెడ్ బౌలింగ్‌లో భారీ పుల్ షాట్ ఆడి లాంగాన్‌లో క్యాచ్ ఇచ్చాడు. ఆ తర్వాతే భారత్ ఓటమికి బాటలు పడ్డాయి.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సినిమా

కాంచనలో కన్‌ఫార్మ్?


పూజా హెగ్డే

కోలీవుడ్‌పై స్పెషల్ ఫోకస్ పెట్టినట్లున్నారు హీరోయిన్ పూజా హెగ్డే. ఇప్పటికే విజయ్, సూర్య హీరోలుగా నటిస్తున్న తమిళ చిత్రాల్లో పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ రెండు చిత్రాలు 2025లో విడుదల కానున్నాయి. కాగా ఈ బ్యూటీ మరో తమిళ సినిమా 'కాంచన 4'లో నటించనున్నారని కొన్ని రోజులుగా ఓ వార్త ప్రచారంలో ఉంది. ఈ వార్త నిజమేనని, పూజా హెగ్డే దాదాపు ఖరారయ్యారని సమాచారం. రాఘవా లారెన్స్ నటించి, దర్శకత్వం వహించనున్న ఈ సినిమాలో పూజా హెగ్డే ఓ డెవిల్ రోల్ చేయనున్నారని కోలీవుడ్‌లో ప్రచారం సాగుతోంది. త్వరలోనే ఈ హారర్ మూవీ గురించి ఓ అప్‌డేట్ రానుంది.


మీనాక్షీ చౌదరి, వెంకటేశ్, ఐశ్వర్యా రాజేశ్

బ్లాక్‌బస్టర్ పొంగల్

'ఇట్స్ ఏ బ్లాక్‌బస్టర్ పొంగల్' అంటూ హుషారుగా ఆడి పాడుతున్నారు వెంకటేశ్. ఆయన హీరోగా నటించిన తాజా చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో ఐశ్వర్యా రాజేశ్, మీనాక్షీ చౌదరి హీరోయిన్లుగా నటించారు. 'దిల్' రాజు సమర్పణలో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్‌పై శిరీష్ నిర్మించిన ఈ సినిమా సంక్రాంతి కానుకగా జనవరి 14న విడుదల కానుంది. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించారు. ఈ మూవీ నుంచి 'బ్లాక్ బస్టర్ పొంగల్..' అంటూ సాగే మూడో పాటని సోమవారం విడుదల చేశారు. 'హే గొబ్బియల్లో గొబ్బియల్లో... పండగొచ్చే గొబ్బియల్లో.. ఎవ్రీ బడీ గొబ్బియల్లో... సింగ్ దిస్ మెలోడీ గొబ్బియల్లో... పెద్ద పండగండీ గొబ్బియల్లో.. లెట్స్ గెట్ ట్రెండీ గొబ్బియల్లో కమాన్'.. 'బేసికల్లీ.. టెక్నికల్లీ... లాజికల్లీ... ప్రాక్టికల్లీ అండ్ ఫైనల్లీ... ఇట్స్ ఏ యాటిట్యూడ్ పొంగల్... ఇట్స్ ఏ బ్లాక్‌బస్టర్ పొంగల్'... అంటూ ఈ పాట సాగుతుంది. రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించిన ఈ పాటని వెంకటేశ్, మైపిలో రోహిణి సోరట్, భీమ్స్ సిసిరోలియో పాడారు. భాను మాస్టర్ కొరియోగ్రఫీ అందించారు. ఈ పాటలో వెంకటేశ్, ఐశ్వర్యా రాజేష్, మీనాక్షీ చౌదరి సంప్రదాయ వస్త్రధారణలో ఎనర్జిటిక్ డ్యాన్స్‌తో సందడి చేశారు. ఈ చిత్రానికి కెమేరా: సమీర్ రెడ్డి.

మా అమ్మలా పెంచాలనుకుంటున్నాను



\- దీపికా పదుకోన్

"మా అమ్మగారు నన్ను ఎలా పెంచారో నేను కూడా నా కూతుర్ని అలాగే దగ్గరుండి పెంచాలనుకుంటున్నాను" అంటున్నారు హీరోయిన్ దీపికా పదుకోన్. ప్రభాస్ హీరోగా నటించిన పాన్ ఇండియన్ చిత్రం 'కల్కి 2898 ఏడీ'. నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దీపికా పదుకోన్, దిశా పటానీ ఇతర పాత్రలు పోషించారు. వైజయంతీ మూవీస్‌పై సి. అశ్వినీదత్ నిర్మించిన ఈ సినిమా జూన్ 27న విడుదలైంది. ఈ మూవీకి సీక్వెల్‌గా 'కల్కి 2' తెరకెక్కనున్న విషయం తెలిసిందే. తొలి భాగం బ్లాక్‌బస్టర్ కావడంతో ద్వితీయ భాగంపై అటు ఇండస్ట్రీ వర్గాల్లో, ఇటు ప్రేక్షకుల్లో భారీ అంచనాలున్నాయి. ప్రస్తుతం 'కల్కి 2' ప్రీ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉన్నారు నాగ్ అశ్విన్. 2025లో ఈ మూవీ సెట్స్‌పైకి వెళుతుందని టాక్. 'కల్కి 2898 ఏడీ'తో టాలీవుడ్‌లో అడుగుపెట్టారు దీపికా పదుకోనే. ఈ మూవీలో ఆమె చేసిన సుమతి పాత్ర నిడివి తక్కువగా ఉందనే మాటలు వినిపించాయి. అయితే 'కల్కి 2'లో ఆమె పాత్ర చాలా కీలకమని, ఆమె కూడా త్వరలోనే షూటింగ్‌లో పాల్గొంటారనే వార్తలు వినిపించాయి. తాజాగా ఏర్పాటు చేసిన ఓ గెట్ టు గెదర్ పార్టీలో పాల్గొన్న దీపికకి 'కల్కి 2' సినిమా గురించి ఓ ప్రశ్న ఎదురైంది. ఆ ప్రశ్నకు ఆమె బదులిస్తూ.. "నేను కూడా 'కల్కి 2' మూవీ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను. అయితే ఇప్పుడు నా తొలి ప్రాధాన్యం నా కుమార్తె దువా. నా కూతురు పెంపకం కోసం కేర్ టేకర్‌ని నియమించుకోవడం నాకు ఇష్టం లేదు. నన్ను మా అమ్మగారు ఎలా అయితే పెంచారో.. నేను కూడా నా కూతుర్ని అలాగే దగ్గరుండి పెంచాలని, తన ప్రతి క్షణాన్ని ఆస్వాదించాలని భావిస్తున్నాను" అన్నారు. ఇదిలా ఉంటే... హీరో రణ్‌వీర్ సింగ్, దీపికా పదుకోన్‌లకు 2018 నవంబరు 14న వివాహం కాగా ఈ ఏడాది సెప్టెంబరులో వారికి కుమార్తె (దువా) జన్మించిన సంగతి తెలిసిందే.

విద్యార్థులకు చేరువ కావడం ఆనందం


మూలవిరాట్, ప్రభాకర్ జైనీ, విజయలక్ష్మి

\- ప్రభాకర్ జైనీ

"తెలంగాణకు చెందిన ప్రజాకవి, స్వాతంత్ర్య సమరయోధుడు కాళోజీ నారాయణ రావుగారి చరిత్ర భవిష్యత్తు తరాలైన విద్యార్థులకు తెలియజేయాలనే ఉద్దేశ్యంతో 'ప్రజాకవి కాళోజీ' చిత్రాన్ని నిర్మించాం. కాళోజీగారి బయోపిక్ అందరికీ చేరువ కావాలని విద్యార్థులకు థియేటర్‌లో ఉదయం ఆటను ఉచితంగా ప్రదర్శించగా అద్భుతమైన స్పందన వచ్చింది. ఇలాంటి మంచి సినిమాను నిర్మించే అవకాశం ఇచ్చిన నా భర్త ప్రభాకర్ జైనీకి ధన్యవాదాలు" అని నిర్మాత విజయలక్ష్మీ జైనీ తెలిపారు. ప్రభాకర్ జైనీ దర్శకత్వంలో రూపొందిన 'ప్రజాకవి కాళోజీ' బయోపిక్ ఈ నెల 23న విడుదలైంది. టైటిల్ రోల్‌లో మూలవిరాట్, ఇతర ముఖ్య పాత్రల్లో పద్మ, రాజ్ కుమార్, స్వప్న నటించారు. "తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఈ నెల 23 నుండి ప్రతిరోజూ ఉదయం ఆటను స్కూలు పిల్లలకు ఉచితంగా ప్రదర్శించడం జరిగింది. ఈ చిత్రం విద్యార్థులకు చేరువ కావడం ఆనందంగా ఉంది" అని ప్రభాకర్ జైనీ పేర్కొన్నారు.

తండ్రీ కొడుకుల అనుబంధం


అపర్ణా దాస్, కవిన్


కవిన్, అపర్ణా దాస్ లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'డా..డా'. గణేశ్ కె.బాబు దర్శకత్వం వహించిన ఈ సినిమా తమిళంలో ఘన విజయం సాధించింది. భాగ్యరాజా, వీటీవీ గణేశ్, ఐశ్వర్య, ప్రదీప్ శక్తి తదితరులు నటించిన ఈ చిత్రాన్ని 'పా.. పా..' పేరుతో జేకే ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్‌పై నిర్మాత నీరజ కోట తెలుగులో విడుదల చేస్తున్నారు. జనవరి 3న ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు అమెరికా, ఆస్ట్రేలియాలో ఈ చిత్రం విడుదల కానుంది. నీరజ కోట మాట్లాడుతూ– "తండ్రీ కొడుకుల అనుబంధం నేపథ్యంలో తెరకెక్కిన చిత్రం 'పా.. పా..'. భావోద్వేగం, ప్రేమ, వినోదం... ఇవన్నీ సమపాళ్లలో ఉన్న ఫీల్ గుడ్ ఎమోషనల్ డ్రామా ఇది. తమిళంలో బ్లాక్ బస్టర్‌గా నిలిచిన ఈ మూవీ తెలుగు ప్రేక్షకులకు కూడా కనెక్ట్ అవుతుందనే నమ్మకం ఉంది. ఎంజీఎం సంస్థ నుంచి అచ్చిబాబు ఈ మూవీని విడుదల చేయనున్నారు" అని చెప్పారు.

భక్తిలో పారవశ్యం... కన్నప్పకి సర్వస్వం


ప్రీతీ ముకుందన్

అందంలో సహజం... తెగింపులో సాహసం... ప్రేమలో అసాధారణం... భక్తిలో పారవశ్యం ... కన్నప్పకి సర్వస్వం... ఇదంతా ఎవరి గురించి అంటే... చెంచు యువరాణి నెమలి గురించి అన్నమాట. ఈ నెమలి అంటే ఎవరో కాదు... ఇక్కడున్నారు.. చూస్తున్నారు కదా.. ఆమె హీరోయిన్ ప్రీతీ ముకుందన్. మంచు విష్ణు హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'కన్నప్ప'. ఈ చిత్రంలో ప్రీతీ ముకుందన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ చిత్రంలో మోహన్‌బాబు, మోహన్ లాల్, శరత్ కుమార్, మధుబాల, బ్రహ్మానందం, దేవరాజ్, బ్రహ్మాజీ ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తుండగా, ప్రభాస్, అక్షయ్ కుమార్, కాజల్ అగర్వాల్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సోమవారం ఈ సినిమాలోని నెమలి పాత్రలో హీరోయిన్ ప్రీతీ ముకుందన్ నటిస్తున్నట్లుగా వెల్లడించి, ఆమె ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వంలో మోహన్‌బాబు నిర్మిస్తున్న ఈ చిత్రం 2025 ఏప్రిల్ 25న విడుదల కానుంది. "కన్నప్ప' చిత్రంలో ధైర్యవంతుడైన యోధుడు, శివుని భక్తుడైన కన్నప్ప కథను అద్భుతంగా చూపించనున్నాం. గొప్ప సినిమాటిక్ అనుభూతినిచ్చే విజువల్ వండర్‌గా ప్రేక్షకుల ముందుకు ఈ చిత్రం రాబోతోంది" అని చిత్రయూనిట్ పేర్కొంది.

భావోద్వేగాల బాపు


బ్రహ్మాజీ, సుధాకర్ రెడ్డి

బ్రహ్మాజీ ప్రధాన పాత్రలో, ఆమని, అవసరాల శ్రీనివాస్, 'బలగం' సుధాకర్ రెడ్డి, ధన్యా బాలకృష్ణ ఇతర పాత్రల్లో నటిస్తున్న డార్క్ కామెడీ అండ్ ఎమోషనల్ డ్రామా మూవీ 'బాపు'. ఈ చిత్రంలో బ్రహ్మాజీతో పాటు మరో లీడ్ రోల్‌లో నటిస్తున్న దయా ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. కామ్రేడ్ ఫిల్మ్ ఫ్యాక్టరీ పతాకంపై రాజు, సీహెచ్. భాను ప్రసాద్ రెడ్డి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. తాజాగా 'బాపు' ఫస్ట్ లుక్ పోస్టర్‌ను నటుడు – నిర్మాత రానా విడుదల చేశారు. "బాపు నిజ జీవిత సంఘటనల స్ఫూర్తితో ఓ వ్యవసాయ కుటుంబానికి చెందిన భావోద్వేగాల ప్రయాణమే ఈ చిత్రం. కుటుంబంలోని ఓ సభ్యుడు తన ఫ్యామిలీ కోసం తన జీవితాన్ని త్యాగం చేయాల్సి వచ్చినప్పుడు ఎలాంటి పరిస్థితులు నెలకొంటాయి? అనే అంశాలు ఉంటాయి. డార్క్ కామెడీ, హ్యూమర్, ఎమోషనల్‌గా హత్తుకునే సన్నివేశాలు ఈ సినిమాలో ఉంటుంది" అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: ఆర్ఆర్ ధ్రువన్.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
451	169
78,248	23,645

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	19,596	▽	126
డోజోన్స్	42,684	▽	308
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,121	▽	28
డాక్స్	19,909	▽	75
షాంఘై	3,407	△	7
నికాయ్	39,895	▽	387

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	76,194
బంగారం (99.5 స్వచ్ఛత)	75,889
వెండి (కిలో)	87,175

ఫారెక్స్ రేట్లు రూ.లలో

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	83.99	87.10
£	బ్రిటన్ పౌండ్	105.36	109.63
€	యూరో	87.24	91.09
¥	జపాన్ ఎన్ (100)	43.00	64.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	51.04	55.16
S$	సింగపూర్ డాలర్	60.93	65.00
SAR	సౌదీ రియాల్	21.93	23.44
UAE D	యూఏఈ దిర్హామ్	22.43	24.15
¥	చైనా యువాన్	10.97	12.56

సెన్సెక్స్ 451 పాయింట్లు డౌన్

23,650 దిగువకు నిఫ్టీ



ముంబై: అధిక వెయిటేజీ షేర్లలో అమ్మకాలు, అంతర్జాతీయ మార్కెట్లలోని ప్రతికూల సంకేతాల ప్రభావంతో సోమవారం స్టాక్ సూచీలు అరశాతానికి పైగా నష్టపోయాయి. విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలు, రూపాయి బలహీనతలు సెంటిమెంట్‌పై మరింత ఒత్తిడి పెంచాయి. సెన్సెక్స్ 451 పాయింట్లు కోల్పోయి 78,248 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 169 పాయింట్లు క్షీణించి 23,645 వద్ద నిలిచింది. ఉదయం స్వల్ప నష్టాలతో మొదలైన కాసేపటికే నష్టాలు భర్తీ చేసుకోగలిగాయి. అయితే మిడ్‌సెషన్ నుంచి రిలయన్స్, హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ బ్యాంకులు **1% పతనంతో** పాటు ఆటోరంగ షేర్లలో అమ్మకాల**తో మళ్లీ నష్టా**ల్లోకి జారుకున్నాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 79,098 వద్ద గరిష్టాన్ని, 78,077 వద్ద కనిష్టాన్ని **తాకింది.** నిఫ్టీ 23,915 – 23,599 శ్రేణిలో ట్రేడైంది. **ఫార్మా,** ఐటీ, టెలికమ్యూనికేషన్ షేర్లకు **కొనుగోళ్ల మద్దతు** లభించింది. వచ్చే ఏడాదిలో ఫెడ్ **వడ్డీరేట్ల తగ్గింపుపై** అంచనాలు సన్నగిల్లడంతో అం**తర్జాతీయ ఈక్విటీ** మార్కెట్లు నష్టాల్లో ట్రేడవుతున్నాయి.

లిస్టింగ్స్‌లో రెండు హిట్, మరొకటి డీలా

ఇటీవల ఐపీఓ పూర్తి చేసుకున్న మూడు కంపెనీల షేర్లు సోమవారం ఎక్సే్ఛంజీల్లో లిస్టయ్యాయి. తొలిరోజు రెండు కంపెనీల షేర్లు లాభాలు పంచగా, మరొకటి నష్టాలు మిగిల్చింది.



సెనోర్స్ ఫార్మాస్యూటికల్స్: ఇష్యూ ధర (రూ.391)తో పోలిస్తే బీఎస్‌ఈలో షేరు 52% ప్రీమియంతో రూ.594 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో 56% ఎగసి రూ.609 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 43% లాభంతో రూ.558 వద్ద స్థిరపడింది. కంపెనీ మార్కెట్ క్యాప్ రూ.2,569 కోట్లుగా నమోదైంది.



వెంటివ్ హాస్పిటల్స్: ఇష్యూ ధర(రూ.643)తో 12% అధికంగా రూ.718 వద్ద లిస్టయ్యింది. ఒక దశలో 16% పెరిగి రూ.749 వద్ద గరిష్టాన్ని తాకింది. ఆఖరికి 10% లాభంతో రూ.705 వద్ద నిలిచింది. కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.16,454 కోట్లుగా నమోదైంది.

కారారో ఇండియా: ఇష్యూ ధర(రూ.704)తో పోలిస్తే 10% డిస్కౌంట్‌తో రూ.660 వద్ద ట్రేడింగ్ మొదలైంది. ఒక దశలో రూ.631 వద్ద కనిష్టాన్ని తాకి, చివరికి 9.50% నష్టంతో రూ.636 వద్ద స్థిరపడింది. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.3,617 కోట్లుగా నమోదైంది.




విల్మర్ నుంచి అదానీ ఔట్

జేవీలో వాటా విక్రయానికి రెడీ ● విల్మర్‌కు 31 శాతం వాటా ఆఫర్ ● డీల్ విలువ రూ. 12,314 కోట్లు ● ఫార్చూన్ బ్రాండ్‌తో ఫుడ్ ప్రొడక్టులు

న్యూఢిల్లీ: ఎఫ్ఎంసీజీ దిగ్గజం అదానీ విల్మర్ నుంచి బిలియనీర్ గౌతమ్ అదానీ గ్రూప్ వైదొలగనుంది. ఈ భాగస్వామ్య కంపెనీ(జేవీ)లో అదానీ గ్రూప్, సింగపూర్ సంస్థ విల్మర్ విడిగా 43.94 శాతం చొప్పున వాటా కలిగి ఉన్నాయి. అయితే దీనిలో 31.06 శాతం వాటాను విల్మర్‌కు విక్రయించనున్నట్లు అదానీ గ్రూప్ కంపెనీ అదానీ ఎంటర్‌ప్రైజెస్ తాజాగా వెల్లడించింది. షేరుకి రూ. 305 ధర మించకుండా విల్మర్‌కు వాటాను అమ్మివేయనున్నట్లు పేర్కొంది. తద్వారా రూ. 12,314 కోట్లు అందుకోనుంది. కంపెనీ ఫార్చూన్ బ్రాండ్‌తో వంట నూనెలుసహా పలు ఫుడ్ ప్రొడక్టులను విక్రయిస్తున్న విషయం విదితమే. మరో 13 శాతం వాటాను పబ్లిక్‌కు కనీస వాటా నిబంధనకు అనుగుణంగా ఓపెన్ మార్కెట్లో విక్రయించనున్నట్లు అదానీ ఎంటర్‌ప్రైజెస్ తెలియజేసింది. వెరసి పూర్తి వాటాను 200 కోట్ల డాలర్లకు(సుమారు రూ. 17,100 కోట్లు) విక్రయించనుంది. తద్వారా కంపెనీ నుంచి పూర్తిగా వైదొలగనుంది. లావాదేవీలు 2025 మార్చి31కల్లా పూర్తికావచ్చని అంచనా వేసింది. ఫలితంగా అదానీ నామినీ డైరెక్టర్లు జేవీ బోర్డు నుంచి తప్పుకోనున్నట్లు వెల్లడించింది.

వృద్ధిపై వెచ్చింపు

అదానీ విల్మర్‌లో వాటా విక్రయం ద్వారా సమకూరే నిధులను వృద్ధి అవకాశాలపై వెచ్చించనున్నట్లు అదానీ ఎంటర్‌ప్రైజెస్(ఏఈఎల్) పేర్కొంది. ఎనర్జీ, యుటిలిటీ, ట్రాన్స్‌పోర్ట్, లాజిస్టిక్స్ తదితర కీలకమైన మౌలిక సదుపాయాల బిజినెస్ పురోభివృద్ధికి వినియోగించనున్నట్లు వివరించింది. తాజా లావాదేవీ ద్వారా అదానీ గ్రూప్ లిక్విడిటీ పరిస్థితి మెరుగుపడనుంది.



కాగా.. ఏఈఎల్ నుంచి అదానీ విల్మర్‌లో గరిష్టంగా 31.06 శాతం వాటా కొనుగోలుకి విల్మర్ ఒప్పందం కుదుర్చుకుంది. అంతేకాకుండా పబ్లిక్‌కు కనీస వాటా నిబంధనమేరకు 13 శాతం వాటాను ఏఈఎల్ ఓపెన్ మార్కెట్లో విక్రయించనుంది. ఇందుకు రెండు కంపెనీలు చేతులు కలిపినట్లు ఒక ప్రకటనలో తెలియజేశాయి. ప్రస్తుతం అదానీ విల్మర్‌లో రెండు కంపెనీలకూ సంయుక్తంగా 87.87 శాతం వాటా ఉంది. అయితే క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నిబంధనల ప్రకారం లిస్టింగ్ తదుపరి పబ్లిక్‌కు కనీసం 25 శాతం వాటాను ఆఫర్ చేయవలసి ఉంది.

కంపెనీ బ్యాక్‌గ్రౌండ్

1999 జనవరిలో సమాన వాటాతో జేవీగా ఏర్పాటైన అదానీ విల్మర్.. ఫార్చూన్ బ్రాండుతో వంట నూనెలు, రైస్, ఆటాసహా వివిధ ఆహారోత్పత్తులను తయారు చేసి విక్రయిస్తోంది. 10 రాష్ట్రాలలో 23 ప్లాంట్లను నిర్వహిస్తోంది. ఐపీవో ద్వారా రూ. 3,600 కోట్లు సమీకరించింది. స్టాక్ ఎక్సే్ఛంజీలలో 2022 ఫిబ్రవరిలో లిస్టయ్యింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన గతేడాది(2023–24) రూ. 51,555 కోట్లకుపైగా ఆదాయాన్ని అందుకుంది. ప్రస్తుతం కంపెనీ మార్కెట్ విలువ రూ. 42,785 కోట్లుగా నమోదైంది. నవంబర్‌లో గ్రూప్ వ్యవస్థాపకుడు, చైర్మన్ గౌతమ్ అదానీ తదితరులపై యూఎస్ ఫెడరల్ ప్రాసిక్యూటర్లు అవినీతి ఆరోపణలు చేశాక గ్రూప్ చేపట్టిన తొలి భారీ లావాదేవీ ఇది. గ్రూప్ ఈ ఆరోపణలను తోసిపుచ్చడంతో పాటు న్యాయపరంగా ఎదుర్కొనేందుకు సిద్ధపడిన సంగతి తెలిసిందే.

ఈ వార్తల నేపథ్యంలో ఎన్ఎస్ఈలో అదానీ విల్మర్ షేరు 2 శాతం క్షీణించి రూ. 323 వద్ద ముగిసింది. 52 వారాల గరిష్టం రూ. 409కాగా.. కనిష్టం రూ. 279గా నమోదైంది. మరోపక్క అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేరు 7.3 శాతం జంప్‌చేసి రూ. 2,585 వద్ద స్థిరపడింది.

కార్పొరేట్ వలంటీర్లు



● సమాజ సేవలో ఉద్యోగులు ● ప్రోత్సహిస్తున్న కంపెనీలు
● విద్య, ఆరోగ్య రంగాల్లో సాయమందించేలా కార్యక్రమాలు
● జాబితాలో ఇన్ఫీ, హెచ్‌యూఎల్ తదితర సంస్థలు

సమాజం నుంచి తీసుకోవడమే కాదు .. ఎంతో కొంత సమాజానికి తిరిగి కూడా ఇవ్వాలనే స్ఫూర్తితో పలు కార్పొరేట్ కంపెనీలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. విద్య, ఆరోగ్యం, నైపుణ్యాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ తదితర రంగాల్లో ప్రజలకు సాయమందించేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. వాటిలో వలంటీర్లుగా పాలుపంచుకునేలా ఉద్యోగులను కూడా ప్రోత్సహిస్తున్నాయి. ఇందుకోసం, పెయిడ్ లీవ్‌లివ్వడమే కాకుండా తగు ప్రోత్సాహకాలు ఇస్తున్నాయి. దీంతో ఉద్యోగులు కూడా ఉత్సాహంగా పాల్గొంటున్నారు. మరింత సమయం సైతం వెచ్చించేందుకు ముందుకు వస్తున్నారు. ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనేలా ఉద్యోగులను ప్రోత్సహిస్తున్న వాటిల్లో ఇన్ఫోసిస్, పీఅండ్‌జీ, క్యాప్‌జెమిని, స్టాండర్డ్ చార్టర్డ్, హెచ్‌యూఎల్, నెట్‌యాప్ తదితర కంపెనీలు ఉన్నాయి.

వివిధ కంపెనీలు నిర్వహిస్తున్న ప్రాజెక్టుల్లో కొన్ని..

ఇన్ఫోసిస్: జీవవైవిధ్యానికి తోడ్పడేలా ప్రాంతీయంగా వృక్ష సంపదను పెంపొందించేందుకు కంపెనీ నడుం కట్టింది. ఉద్యోగులంతా కలిసి ఇటీవలే 2,00,000కు పైగా సీడ్‌బాల్స్‌ను తయారు చేశారు. వీటిని దేశవ్యాప్తంగా దాదాపు 20 ప్రాంతాల్లో అడవుల పెంపకం ప్రాజెక్టుల్లో ఉపయోగించనున్నారు. ఇక ఇన్ఫీకి చెందిన బీపీఎం విభాగం ప్రాజెక్ట్ జెనిసిస్ పేరిట మరో కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. కార్పొరేట్ కంపెనీల్లో ఉద్యోగాలను అందిపుచ్చుకునేందుకు ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లోని విద్యార్థులకు అవసరమైన నైపుణ్యాల్లో శిక్షణ కల్పిస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో ఇలా 78,000 మందికి పైగా విద్యార్థులకు తోడ్పాటు అందించింది.

పీఅండ్‌జీ: అంతగా విద్యా సేవలు అందని ప్రాంతాల్లోని బాలలకు చదువును అందుబాటులోకి తెచ్చే దిశగా శిక్షా ప్రోగ్రాంను నిర్వహిస్తోంది. దీనితో దాదాపు యాభై లక్షల మందికి పైగా చిన్నారులు లబ్ధి పొందినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

క్యాప్‌జెమిని: విద్య, సస్టైనబిలిటీ, ఆరోగ్య సంరక్షణ, నైపుణ్యాల అభివృద్ధి మొదలైన కార్యక్రమాలపై దృష్టి పెట్టింది. వీటిలో 90,000 **మందికి పైగా ఉద్యోగులు పాల్గొన్నారు.** మొత్తం 2,43,000 పైగా గం**టల సమయం వెచ్చించారు. గత కొన్నాళ్లుగా ఉద్యోగులు స్వచ్ఛందంగా ఇలాంటి కార్యక్రమాల కోసం వె**చ్చించే సమయం వార్షికంగా 20 శాతం మేర పెరుగుతోందని సంస్థ వర్గాలు తెలిపాయి. ఉద్యోగులు మాక్ ఇంటర్వ్యూలు .. రెజ్యూమె బిల్డింగ్ వర్క్‌షాప్‌లు నిర్వహించడం, కెరియర్ విషయంలో మార్గనిర్దేశనం చేయడం మొదలైన మార్గాల్లో ఉద్యోగార్థులకు సహాయం చేస్తున్నారు. జాబ్ మార్కెట్‌కి అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకుని, అవకాశాలను అందిపుచ్చుకునేలా వారికి తోడ్పాటు అందిస్తున్నారు.

స్టాండర్డ్ చార్టర్డ్: నైపుణ్యాలను బట్టి వివిధ సామాజిక సేవా ప్రాజెక్టుల్లో పాలుపంచుకునేలా ఉద్యోగులను ప్రోత్సహిస్తోంది. విద్యార్థులకు మార్గనిర్దేశనం చేయడం, కెరియర్‌పరంగా గైడెన్స్ ఇవ్వడం వంటి కార్యక్రమాలను చేపడుతోంది. వాటిలో పాల్గొనే ఉద్యోగులకు మూడు రోజుల పాటు పెయిడ్ లీవ్ కూడా ఇస్తోంది. ఇలాంటి కార్యక్రమాలపై ఉద్యోగులంతా కలిసి మొత్తం 1,17,376 గంటల సమయాన్ని వెచ్చించారు.

– సాక్షి, బిజినెస్ డెస్క్

పెట్రోల్, డీజిల్‌పై రూ.5 వరకు తగ్గింపు: నయారా

హైదరాబాద్: ప్రైవేటు రంగ చమురు సంస్థ నయారా ఎనర్జీ పండుగల సందర్భంగా వాహన యజమానుల కోసం ఆఫర్ ప్రకటించింది. డిజిటల్ పేమెంట్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా ఇంధనం నింపుకుంటే లీటర్ పెట్రోల్, డీజిల్‌పై రూ.5 వరకు తగ్గింపు ఇస్తున్నట్లు తెలిపింది. 'సబ్ కీ జీత్ గ్యారంటీడ్ 2024' పథకం కింద పట్టణ, గ్రామీణ ప్రాంత బంకుల్లోనూ పెట్రోల్, డీజిల్‌పై ఈ ఆఫర్ అమలవుతుందని పేర్కొంది. 'కస్టమర్లు కేవలం డబ్బును ఆదా చేసుకోవడమే కాకుండా డిజిటల్ లావాదేవీలు ప్రోత్సహించేందుకు ఈ పథకాన్ని ప్రారంభించాము' అని నయారా ఎనర్జీ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ మాధుర్ తనేజా వెల్లడించారు. జనవరి 31 వరకు ఆఫర్ అమల్లో ఉంటుంది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

బడ్జెట్‌లో వ్యక్తిగత ఆదాయపన్ను తగ్గించాలి	స్థిరంగా భారత్ ఎకానమీ: ఆర్‌బీఐ

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..

» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం- తెలంగాణ చరిత్ర
» టెట్/డీఎస్సీ ప్రత్యేకం- బయాలజీ
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం- జాగ్రఫీ
» బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం-రీజనింగ్

విద్య, ఉద్యోగ సమాచారం

ఎస్‌బీఐలో 600 ప్రొబేషనరీ ఆఫీసర్ పోస్టులు

కేంద్ర ప్రభుత్వ రంగ బ్యాంకు.. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)లో ప్రొబేషనరీ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 600.
» **అర్హత:** ఏదైనా విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. చివరి సంవత్సరం ఫైనల్ పరీక్షలు రాసిన అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
» **వయసు:** 01.04.2024 నాటికి 21 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.48,480 నుంచి రూ.85,920.
» **ఎంపిక విధానం:** ఫేజ్–1 ప్రిలిమినరీ పరీక్ష, ఫేజ్–2 మెయిన్ ఎగ్జామినేషన్, ఫేజ్–3 సైకోమెట్రిక్ టెస్ట్, గ్రూప్ ఎక్సర్‌సైజ్, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు. ప్రిలిమినరీ పరీక్షలో మొత్తం 100 మార్కులకు–100 ప్రశ్నలు ఉంటాయి. ఇందులో ఇంగ్లిష్ లాంగ్వేజ్ (40 ప్రశ్నలు), క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్(30 ప్రశ్నలు), రీజనింగ్ ఎబిలిటీ(30 ప్రశ్నలు)ల నుంచి ప్రశ్నలు వస్తాయి. పరీక్ష సమయం 1 గంట.
» **మెయిన్స్ పరీక్ష:** మొత్తం 200 మార్కులకు–170 ప్రశ్నలు ఆబ్జెక్టివ్ విధానంలో పరీక్ష జరుగుతుంది. ఇందులో రీజనింగ్–కంప్యూటర్ ఆప్టిట్యూడ్ (40 ప్రశ్నలు–60 మార్కులు), డేటా అనాలసిస్–ఇంటర్‌ప్రెటేషన్ (30 ప్రశ్నలు–60 మార్కులు), జనరల్ అవేర్‌నెస్/ఎకానమీ/బ్యాంకింగ్ నాలెడ్జ్, ఇంగ్లిష్ లాంగ్వేజ్ (40 ప్రశ్నలు–20 మార్కులు) ఉంటాయి. పరీక్ష సమయం మూడు గంటలు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:** 16.01.2025
» **ఫేజ్–1 ఆన్‌లైన్ ప్రిలిమినరీ పరీక్ష తేదీలు:** 2025 మార్చి 08,15.
» **ఫేజ్–2 ఆన్‌లైన్ మెయిన్ ఎగ్జామ్:** ఏప్రిల్/మే 2025.
» **ఇంటర్వ్యూ, గ్రూప్ ఎక్సర్‌సైజ్ తేదీలు:** మే/జూన్, 2025.
» **వెబ్‌సైట్:** https://bank.sbi/web/careers/current-openings

ఐటీబీపీలో 51 హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్ పోస్టులు

ఇండో–టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్ (ఐటీబీపీ).. గ్రూప్–సి నాన్ గెజిటెడ్(నాన్ మినిస్టీరియల్).. విభాగంలో హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి అర్హులైన పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 51. » **పోస్టుల వివరాలు:** హెడ్ కానిస్టేబుల్ (మోటార్ మెకానిక్)–07, కానిస్టేబుల్ (మోటార్ మెకానిక్)–44.
» **అర్హత:** హెడ్ కానిస్టేబుల్ పోస్టులకు 10+2 ఉత్తీర్ణులవ్వాలి. మోటార్ మెకానిక్ సర్టిఫికేట్/డిప్లొమా(ఆటోమొబైల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులవ్వాలి. కానిస్టేబుల్ పోస్టులకు పదో తరగతి, ఐటీఐ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** 22.01.2025నాటికి 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** హెడ్ కానిస్టేబుల్ పోస్టులకు రూ.25,500 నుంచి రూ.81,100, కానిస్టేబుల్ పోస్టులకు రూ.21,700 నుంచి రూ.69,100.
» **ఎంపిక విధానం:** ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, డాక్యుమెంటేషన్, రాతపరీక్ష, ప్రాక్టికల్(స్కిల్) టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 22.01.2025.
» **వెబ్‌సైట్:** https://recruitment.itbpolice.nic.in

ఎస్‌బీఐలో జూనియర్ అసోసియేట్ కొలువు

బ్యాంకు కొలువులంటే యువతలో ఎంతో క్రేజ్. అందుకే బ్యాంక్ జాబ్ నోటిఫికేషన్ల కోసం ఎదురు చూస్తూ సుదీర్ఘకాలం ప్రిపరేషన్ సాగిస్తుంటారు. అలాంటి వారికి దేశంలోని అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు.. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) నూతన సంవత్సరం వేళ శుభవార్త అందించింది! తాజాగా క్లరికల్ హోదాలో.. 13వేలకు పైగా జూనియర్ అసోసియేట్ (కస్టమర్ సపోర్ట్ అండ్ సేల్స్) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఏదైనా డిగ్రీతో ఈ పోస్టులకు పోటీపడొచ్చు. ఈ నేపథ్యంలో.. ఎస్‌బీఐ జూనియర్ అసోసియేట్స్ పోస్టులు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్ విశ్లేషణ, ప్రిపరేషన్ తదితర వివరాలు..

» 13,735 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల
» తెలుగు రాష్ట్రాల్లో 392 ఖాళీలు
» రెండు దశల్లో ఎంపిక ప్రక్రియ నిర్వహణ
» ఏదైనా డిగ్రీతో పోటీ పడే అవకాశం

మొత్తం పోస్టుల సంఖ్య 13,735

ప్రతి ఏటా వేల సంఖ్యలో క్లరికల్ కేడర్ పోస్ట్‌లను భర్తీ చేస్తున్న ఎస్‌బీఐ.. తాజా నోటిఫికేషన్‌లోనూ అదే పంథా కొనసాగించింది. ఇటీవల మొత్తం13,735 జూనియర్ అసోసియేట్ పోస్ట్‌ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. వీటికి అదనంగా మరో 609 బ్యాక్‌లాగ్ పోస్ట్‌ల భర్తీ కూడా చేపట్టనుంది.

తెలుగు రాష్ట్రాల్లో 392 పోస్ట్‌లు

ఎస్‌బీఐ జూనియర్ అసోసియేట్ పోస్ట్‌లకు సంబంధించి సర్కిల్స్ వారీగా ఖాళీలను ప్రకటించింది. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి హైదరాబాద్ సర్కిల్‌లో 342 పోస్ట్‌లు, అమరావతి (ఆంధ్రప్రదేశ్) సర్కిల్‌లో 50 పోస్ట్‌లు ఉన్నాయి. నోటిఫికేషన్‌లో పేర్కొన్న ప్రకారం–అభ్యర్థులు ఏదో ఒక సర్కిల్‌కు దరఖాస్తు చేసుకుని పోటీ పడొచ్చు.

అర్హతలు

- 2024, డిసెంబర్ 31 నాటికి బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత సాధించాలి.
- **వయసు:** 2024, ఏప్రిల్ 1 నాటికి 20–28 ఏళ్ల మధ్యలో ఉండాలి. గరిష్ట వయో పరిమితిలో ఎస్సీ, ఎస్టీ కేటగిరీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీలకు మూడేళ్ల సడలింపు లభిస్తుంది.

రెండు దశల రాత పరీక్ష

ఎస్‌బీఐ జూనియర్ అసోసియేట్ పోస్టుల భర్తీకి రెండు దశల ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. ముందుగా ప్రిలిమినరీ రాత పరీక్ష ఉంటుంది. ఇందులో అర్హత సాధించిన వారికి రెండో దశలో మెయిన్ ఎగ్జామినేషన్ జరుగుతుంది. అయితే నియామకాల తుది ఖరారుకు మెయిన్ పరీక్షలో చూపిన ప్రతిభను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు.

100 మార్కులకు ప్రిలిమ్స్

ఎంపిక ప్రక్రియలో తొలిదశ ప్రిలిమినరీ పరీక్ష 100 ప్రశ్నలు–100 మార్కులకు ఉంటుంది. ఇందులో ఇంగ్లిష్ లాంగ్వేజ్ 30 ప్రశ్నలు–30 మార్కులకు, న్యూమరికల్ ఎబిలిటీ 35 ప్రశ్నలు–35 మార్కులకు, రీజనింగ్ ఎబిలిటీ 35 ప్రశ్నలు–35 మార్కులకు ఉంటాయి. పరీక్ష సమయం ఒక గంట. పరీక్ష పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో ఆబ్జెక్టివ్ తరహాలో జరుగుతుంది. ఇంగ్లిష్ లాంగ్వేజ్ మినహా మిగతా విభాగాలకు సంబంధించి అభ్యర్థులు తమ రాష్ట్రానికి చెందిన లేదా తాము దరఖాస్తు చేసుకున్న రాష్ట్రానికి సంబంధించిన ప్రాంతీయ భాషలో పరీక్ష రాయొచ్చు.

మొత్తం 200 మార్కులకు మెయిన్

తొలిదశ ప్రిలిమినరీ పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా 1:10 నిష్పత్తిలో (ఒక్కో పోస్ట్‌కు పది మందిని చొప్పున) తదుపరి దశ మెయిన్ ఎగ్జామ్‌కు ఎంపిక చేస్తారు. ఆన్‌లైన్ విధానంలో ఆబ్జెక్టివ్ తరహాలో జరిగే మెయిన్ పరీక్ష మొత్తం నాలుగు విభాగాల్లో 190 ప్రశ్నలు–200 మార్కులకు ఉంటుంది. ఇందులో–జనరల్ /ఫైనాన్షియల్ అవేర్‌నెస్ 50 ప్రశ్నలు–50 మార్కులకు, జనరల్ ఇంగ్లిష్ 40 ప్రశ్నలు–40 మార్కులకు, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ 50 ప్రశ్నలు–50 మార్కులకు, రీజనింగ్ ఎబిలిటీ అండ్ కంప్యూటర్ ఆప్టిట్యూడ్ 50 ప్రశ్నలు–60 మార్కులకు ఉంటాయి. పరీక్ష సమయం 2 గంటల 40 నిమిషాలు. మెయిన్ ఎగ్జామ్‌లోనూ అభ్యర్థులు జనరల్ ఇంగ్లిష్ మినహా మిగతా విభాగాలను తమకు ఆసక్తి, అర్హత ఉన్న ప్రాంతీయ భాషలో హాజరయ్యే అవకాశం ఉంది.

స్థానిక భాష పరీక్ష

అభ్యర్థులు తాము పరీక్షకు హాజరయ్యే మాధ్యమాన్ని దరఖాస్తు సమయంలోనే పేర్కొనాల్సి ఉంటుంది. దాని ఆధారంగానే పరీక్ష పేపర్ మాధ్యమం ఉంటుంది. ఒకవేళ మాతృ భాష కాకుండా వేరే భాషల్లో పరీక్ష రాసేందుకు ఆసక్తి చూపిన అభ్యర్థులకు.. మెయిన్ ఎగ్జామినేషన్ తర్వాత ప్రత్యేకంగా వారు ఎంపిక చేసుకున్న భాషలో లోకల్ లాంగ్వేజ్ టెస్ట్ నిర్వహిస్తారు. అభ్యర్థులు తాము ఎంపిక చేసుకున్న సర్కిల్‌లో అధికార భాషకు సంబంధించిన లాంగ్వేజ్ టెస్ట్‌కు హాజరు కావాలి.

ప్రిపరేషన్ ఇలా

ఎస్‌బీఐ నోటిఫికేషన్‌లో పేర్కొన్న ప్రకారం–ప్రిలిమినరీ పరీక్షను 2025 ఫిబ్రవరిలో నిర్వహించే అవకాశముంది. ఆ తర్వాత మెయిన్ ఎగ్జామినేషన్ మార్చి/ఏప్రిల్‌లో జరుగుతుంది. అభ్యర్థులకు ప్రిలిమ్స్‌కు గరిష్టంగా నెలన్నర, మెయిన్స్‌కు మూడు /నాలుగు నెలల సమయం అందుబాటులో ఉంటుంది. కాబట్టి అభ్యర్థులు ముందుగా ప్రిలిమ్స్ పరీక్ష తేదీ వరకు.. ప్రిలిమ్స్, మెయిన్స్ రెండింటిలో కామన్‌గా ఉన్న సబ్జెక్ట్‌ల సన్నద్ధత సాధించాలి. ఆ తర్వాత మెయిన్స్‌పై దృష్టి పెట్టాలి. మెయిన్‌లో మాత్రమే ఉన్న జనరల్/ఫైనాన్షియల్ అవేర్‌నెస్, కంప్యూటర్ ఆప్టిట్యూడ్ విభాగాలకు ప్రత్యేక సమయం కేటాయించాలి.

ఇంగ్లిష్ లాంగ్వేజ్

ఈ విభాగంలో రాణించాలంటే.. బేసిక్ గ్రామర్‌పై అవగాహన పెంచుకోవాలి. ఇడియమ్స్, ఫ్రేజెస్, సెంటెన్స్ కరెక్షన్, వొకాబ్యులరీ, సెంటెన్స్ రీ అరేంజ్‌మెంట్, వన్‌వర్డ్ సబ్‌స్టిట్యూట్స్‌పై పట్టు సాధించాలి. జనరల్ ఇంగ్లిష్ నైపుణ్యం పెంచుకోవాలి. ఇందుకోసం ఇంగ్లిష్ దినపత్రికలు చదవడం, వాటిలో వినియోగిస్తున్న పదజాలం, వాక్య నిర్మాణం వంటి వాటిపై దృష్టి పెట్టాలి.

న్యూమరికల్ ఎబిలిటీ

మెయిన్ పరీక్షలో క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్‌కు సరితూగే విభాగంగా దీన్ని పేర్కొనొచ్చు. ప్రధానంగా అర్థమెటిక్ అంశాల (పర్సంటేజెస్, నిష్పత్తులు, లాభ నష్టాలు, నంబర్ సిరీస్, బాడ్‌మాస్ నియమాలు)పై పూర్తిగా అవగాహన పొందేలా ప్రాక్టీస్ చేయాలి. వీటితోపాటు డేటా ఇంటర్‌ప్రిటేషన్, డేటా అనాలిసిస్‌లపై పట్టు సాధించాలి.

రీజనింగ్

ఈ విభాగం ప్రిలిమ్స్, మెయిన్స్ రెండింటిలో ఉంటుంది. ఇందులో మంచి మార్కుల సాధనకు కోడింగ్–డీకోడింగ్, బ్లడ్ రిలేషన్స్, డైరెక్షన్, సిలాజిజమ్ విభాగాలను బాగా ప్రాక్టీస్ చేయాలి. ప్రిలిమ్స్ సమయానికే ఈ అంశాల్లో పట్టు సాధిస్తే.. మెయిన్‌లో అధిక శాతం సిలబస్‌ను పూర్తి చేసినట్లవుతుంది.

జనరల్/ఫైనాన్షియల్ అవేర్‌నెస్

మెయిన్‌లో మాత్రమే ఉండే ఈ విభాగంలో రాణించాలంటే.. తాజా బ్యాంకింగ్ రంగం పరిణామాలు, విధానాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. బ్యాంకింగ్ రంగంలోని అబ్రివేషన్లు, పదజాలం, విధులు, బ్యాంకులకు సంబంధించిన కొత్త విధానాలు, కోర్ బ్యాంకింగ్‌కు సంబంధించి చట్టాలు, విధానాలు, రిజర్వ్ బ్యాంకు విధులు వంటి వాటిపై అవగాహన పెంచుకోవాలి. జనరల్ అవేర్‌నెస్‌లో కరెంట్ అఫైర్స్, స్టాక్ జీకే కోణంలోనూ ఆర్థిక సంబంధ వ్యవహారాల(ఎకానమీ, ప్రభుత్వ పథకాలు)కు ప్రాధాన్యం ఇవ్వాలి.



కంప్యూటర్ ఆప్టిట్యూడ్

అభ్యర్థులకున్న కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పరీక్షించే ఉద్దేశంతో మెయిన్‌లో పొందుపరిచిన విభాగమిది. దీనికి సంబంధించి ప్రధానంగా కంప్యూటర్ ఆపరేటింగ్ సిస్టమ్స్, కంప్యూటర్ స్ట్రక్చర్, ఇంటర్నెట్ సంబంధిత అంశాలు, పదజాలంపై దృష్టి పెట్టాలి. కీబోర్డ్ షార్ట్ కట్స్, కంప్యూటర్ హార్డ్‌వేర్ సంబంధిత అంశాల(సీపీయూ, మానిటర్, హార్డ్ డిస్క్ తదితర) గురించి తెలుసుకోవాలి.

మాక్ టెస్టులు

అభ్యర్థులు గత ప్రశ్న పత్రాల సాధన, మాక్ టెస్ట్‌లకు హాజరు కావడం మేలు. దీనిద్వారా ఆయా విభాగాలు, అంశాల పరంగా ఏ సబ్జెక్ట్‌లో ఏ టాపిక్‌కు ఎంత వెయిటేజీ ఉంటుందనే విషయంపై అవగాహన లభిస్తుంది. గ్రాండ్ టెస్ట్‌ల సమాధానాలను సరి చూసుకోవడం ద్వారా.. తాము ఇంకా అవగాహన పొందాల్సిన అంశాలపై స్పష్టత లభిస్తుంది. మాక్ టెస్ట్‌లకు హాజరవడం వల్ల పరీక్ష హాల్లో టైమ్ మేనేజ్‌మెంట్ అలవడుతుంది.

సీజీఎం స్థాయికి

ఎస్‌బీఐలో జూనియర్ అసోసియేట్‌గా కొలువులో చేరితే..భవిష్యత్‌లో పదోన్నతుల ద్వారా చీఫ్ మేనేజర్,డీజీఎం వంటి ఉన్నత స్థానాలకు చేరుకునే అవకాశం ఉంది. మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న తర్వాత బ్యాంకు అంతర్గతంగా నిర్వహించే రాత పరీక్ష, ఇంటర్వ్యూలో విజయం సాధిస్తే.. ట్రైనీ ఆఫీసర్ హోదా లభిస్తుంది. జేఏఐఐబీ, సీఏఐఐబీ కోర్సులు పూర్తి చేసుకున్న వారు ఫాస్ట్ ట్రాక్ ప్రమోషన్ ఛానల్ విధానంలో 20 ఏళ్ల సర్వీస్ పూర్తి చేసుకునే సమయానికి డీజీఎం హోదాకు చేరుకోవచ్చు. ప్రస్తుతం అమలవుతున్న సర్వీస్ నిబంధనల ప్రకారం క్లర్క్ స్థాయిలో కొలువుదీరిన వారు చీఫ్ మేనేజర్ స్థాయికి చేరుకునే వీలుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2025, జనవరి 7
- **ప్రిలిమినరీ పరీక్ష తేదీ:** 2025 ఫిబ్రవరిలో
- **మెయిన్ ఎగ్జామినేషన్ తేదీ:** 2025 మార్చి/ఏప్రిల్‌లో
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://bank.sbi/careers/currentopenings, www.sbi.co.in/careers/currentopenings

ఈ ఏడాదిలో రూ.7.46 కోట్ల మందులు సీజ్

- పట్టుబడిన మరో రూ.2.36 కోట్ల విలువైన నకిలీ మందులు
- నకిలీ క్లినిక్‌లలో రూ.61 లక్షల విలువైన మందుల పట్టివేత
- డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ వార్షిక నివేదికలో వెల్లడించిన డీజీ కమలాసన్‌రెడ్డి



హైదరాబాద్: ప్రజలను నకిలీ మందుల బెడద నుంచి కాపాడేందుకు ఈ ఏడాది ముమ్మరంగా తనిఖీలు నిర్వహించినట్టు తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డీజీ వీబీ కమలాసన్‌రెడ్డి తెలిపారు. ఈ ఏడాదిలో డిసెంబర్ 25 వరకు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 573 సోదాలు నిర్వహించినట్టు తెలిపారు. డీసీఏ వార్షిక నివేదిక-2024 వివరాలు సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. 2023లో మొత్తం 56 సోదాలు చేపట్టినట్టు తెలిపారు. ఈ ఏడాది నకిలీ మందుల ముఠాలు, అధిక ధరలకు మందులు విక్రయించే దుకాణదారులు, నకిలీ మందులు, అనుమతులు లేకుండా మందులు విక్రయించే దుకాణాలు, నకిలీ క్లినిక్‌లు, తప్పుడు ప్రకటనలతో ప్రజలను మోసగించే వారిపై ఇలా అనేక అంశాల్లో డీసీఏ అధికారుల సోదాలు కొనసాగినట్టు పేర్కొన్నారు. మొత్తం 8 నకిలీ మందుల తయారీ ముఠాల గుట్టురట్టు చేసినట్టు వివరించారు. అధిక ధరలకు మందులు విక్రయిస్తున్న 79 దుకాణాలు, 199 నకిలీ క్లినిక్‌లను సీజ్ చేసినట్టు తెలిపారు. నిషేధిత మందుల విక్రయాలకు సంబంధించి 3 కేసులు నమోదు చేసినట్టు పేర్కొన్నారు.

2024లో జనవరి నుంచి డిసెంబర్ 25 వరకు డీసీఏ పట్టివేతలు ఇలా..

స్వాధీనం చేసుకున్న మందుల మొత్తం విలువ రూ.7.46 కోట్లు

స్వాధీనం చేసుకున్న నకిలీ మందుల విలువ రూ.2.36 కోట్లు

నకిలీ క్లినిక్‌లలో పట్టుబడిన మందుల విలువ రూ.61.61 లక్షలు

ఎక్సైజ్‌శాఖతో జాయింట్ ఆపరేషన్‌లో స్వాధీనం చేసుకున్న మందుల విలువ రూ.11.32 కోట్లు

ఆపద ఏదైనా మేం సదా సిద్ధం

అగ్నిమాపక శాఖ డీజీ నాగిరెడ్డి



సాక్షి, హైదరాబాద్: అగ్ని ప్రమాదాల తోపాటు ప్రకృతి విపత్తులు, ఇతర ఏ ఆపద వచ్చినా ప్రజలను కాపాడేందుకు అగ్నిమాపక శాఖ సదా సిద్ధంగా ఉంటుందని రాష్ట్ర డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎస్‌డీఆర్ఎఫ్), ఫైర్ సర్వీసెస్ డీజీ నాగిరెడ్డి అన్నారు. ఖమ్మంలో వరదలు వచ్చినప్పుడు రాత్రి సమయంలోనూ సహాయక చర్యలు చేపట్టి 880 మందిని కాపాడినట్టు వెల్లడించారు. గతేడాదితో పోలిస్తే ఈ సారి ఫైర్ కాల్స్ స్వల్పంగా తగ్గినట్టు తెలిపారు. ఈ ఏడాది ప్రమాదాల నుంచి 54 మంది ప్రాణాలు రక్షించామని చెప్పారు. సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో తెలంగాణ అగ్నిమాపక, విపత్తుల స్పందన, పౌర రక్షణ విభాగం వార్షిక నివేదిక -2024ను డీజీ నాగిరెడ్డి, అగ్నిమాపకశాఖ అధికారులతో కలసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది 0.23 శాతం భారీ అగ్నిప్రమాదాల సంఖ్య తగ్గినట్టు తెలిపారు. స్వల్ప అగ్నిప్రమాదాలకు సంబంధించి 5.9 శాతం ఫైర్ కాల్స్ పెరిగాయన్నారు. రాష్ట్రంలో అగ్నిప్రమాదాల నివారణకు ప్రజల్లో అవగాహన తీసుకురావడంతో పాటు కమర్షియల్ కాంప్లెక్స్‌లలో ఫైర్ సేఫ్టీ నిబంధనలు కఠినతరం చేశామని తెలిపారు. సికింద్రాబాద్ స్వప్నలోక్ కాంప్లెక్స్ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకున్నామన్నారు. అగ్నిమాపక శాఖ చట్టాలను బలోపేతం చేసేందుకు తెలంగాణ ఫైర్ సర్వీసెస్ యాక్ట్-1999ను సవరించడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు తెలిపారు. తెలంగాణ అగ్నిమాపక శాఖకు అన్ని విధాలుగా సహకరిస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో అడిషనల్ డైరెక్టర్ ప్రసన్న కుమార్, డిప్యూటీ డైరెక్టర్ సుధాకర్‌రావు, ఆర్ఎఫ్ఓ హరినాథ్‌రెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.



గజేంద్రుడికి ఇలానా మోక్షం!!

మనిషి సృష్టించిన మహా విపత్తు.. ప్లాస్టిక్ కాలుష్యం.. ఇది పర్యావరణానికే కాదు.. జీవజాలానికీ పెనుముప్పుగా పరిణమిస్తోంది. దానికి నిదర్శనమే ఈ దృశ్యం.

శ్రీలంకలోని అంపారా తూర్పు జిల్లాలో ఓ ఏనుగు ఇలా ప్లాస్టిక్ వ్యర్థాల మధ్య ఆహారాన్ని వెతుక్కుంటోంది. తెలియక ప్లాస్టిక్ వ్యర్థాలనూ ఆరగిస్తోంది. చివరికి అవి జీర్ణమవక చాలా ఏనుగులు మృత్యువాత పడుతున్నాయని పర్యావరణ ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత దశాబ్ద కాలంలో ఇలాంటి కేసులు బాగా పెరిగాయని చెబుతున్నారు. శ్రీలంకలో ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండటం దీనికి ఓ కారణమని పేర్కొంటున్నారు. ఈ చిత్రాన్ని లక్షిత కరుణరత్న అనే ఫొటోగ్రాఫర్ తీశారు. పలు ఫొటోగ్రఫీ పోటీల్లో ఈ చిత్రం పురస్కారాలను గెలుచుకుంది.

నెట్‌లో చిక్కకుండా నేర్పుగా..



వాట్సాప్‌లో గుడ్ మార్నింగ్‌లు.. ఫేస్‌బుక్‌లో ఫొటో షేర్‌లు.. యూట్యూబ్, ఇన్‌స్టా, స్నాప్‌చాట్‌లలో రీల్స్, షార్ట్స్..

ఇలా ఈ తరం పిల్లల దినచర్య అంతా డిజిటల్ ప్రపంచం చుట్టూ సాగుతోంది. గోరుముద్దలు తినే బుజ్జాయిలు మొదలు.. ఇల్లుపీకి పందిరేసే అల్లరి గడుగ్గాయిల వరకు అందరినీ కుదురుగా కూర్చోబెట్టేందుకు తల్లిదండ్రులే వారి చేతికి 'స్మార్ట్' ప్రపంచాన్ని అందిస్తున్న ధోరణి రోజురోజుకూ పెరుగుతోంది. నీతికథల నుంచి నిద్రపుచ్చే లాలిపాటల వరకు అంతా వారికి డిజిటల్‌గానే సాగుతోంది. నిత్యం గంటలకొద్దీ నెట్టింట గడుపుతుండటంతో పిల్లలు స్మార్ట్‌ఫోన్లకు బానిసలుగా మారుతున్నారు. శారీరక, మానసిక రుగ్మతలకుతోడు సైబర్ బుల్లీయింగ్ (బెదిరింపులు), ఆన్‌లైన్ వేధింపుల బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో పిల్లలు 'నెట్'లో చిక్కకుండా, ఆన్‌లైన్ దుష్ప్రభావాల బారిన పడకుండా ఉండేందుకు తల్లిదండ్రులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో సూచిస్తూ తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) మార్గదర్శకాలు రూపొందించింది. 'హౌ టు కీప్ యువర్ చిల్డ్రన్ సేఫ్ ఇన్ ద డిజిటల్ స్పేస్?'పేరిట తెచ్చిన ఈ హ్యాండ్ బుక్‌ను టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్‌తో కలిసి డీజీపీ జితేందర్ విడుదల చేశారు.

హ్యాండ్‌బుక్‌లోని ముఖ్యాంశాలు ఇవీ..

1 పేరెంటల్ కంట్రోల్స్ మరవొద్దు

- ప్రతి డిజిటల్ డివైస్, సాఫ్ట్‌వేర్, సోషల్ మీడియా యాప్‌లలో పేరెంటల్ కంట్రోల్ ఆప్షన్లు ఉంటాయి. వాటి సాయంతో పిల్లలు ఆన్‌లైన్‌లో చూసే కంటెంట్‌ను పర్యవేక్షిస్తుండొచ్చు. దీనివల్ల వారు అనుమానాస్పద లింక్‌లు, ప్రమాదకరమైన వెబ్‌సైట్లలోకి వెళ్లకుండా నియంత్రించవచ్చు.
- పిల్లలు స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్, ల్యాప్‌టాప్, ట్యాబ్‌లలో ఎంత సమయం గడుపుతున్నారో గమనిస్తుండాలి. ఆన్‌లైన్‌లో అపరిచిత వ్యక్తుల నుంచి ఫ్రెండ్ రిక్వెస్ట్‌లు అంగీకరించొద్దని.. ఎస్ఎంఎస్‌లు, ఈ-మెయిల్స్‌లోని అనుమానాస్పద లింక్‌లపై క్లిక్ చేయొద్దని చెప్పాలి.
- సురక్షితమైన ఇంటర్నెట్ వినియోగం, డిజిటల్ భద్రతపై కుటుంబ సభ్యులంతా ఎప్పటికప్పుడు చర్చించుకోవాలి.
- పిల్లలు వాడుతున్న యాప్స్, వారు చూస్తున్న సైట్ల గురించి సరదా చర్చలు పెడుతూ వారి ప్రవర్తన తెలుసుకోవాలి. స్ట్రాంగ్ పాస్‌వర్డ్‌లు ఎలా పెట్టాలి. ముఖ్యమైన సమాచారం కాపాడుకోవడం ఎలా అన్నది నేర్పాలి.

2 ఈ హద్దులు పెట్టండి..

- మీ పిల్లల వయసుకు తగ్గట్లుగా వారికి ఇంటర్నెట్ వాడకంలో సమయం, సమాచారం తదితర అంశాల్లో హద్దులు నిర్ణయించాలి.
- డివైజ్ కర్ఫ్యూ... అంటే ప్రతిరోజూ సాయంత్రం కొంత సమయం డిజిటల్ డివైజ్‌లు ఏవీ వాడకుండా నిషేధం పెట్టాలి.
- కుటుంబంతో ఉన్నప్పుడు, తినే సమయంలో ఎవరూ మొబైల్ ఫోన్, ట్యాబ్, ల్యాప్‌టాప్ వంటివి వాడొద్దన్న నిబంధన పెట్టాలి.
- తల్లిదండ్రులు కూడా స్మార్ట్‌ఫోన్లు, డిజిటల్ డివైజ్‌ల వాడకంలో తరచూ బ్రేక్స్ తీసుకుంటూ పిల్లలకు ఆదర్శంగా ఉండాలి.

3 ఈ విషయాల్లో పిల్లలకు తోడుగా ఉండాలి..

- పిల్లల ప్రవర్తనలో అప్పటికప్పుడు మార్పులు (మూడ్ స్వింగ్స్), ఒంటరిగా ఉంటున్నట్లు గుర్తిస్తే వారితో కాసేపు గడపాలి.
- పిల్లలు ఏదైనా చెప్పేందుకు వచ్చినప్పుడు వారు చెప్పేది పూర్తిగా, సావధానంగా వినాలి. వారికి మద్దతుగా నిలబడాలి.
- సైబర్ బుల్లీయింగ్‌కు గురైతే వెంటనే ఎదుటి వారిని బ్లాక్ చేయడం.. దానిపై రిపోర్ట్ చేయడం గురించి అవగాహన కల్పించాలి.

యాప్‌ల నియంత్రణ ఇలా..

యూట్యూబ్‌లో..
గూగుల్ ప్లేస్టోర్, యాపిల్ స్టోర్ నుంచి యూట్యూబ్ కిడ్స్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలి. అందులో కిడ్స్ ప్రొఫైల్‌ను సెట్ చేసుకోవాలి. ఆ తర్వాత కంటెంట్ సెట్టింగ్స్‌లో పిల్లల వయసువారీగా ప్రీ స్కూల్ (నాలుగేళ్ల వరకు), యంగర్ (8 ఏళ్ల వరకు), ఓల్డర్ (12 ఏళ్ల వరకు) ఆప్షన్లు పెట్టాలి. తర్వాత స్క్రీన్ టైం పరిమితిని సెట్ చేయాలి. వారు ఎలాంటి వీడియోలు చూస్తున్నారో పేరెంట్ డివైస్ ద్వారా తెలుసుకోవచ్చు.

ఇన్‌స్టాగ్రామ్..
ప్రొఫైల్‌లోని సెట్టింగ్ ఆప్షన్‌లో ఉండే ఫ్యామిలీ సెంటర్ ఆప్షన్‌లోకి వెళ్లి ప్రైవసీ ఆప్షన్‌లో సూపర్‌విజన్‌ను ఎంపిక చేయాలి. ఇన్వైట్ యువర్ టీన్ ఆప్షన్‌పై క్లిక్ చేసి మీ పిల్లలకు మెసేజ్ పంపి వాళ్ల ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో దాన్ని యాక్సెప్ట్ చేయించాలి.

ఫేస్‌బుక్‌లో...
సెట్టింగ్స్‌లో 'గో టు ప్రైవసీ'లోకి వెళ్లాలి. ప్రొఫైల్ ప్రైవసీ కంట్రోల్‌ను యాక్టివేట్ చేయాలి. ఫ్యామిలీ సెంటర్ ఆప్షన్‌లో పేరెంటల్ సూపర్‌విజన్ ఆప్షన్‌ను పెట్టాలి. దీనివల్ల పిల్లల ఫొటోలు, వీడియోలు అపరిచిత ఖాతాల్లో ఇతరులు చూడకుండా నియంత్రించొచ్చు.

ఎక్స్‌లో..
సెట్టింగ్స్‌లోకి వెళ్లి ప్రైవసీ ఆప్షన్‌లోని ప్రైవసీ అండ్ సేఫ్టీపై క్లిక్ చేయాలి. ఆడియన్స్ అండ్ ట్యాగింగ్ ఆప్షన్‌లో సెన్సిటివ్ కంటెంట్ ఫిల్టర్‌ను ఎనేబుల్ చేయాలి. అలాగే ప్రొటెక్ట్ యువర్ పోస్ట్స్, ప్రొటెక్ట్ యువర్ వీడియోస్‌ను ఆన్ చేయాలి.

స్నాప్‌చాట్‌లో..
సెట్టింగ్స్‌లోకి వెళ్లి ఫ్యామిలీ సెంటర్ ఆప్షన్‌ను ఎంచుకోవాలి. అందులోంచి మీ పిల్లలకు 'టీన్ టు జాయిన్'అని మీ పిల్లలను ఇన్వైట్ చేయాలి. ఆ తర్వాత మీ ఖాతాలోని ఫ్యామిలీ సెంటర్ ద్వారా మీ పిల్లల ఫ్రెండ్స్ లిస్టును చూడొచ్చు. ప్రైవసీ సెట్టింగ్స్ లోనూ మీరు మార్పులు చేయొచ్చు.

బుకింగ్‌ను తిరస్కరిస్తే డ్రైవర్లపై చర్యలు

'డిసెంబర్ 31' నేపథ్యంలో రాచకొండ సీపీ కీలక నిర్ణయం	ఔటర్ రింగ్‌రోడ్‌లో ప్రయాణికుల వాహనాలపై ఆంక్షలు	టికెట్ చూపిస్తే విమానాశ్రయానికి వెళ్లేవారికి అనుమతి	సురక్షిత ప్రయాణానికి మెట్రో రైళ్ల వేళలు పొడిగింపు	క్యాబ్ డ్రైవర్లు ఇబ్బంది పెడితే వాట్సాప్ చేయాల్సిన నంబర్లు	రాచకొండ 8712662111 / సైబరాబాద్ 9490617346

సాక్షి, హైదరాబాద్: నగరంలోని ప్రయాణికులకు ఆటో, క్యాబ్, ట్యాక్సీ డ్రైవర్ల నుంచి తరచూ ఎదురయ్యే సమస్య.. రెఫ్యూజల్‌గా పిలిచే తిరస్కరణ.. ఓ ప్రాంతానికి వెళ్లాలని వాహనాన్ని బుక్ చేసుకుంటే కొందరు డ్రైవర్లు ఆ ట్రిప్‌ను క్యాన్సిల్ చేయడమో, లేదా ప్రయాణికుడి వరకూ వచ్చిన తర్వాత తాము రాలేమని చెప్పి వెళ్లిపోవడమో చేస్తున్నారు. ఈ నేపథ్యంలో డిసెంబర్ 31 రాత్రి ఇలాంటి సమస్య ఎవరికీ ఎదురుకాకూడదని భావించిన రాచకొండ పోలీసు కమిషనర్ జి.సుధీర్‌బాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఆయా అద్దె వాహనాల డ్రైవర్లు.. ప్రయాణికులు కోరిన చోటుకు వెళ్లాల్సిందేనని, తిరస్కరిస్తే మోటారు వాహనాల చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. డ్రైవర్ల రెఫ్యూజల్ సమస్య కారణంగా డ్రంక్ అండ్ డ్రైవింగ్ పెరగడంతో పాటు ప్రైవేట్ వాహనాలు ఎక్కువగా రోడ్డు మీదకు వచ్చే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఇది ప్రమాద హేతువుగా మారే అవకాశం ఉండటంతో రాచకొండ పోలీసు కమిషనర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఎవరికైనా ఆటో, క్యాబ్, ట్యాక్సీ డ్రైవర్ల నుంచి రెఫ్యూజల్ సమస్య ఎదురైతే 8712662111 నంబర్‌కు వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేయాలని ఆయన కోరారు. ఈ ఫిర్యాదులో వాహనం వివరాలతో పాటు రెఫ్యూజల్ జరిగిన సమయం, ప్రదేశం ఉండాలని సూచించారు. బాధ్యులకు ఈ-చలాన్ ద్వారా రూ.500 జరిమానా విధిస్తామని సుధీర్‌బాబు స్పష్టం చేశారు. ప్రయాణికులతో దురుసుగా ప్రవర్తించడం, అదనంగా నగదు డిమాండ్ చేయడం సరికాదని డ్రైవర్లకు ఆయన హితవు పలికారు. కాగా, బార్, పబ్ తదితరాలకు చెందిన యాజమాన్యాలు తమ కస్టమర్లలో ఎవరైనా డ్రంక్ అండ్ డ్రైవింగ్ చేయనున్నారని తెలిసీ బయటకు పంపిస్తే చట్ట ప్రకారం వారి పైనా చర్యలు తీసుకుంటామని సీపీ పేర్కొన్నారు. మద్యం మత్తులో తమ ఏరియా దాటి వెళ్లే వారిని అడ్డుకుని, వారికి అవగాహన కల్పించాల్సిన బాధ్యత యాజమాన్యాలపై ఉందని అన్నారు. న్యూ ఇయర్ వేడుకల నేపథ్యంలో అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా మంగళవారం రాత్రి 11 నుంచి బుధవారం ఉదయం 5 గంటల వరకు ఔటర్ రింగ్‌రోడ్ పైకి ప్రయాణికుల వాహనాలను అనుమతించమని, కేవలం సరుకు రవాణా వాహనాలకే అనుమతి ఉంటుందని సుధీర్‌బాబు స్పష్టం చేశారు. విమానాశ్రయానికి వెళ్లే ప్రయాణికుల వాహనాలను మాత్రం అనుమతిస్తామని, అయితే కచ్చితంగా విమాన టికెట్లు చూపించాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

సైబరాబాద్ పరిధిలో.. ఇదిలా ఉండగా సైబరాబాద్ పరిధిలోనూ ఉన్నతాధికారులు రెఫ్యూజల్‌ను అరికట్టేందుకు చర్యలు చేపట్టారు. ఆటో, క్యాబ్, ట్యాక్సీ డ్రైవర్లు రెఫ్యూజల్‌కు పాల్పడితే 9490617346 నంబర్‌కు వాట్సాప్ ద్వారా సమాచారం ఇవ్వాలని సంయుక్త పోలీసు కమిషనర్ జోయల్ డెవిస్ కోరారు.



నేడు అర్ధరాత్రి కూడా మెట్రో సదుపాయం

నూతన సంవత్సర వేడుకల దృష్ట్యా హైదరాబాద్ వాసులకు సురక్షితమైన ప్రయాణ సదుపాయాన్ని కల్పించేందుకు ఏర్పాట్లు చేపట్టినట్లు హైదరాబాద్ మెట్రోరైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు నగరంలోని టెర్మినల్ స్టేషన్‌ల నుంచి మంగళవారం అర్ధరాత్రి 12.30 గంటలకు బయలుదేరి తెల్లవారుజామున 1.15 గంటల వరకు చివరి స్టేషన్‌లకు చేరుకొనేవిధంగా మెట్రో రైళ్ల రాకపోకలు సాగించనున్నాయి. దీని ప్రకారం ప్రయాణికులు రాయదుర్గం, మియాపూర్, ఎల్‌బీనగర్, నాగోల్, ఎంజీబీఎస్, జేబీఎస్ మెట్రోస్టేషన్‌ల నుంచి అర్ధరాత్రి కూడా మెట్రోలో పయనించి గమ్యం చేరుకోవచ్చు.

చోరీకి వచ్చాడు.. చుక్కేసి పడుకున్నాడు



చిన్నశంకరంపేట (మెదక్): వైన్ షాపును దోచుకుపోదామని పక్కా ప్లాన్‌తో వచ్చాడు. ఉన్నదంతా ఊడ్చి బ్యాగులో సర్దుకున్నాడు. ఒక్కసారిగా మద్యంపై మనసు లాగింది.. ఇంకేముంది ఫుల్లుగా తాగి మత్తులో అదే దుకాణంలో నిద్రపోయాడు. ఈ ఘటన నార్సింగి మండల కేంద్రంలోని దుర్గా వైన్స్‌లో చోటుచేసుకుంది. నార్సింగి ఎస్ఐ అహ్మద్ మొహినొద్దీన్ కథనం మేరకు.. నార్సింగి వైన్స్ నిర్వాహకులు రోజులాగే ఆదివారం రాత్రి 10 గంటలకు దుకాణానికి తాళం వేసి వెళ్లారు. ఇదే అదనుగా దొంగతనం చేసేందుకు ప్లాన్ వేసుకున్న గుర్తు తెలియని దుండగుడు పైకప్పు రేకులను తొలగించి వైన్స్‌లోకి దూరాడు. ప్లాన్ ప్రకారం ముందుగా సీసీ కెమెరాలు పనిచేయకుండా హార్డ్‌డిస్క్ తీసి సంచిలో వేసుకున్నాడు. గల్లపెట్టెలోని నగదును దోచుకున్నాడు. అందినకాడికి మందుబాటిళ్లు బ్యాగులో సర్దుకున్నాడు. ఇక బయటపడాల్సిన సమయంలో.. బయట చలిగా ఉందని భావించాడో ఏమో ఒక పెగ్గు వేస్తే పోలే అనుకొని కొద్దికొద్దిగా తాగుతూ ఫుల్లుగా తాగేశాడు.. మద్యం మత్తులోకి జారుకుని వైన్ షాపులోనే అపస్మారక స్థితిలో పడిపోయాడు. ఉదయం దుకాణం నిర్వాహకులు వచ్చి తాళం తీసి చూస్తే చిందరవందరగా పడిపోయిన మందు బాటిళ్ల మధ్య పడుకొని ఉన్నాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా, అపస్మారక స్థితిలో ఉన్న దొంగని రామాయంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. షాప్ నిర్వాహకుడు పర్శగౌడ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దొంగ ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యాక అరెస్టు చేస్తామని చెప్పారు.



ఓయూలో దేశంలోనే విశాలమైన తరగతి గది

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా విశ్వవిద్యాలయంలో దేశంలో ఎక్కడాలేని విధంగా 500 కుర్చీలతో విశాలమైన తరగతి గదిని నిర్మించారు. క్యాంపస్‌లోని సైన్స్ విభాగాల సెక్టార్‌లో నిరుపయోగంగా ఉన్న పాత భవనాన్ని గత వీసీ ప్రొఫెసర్ రవీందర్ మరమ్మతులు చేయించి తరగతి గదిగా నిర్మించారు. దేశంలో ఎక్కడాలేని విధంగా ఒకేసారి 500 మంది విద్యార్థులు కూర్చుని పాఠాలు వినేలా ఈ గదిని ఏర్పాటు చేశారు. ఓయూ విద్యార్థులను ఐఏఎస్, ఐపీఎస్, ఇతర ఉన్నత ఉద్యోగాలకు ఎంపిక చేసే లక్ష్యంతో సివిల్ సర్వీస్ అకాడమీని స్థాపించారు. యూపీఎస్సీ సివిల్స్ ఉద్యోగాలపై ఆసక్తి గల అభ్యర్థులను రాత పరీక్ష ద్వారా ఎంపిక చేసి ఉచిత శిక్షణ ఇస్తున్నారు. ఓయూ క్యాంపస్‌లోని వివిధ కాలేజీలతో పాటు యూనివర్సిటీ అనుబంధ నిజాం, సైఫాబాద్, సికింద్రాబాద్ పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులకు నిష్ణాతులైన బోధకులతో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు.

7 నుంచి తరగతులు ప్రారంభం

ఓయూ సివిల్ సర్వీస్ అకాడమీలో 2025 జనవరి 7 నుంచి విద్యార్థులకు తరగతులు ప్రారంభమవుతాయని డైరెక్టర్ ప్రొ.కొండ నాగేశ్వర్‌రావు సోమవారం తెలిపారు. వచ్చే సంవత్సరం సివిల్ సర్వీస్ ప్రిలిమ్స్ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులను రాత పరీక్ష ద్వారా ఎంపిక చేసినట్లు చెప్పారు. మొదటి బ్యాచ్ తరగతులకు 200 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ఆయన తెలిపారు.



మా టీచర్లే మాకు కావాలి..

జగదేవ్‌పూర్ (గజ్వేల్): 'మా పాఠశాల టీచర్లనే పంపండి.. వేరే పాఠశాల టీచర్లు మాకొద్దు'అంటూ సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్‌లోని కస్తూర్బాగాంధీ విద్యార్థినులు నిరసన చేపట్టారు. పాఠశాల ఉపాధ్యాయులు సమ్మెలో ఉండటంతో సోమవారం ఎంఈఓ మాధవరెడ్డి ఇద్దరు ఉపాధ్యాయులను కేజీబీవీ పాఠశాలకు పంపించారు. వారిని విద్యార్థినులు అడ్డుకున్నారు. మా పాఠశాల ఉపాధ్యాయులే మాకు కావాలని పట్టుబట్టారు. అయినప్పటికీ ఇద్దరు ఉపాధ్యాయులు పాఠశాలలోకి వెళ్లి విద్యార్థులకు పాఠాలు బోధించారు. సాయంత్రం టీచర్లు తిరిగి వెళ్తున్న క్రమంలో పాఠశాల గేటుకు తాళం వేసి గంటపాటు పాఠశాలలోనే నిరసన వ్యక్తం చేశారు. ఎంఈఓ మాట్లాడటంతో ఉపాధ్యాయులను బయటకు పంపారు.

సార్.. మా నాన్న ఆపదలో ఉన్నారు

ప్రజావాణిలో కలెక్టర్‌కు చిన్నారుల ఫిర్యాదు




జగిత్యాల టౌన్: 'సార్.. మానాన్న ఆపదలో ఉన్నారు. మీరే కాపాడాలి..'అంటూ జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం చెర్లపల్లికి చెందిన బండి తిరుపతి కుమారుడు శ్రీవాత్సవ్, కూతురు సాయివైష్ణవి సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌ను ఆశ్రయించారు. వారి కథనం ప్రకారం.. 'మా తాత స్వర్గీయ బండి మల్లయ్య సింగరేణిలో ఉద్యోగ విరమణ చేయగా రిటైర్మెంట్ బెనిఫిట్ కింద రూ.12 లక్షలు వచ్చాయి. ఆ డబ్బుల విషయమై మానాన్న, చిన్నాన్న మధ్య విభేదాలు చోటుచేసుకున్నాయి. చిన్నాన్న రూ.18 లక్షలు వచ్చాయంటున్నాడు. ఈ విషయం పోలీస్ స్టేషన్ వరకు వెళ్లింది. గ్రామ పెద్దల మధ్య పంచాయితీ నిర్వహించగా.. రూ.12 లక్షలే వచ్చాయని ఆధారాలతో సహా నిరూపణ అయ్యింది. ఆ డబ్బులు వాడుకున్నాడంటూ చిన్నాన్న, నానమ్మ మా నాన్నపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. లక్సెట్టిపేటలో 12 గుంటల భూమి కొన్నట్లు ఆరోపిస్తున్నారు. చిన్నాన్న మా వాటా కింద వచ్చిన వ్యవసాయ భూమిని మాకు తెలియకుండా ఆయన పేరుమీదకు మార్చుకున్నాడు. పలుమార్లు దాడికి ప్రయత్నించాడు. దీంతో మా అమ్మ అనారోగ్యం పాలైంది. నాన్నకు మనశ్శాంతి కరువైంది. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియక ఇంట్లో ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. మీరు స్పందించి మా సమస్య పరిష్కరించండి'అంటూ కలెక్టర్‌ను వేడుకున్నారు. స్పందించిన కలెక్టర్ సత్యప్రసాద్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.


Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

విహంగాల విడిది.. జన్నారం


అరుదైన స్వదేశీ, విదేశీ పక్షుల వలస








జన్నారం: కవ్వాల్ టైగర్‌జోన్ రకరకాల పక్షులకు ఆవాసంగా మారింది. శీతాకాలంలో వివిధ ప్రాంతాల నుంచి స్వదేశీ, విదేశీ పక్షులు వలస వస్తున్నాయి. మంచిర్యాల జిల్లా జన్నారం అటవీ డివిజన్‌లో ఇటీవల నిర్వహించిన బర్డ్‌వాక్‌లో వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్లు అరుదైన పక్షులను తమ కెమెరాల్లో బంధించారు. వీటిలో అరుదైన ఇండియన్ నైట్‌జార్, ఇండియన్ హాక్ ఈగల్ తదితర జాతి పక్షులు ఉండటంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నైట్‌జార్ పక్షి కేవలం రాత్రి వేళల్లో మాత్రమే కనిపిస్తుందని, ఇండియన్ హాక్ ఈగల్ చాలా అరుదైన పక్షి అని వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్లు నాగేశ్వర్‌రావు, నవీన్, రాజేశ్, ప్రశాంత్ తెలిపారు. తాము చిత్రీకరించిన పక్షులను వారు అటవీశాఖ అధికారులకు విడుదల చేశారు. ఈ ప్రాంతంలో అరుదైన పక్షులు కనిపించడంపై రేంజ్ అధికారి సుష్మారావు ఆనందం వ్యక్తం చేశారు.



















తెలంగాణ శ్రీశైలం.. ఓదెల మల్లన్న ఆలయం

- భక్తుడి పేరిట వెలుగొందుతున్న గుడి... కోరిన కోర్కెలు తీర్చే స్వామిగా ప్రసిద్ధి
- సీతారాములు వనవాస సమయంలో మల్లికార్జున స్వామిని దర్శించుకున్నట్టు ప్రతీతి
- మల్లన్నను దర్శించుకున్నాకే ఎన్నికల బరిలోకి నేతలు
- పట్నాలు, బోనాల కోసం పలు రాష్ట్రాల నుంచి భక్తుల రాక



సాక్షి, పెద్దపల్లి: 'గజ్జల లాగులను ధరించిన ఓదెల మల్లన్న దండాలో.. మమ్మేలు మా స్వామి దండాలో.. ఆలుమిలా తారడో బోలుమియా గారడో..' అంటూ గంతులు వేస్తూ తమ ఇలవేల్పును దర్శించేందుకు భక్తులు ఆ ఆలయానికి భారీగా తరలివస్తుంటారు. తనకు గాయం చేసిన భక్తుడి పేరునే తన క్షేత్రానికి పెట్టుకొన్న శివుడు.. మల్లన్నగా.. ఓదెల మల్లన్నగా పూజలందుకుంటున్నాడు. తెలంగాణ శ్రీశైలంగా ప్రసిద్ధి చెందాడు. అదే పెద్దపల్లి జిల్లా ఓదెల మల్లికార్జునస్వామి ఆలయం. ఆ ఆలయ చరిత్ర తెలుసుకుందాం.

నాగలి చేసిన గాయంతో..

పూర్వం ఈ ప్రాంతం దండకారణ్యంగా ఉండేది. ఆ రోజుల్లో స్వయంభూలింగంగా వెలసిన మహాశివుడిని పంకజ మహామునీశ్వరుడు నిత్యం కొలుస్తూ తపస్సు చేసేవాడని ప్రతీతి. దీనికి నిదర్శనంగా ఆలయ స్తంభంపై మునీశ్వరుల బొమ్మలు, నామం చెక్కి కనిపిస్తాయి. ఆయన తర్వాత పూజ చేసేవారు లేక శివలింగంపై పెద్దఎత్తున పుట్ట పెరిగింది. అయితే, చింతకుంట ఓదెలు అనే రైతు వ్యవసాయం చేస్తుండగా.. నాగలి కర్ర పుట్టలోని శివలింగానికి తగిలింది. జరిగిన పొరపాటును ఓదెలు తెలుసుకొని, స్వామివారిని మన్నించమని వేడుకున్నాడు. దీంతో ఓదెలుకు శాశ్వత మోక్షాన్ని ప్రసాదించడమే కాకుండా, అతడి పేరుతోనే భక్తులకు దర్శనం ఇస్తానని స్వామివారు చెప్పినట్లు భక్తులు విశ్వసిస్తారు. ఇప్పటికీ శివలింగానికి నాగలి కర్ర చేసిన గాయాన్ని పోలిన మచ్చ ఉంటుంది. ఈ ఆలయ నిర్మాణ క్రమం, స్తంభ వర్ణ శిలలు, శిల్పాల ఆధారంగా సుమారు 1300 మధ్య కాకతీయుల కాలంలో ఆలయాన్ని పునర్నిర్మించినట్లుగా చారిత్రక ఆధారాలున్నాయని చెబుతు న్నారు. ఆ సమయంలో దక్షిణ దిశగా శ్రీభ్రమరాంబ అమ్మవారిని, ఉత్తర దిశగా శ్రీవీరభద్రస్వామిని, క్షేత్రపాలకుడిగా శ్రీభైరవస్వామిని ప్రతిష్ఠించారు.

మల్లన్న ఆలయానికి సమాంతరంగా సీతారామ చంద్రస్వామి విగ్రహాలు

శ్రీసీతారాములు వనవాసం చేసే సమయంలో రామగిరిఖిల్లా నుంచి ఇల్లంతకుంటకు వెళ్లే దారిలో ఓదెల శ్రీమల్లికార్జునస్వామిని దర్శించుకున్నారని ప్రతీతి. దానికి ప్రతీకగా మల్లన్నస్వామి ఆలయానికి సమాంతరంగా శ్రీసీతారామచంద్రస్వామి వారి విగ్రహాలను ప్రతిష్ఠించారని స్థానికులు చెబుతుంటారు.



సంతానం కోసం టెంకాయ బంధనం

'గండాలు తీరితే గండదీపం పెడతాం.. కోరికలు తీరితే.. కోడెలు కడతాం.. పంటలు పండితే.. పట్నాలు వేస్తాం.. పిల్లాజెల్ల సల్లంగా ఉంటే.. సేవలు చేస్తాం' అని స్వామివారికి భక్తులు మొక్కుకుంటారు. వచ్చే భక్తుల్లో చాలామంది సంతానం కోసం 'టెంకాయ బంధనం' కట్టి వారికి సంతానం కలిగిన తర్వాత స్వామివారికి మొక్కుబడి చెల్లిస్తారు. మల్లన్నను దర్శించుకున్న తర్వాతే ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ప్రజాప్రతినిధులు ఎన్నికల్లో నామినేషన్ దాఖలు చేయడం ఆనవాయితీగా వస్తోంది.

ఒగ్గుపూజారుల పట్నాలతో..

ఓదెల మల్లన్న సన్నిధిలో భక్తులు స్వామివారి పేరిట పట్నం వేస్తారు. ఒగ్గుపూజారుల చేతిలో ఢమరుకాన్ని మోగిస్తూ శ్రుతిని తలుస్తుండగా స్వామివారికి భక్తులు మొక్కులు చెల్లించుకుంటారు. మండపంలో ఒగ్గు పూజారులు గజ్జెలతో కుట్టిన లాగుల (నిక్కర్లు)తో పూసలు కట్టిన అంగీలు (చొక్కాలు), పూసల కుల్లాయి (టోపీ) సన్నని జాలిచెద్దరు, చేతిలో త్రిశూలం, దానికి చిరుగంటలు, మరోచేతిలో కొరడా (వీరకోల) వంటివి ధరించి భక్తి తన్మయత్వంతో పూనకాలతో ఊగుతూ, గంతులు వేస్తూ.. శివతాండవం చేస్తూ దేవున్ని ప్రత్యేకంగా కొలవడం విశేషం.


కొలువైన వీరభద్రస్వామి



దేవాలయంలో నంది



పలు రాష్ట్రాల నుంచి భక్తుల రాక

ఏటా సుమారు రూ.2 కోట్లకుపైగా ఆదాయం సమకూరే ఓదెల శ్రీమల్లికార్జునస్వామి దేవాలయానికి ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచే కాక రాష్ట్రంలోని అనేక జిల్లాల నుంచి, పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచి కూడా లక్షలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటారు.

భక్తుడి పేరుతో దర్శనం



చింతకుంట ఓదెలు అనే భక్తుడి పేరు మీద మల్లన్న క్షేత్రం విరాజిల్లుతోంది. శ్రీరాముడు కూడా మల్లన్నను దర్శించుకొని పూజలు చేశాడని ప్రతీతి. శ్రీశైలం, ఓదెల ఆలయం రెండు ఒకే సమయంలో నిర్మించడంతో తెలంగాణ శ్రీశైలం అని ఈ ఆలయానికి పేరు వచ్చింది. కాకతీయుల కాలంలో ఈ ఆలయాన్ని పునర్నిర్మించారు.

– పంచాక్షరి, ఆలయ అర్చకులు

బుధ, ఆదివారాల్లో రద్దీ



ఉగాది పర్వదినం రోజున ఎడ్లబండ్లతో దేవాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు. ఆ తర్వాత జాతర ప్రారంభిస్తారు. ఈ సందర్భంగా పెద్దపట్నాలు, అగ్నిగుండాలు దాటడంతో ఏటా జాతర సాగుతుంది. ఆలయంలో పలు అభివృద్ధి పనులు, నిర్మాణాలు కొనసాగుతున్నాయి. వాటి నిర్మాణాలకు సహకరించిన దాతలకు జాతర సమయంలో ప్రత్యేక గుర్తింపు కల్పిస్తాం.

– బి.సదయ్య, ఈవో(403)


మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతిపై అసెంబ్లీలో సంతాప తీర్మానం చేసినందుకు పలు గురుద్వారాల ప్రతినిధులు శాసన సభ వ్యావహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును కలిసి ధన్యవాదాలు తెలిపారు. సీఎం, అన్ని పార్టీల శాసన సభ్యులకూ కృతజ్ఞతలు తెలిపారు.

బారులు తీరిన బియ్యం లారీలు



బాయిల్డ్ రైస్‌తో బారులు తీరిన లారీలను ఆ దారివెంట ప్రయాణించేవారు ఆసక్తిగా చూస్తూ ఉండిపోయారు. రైలు పెట్టెల్లా అందంగా ఒకదాని వెంట మరొకటి వరుసగా కదులుతూ ముందుకు సాగడం చూసేందుకు అద్భుతంగా కనిపించింది. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ గూడ్స్ లోడింగ్ పాయింట్ వద్ద బియ్యం లోడ్‌తో లారీలు వరుస కట్టగా.. సాక్షి కెమెరాకు ఇలా అందంగా కనిపించాయి. కాగా, బాయిల్డ్ రైస్‌ను ఎఫ్‌సీఐ గోదాంల నుంచి తమిళనాడు, కేరళ, బిహార్‌కు రవాణా చేస్తున్నారని, గూడ్స్ రైల్వే వ్యాగన్ల కోసం గంటల తరబడి వేచిచూడాల్సి వస్తోందని పలువురు డ్రైవర్లు 'సాక్షి'కి తెలిపారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి



అసెంబ్లీలో మల్లు సోదరుల గుసగుసలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క.. ఆయన సోదరుడు, నాగర్‌కర్నూల్ లోక్‌సభ సభ్యుడు మల్లు రవి గుసగుసలాడుకున్నారు. అసెంబ్లీ లాబీల్లోని భట్టి చాంబర్‌కు మల్లురవి రాగా, ఆ సమయంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావుతో పాటు ఇతరులు భట్టి చాంబర్‌లోనే ఉన్నారు. దీంతో తన సోదరుడితో రహస్యంగా మాట్లాడి మల్లు రవి వెళ్లిపోయారు. అయితే, అసెంబ్లీలో ఈ అన్నదమ్ములు ఎందుకు గుసగుసలాడారా అన్న విషయంపై 'సాక్షి' ఆరా తీయగా, రహస్యమేమీ లేదని ఎంపీ మల్లురవి చెప్పారు. అసెంబ్లీ ఆమోదం పొందిన మన్మోహన్‌సింగ్ సంతాప తీర్మానం ఇప్పించాలని, దానిపై తెలంగాణ ఎంపీల సంతకాలు పెట్టించి రాష్ట్రపతి, ప్రధాని, హోంమంత్రికి ఇస్తానని భట్టికి చెప్పానని ఆయన వెల్లడించారు.

తిరుమలలో తెలంగాణ సిఫారసులకు అనుమతి శుభపరిణామం

- శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: తిరుమల వేంకటేశ్వర స్వామి దర్శనం విషయంలో రాష్ట్ర ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలు అనుమతించడం శుభపరిణామమని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. రాష్ట్రానికి చెందిన ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలు అనుమతిస్తామని ప్రకటించినందుకు సీఎం ఎన్.చంద్రబాబునాయుడు, తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ బీఆర్ నాయుడుకు.. గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఒక్కో ప్రజాప్రతినిధికి సంబంధించి వారానికి నాలుగు సిఫార్సు లేఖలు అనుమతించేందుకు టీటీడీ అంగీకరించిందన్నారు. అలాగే వారానికి రెండు బ్రేక్ దర్శనం, రెండు రూ.300 దర్శనానికి సంబంధించిన లేఖలు పరిగణనలోకి తీసుకుంటారని తెలిపారు. తిరుమలలో రాష్ట్ర ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖల అంగీకారం కోసం కొన్ని రోజులుగా చంద్రబాబుకు, బీఆర్ నాయుడుకు వినతిపత్రం ఇచ్చినట్లు గుర్తు చేశారు.

ఇకపై తుది తీర్పు మేరకే ఏఈఈల పదోన్నతులు

- ఇప్పటివరకు జరిగిన వాటిల్లో జోక్యం చేసుకోం
- హైకోర్టు ఉత్తర్వులు..తదుపరి విచారణ ఫిబ్రవరికి వాయిదా



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర జల వనరుల శాఖ పరిధిలోని అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల పదోన్నతులు ఇకపై తమ తుది తీర్పునకు లోబడి ఉంటాయని హైకోర్టు స్పష్టం చేసింది. గత పదోన్నతుల్లో జోక్యం చేసుకోలేమని తేల్చిచెప్పింది. కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. అలాగే 2020 జాబితాపై ఇప్పుడు పిటిషన్ వేయడంపై అభ్యంతరం వ్యక్తం చేసిన న్యాయస్థానం.. ఆలస్యానికి కారణాలు తెలుపుతూ అదనపు కౌంటర్ దాఖలు చేయాలని పిటిషనర్‌ను ఆదేశించింది. తదుపరి విచారణ ఫిబ్రవరి 3కు వాయిదా వేసింది. జల వనరుల శాఖ ఇంజనీరింగ్ చీఫ్ అడ్మిన్ సీనియారిటీ తుది జాబితాను ప్రకటిస్తూ 2020, జనవరి 21న సర్క్యులర్ జారీ చేయడాన్ని సవాల్ చేస్తూ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఎ.అమరేందర్ రెడ్డి, టి.వేణుగోపాల్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. గతంలో ట్రిబ్యునల్ ఇచ్చిన ఆదేశాలను ఉల్లంఘిస్తూ 1978 నుంచి 2007 వరకు పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు సంబంధించి అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల సీనియారిటీ జాబితా రూపొందించారని పేర్కొన్నారు. బీమ్లేష్ తన్వర్ వర్సెస్ స్టేట్ ఆఫ్ హరియాణా కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు ఈ జాబితా విరుద్ధమన్నారు. మెరిట్ ప్రకారం సీనియారిటీ జాబితా సిద్ధం చేసేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ జి.రాధారాణి సోమవారం విచారణ చేపట్టారు. వాదనలు విన్న ధర్మాసనం.. తెలంగాణ ఇరిగేషన్ అండ్ సీఏడీ ముఖ్య కార్యదర్శి, ఇంజనీర్ ఇన్ చీఫ్, ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఏపీపీఎస్సీకి నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణలోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది.

దిగుబడి 'వెలిగి'పోవాలని..



చామంతి పంట సాగులో ఆశించిన దిగుబడి సాధించాలనే లక్ష్యంతో ఓ రైతు తన పొలంలో ఎల్ఈడీ బల్బులను ఏర్పాటు చేయడం ఆకట్టుకుంటోంది. అనంతపురం జిల్లా పెద్దపప్పూరుకి చెందిన రైతు సూర్యనారాయణ నాలుగు ఎకరాల్లో చామంతి సాగు చేస్తున్నాడు. మొక్క ఎదుగుదల దశలోనే మొగ్గలు వస్తే ఆశించిన దిగుబడి రాదని, పంట చుట్టూ ఎల్ఈడీ బల్బులు ఏర్పాటు చేస్తే కాంతి ప్రభావంతో మొగ్గలు రావని కొందరు చెప్పారు. దీంతో సూర్యనారాయణ పంట చుట్టూ ఎల్ఈడీ బల్బులు ఏర్పాటు చేశారు. రోడ్డు పక్కనే పొలం ఉండటంతో రాత్రిపూట రోడ్డుపై వెళ్లే వారు దీన్ని ఆసక్తిగా చూస్తున్నారు.
–పెద్దపప్పూరు, అనంతపురం జిల్లా

గురి కుదరాలి.. ఆకలి తీరాలి



సముద్రంలో చేపలు కెరటాలతో పాటు తీరానికి వస్తాయి. అంతే వేగంగా కెరటాలతో వెనక్కి వెళ్లిపోతాయి. కెరటాలతో పాటు వచ్చే చిన్న చేపలను ఆహారంగా మార్చుకోవడానికి అనేక పక్షులు నిరీక్షిస్తుంటాయి. ఎంతోనేర్పుగా వీటిని పట్టుకుని తుర్రుమని ఎగిరిపోతాయి. ఎంతో ఎత్తులో ఎగిరే గద్దలు సముద్ర కెరటాలపై కనిపించే చిన్న చేపలను పట్టుకోవడానికి సర్వశక్తులు ఒడ్డుతున్నాయి. నీటిపైన విహరిస్తూ చేపలు ఉన్న ప్రాంతాన్ని గుర్తించి తమ కాలి గోర్లతో వీటిని ఒడుపుగా పట్టుకుంటాయి. కొన్ని సందర్భాలలో నోటికి అందిన చేపలు కూడా తిరిగి జారిపోవడం, నీటిలో పడిపోవడం జరుగుతోంది. అయినా తమ ప్రయత్నాన్ని విరమించకుండా మళ్లీ ప్రయత్నించి ఆహారాన్ని సంపాదించుకుంటున్నాయి.
–ఏయూక్యాంపస్

క్లుప్తంగా...

ఒకటో తేదీ నుంచి నూతన బయోమెట్రిక్ విధానం

సాక్షి, అమరావతి: రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖలో మొబైల్ అప్లికేషన్ ద్వారా కొత్త బయోమెట్రిక్ ఫేస్ అథెంటికేషన్ సౌకర్యాన్ని బుధవారం(జనవరి ఒకటో తేదీ) నుంచి అమల్లోకి తెస్తున్నామని ప్రధాన కమిషనర్ అహ్మద్ బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నకిలీ పన్ను చెల్లింపుదారులు, నకిలీ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ దుర్వినియోగానికి అడ్డుకట్ట వేయడానికి ఈ విధానం తోడ్పడుతుందన్నారు. ఆధార్ వివరాల దుర్వినియోగం, నకిలీ గుర్తింపు కార్డుల సృష్టికి వ్యతిరేకంగా మెరుగైన భద్రతను అందిస్తుందని వివరించారు.

'ఉద్యోగుల వివరాలు నమోదు చేయండి'

సాక్షి, అమరావతి: పాఠశాల విద్యాశాఖలో పనిచేస్తున్న ఉద్యోగులు, కాంట్రాక్టు, ఆప్కాస్ సిబ్బందితో పాటు పెన్షనర్ల వివరాలను నమోదు చేయాలని ఆర్జేడీలను విద్యాశాఖ అధికారులు ఆదేశించారు. అన్ని ప్రభుత్వ విభాగాల్లో కలిపి రెగ్యులర్ ఉద్యోగులు, పెన్షనర్లు, ఆప్కాస్‌లో పనిచేస్తున్న వారు ఇంకా మిగిలారని, వీరి వివరాలు హౌస్ హోల్డ్ డేటాబేస్‌లో నమోదు కాలేదని తెలిపారు. వివిధ ప్రభుత్వ విభాగాల్లో పనిచేస్తూ డేటాబేస్‌లో నమోదు కావాల్సిన ఉద్యోగులు మొత్తం 2,80,587 మంది ఉండగా, ఒక్క పాఠశాల విద్యాశాఖలోనే 63,388 మంది ఉన్నట్లు పేర్కొన్నారు.

టూకామ్స్‌తో ఏపీఎస్ఎస్‌డీసీ ఒప్పందం

సాక్షి, అమరావతి: అంతర్జాతీయ ఉద్యోగావకాశాలు కల్పించే విధంగా టూకామ్స్ కన్సల్టింగ్ సంస్థతో ఓంకాప్ ద్వారా ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ)ఒప్పందం కుదుర్చుకుంది. ఏపీఎస్ఎస్‌డీసీ ఎండీ జి.గణేష్‌కుమార్ మాట్లాడుతూ ఐదు సంవత్సరాల్లో 20 లక్షలు ఉద్యోగాల కల్పనే ప్రభుత్వ లక్ష్యమన్నారు. టూకామ్స్ కన్సల్టింగ్ సీఈవో ప్రశాంత్ పచ్చిసియా మాట్లాడుతూ సంవత్సరానికి 10,000 విదేశీ ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు.

రాష్ట్ర విద్యుత్ సలహా మండలి ఏర్పాటు

ఉత్తర్వులు విడుదల చేసిన 'ఏపీఈఆర్‌సీ'

సాక్షి, అమరావతి: రాష్ట్ర విద్యుత్ సలహా మండలి(స్టేట్ అడ్వయిజరీ కమిటీ–ఎస్ఈసీ)ని 19 మంది సభ్యులతో ఏర్పాటు చేస్తూ ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి(ఏపీఈఆర్‌సీ) తాజాగా ఉత్తర్వులిచ్చింది. ఏపీఈఆర్‌సీ చైర్మన్, సభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఈ కమిటీకి ఎక్స్ అఫిషియో సభ్యులుగా ఉంటారని తెలిపింది. వాణిజ్యం, పరిశ్రమ, వ్యవసాయం, వినియోగదారులు, ప్రభుత్వేతర సంస్థలు, కార్మిక, విద్య, పరిశోధన విభాగాలకు చెందిన ప్రతినిధులతో ఏర్పడ్డ ఈ కమిటీ మూడేళ్ల పాటు పదవిలో ఉంటుందని వివరించింది.

ఎన్ఆర్ఐ దంపతులు రూ.కోటి విరాళం

సాక్షి, అమరావతి: అమరావతిలో నిర్మించనున్న బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి నిర్మాణానికి ఎన్ఆర్ఐ దంపతులు డాక్టర్ సూరపనేని వంశీకృష్ణ, డాక్టర్ ప్రతిభ రూ.కోటి విరాళాన్ని సీఎం చంద్రబాబుకు అందజేశారు. పల్నాడు జిల్లా అమరావతి మండలం అత్తలూరు గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ దంపతులు సచివాలయంలో సోమవారం సీఎంకు చెక్‌ను అందించారు.

కమ్యూనిస్టు ఉద్యమ ఐక్యతకు కృషి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

సాక్షి, అమరావతి: కమ్యూనిస్టు ఉద్యమ ఐక్యత కోసం కృషి జరుగుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు. సీపీఐ శత వార్షికోత్సవాలను పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రూపొందించిన ఆడియో సీడీని విజయవాడ దాసరి భవన్‌లో రామకృష్ణ సోమవారం ఆవిష్కరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ సీపీఐ శతవార్షికోత్సవాలు ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో ప్రారంభమయ్యాయని, 2025 డిసెంబర్ 26 వరకు జరుగుతాయని, ఆంధ్రప్రదేశ్‌లోని 26 జిల్లాల్లో ఈ వేడుకలు నిర్వహిస్తున్నామని ఆయన వివరించారు.

జీసీసీ కొనదు.. వ్యాపారులను కొననివ్వరు



కొండలపై పండుతున్న కొండచీపురు పంట

కొండచీపుర్ల విక్రయంలో గిరిజనులకు అగచాట్లు

- వ్యాపారులు కొనుగోలు చేస్తే భారీగా జరిమానా విధిస్తున్న అటవీశాఖ
- ఇళ్ల వద్దే మూలుగుతున్న కొండచీపుర్లు
- పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం

సీతంపేట: కొండ శిఖరాల్లో పోడు కొట్టి, విత్తు నాటి ఆరుగాలం శ్రమించి పండించిన అటవీ ఉత్పత్తులను విక్రయించుకునే విషయంలో గిరిపుత్రులకు కష్టాలు తప్పడంలేదు. అటవీ ఫలసాయం అమ్ముకోవడానికి ప్రభుత్వ సంస్థలే అడ్డుపడుతుండటంతో వారు ఆందోళనకు గురవుతున్నారు. తమ సమస్యను ఎవరికి చెప్పుకోవాలో తెలియక మధన పడుతున్నారు. ప్రభుత్వ తీరుపై మండిపడుతున్నారు. ప్రస్తుత సీజన్‌లో పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట ఏజెన్సీ కొండపోడులో 1,500 హెక్టార్లలో గిరిజనులు సాగుచేసిన కొండచీపురు పంట చేతికొచ్చింది. వీటిని గిరిజన సహకార సంస్థ (జీసీసీ) కొనుగోలు చేయాలి. జీసీసీ సవాలక్ష నిబంధనలు విధిస్తుండడంతో గిరిజనులు బయట ప్రాంతాల నుంచి వచ్చే వ్యాపారులకు చీపుర్లు విక్రయించుకుంటున్నారు. దీన్ని ఆసరాగా చేసుకుని అటవీశాఖ అధికారులు కొండచీపుర్లు రవాణా చేస్తున్న వ్యాపారులను పట్టుకుని పెద్దమొత్తంలో జరిమానా విధిస్తున్నారు. దీంతో వ్యాపారులు భయపడి కొనుగోలుకు ముందుకురావడం లేదు. వారంలో ఒకరోజు సీతంపేట, మర్రిపాడు, పూతికవలస, పొల్ల, దోనుబాయి, కుశిమిలలో జరిగే వారపు సంతలకు గిరిజనులు కొండ చీపుర్లు అమ్మకానికి తెస్తున్నా చెల్లుబాటుకాక తిరిగి ఇళ్లకు మోసుకెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. చాలా గ్రామాల్లో ఇళ్ల వద్దనే కొండ చీపుర్లు కుప్పలుగా కనిపిస్తున్నాయి. జీసీసీ ఇటీవల కొండ చీపుర్లు కొనుగోలుకు మద్దతు ధరలు ప్రకటించింది. ఒకటో రకం కొండచీపురు ఒక్కొక్కటి రూ.45, రెండో రకం రూ.40, మూడో రకం రూ.30 చొప్పున కొనుగోలు చేస్తామని ప్రకటించినా ఇప్పటివరకూ కొనుగోలు మాత్రం చేయడం లేదని గిరిజనులు ఆరోపిస్తున్నారు. వన్‌ధన్ వికాస కేంద్రాలు కూడా ఎటువంటి కొనుగోళ్లు జరపడంలేదని గిరిజన రైతులు వాపోతున్నారు.

ధరలేక దిగాలు..

చేతికొచ్చిన పంటను గిరిజనులు ఇంటిల్లిపాది కూర్చొని గ్రేడింగ్ చేసి వారపు సంతల్లో విక్రయిస్తున్నారు. సరాసరి ఒక్కో చీపురు ధర రూ.30 మాత్రమే పలుకుతోంది. గతంలో రూ.55 వరకు ధర పలికేది. ప్రస్తుతం వ్యాపారులు కొనుగోలు చేయకపోవడంతో సరైన ధర రావడంలేదని గిరి రైతులు చెబుతున్నారు. ఇదే చీపురుకట్ట విజయవాడ, విశాఖపట్నం, రాజమండ్రి, ఒడిశా మార్కెట్లో రూ.80 వరకు పలుకుతోందన్నారు. ఇటీవల ఐటీడీఏలో జేసీ శోభిక ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో గిరిజన జేఏసీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేసినా స్పందనలేకపోయిందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.



గిరిజనులు వారపుసంతకు తెచ్చిన కొండచీపుర్లు

ఇలాంటి పరిస్థితి ఎన్నడూ చూడలేదు



ఇంతటి దారుణమైన పరిస్థితి గతంలో ఎన్నడూ చూడలేదు. రెవెన్యూ భూముల్లోనే కొండచీపుర్లు పండిస్తున్నాం. ఆర్ఓఎఫ్ఆర్‌లో పండించడం లేదు. అటవీశాఖ వ్యాపారులను కొనుగోలు చేయనీయకపోతే ఎలా? కొనుగోలు చేసే వారిని పట్టుకుని జరిమానాలు విధిస్తుంటే ఎవరు ముందుకు వస్తారు. అధికారులు స్పందించి గిరిజన రైతులకు న్యాయం చేయాలి.
– ఎస్.సాయికుమార్, మాజీ సర్పంచ్, మండ

కష్టానికి తగ్గ ఫలితం లేదు



కష్టానికి తగ్గ ఫలితం లేదు. కొండచీపుర్ల సాగు, తయారీలో ఇంటిల్లిపాదీ కష్టపడతాం. తీరా అమ్మకానికి ఇబ్బందులు తప్పడంలేదు. కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ముందుకు రాకపోవడంతో సంతల్లో సైతం ధరలు పలకడం లేదు. జీసీసీ కొనుగోలు చేయదు.. కొనేవారిని అటవీశాఖ పట్టుకుంటోంది.
– ఎ.ఆనంద్, దిగువకలువరాయి, సీతంపేట

జీసీసీ కొనుగోలు చేయాలి

జీసీసీ మాత్రమే కొండచీపుర్లు కొనుగోలు చేయాల్సి ఉంది. అనుమతులు లేకుండా వ్యాపారులు కొనుగోలు చేయకూడదు. కొండచీపుర్లు రవాణా చేస్తే అటవీ అధికారులు పట్టుకుంటున్న మాట వాస్తవమే. ఈ విషయమై ఇటీవల పీజీఆర్ఎస్‌లో కూడా గిరిజనులు ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఈ సమస్య పరిష్కరిస్తాం.
– రామారావు, ఎఫ్ఆర్‌వో, పాలకొండ

అమిత్ షాను బర్తరఫ్ చేయాలి

అంబేడ్కర్‌ను అవమానిస్తే చూస్తూ ఊరుకోం

సామాజిక న్యాయ మహాశిల్పం వద్ద వామపక్షాల నిరసన

సాక్షి, అమరావతి/గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నవ భారత రాజ్యాంగ నిర్మాత, భారత రత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను పార్లమెంటు సాక్షిగా అవమానపర్చిన కేంద్ర హోం మంత్రి అమిత్ షాను తక్షణమే బర్తరఫ్ చేయాలని వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. అంబేడ్కర్‌పై అమిత్ షా వ్యాఖ్యలను ఖండిస్తూ వామపక్షాలు దేశవ్యాప్తంగా చేపట్టిన నిరసనల్లో భాగంగా విజయవాడలోని 125 అడుగుల అంబేడ్కర్ న్యాయ మహాశిల్పం వద్ద సోమవారం నిరసన ప్రదర్శన జరిగింది. సీపీఎం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శులు వి.శ్రీనివాసరావు, కె.రామకృష్ణ మాట్లాడుతూ అంబేడ్కర్‌ను కించపర్చడం ద్వారా బీజేపీ నిజస్వరూపం, ఆర్ఎస్ఎస్ ఉద్దేశం ఏమిటో అర్థమవుతుందన్నారు. రాజ్యాంగం అమల్లోకి వచ్చిన రోజే దానిని తాము వ్యతిరేకిస్తున్నామని ఆర్ఎస్ఎస్ ప్రకటించిందని గుర్తు చేశారు. రాజ్యాంగాన్ని మార్చుతామని బీజేపీ ప్రచారం చేసిందని, ప్రజాస్వామ్య వ్యవస్థను కూల్చడమే లక్ష్యంగా బీజేపీ పనిచేస్తోందని ధ్వజమెత్తారు. అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని దేశంలోని అన్ని రాష్ట్రాల్లోనూ ఆందోళనలు కొనసాగుతున్నాయని, ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, జగన్‌మోహన్‌రెడ్డి ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. వివిధ ప్రజాపక్షాల నేతలు పి.ప్రసాద్, కె.పొలారి,డి.హరినాథ్ జె.జానకిరాములు, ఎస్‌కే.ఖాదర్‌బాషా, అక్కినేని వనజ, పి.జమలయ్య, జి.కోటేశ్వరరావు, దోనేపూడి కాశీనాథ్, సీహెచ్ బాబూరావు తదితరులు మాట్లాడారు.



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహా శిల్పం వద్ద నిరసన తెలియజేస్తున్న వామపక్ష పార్టీలు

మంత్రి రామానాయుడు పిటిషన్‌పై విచారణ వాయిదా

సాక్షి, అమరావతి: తనపై గతంలో నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసులో ఏలూరు ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక న్యాయస్థానంలో జరుగుతున్న ప్రొసీడింగ్స్‌ను కొట్టేయాలని కోరుతూ రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు దాఖలు చేసిన పిటిషన్‌లో హైకోర్టు తదుపరి విచారణను జనవరి 7వ తేదీకి వాయిదా వేసింది. రామానాయుడిపై ఫిర్యాదు చేసిన పాలకొల్లు టౌన్ వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బండి రమేష్‌కి నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2022లో పాలకొల్లు పట్టణంలో అప్పటి ప్రభుత్వం టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేసే ఏర్పాటు చేసింది. ఆ కార్యక్రమంలోకి దూసుకొచ్చిన నిమ్మల రామానాయుడు, మరో 25 మంది అనుచరులు స్టేజీపై ఉన్న పలువురు వైఎస్సార్‌సీపీ నేతలను, కార్యకర్తలను దూషించి దాడికి పాల్పడ్డారు. దీనిపై పాలకొల్లు టౌన్ వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బండి రమేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రామానాయుడు, ఆయన అనుచరులు కలిసి తనను కులం పేరుతో దూషించి గాయపరిచారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో పాలకొల్లు పోలీసులు రామానాయుడుతో పాటు మరో 25 మందిపై 2022 ఆగస్టు 5న కేసు నమోదు చేశారు. ఈ కేసులో దర్యాప్తు పూర్తి చేసిన పోలీసులు ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో రామానాయుడు హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే.

ప్రభుత్వ పాఠశాలల్లో సామాజిక తనిఖీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రభుత్వ, యాజమాన్య పాఠశాలల్లో సామాజిక తనిఖీ(సోషల్ ఆడిట్) ప్రారంభమైంది. ఈ మేరకు చర్యలు చేపట్టాలని సమగ్ర శిక్ష ఎస్పీడీ జిల్లాల విద్యా అధికారులను ఆదేశించారు. అవసరమైన అన్ని పత్రాలు, రిజిస్టర్లు, ఇతర సమాచారాన్ని సకాలంలో సోషల్ ఆడిటర్లకు సమర్పించాలని సంబంధిత పాఠశాలల హెచ్ఎంలను ఆదేశించాలన్నారు. పాఠశాలలోని నిర్మాణాత్మక, పరిమాణాత్మక అంశాలపై కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఏటా సోషల్ ఆడిట్ నిర్వహిస్తారు. ఎంపిక చేసిన పాఠశాలల భవన నిర్మాణాలు, మధ్యాహ్నం భోజన పథకం, పాఠశాలకు మంజూరైన నిధులు, చేసిన ఖర్చుపై లోతుగా పరిశీలించి లోటు పాట్లను అంచనా వేస్తారు. పాఠశాలలోని రికార్డులన్నింటినీ నిశితంగా పరిశీలించి ఏమైనా పొరపాట్లు ఉంటే సూచనలు చేస్తుంది.

తిరుమలలో తెలంగాణ సిఫార్సులకు అనుమతి

వారానికి రెండు రోజులు తెలంగాణ ప్రజా ప్రతినిధుల లేఖల మీద దర్శనాలు

సాక్షి, అమరావతి: తిరుమల శ్రీవారి ఆలయం దర్శనాలకు తెలంగాణ రాష్ట్ర ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలను వారంలో రెండు రోజులు (సోమవారం నుంచి గురువారం మధ్య) అనుమతిస్తామని తెలంగాణా సీఎం రేవంత్‌రెడ్డికి ఏపీ సీఎం చంద్రబాబు లేఖ రాశారు. తెలంగాణ సిఫార్సులను అనుమతించాలని సీఎం రేవంత్ రెడ్డి ఈ నెల 16న రాసిన లేఖపై ప్రతిగా సోమవారం సీఎం చంద్రబాబు లేఖ రాశారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే భక్తుల రద్దీ, సౌకర్యం, సులభతర దర్శనం అంశాలను పరిగణనలోకి తీసుకుని రెండు రోజుల వీఐపీ బ్రేక్ దర్శనానికి రెండు లేఖలు, స్పెషల్ ఎంట్రీ దర్శనం (రూ. 300) కోసం రెండు లేఖలు స్వీకరిస్తామని స్పష్టం చేశారు. ప్రతి లేఖలో ఆరుగురు భక్తులను అనుమతిస్తారని వెల్లడించారు.

డాక్టర్ ప్రభావతి బెయిల్ పిటిషన్‌పై విచారణ నేటికి వాయిదా

రఘురామకృష్ణరాజు ఇంప్లీడ్ పిటిషన్‌ను అనుమతించిన హైకోర్టు


సాక్షి, అమరావతి: గత ఎంపీ, ప్రస్తుత శాసనసభ డిప్యూటీ స్పీకర్ కె.రఘురామకృష్ణరాజు ఫిర్యాదు మేరకు గుంటూరు నగరపాలెం పోలీసులు నమోదు చేసిన కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ గుంటూరు ప్రభుత్వాసుపత్రి గత సూపరింటెండెంట్ నీలం ప్రభావతి దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేసింది. ఈ వ్యాజ్యంలో తనను ప్రతివాదిగా చేర్చుకుని వాదనలు వినాలంటూ రఘురామకృష్ణరాజు దాఖలు చేసిన అనుబంధ పిటిషన్‌ను హైకోర్టు అనుమతించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. తనను సీఐడీ పోలీసులు కస్టోడియల్ టార్చర్‌కు గురిచేసి గాయపరిచారని, అయితే తనకు ఎలాంటి గాయాలు కాలేదంటూ ప్రభావతి తప్పుడు వైద్య నివేదిక ఇచ్చారంటూ రఘురామకృష్ణరాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ప్రభావతిపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఆమెకు ముందస్తు బెయిల్ మంజూరు చేసేందుకు కింది కోర్టు తిరస్కరించడంతో హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యం సోమవారం విచారణకు వచ్చింది. ప్రభావతి తరఫున సీనియర్ న్యాయవాది పొపెల్లుగారి వీరారెడ్డి స్పందిస్తూ.. రఘురామకృష్ణరాజు ఇంప్లీడ్ పిటిషన్‌ను అనుమతిస్తే తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. దీంతో రఘురామకృష్ణరాజు ఇంప్లీడ్ పిటిషన్‌ను అనుమతించిన న్యాయమూర్తి విచారణను మంగళవారానికి వాయిదా వేశారు.

సీఎం చంద్రబాబుతో టీటీడీ చైర్మన్ భేటీ

సాక్షి, అమరావతి : టీటీడీ పాలక మండలి చైర్మన్ బీఆర్ నాయుడు సోమవారం సీఎం చంద్రబాబును కలిసి పాలక మండలి నిర్ణయాలను వివరించారు. ఈ సందర్భంగా తిరుమలలో భక్తులు గంటల తరబడి దర్శనం కోసం వేచి ఉండకుండా ఏఐ టెక్నాలజీ ద్వారా త్వరితగతిన దర్శనం కల్పించాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఈ మేరకు నిపుణుల కమిటీ ద్వారా దీనిపై నిర్ణయం తీసుకోవాలని చైర్మన్ కోరారు. తిరుమల ఆలయంలో భక్తులు తోపులాటకు గురవుతున్నారంటూ తరచూ భక్తుల నుంచి ఫిర్యాదు వస్తున్న నేపథ్యంలో నేమ్ బ్యాడ్జ్ పెట్టాలని పాలక మండలి నిర్ణయం తీసుకున్నట్టు సీఎం దృష్టికి తెచ్చారు. గత ప్రభుత్వ హయాంలో డెప్యూటేషన్‌పై వచ్చిన ఎనిమిది మంది అధికారులను బదిలీ చేయాలని సీఎంను కోరారు. సిమ్స్ ఆస్పత్రికి ఏటా రూ.100 కోట్ల నష్టం వస్తోందని, ఆరోగ్యశ్రీ నుంచి రూ.80 కోట్లు ఇవ్వాల్సి ఉందన్నారు. ఈ సందర్భంగా సీఎం స్పందిస్తూ ఏఐ టెక్నాలజీ వినియోగంపై ప్రపంచ స్థాయి సాంకేతిక పరిజ్ఞానం గల సంస్థలతో సంప్రదింపులు జరిపి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. డెప్యూటేషన్ ఉద్యోగులను బదిలీ చేస్తామన్నారు. అలాగే సిమ్స్‌లో నూతన భవనాల నిర్మాణాలపై పాలకమండలి నిర్ణయం మేరకు నిర్ణయం తీసుకోవాలని సీఎం ఆదేశించారు.

మార్చి నాటికి 50 వేల ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

అధికారులకు మంత్రి సారథి ఆదేశం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వచ్చే మార్చి నాటికి 50 వేల ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని గృహ నిర్మాణ శాఖ అధికారులను మంత్రి కొలుసు పార్థసారథి ఆదేశించారు. సోమవారం సచివాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి.. త్వరలో నిర్మాణాలు పూర్తయిన ఇళ్ల లబ్ధిదారులకు తాళాలు అందించే కార్యక్రమం నిర్వహిస్తామని వెల్లడించారు. పేదల కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పురపాలక, పంచాయతీరాజ్, విద్యుత్ శాఖలు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.

భార్గవ్‌రెడ్డిపై కఠిన చర్యలేవీ తీసుకోవద్దు

మరోసారి మధ్యంతర ఉత్తర్వులు పొడిగించిన హైకోర్టు

సాక్షి, అమరావతి: సోషల్ మీడియా పోస్టులకు సంబంధించి పోలీసులు తనపై నమోదు చేసిన కేసుల్లో వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా మాజీ ఇన్‌చార్జ్ సజ్జల భార్గవ్‌రెడ్డిపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దంటూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను హైకోర్టు మరోసారి పొడిగించింది. తదుపరి విచారణను జనవరి 7వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వెంకటజ్యోతిర్మయి ప్రతాప సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. తనపై రాష్ట్రవ్యాప్తంగా పలు పోలీస్ స్టేషన్లలో నమోదు చేసిన కేసులన్నింటినీ కొట్టేయాలని కోరుతూ భార్గవ్‌రెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన సుప్రీంకోర్టు ఈ వ్యవహారాన్ని హైకోర్టులో తేల్చుకోవాలని స్పష్టం చేస్తూ రెండు వారాలపాటు ఆయనపై కఠిన చర్యలేవీ తీసుకోవద్దని పోలీసులను ఆదేశించిన విషయం తెలిసిందే. దీంతో ఆయన తనపై కేసులను కొట్టేయాలని కోరుతూ హైకోర్టులో పలు పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై విచారణ జరిపిన హైకోర్టు.. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో భార్గవ్ రెడ్డిపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశించింది. తాజాగా ఈ వ్యాజ్యాలు సోమవారం మరోసారి విచారణకు రాగా, భార్గవ్‌పై గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పొడిగిస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు.

యోగా పోటీల్లో ట్రిపుల్ ఐటీ విద్యార్థి ప్రతిభ

నూజివీడు: భువనేశ్వర్‌లోని కిట్ యూనివర్సిటీలో అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ ఆధ్వర్యంలో ఈ నెల 24 నుంచి 28 వరకు నిర్వహించిన జాతీయ స్థాయి అంతర్ విశ్వవిద్యాలయాల యోగాసన పోటీల్లో ఏలూరు జిల్లా నూజివీడు ట్రిపుల్ ఐటీ విద్యార్థి ప్రతిభ కనబరిచాడు. రిథమిక్ యోగాలో ఇంజనీరింగ్ ప్రథమ సంవత్సరానికి చెందిన టి.దుర్గాప్రసాద్ ప్రతిభ కనబరిచి తృతీయస్థానం సాధించి కాంస్య పతకాన్ని గెలుచుకున్నాడు. విద్యార్థిని డైరెక్టర్ ఆచార్య సంద్ర అమరేంద్రకుమార్ అభినందించారు. జాతీయస్థాయిలో ప్రతిభ కనబరచి ట్రిపుల్ ఐటీ ప్రతిష్టను మరింత పెంచాడని తెలిపారు. ఏవో బి.లక్ష్మణరావు తదితరులు విద్యార్థిని అభినందించారు.



దుర్గాప్రసాద్‌ను అభినందిస్తున్న డైరెక్టర్ ఆచార్య సంద్ర అమరేంద్రకుమార్

సత్యదేవుని హుండీ ఆదాయం రూ.1.52 కోట్లు

అన్నవరం: అన్నవరం శ్రీ వీర వేంకట సత్యనారాయణస్వామి దేవస్థానానికి హుండీల ద్వారా 28 రోజులకు రూ.1,52,58,438 ఆదాయం వచ్చింది. హుండీలను సోమవారం లెక్కించారు. హుండీల ద్వారా రూ.1,46,41,197 నగదు, రూ.6,17,241 చిల్లర నాణేలు వచ్చాయని అధికారులు తెలిపారు. వీటితో పాటు 16.800 గ్రాముల బంగారం, 745 గ్రాముల వెండి వచ్చాయన్నారు.

లోకాయుక్త ఆదేశాలతోనే బీఎల్‌ఓలకు గౌరవ వేతనం


కర్నూలు(సెంట్రల్): లోకాయుక్త ఆదేశాలతోనే ఎన్నికల విధులకు సంబంధించి బూత్ లెవల్ ఆఫీసర్ల (బీఎల్ఓ)కు గౌరవ వేతనం మంజూరు చేసినట్లు లోకాయుక్త కార్యాలయం సోమవారం ఓ ప్రకటన విడుదల చేసింది. కృష్ణాజిల్లా ఉయ్యూరుకు చెందిన సోషల్ వర్కర్ జే శ్రీనివాస గౌడ్ రాష్ట్రవ్యాప్తంగా 4,368 మంది బీఎల్ఓలకు గౌరవ వేతనాన్ని ఇవ్వడం లేదని లోకాయుక్తను ఆశ్రయించారు. దానిని విచారణకు స్వీకరించిన లోకాయుక్త.. వారికి వేతనాలు మంజూరు చేయాలని భూపరిపాలన ప్రధాన కమిషనర్‌కు ఆదేశాలిచ్చింది. ఈ మేరకు శ్రీనివాస గౌడ్ ప్రధాన ఎన్నికల కమిషనర్ దృష్టికి విషయాన్ని తీసుకెళ్లడంతో డిసెంబర్ 24వ తేదీన రూ.58.62 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం జీఓ ఆర్‌టీ నంబర్ 22100ను విడుదల చేసిందని లోకాయుక్త ఆ ప్రకటనలో పేర్కొంది.

హెల్త్

అందం... ఆరోగ్యం...

అందాన్ని పెంపొందించుకునేందుకు కొన్ని సాధారణ పదార్థాలను ఎప్పటి నుంచో మనం వాడుతూనే ఉన్నాం. ఇప్పటికే ఎన్నో కొత్త కొత్త సౌందర్యసాధనాలు అందుబాటులోకి వచ్చాయి గానీ నేచురల్‌గా లభ్యమయ్యే ఈ మామూలు పదార్థాలతోనే మేనినీ, జీవితాన్ని చాలా అందంగా చేసుకోవచ్చని అనాది కాలం నుంచి నిరూపితమైంది. ఎన్ని రకాల సౌందర్య సాధనాలు వచ్చినా ఇవి మాత్రం ఆరోగ్యకరమైనవిగా కాల పరీక్షను తట్టుకుని నిలబడ్డాయి. సౌందర్య సాధానాలుగా మనం ఉపయోగిస్తున్న కొన్ని ఇంటి, వంటింటి పదార్థాల గురించి తెలుసుకుందాం.

• ప్రకృతి ఓనమాలు



శనగపిండి : ముఖానికి ఉన్న జిడ్డును తొలగించడానికి శనగపిండిని ప్యాక్‌లా వేసుకోవడమన్నది చాలామంది ఎప్పటి నుంచో అనుసరిస్తున్న పద్ధతే. దీన్ని పసుపు, పాలు, వెన్న, తేనె వంటి వాటితో కలిపి మిశ్రమంలా ముఖానికి రాసుకోవడం వల్ల మేని ఛాయ మెరుగవుతుందని చాలా మంది నమ్మకం.



పసుపు : పసుపును పసుపు మొక్క వేళ్ల నుంచి తయారుచేస్తారు. పసుపుకొమ్ములుగా పేర్కొనే ఆ మొక్కల వేళ్లను పొడిగా మార్చి పొడి చేసి, అలా వచ్చిన పౌడర్‌ను ఓ సౌందర్య సాధనంగా ఉపయోగిస్తారు. పసుపును వంటలో సైతం వాడతారు. ఇది క్రిమినాశినిగా పనిచేస్తుంది. తెలుగువారి ఎన్నో సాంస్కృతిక ఉత్సవాల్లో కాళ్లకు పసుపు రాసుకునే సంప్రదాయం ఉంది. దాంతోపాటు ముఖానికి కూడా సౌందర్య సాధనంగా పసుపు రాసుకుంటారు. దాంతో మెరుగైన ఛాయ వస్తుంది. అయితే దీర్ఘ కాలం పసుపును ముఖానికి రాయడం అంత మంచిది కాదు. దాని వల్ల ముఖం తడి కోల్పోయి విపరీతంగా పొడిబారి ముఖంపై ముడుతలు వచ్చే అవకాశం ఉంది.



చందనం : తెలుగు వారి సంస్కృతిలోని ఎన్నో ఉత్సవాల్లో కాళ్లకు పసుపుతో పాటు... మెడపై గంధం రాసుకునే సంప్రదాయం కూడా ఉంది. అందుకే చాలా సందర్భాల్లో పసుపూ–చందనం అంటూ ఈ రెండింటినీ కలిపి చెబుతుంటారు. దీన్నిబట్టి సౌందర్య సాధనాలను ఆరోగ్యకరమైన రీతిలో వేడుకలకు ఉపయోగించడం మన సంస్కృతిలో ఎప్పటినుంచో ఉన్నదే అన్న విషయాన్ని గట్టిగా చెప్పవచ్చు. చందనాన్ని ఒక పరిమళ ద్రవ్యంగా ఉపయోగించడంతో పాటు చలువ చేసేందుకు వాడే వస్తువుగా కూడా పరిగణిస్తారు. సంప్రదాయంగా చందనం చెక్కను రాతి మీద అరగదీసి గంధాన్ని తయారు చేసి వాడతారు. ఇటీవల ఈ చందనాన్ని ముఖానికి రాసుకునే పౌడర్లలో, పెర్‌ఫ్యూమ్స్‌లో, సబ్బుల్లో ఉపయోగిస్తున్నారు. చందంతో ముఖానికి ప్యాక్ వేయడం వల్ల నిగారింపు వస్తుందన్న నమ్మకం అనాదిగా ఉన్నదే.



గోరింటాకు : ఇటీవల మెహందీ పేరిట చెబుతున్న ఈ ఆకును నూరి తయారు చేసే ఈ ఉత్పాదనను మన సంస్కృతిలో ఎప్పటి నుంచో ఓ సౌందర్య సాధనంగా ఉపయోగిస్తున్నారు. ఇది రంగును ఇచ్చే కలరింగ్ ఏజెంట్‌గా మాత్రమే కాకుండా... చల్లదనాన్ని ఇచ్చే సౌందర్య సాధనంగా పేరు పొందింది. ఇటీవల దీన్ని తలకు వేసే రంగుల కోసం 'హెన్నా' అని కూడా ఉపయోగిస్తున్నారు. నిజానికి పెండ్లి వేడుకల సందర్భంగా, అలాగే అనేక పర్వదినాల్లో... ముందుగా దీన్ని రాసుకోవడం అన్నది అనాదిగా మన సంప్రదాయంలో ఒక సాంస్కృతిక వేడుక.





సాంబ్రాణి : ఇది కొన్ని రసాయనాలతో పాటు కొన్ని మొక్కల బెరడుల నుంచి తీసే మిశ్రమం. ఇది సుగంధ పరిమళ సాధనమే అయినా చిన్న పిల్లల్లో ఆరోగ్యం కోసం దీన్ని ఉపయోగిస్తారు. ప్రతిరోజూ చంటి పిల్లల స్నానం తర్వాత సాంబ్రాణిని నిప్పులపై వేస్తారు. అందులోంచి వచ్చే పొగ క్రిమి సంహారిణిగా పనిచేస్తుంది. దానితో పాటు చంటిపిల్లలు ఉన్న గదిలో వచ్చే దుర్వాసనను పోగొడుతుంది. అంటే అక్కడ పేరుకునే హానికారక బ్యాక్టీరియాను దూరం చేస్తుండటం వల్ల దుర్వాసన దూరమవుతుంది.





కొబ్బరి నూనె : ఇది ముదురు కొబ్బరి నుంచి తీసే నూనె. శుభ్రమైన ఈ నూనెను మన సంస్కృతిలో తలకు రాయడం ఒక ఆనవాయితీ. తలకు రాసే ఎన్నో నూనెల కంటే అది శ్రేష్ఠమైనదని నమ్మకం. దీనితో పాటు ఆరోగ్యకరమైన కేశాల కోసం మందార ఆకులు, ఉసిరి కలిపి వాడటం కూడా సాధారణంగా జరుగుతుంటుంది.

ఏజ్ సైజ్

మనిషి పుట్టుకకు ప్రోస్టేట్ గ్రంథి ఎంత కీలకం అంటే అది లేకపోతే మానవ మనుగడే లేదు. వృషణాలు వీర్యకణాలను ఉత్పత్తి చేస్తాయి. అయితే అవి ఈదుతూ స్త్రీ అండం వరకు వెళ్లేందుకు తోడ్పడే ద్రవాన్ని మాత్రం ప్రోస్టేట్ గ్రంథి ఉత్పత్తి చేస్తుంది. వీర్యకణాలు మహిళ అండాలను చేరేవరకు వీర్యకణాలు నశించిపోకుండా... ఆ ద్రవంలోని ప్రోటీన్లూ, ఎంజైములూ, గ్లూకోజూ, కొన్ని కొవ్వులు సాయపడుతుంటాయి. ఇక మహిళల శరీరంలో కాస్త ఆమ్లగుణం ఉండటం వల్ల... దాన్ని న్యూట్రలైజ్ చేసేలా ప్రోస్టేట్ ద్రవం కాస్త క్షారగుణం కలిగి ఉంటుంది. దాంతో ప్రోస్టేట్ ద్రవంలోని క్షారగుణం... మహిళ శరీర ఆమ్లగుణాన్ని తట్టుకుని, వీర్యకణాల మనుగడ సాధ్యమయ్యేలా చేసి, వాటిని గమ్యానికి చేరుస్తాయి. దాంతో వీర్యకణంతో కలిశాక అండం పిండమై అదే చిన్నారి శిశువుగా రూపొందుతుంది. అయితే చాలామందిలో 50 ఏళ్లు దాటాక ఈ గ్రంథి సైజు దాదాపు అకస్మాత్తుగా పెరిగే అవకాశముంది. అప్పుడు వచ్చే సమస్యలూ, వాటి పరిష్కారాలూ తెలుసుకుందాం.

• ప్రోస్టేట్ గ్రంధి రంధి



ప్రోస్టేట్ గ్రంథి బాదం కాయ సైజులో దాదాపు 18–22 గ్రాముల బరువుంటుంది. ఈ గ్రంథి మధ్య నుంచే మూత్రాన్ని బయటకు తీసుకు వచ్చే నాళం ఉంటుంది. వయసు పెరిగిన వాళ్లలో హఠాత్తుగా ప్రోస్టేట్ గ్రంథి పెరగడంతో ఆ నాళం ఒత్తుకుపోవడం వల్ల మూత్రం బయటకు వచ్చే దారి మూసుకుపోతుంది. దాంతో మూత్రం బయటకు రాలేకపోవడంతో కడుపు ఉబ్బిపోతున్నట్లుగా అనిపించడం... మూత్ర విసర్జనకు వెళ్తే అది బయటకు రాకపోవడంతో పురుషులు విలవిలలాడుతుంటారు. మునుపెన్నడూ ఇలా జరగకపోవడంతో మూత్రం వస్తున్నట్లు అనిపించడం, తీరా విసర్జనకు వెళ్తే రాకపోవడంతో ఏం జరుగుతుందో తెలియక ఆందోళనకు లోనవుతుంటారు. ఇలా బాధపడేవాళ్లను ఆసుపత్రికి తీసుకెళ్తే... డాక్టర్లు అక్కడ మూత్రనాళంలోకి ఒక పైప్‌ను ప్రవేశపెట్టి లోపలున్న మూత్రాన్ని బయటకు వచ్చేలా చేస్తారు. ఆ తర్వాత పెద్దదిగా పెరిగిపోయిన ప్రోస్టేట్‌కు గ్రంథికి అవసరమైన చికిత్స అందిస్తారు.

ప్రోస్టేట్ సైజు పెరిగేదెందుకు?

కొందరిలో ప్రోస్టేట్ గ్రంథి సైజు ఎందుకు పెరుగుతుందనేందుకు కారణాలు ఇప్పటికీ తెలియరాలేదు. వయసు పెరగడం వల్ల వచ్చే ఓ పరిణామంగా దాన్ని పరిగణిస్తుంటారు. ఓ వయసు దాటాక వెంట్రుకలు తెల్లబడటం ఎలాగో... ప్రోస్టేట్ సైజ్ పెరగడం కూడా అలాగేనని కొందరు నిపుణల అభిప్రాయం. ఒక వయసు దాటాక వృషణాల్లోని కణాలూ, వాటి నిర్మాణంలో వచ్చే మార్పులతో పాటు అవి ఉత్పత్తి చేసే టెస్టోస్టెరాన్ హార్మోన్ స్థాయిల మార్పుల వల్ల ప్రోస్టేట్ కూడా పెరుగుతుందేమోనన్నది కొందరు నిపుణుల భావన.

ఒక పెరుగుదల హానికరం... మరొకటి నిరపాయకరం...

ప్రోస్టేట్‌లోని పెరుగుదల రెండు రకాలుగా చెప్పవచ్చు. ఎలాంటి హానికరమైన మార్పులు లేని కణాలతో సైజు పెరగడాన్ని 'బినైన్ ప్రోస్టేటిక్ హైపర్‌ప్లేసియా' అంటారు. దీని వల్ల ఎలాంటి ప్రాణాపాయం ఉండబోదు.

ఇక రెండో రకమైన పెరుగుదలను ప్రమాదకరమైనది పరిగణిస్తారు. ఇందులో ఈ పెరగుదల క్యాన్సర్ కణాలతో జరుగుతుంది. ప్రోస్టేట్ క్యాన్సర్ కారణంగా ఆ కణంలో అపరిమితంగా కణవిభజన జరగడంతో ఈ పెరుగుదల సంభవిస్తుంది.

లక్షణాలు...

ప్రోస్టేట్ పెరుగుదలలో రెండు రకాల లక్షణాలు కనిపిస్తాయి. మొదటిది స్టోరేజీ... అంటే మూత్రం భర్తీ కావడంతో కనిపించే లక్షణాలు. రెండోది వాయిడింగ్... అంటే మూత్రపు సంచి (బ్లాడర్) ఖాళీ అవడానికి సంబంధించిన లక్షణాలు.

స్టోరేజ్‌కు సంబంధించినదీ...

❖ రాత్రివేళలల్లో మామూలు కంటే ఎక్కువ సార్లు మూత్రానికి వెళ్లాల్సి వస్తుండటం. ❖ పగటివేళల్లో కూడా చాలా ఎక్కువసార్లు మూత్రానికి వెళ్లాల్సిరావడం. ❖ మూత్రాన్ని ఏమాత్రం ఆపుకోలేకపోవడం. ❖ మూత్రవిసర్జనపై నియంత్రణ లేకపోవడం.

వాయిడింగ్...

❖ మూత్రవిసర్జన కోసం నిలబడ్డ తర్వాత ఎంతోసేపటి తర్వాత గాని మూత్రపు ధార మొదలుకాకపోవడం. ❖ ధార సాఫీగా కాకుండా... చాలా మెల్లగా రావడం. ❖ మూత్రపు సంచి (బ్లాడర్) ఖాళీ కావడానికి చాలా సమయం తీసుకోవడం. ❖ మూత్రం... ఓ ధారలా కాకుండా... వస్తూ, ఆగుతూ... వస్తూ, ఆగుతూ వస్తుండటం. ❖ ఎప్పటిలా కాకుండా మూత్రవిసర్జన చాలా శ్రమతోనో, బాధతోనో జరుగుతుండటం, మూత్రవిసర్జనలో నొప్పి రావడం. ❖ మూత్రవిసర్జన ముగిసే సమయానికి ముక్కి ముక్కి పోయాల్సిరావడం. ❖ ఎంతో కొంత మూత్రం లోపలే ఉండిపోయినట్లు అనిపిస్తుండటం. ❖ ఒక్కోసారి మూత్రపు ధారలో రక్తం కనిపించడం (మూత్రంలో లేదా బ్లాడర్‌లో ఇన్ఫెక్షన్ ఉన్నప్పుడు ఇలా జరుగుతుంది).

నిర్ధారణ...

❖ సమస్య నిర్ధారణ కోసం డాక్టర్లు తమ వేళ్లను మల మార్గం ద్వారా లోనికి ప్రవేశపెట్టి వేళ్ల స్పర్శ సహాయంతో ప్రోస్టేట్ పెరిగినదీ, లేనిదీ తెలుసుకుంటారు. దీన్నే 'డిజిటల్ రెక్టల్ ఎగ్జామినేషన్' (డీఆర్‌ఈ) అంటారు. ❖ మైక్రోస్కోప్ సహాయంతో మూత్రపరీక్ష (దీంతో ఏవైనా ఇన్ఫెక్షన్స్ ఉంటే తెలుస్తాయి). ❖ యూరిన్ కల్చర్ ❖ మూత్ర వేగం (యూరనరీ ఫ్లో / యూరోఫ్లోమెట్రీ ❖ అల్ట్రాసౌండ్ స్కానింగ్ (ఈ పరీక్ష వల్ల మూత్రపిండాలు, యురేటర్ (మూత్రపిండం నుంచి మూత్రపు సంచి వరకు ఉండే ట్యూబ్), మూత్రపు సంచి (బ్లాడర్)ల పరిమాణంతో పాటు మూత్రపు సంచిలో మూత్రం మిగిలిపోతోందా అన్న విషయాలు తెలుస్తాయి). ❖ బ్లడ్ యూరియా, క్రియా

ప్రోస్టేట్ సమస్యల నివారణ కోసం...

ప్రోస్టేట్ ఎన్‌లార్జ్‌మెంట్ నివారణ మన చేతుల్లో లేకపోయినా... కొన్ని మామూలు జాగ్రత్తలతో ప్రోస్టేట్ సమస్యలను చాలావరకు నివారించవచ్చు. అవి...

❖ మూత్రవిసర్జన ఫీలింగ్ రాగానే... చాలా సేపు ఆపుకోకుండా వీలైనంత త్వరగా మూత్ర విసర్జనకు వెళ్లడం. ❖ మూత్రవిసర్జన కోసం ముందుగా నిర్ణయించుకున్న కొన్ని నిర్దిష్ట వేళల్లో... మూత్రం వచ్చినా రాకున్నా ఆ సమయంలో మూత్రవిసర్జనకు వెళ్లడం. ❖ కెఫిన్ మోతాదులు ఎక్కువగా ఉండే కూల్‌డ్రింకులూ, కాఫీ వంటివి తీసుకోకపోవడం లేదా చాలా పరిమితంగా మాత్రమే తీసుకోవడం. ❖ రోజూ సాధారణంగా తాగే నీళ్లకు మించి... మరీ ఎక్కువగా మరిన్ని నీళ్లు తాగకపోవడం. ❖ డాక్టర్ సలహా లేకుండా అలర్జీల కోసం / ఊపిరితిత్తుల్లోకి గాలి సాఫీగా ప్రవహించేలా చేసే డీ–కంజెస్టెంట్స్ లేదా యాంటీహిస్టమైన్ మందులు తీసుకోకపోవడం. ఇవి బినైన్ ప్రోస్టేటిక్ హైపర్‌ప్లేసియా ముప్పును పెంచే అవకాశం ఉంది. ❖ చాలా చల్లని వాతావరణంలో మనల్ని మనం వెచ్చగా ఉంచుకోవడం (చలి వాతావరణం ఈ సమస్యను మరింత పెంచుతుంది). ❖ చురుగ్గా ఉండటం. అలా ఉండటం కోసం క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం. ❖ శరీరకంగా, మానసికంగా ఒత్తిడికి లోనుకాకుండా చూసుకోవడం / ఒత్తిడిని అధిగమించడం (ఒత్తిడి వల్ల మాటిమాటికీ మూత్రవిసర్జనకు వెళ్లాలనిపిస్తుంటుంది).

చికిత్స...

ప్రోస్టేట్ వచ్చిన సమస్య, పెరుగుదలకు కారణం, దాని తీవ్రతా, లక్షణాలూ... అలాగే ఆ సమస్య వల్ల బాధితులు రోజువారీగా ఎదుర్కొనే సమస్యలను బట్టి చికిత్స ఉంటుంది. ఉదాహరణకు...

❖ **ప్రోస్టైటిస్ :** ప్రోస్టేట్ గ్రంథికి వచ్చే ఇన్ఫెక్షన్‌ను ప్రోస్టైటిస్ అంటారు. మిగతా అన్ని రకాల ఇన్ఫెక్షన్‌ల లాగే... యాంటిబయాటిక్స్‌తో చికిత్స చేస్తే ఇది పూర్తిగా నయమవుతుంది. కాకపోతే యాంటిబయాటిక్స్‌తో కాస్త ఎక్కువ కాలం పాటు చికిత్స చేయాల్సి ఉంటుంది.

❖ మూత్రం ఏమాత్రం ఆపుకోలేకపోవడం, మూత్రంలో ఎరుపు కనిపించడం, మూత్రధారలో రక్తపు చారిక, మూత్రం లోపలే ఉండిపోవడం, మాటిమాటికీ వచ్చే ఇన్ఫెక్షన్లూ, కిడ్నీ దెబ్బతినడం వంటి సమస్యలను మందులతో అదుపు చేయలేకపోతే... అప్పుడు శస్త్రచికిత్స అవసరమవుతుంది. ❖ ప్రోస్టేట్ పెరిగిన పరిమాణం, దాని ఆకృతి వంటి అంశాలను బట్టి వేర్వేరు రకాల ప్రక్రియలు (ప్రొసిజర్స్) అవసరమవుతాయి. వీటన్నింటిలో బినైన ప్రోస్టేటిక్ హైపర్‌ప్లేసియా సమస్య కోసం సాధారణంగా 'ట్రాన్స్ యురెథ్రల్ రిసెక్షన్ ఆఫ్ ప్రోస్టేట్' (టీయూఆర్‌పీ) అనే శస్త్రచికిత్స ప్రక్రియను అనుసరిస్తుంటారు. ❖ మరికొందరిలో లేజర్ సహాయంతో 'లేజర్ ప్రోస్టెక్టమీ' చేస్తుంటారు. సంప్రదాయ శస్త్రచికిత్సతో పోలిస్తే... రక్తాన్ని పలచబార్చే మందులు వాడుతున్నవారికీ, ప్రోస్టేట్ సైజు మరీ విపరీతంగా పెరిగినవారికీ, గుండె సమస్యలున్నవారికీ లేజర్ సహాయంతో చేసే చికిత్స వల్ల ప్రయోజనాలుంటాయి. ఉదాహరణకు ❖ చాలా స్వల్పంగా మాత్రమే రక్తస్రావం ❖ హాస్పిటల్‌లో ఉండాల్సిన వ్యవధి చాలా తక్కువ కావడం ❖ త్వరగా కోలుకోవడం వంటివి.

పైన పేర్కొన్న లక్షణాలను బట్టి మూత్రవిసర్జన కోసం మూత్రవిసర్జన కోసం టాయెలెట్‌లో గడిపాల్సిన సమయం పెరుగుతుంటే ఒకసారి యూరాలజిస్టును సంప్రదించి, తగిన పరీక్షలు చేయించుకుని, అవసరాన్ని బట్టి తగిన చికిత్స తీసుకోవడం మేలు.

తమ పాదాల నొప్పి తగ్గడానికి పొట్టలోని కొవ్వును ఇంజెక్ట్ చేస్తే చాలు!!



తమను బాధించే పాదాల నొప్పికి తమ పొట్ట (లోవర్ అబ్డామెన్)లోని కొవ్వు విరుగుడుగా పనిచేస్తుందని ఓ అధ్యయనంలో తేలింది. ప్లాంటార్ ఫేసియైటిస్ వంటి కొన్ని రకాల పాదాల నొప్పికి కారణమయ్యే వ్యాధులకు తమ పొట్టలోని సొంత కొవ్వు కణాలనుంచి తీసిన 'స్టెమ్ సెల్స్'ను పాదాల్లోకి ఇంజెక్ట్ చేస్తారు. దీనివల్ల చాలాకాలం నుంచి బాధిస్తున్న నొప్పి తగ్గడమే కాదు... కేవలం ఆరు నెలల వ్యవధిలోనే వారు మునుపటిలా స్పోర్ట్స్ అండ్ గేమ్స్ వంటి ఆటపాటల్లో పాలు పంచుకునేంతగా సమస్య నయమవుతుందని ఈ పరిశోధన వల్ల తేలింది. యూఎస్‌లోని యూనివర్సిటీ ఆఫ్ పిట్స్‌బర్గ్‌కు చెందిన శాస్త్రవేత్తలు చేసిన ఓ పరిశోధనలో ఈ విషయం తేటతెల్లమైంది. శస్త్రచికిత్సే చివరి పరిష్కారంగా ఉన్న కొత్త పాదాల నొప్పులు కూడా ఈ చిన్నపాటి ఇంజెక్షన్ చికిత్సతో తగ్గిపోయినట్లుగా ఈ పరిశోధనలో తెలిసివచ్చింది. ఈ పరిశోధన వివరాలు ''ప్లాస్టిక్ అండ్ రీ–కన్‌స్ట్రక్టివ్ సర్జరీ' అనే మెడికల్ జర్నల్‌లో నమోదు చేశారు.

• హ్యాపీ జర్నీ

ట్రావెల్‌నెస్ ట్రిప్స్!!




నిన్నమొన్ననే జరిగిన క్రిస్‌మస్ సెలవుల కోసమని కొందరు, జనవరి మొదటిరోజు తమకు ఇష్టమైన వారిని కలవడం కోసం లేదా రాబోయే సంక్రాంతికి ఇంకొందరు ప్రయాణాలు చేస్తూనే ఉంటారు. కారణమేదైనా రకరకాల అవసరాల కోసం ఎప్పటికప్పుడు ఎవరో ఒకరు ప్రయాణాలు చేయాల్సిన ఆవశ్యకత ఉండనే ఉంటుంది. ప్రయాణాల్లో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలిపే కథనమిది.

❖ అన్నిటికంటే ముందుగా ప్రయాణం చేయబోయే ముందర తాము రెగ్యులర్‌గా సంప్రదించే జనరల్ ఫిజీషియన్‌ను తొలుత తప్పనిసరిగా కలవాలి. తాము వెళ్తున్న ప్రదేశం గురించి తెలపాలి. అక్కడ ఉండే వాతావరణానికి అనువుగా తాము తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలుసుకొని... ఆ మేరకు జాగ్రత్తలు తీసుకోవాలి.

❖ తమకు ఏవైనా ఆరోగ్య సమస్యలుంటే డాక్టర్‌కు చెప్పి, ఆ నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలేమిటో తెలుసుకోవాలి.

❖ ఆ మేరకు డాక్టర్లు ప్రిస్క్రయిబ్ చేసిన ప్రకారం... తమకు అవసరమైన మందులను ముందుగానే రెడీగా పెట్టుకోవాలి. ఉదాహరణకు హై–బీపీ, డయాబెటిస్, హై–కొలెస్ట్రాల్ వంటి సమస్యలు ఉన్నవారు తాము ప్రయాణం చేసే కాలానికి అవసరమైనన్ని మందులను రెడీ చేసుకొని పెట్టుకోవాలి. సరిగ్గా తాము అనుకున్న వ్యవధికి అవసరమైనన్నే కాకుండా... వీలైతే కొద్దిగా ఎక్కువ మందులే తీసుకెళ్లడం మంచిది. ఉదాహరణకు ఆస్తమా బాధితులు ఎటాక్ వచ్చిన వెంటనే తాము తక్షణం వాడాల్సిన (ఎస్‌ఓఎస్) మందుల్ని వెంట ఉంచుకోవాలి. అలాగే వారు తమతో పాటు క్యారీ చేయాల్సిన ఇన్‌హేలర్స్, ప్రివెంటివ్ ఇన్‌హేలర్స్‌ను (వీలైతే ఒకటి రెండు ఎక్కువగానే) తీసుకెళ్లాలి. ఇది ఉదాహరణ మాత్రమే. ప్రయాణికులు తమ ఆరోగ్య సమస్యను బట్టి మందులు క్యారీ చేయాల్సి ఉంటుంది.





❖ విదేశాలకు వెళ్లాల్సిన అవసరం ఉన్నవారు... అక్కడ ఉండే ఆరోగ్య పరిస్థితులను బట్టి తీసుకోవాల్సిన ముందస్తు టీకా మందులు (వ్యాక్సిన్స్) తీసుకోవాలి. ఉదాహరణకు ఆఫ్రికా దేశంలోని కొన్ని ప్రాంతాల్లో ఎల్లో ఫీవర్ వ్యాధి ఎక్కువగా ఉంటుంది. ఆ దేశాలకు ప్రయాణం చేసేవారు ముందుగానే అక్కడి స్థానిక పరిస్థితులను బట్టి ఆయా వ్యాక్సిన్లు తీసుకున్న తర్వాతే ప్రయాణం మొదలుపెట్టాలి.

❖ గర్భవతులు తాము వాడాల్సిన మందులూ, అలాగే తీసుకోవాల్సిన అన్ని రకాల వ్యాక్సిన్లను తీసుకొని ఉండాలి.

❖ పిల్లలకు వారికి ఉన్న ఆరోగ్య సమస్యలను బట్టి వారు తీసుకోవాల్సిన మందుల్ని రెడీగా ఉంచుకోవాలి. ❖ ఆయా దేశాలే కాదు... కొన్ని సందర్భాల్లో తాము ప్రయాణం చేసే విమాన సంస్థలు సైతం కొన్ని ఆంక్షలు పెడుతుంటాయి. ''ఫిట్ టు ఫ్లై'' నిబంధనలుగా పేర్కొనే ఈ నిబంధనల గురించి ముందుగానే తెలుసుకోవాలి. దీంతో తమ ప్రయాణంలో రాబోయే సమస్యలను తెలుసుకుని, నివారించుకోవడం తేలికవుతుంది.

❖ తాము బస చేయబోయే చోట కొందరు 'పాస్ట్ ట్రావెల్ హిస్టరీ' అడిగి తీసుకుంటూ ఉంటారు. అంటే... గతంలో ఏయే ప్రాంతాలు / దేశాలు తిరిగివచ్చారో అడిగి తెలుసుకుంటుంటారు. తమ పాస్ట్ ట్రావెల్ హిస్టరీ గురించి ఎవరికి వారు ముందుగానే సమీక్షించుకుని, ప్రయాణ ఏర్పాట్లు చేసుకోవడం మంచిది. అయితే ప్రజలందరి సంక్షేమం కోసం తమ ట్రావెల్ హిస్టరీని పారదర్శకంగా సమర్పించడం ప్రయాణికులకూ మేలు. ఒక్కోసారి ఏదైనా సమాచారాన్ని దాచిపెట్టడం... వారికే ఇబ్బందులు తెచ్చేందుకు అవకాశమిస్తుంది.

❖ ఇవే గాకుండా... తాము వెళ్లబోయే ప్రదేశంలో ఉండే వాతావరణానికి అనువుగా దుస్తులు, అక్కడ ఎదురవ్వబోయే సమస్యలకు అనువుగా ఏర్పాట్లు చేసుకుని వెళ్లడం మంచిది.

❖ ఇటీవల పిల్లలకూ, పెద్దలకు దాదాపుగా అందరికీ కళ్లజోళ్లు ఉంటున్నాయి. ఉన్న కళ్లజోడుకి తోడుగా మరొకటి అదనంగా తీసుకెళ్లడం మేలు. ఎందుకంటే జర్నీలో కళ్లజోడు పోయినా లేదా విరిగిపోయినా అప్పటికప్పుడు మరొకటి సమకూర్చుకోవడం ప్రయాణ సమయంలో కష్టమవుతుంది. మరొకటి అదనంగా (స్పేర్‌గా) పెట్టుకోవడం చాలావరకు ఉపకరిస్తుంది.

ఈ కొద్దిపాటి జాగ్రత్తలతో ప్రయాణంలో వచ్చే చాలా ఆరోగ్య సమస్యల్ని తేలిగ్గానే అధిగమించవచ్చు. అందుకే కొన్ని ముందుజాగ్రత్తలు తీసుకున్న తర్వాతనే ప్రయాణం మొదలుపెట్టడం చాలావరకు మేలు చేస్తుందని గుర్తుంచుకోండి.

బిజినెస్ రీల్

లుపిన్ చేతికి హుమ్‌ఇన్సులిన్



న్యూఢిల్లీ: మధుమేహ చికిత్స ఔషధం 'హుమ్‌ఇన్సులిన్'ను ఎలీ లిల్లీ అండ్ కంపెనీ నుంచి కొనుగోలు చేసినట్లు ఫార్మా దిగ్గజం లుపిన్ తెలిపింది. అయితే, ఇందుకోసం ఎంత వెచ్చించినదీ మాత్రం వెల్లడించలేదు. తమ డయాబెటిస్ పోర్ట్‌ఫోలియోను పటిష్టం చేసుకునేందుకు, నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ సేవలను పేషంట్లకు చౌకగా అందించేందుకు ఈ కొనుగోలు ఉపయోగపడగలదని లుపిన్ ఎండీ నీలేష్ గుప్తా పేర్కొన్నారు. టైప్ 1, టైప్ 2 డయాబెటిస్ చికిత్సలో హుమ్‌ఇన్సులిన్ ఉత్పత్తుల శ్రేణిని వినియోగిస్తారు.

రిలయన్స్ 'కేజీ' చమురుకు ప్రీమియం ధర..

న్యూఢిల్లీ: కేజీ బేసిన్‌లో ఉత్పత్తి చేసే ముడిచమురుకు ప్రీమియం ధరను డిమాండ్ చేస్తూ రిలయన్స్ ఇండస్ట్రీస్ బిడ్లను ఆహ్వానించింది. దీనికి సంబంధించిన టెండర్ ప్రకారం బిడ్డర్లు అంతర్జాతీయ బెంచ్‌మార్క్‌కన్నా కనీసం 3.5 డాలర్లు (బ్యారెల్‌కు) అధికంగా కోట్ చేయాల్సి ఉంటుంది. 2025 జనవరి 24 నాటికి బిడ్లను దాఖలు చేయాల్సి ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ తూర్పు గోదావరి జిల్లాలోని గాడిమొగ నుంచి ఈ ఆయిల్‌ను రిలయన్స్ సరఫరా చేస్తుంది. ప్రధానంగా గ్యాస్ క్షేత్రమైన కేజీ–డీ6 బ్లాక్‌లో రిలయన్స్‌కు 66.67 శాతం, బీపీ ఎక్స్‌ప్లొరేషన్‌కు (ఆల్ఫా) 33.33 శాతం వాటాలు ఉన్నాయి. ఇందులో కొంత మొత్తం ముడిచమురు కూడా ఉత్పత్తి అవుతుంది. 2025 ఏప్రిల్ నుంచి 2026 ఫిబ్రవరి వరకు ప్రతి నెలా ఉత్పత్తి చేసే 17,600 బ్యారెళ్ల ఆయిల్ విక్రయం కోసం తాజాగా బిడ్లను ఆహ్వానించారు. ప్రస్తుతం ప్రామాణికంగా తీసుకుంటున్న నైజీరియన్ బోనీ లైట్ గ్రేడ్ క్రూడాయిల్ ధర బ్యారెల్‌కు 73.5 డాలర్లుగా ఉంది. టెండరు ప్రకటన ప్రకారం దీనికి 1.5 డాలర్ల ప్రీమియంతో పాటు బ్యారెల్‌కు కనీసం 2 డాలర్లు అధికంగా బిడ్డర్లు కోట్ చేయాల్సి ఉంటుంది.

వివాద్ సే విశ్వాస్.. గడువు పొడిగింపు

న్యూఢిల్లీ: వివాద్ సే విశ్వాస్ పథకం కింద వడ్డీ రేటు, పెనాల్టీల మాఫీకి వీలుగా డిక్లరేషన్ ఫైలింగ్ గడువును జనవరి 31 వరకు పొడిగిస్తున్నట్లు సీబీడీటీ ప్రకటించింది. వివాద్ సే విశ్వాస్ 2024 పథకం నిబంధనల ప్రకారం, పన్ను వివాదాల పరిష్కారానికి వీలుగా డిసెంబర్ 31వరకు డిక్లరేషన్ దాఖలు చేయాల్సి ఉంది. తాజాగా మరో నెల గడువు ఇస్తూ ఆదాయపన్ను శాఖ అత్యున్నత నిర్ణయాల విభాగం సీబీడీటీ నిర్ణయం తీసుకుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

31-12-2024

విశాఖ	600–00
చిత్తూరు	563–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	535–00
విజయవాడ	540–00
రిటైల్ ధర (డజను)	84.00
హైదరాబాద్	510–00
వరంగల్	512–00
రిటైల్ ధర	7.70

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ADANIENT	2,585.00	7.26
TECHM	1,729.35	1.03
HCLTECH	1,910.65	0.99
INDUSINDBK	961	0.8
SHRIRAMFIN	2,921.85	0.79

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
HINDALCO	603.1	-2.32
TATAMOTORS	735.25	-2.03
TRENT	6,975.00	-2.01
BEL	286.2	-2
WIPRO	304	-1.65

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	6,210
ఎన్ఎస్ఈ	140,017
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,88,286
ఎఫ్ఐఐ	- 1,893
డీఐఐ	+ 2,174

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	71.22 (రాత్రి 11.30కి)	$ 70.60 (క్రితం ముగింపు)
బ్రెంట్	74.28 (రాత్రి 11.30కి)	$ 73.79 (క్రితం ముగింపు)

స్థిరంగా దూసుకెళుతున్న భారత్ ఆర్థిక వ్యవస్థ

గ్రామీణ వినియోగం, ప్రభుత్వ పెట్టుబడుల దన్ను ● 2024 ఆర్‌బీఐ ఆర్థిక స్థిరత్వ నివేదిక వెల్లడి

ముంబై: భారత ఆర్థిక వ్యవస్థ సవాళ్లను ఎదుర్కొంటూ స్థిరత్వాన్ని కొనసాగిస్తోందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) నివేదిక పేర్కొంది. గ్రామీణ వినియోగం పునరుద్ధరణ, ప్రభుత్వ పెట్టుబడుల పెరుగుదల అలాగే బలమైన సేవల ఎగుమతులు భారత్ ఎకానమీ పటిష్టతకు కారణమవుతున్నాయని వివరించింది. ఆయా అంశాల దన్నుతో మార్చితో ముగిసే 2024–25 ఆర్థిక సంవత్సరంలో స్థూల దేశీయ ఉత్పత్తి (జీడీపీ) 6.6 శాతం నమోదవుతుందని ఆర్‌బీఐ 2024 డిసెంబర్ ఆర్థిక స్థిరత్వ నివేదిక (ఎఫ్ఎస్ఆర్) వెల్లడించింది. నివేదికలోని ముఖ్యాంశాలు..



- షెడ్యూల్ కమర్షియల్ బ్యాంకులు (ఎస్‌సీబీలు) పటిష్టంగా ఉన్నాయి. వాటి లాభదాయకత పెరుగుతోంది. మొండి బకాయిలు తగ్గుతున్నాయి. తగిన మూలధన మద్దతు లభిస్తోంది. ద్రవ్య లభ్యత (లిక్విడిటీ) బఫర్లతో గణనీయంగా శక్తివంతమయ్యాయి. రుణాలపై రాబడి (ఆర్ఓఏ)ఈక్విటీపై రాబడి (ఆర్ఓఈ) దశాబ్దాల గరిష్ట స్థాయిలో ఉండగా, స్థూల మొండిబకాయిల నిష్పత్తి పలు సంవత్సరాల కనిష్ట స్థాయికి చేరుకుంది. రుణ నాణ్యత మెరుగుపడడం బ్యాంకింగ్‌కు పూర్తి సానుకూల అంశం. స్థూల మొండిబకాయిల (జీఎన్‌పీఏ) నిష్పత్తి 2024 సెప్టెంబరు నాటికి 12 ఏళ్ల కనిష్ట స్థాయికి 2.6 శాతానికి తగ్గింది.
- మొదటి రెండు త్రైమాసికాల్లో బలహీన వృద్ధి ఫలితాలు వచ్చినప్పటికీ, నిర్మాణాత్మక వృద్ధి అంశాలు స్థిరంగా ఉన్నా యి. 2024–25 మూడవ, నాల్గవ త్రైమాసికాల్లో వృద్ధి పునరుద్ధరణ జరుగుతుంది. దేశీయ వినియోగం, ప్రభుత్వ పెట్టుబడులు, బలమైన సేవల ఎగుమతులు, ఆర్థిక పరిస్థితులు ఇందుకు కారణంగా ఉంటాయి.
- కరీఫ్, రబీ పంట భారీ దిగుబడులు ద్రవ్యోల్బణాన్ని పూర్తి అదుపులోనికి తీసుకువచ్చే అవకాశం ఉంది.
- అంతర్జాతీయ భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు గ్లోబల్ సరఫరా చైన్‌పై అలాగే కమోడిటీ ధరలపై ఒత్తిడిని పెంచే అవకాశాలు ఉన్నాయి.

2025లో వృద్ధి అవకాశాలు మెరుగు

"భారత ఆర్థిక వ్యవస్థకు 2025లో మంచి వృద్ధి అభివృద్ధి అవకాశాలు ఉన్నాయి. వినియోగదారులు, వ్యాపార వర్గాల్లో విశ్వాసం ఇందుకు దోహదపడుతుంది. భారత ఆర్థిక వ్యవస్థ పురోగతి, స్థిరత్వంపై మేము దృష్టి సారిస్తున్నాం. అంతర్జాతీయ సవాళ్లు ఉన్నప్పటికీ, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండవ భాగంలో వృద్ధి ఊపందుకుంది."

– ఫైనాన్షియల్ స్టెబిలిటీ రిపోర్ట్‌లో ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ముందుమాట

82.46 శాతం క్లెయిమ్‌లు పరిష్కారం

- చెల్లించిన సగటు రూ.31,086
- ఐఆర్‌డీఏఐ తాజా నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ: ఆరోగ్య బీమా సంస్థలు 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.15,100 కోట్ల విలువైన క్లెయిమ్‌లను అనుమతించలేదు. దాఖలు చేసిన మొత్తం క్లెయిమ్‌లలో ఇవి 12.9 శాతానికి సమానమని బీమా నియంత్రణ సంస్థ ఐఆర్‌డీఏఐ తాజాగా విడుదల చేసిన నివేదిక వెల్లడించింది. సాధారణ, స్వతంత్ర ఆరోగ్య బీమా సంస్థల ఆరోగ్య బీమా కింద మొత్తం రూ.1.17 లక్షల కోట్ల క్లెయిమ్‌లలో.. రూ.83,493.17 కోట్లు లేదా 71.29 శాతం చెల్లింపులు జరిగాయి. బీమా సంస్థలు రూ.10,937.18 కోట్ల (9.34 శాతం) క్లెయిమ్‌లను తిరస్కరించాయి. 2024 మార్చి నాటికి మొత్తం రూ.7,584.57 కోట్ల (6.48 శాతం) విలువైన క్లెయిమ్‌లు బకాయి ఉన్నాయి. 2023–24లో సుమారు 3.26 కోట్ల ఆరోగ్య బీమా క్లెయిమ్‌లు వచ్చి చేరాయి. వీటిలో 2.69 కోట్ల (82.46 శాతం) క్లెయిమ్‌లు పరిష్కారం అయ్యాయి. ఒక్కో క్లెయిమ్‌కు చెల్లించిన సగటు మొత్తం రూ.31,086.

నగదు రహితం 66.16%..

సెటిల్ అయిన క్లెయిమ్‌ల సంఖ్య పరంగా.. 72 శాతం థర్డ్ పార్టీ అడ్మినిస్ట్రేటర్స్ (టీపీఏ) ద్వారా, మిగిలిన 28 శాతం కంపెనీల అంతర్గత యంత్రాంగం ద్వారా పరిష్కారం అయ్యాయి. క్లెయిమ్‌ల సెటిల్‌మెంట్ విధానంలో 66.16 శాతం నగదు రహితంగా, మరో 39 శాతం రీయింబర్స్‌మెంట్ విధానంలో పరిష్కరించారు. 2023–24 సంవత్సరంలో సాధారణ, ఆరోగ్య బీమా కంపెనీలు పర్సనల్ యాక్సిడెంట్, ట్రావెల్ ఇన్సూరెన్స్ మినహాయించి రూ.1,07,681 కోట్ల ఆరోగ్య బీమా ప్రీమియం వసూలు చేశాయి. బీమా ప్రీమియం అంత క్రితం ఏడాదితో పోలిస్తే 20.32 శాతం వృద్ధిని నమోదు చేసింది. పర్సనల్ యాక్సిడెంట్, ట్రావెల్ ఇన్సూరెన్స్ బీమా కింద జారీ చేసిన పాలసీలు మినహా సాధారణ, ఆరోగ్య బీమా కంపెనీలు 2.68 కోట్ల ఆరోగ్య బీమా పాలసీల ద్వారా 57 కోట్ల మందికి కవరేజ్ ఇచ్చాయి.

165.05 కోట్ల జీవితాలను..

2024 మార్చి చివరి నాటికి 25 సాధారణ బీమా సంస్థలు, 8 స్వతంత్ర ఆరోగ్య బీమా సంస్థలు సేవలు అందించాయి. గత ఆర్థిక సంవత్సరంలో వ్యక్తిగత ప్రమాద బీమా కింద పరిశ్రమ మొత్తం 165.05 కోట్ల జీవితాలను కవర్ చేసింది. ఇందులో ప్రభుత్వ ప్రధాన పథకాలు ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన (పీఎంఎస్‌బీవై), ప్రధాన మంత్రి జన్ ధన్ యోజన (పీఎంజేడీవై), ఈ–టికెట్ కొనుగోలు చేసిన ప్రయాణికుల కోసం ఐఆర్‌సీటీసీ ప్రయాణ బీమా కింద కవర్ చేయబడిన 90.10 కోట్ల జీవితాలు ఉన్నాయి. ప్రభుత్వ రంగ సాధారణ బీమా సంస్థలైన న్యూ ఇండియా, నేషనల్, ఓరియంటల్ ఇన్సూరెన్స్ విదేశాలలో ఆరోగ్య బీమా వ్యాపారం చేస్తున్నాయి.



6.8 శాతం వరకూ భారత్ వృద్ధి

- 2024–25పై డెలాయిట్ అంచనా
- దేశీయ డిమాండ్ కారణం

న్యూఢిల్లీ: భారత్ ఆర్థిక వ్యవస్థ మార్చితో ముగిసే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2024 ఏప్రిల్– 2025 మార్చి) 6.5 నుంచి 6.8 శాతం శ్రేణిలో వృద్ధి చెందుతుందని ఆర్థిక సేవల దిగ్గజం– డెలాయిట్ అంచనావేసింది. 2025–2026 ఆర్థిక సంవత్సరంలో ఈ రేటు 6.7–7.3 శాతం శ్రేణిలో నమోదవుతుందని అంచనావేసింది. దేశీయ వినియోగం, డిమాండ్ ఎకానమీ పురోగతికి దోహదపడే ప్రధాన అంశాలని వివరించింది. ఈ నెల ప్రారంభంలో భారత రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) 2024–2025 ఆర్థిక సంవత్సరానికి వృద్ధి అంచనాను 7.2 శాతం నుండి 6.6 శాతానికి తగ్గించిన నేపథ్యంలో తాజా డెలాయిట్ నివేదిక వెలువడింది.

ఎకానమీ పటిష్టమే..

2024–25 ఆర్థిక సంవత్సరపు మొదటి అర్ధభాగంలో వృద్ధి రేట్లు అంచనాలకు తగ్గట్టుగా లేవని డెలాయిట్ ఇండియా ఆర్థిక శాస్త్రవేత్త రుమ్కీ మజుందార్ పేర్కొన్నారు. (క్యూ1, క్యూ2ల్లో వరుసగా 6.7 శాతం, 5.4 శాతం వృద్ధి) ఎన్నికల అనిశ్చితి, భారీ వర్షపాతం, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు డిమాండ్–ఎగుమతులపై ప్రభావం చూపినట్లు ఆయన విశ్లేషించారు. అయితే, వినియోగ ధోరణులు, సేవల వృద్ధి, ఎగుమతుల్లో తయారీ రంగం వాటా పెరగడం, పెట్టుబడులకు సంబంధించి మూలధన మార్కెట్ల స్థిరత్వం వంటి కొన్ని ముఖ్య అంశాల్లో భారత్ ఇప్పటికీ పటిష్టంగా ఉందని అన్నారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి, డిజిటైజేషన్, విదేశీ సంస్థాగత పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) ఆకర్షణపై నిరంతరం దృష్టి సారించడం వంటి ప్రభుత్వ చొరవలు వృద్ధిని మరింత పెంచే అంశాలుగా ఉంటాయని మజుందార్ చెప్పారు. తాయా ఆయా అంశాలపై పూర్తి ఆశావాదంతో ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.



నివేదికలోని మరిన్ని ముఖ్యాంశాలు..

- తయారీకి సంబంధించి ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్లు, రసాయనాల వంటి రంగాల్లో ఎగుమతులు పెరుగుతున్నాయి. ప్రపంచ సరఫరాల చైన్‌లో భారత్ స్థానాన్ని పటిష్టపరిచే పరిణామమిది.
- గత రెండున్నర నెలలుగా విదేశీ పెట్టుబడిదారులు వెనక్కి వెళ్లినప్పటికీ, రిటైల్ దేశీయ సంస్థల పెట్టుబడుల వల్ల మూలధన మార్కెట్లు స్థిరంగా ఉన్నాయి.
- 2025 అంతటా డిమాండ్ బాగుంటుందని అంచనా. గ్రామీణ, పట్టణ డిమాండ్ రెండూ కీలక పాత్ర పోషించనున్నాయి. వ్యవసాయ ఆదాయాలు, సబ్సిడీల వినియోగం, సామాజిక సంక్షేమ కార్యక్రమాలు, ప్రభుత్వ ఉపాధి ప్రోత్సాహాలు, డిజిటైజేషన్ అభివృద్ధి, సేవల రంగం వృద్ధి వంటి అంశాలు వినియోగాన్ని విస్తరించడంలో సహాయ పడతాయి.
- భారత ఆర్థిక వ్యవస్థ అంతర్జాతీయ సవాళ్లను అధిగమించి వృద్ధిని కొనసాగించాల్సి ఉంది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, వాణిజ్య వివాదాలు, సరఫరా వయవస్థల్లో అంతరాయం, వాతావరణ మార్పుల ప్రభావం దీర్ఘకాల ఆర్థిక స్థిరత్వాన్ని ప్రభావితం చేసే అవకాశం ఉంది.
- భారత ఆర్థిక వ్యవస్థను అంతర్జాతీయ అనిశ్చితుల నుండి దూరంగా ఎలా ఉంచాలన్న అంశంపై దృష్టి సారించాలి. అధిక సంఖ్యలో ఉన్న యువ శక్తి వినియోగం, నైపుణ్యాల మెరుగు, మౌలిక సదుపాయాలను బలపరచడం వంటి అంశాలు వృద్ధికి దోహదపడతాయి.
- సవాళ్లను అధిగమిస్తూ, స్వయం సమృద్ధి కలిగిన తయారీ రంగం పటిష్టతపై దృష్టి సారించాలి. గ్లోబల్ వ్యాల్యూ చైన్ సెగ్మెంట్లను లక్ష్యంగా పెట్టుకోవడం ద్వారా భారత్ కొత్త అవకాశాలను సృష్టించుకునే అవకాశాలు ఉన్నాయి.
- భవిష్యత్ పురోగతికి సంబంధించి వ్యూహాత్మక పెట్టుబడులు, విధాన చర్యలు ప్రకటించే అవకాశాలు ఉన్న రాబోయే బడ్జెట్‌పై (2025–26) ప్రస్తుతం అందరి దృష్టి కేంద్రీకృతమై ఉంది.

వ్యక్తిగత ఆదాయపన్ను తగ్గించాలి

- ఇంధనంపై ఎక్సైజ్ సుంకానికి కోత
- ఉపాధి కల్పన రంగాలకు చేయూత
- చైనా డంపింగ్‌పై చర్యలు తీసుకోవాలి
- బడ్జెట్‌పై వాణిజ్య మండళ్ల సూచనలు



న్యూఢిల్లీ: వ్యక్తిగత ఆదాయపన్ను రేట్లను తగ్గించడం ద్వారా ప్రజల చేతుల్లో ఖర్చు చేసే ఆదాయాన్ని పెంచాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రిని వాణిజ్య సంఘాలు కోరాయి. అలాగే, ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తున్న రంగాలకు ప్రేరణనివ్వాలని, ఇంధనంపై ఎక్సైజ్ సుంకం తగ్గించాలని, చైనా నుంచి చౌకగా వచ్చి పడుతున్న దిగుమతులకు వ్యతిరేకంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశాయి. సోమవారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి బడ్జెట్ ముందస్తు సమావేశం నిర్వహించారు. వాణిజ్య మండళ్ల ప్రతినిధుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సమావేశంలో దీపమ్ కార్యదర్శితోపాటు ఆర్థిక శాఖ పరిధిలోని వివిధ విభాగాల కార్యదర్శులు, ప్రభుత్వ ముఖ్య ఆర్థిక సలహాదారు పాల్గొన్నారు. 2025 ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో 2025–26 బడ్జెట్ ప్రవేశపెట్టనున్న విషయం తెలిసిందే. సమావేశం అనంతరం సీఐఐ ప్రెసిడెంట్ సంజీవ్ పురి మీడియాతో మాట్లాడారు. భారత ఆర్థిక వ్యవస్థ చక్కని పనితీరు చూపిస్తున్నప్పటికీ, అంతర్జాతీయంగా సవాళ్లు నెలకొన్నట్టు చెప్పారు. "భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా ఎన్నో ఉత్పత్తులు చైనా ద్వారా దిగుమతి అవుతుండడం చూస్తున్నాం. వాతావరణానికి సంబంధించి సమస్యలు, ఇతర అంశాలు ఆహార భద్రత, ద్రవ్యోల్బణంపై ప్రభావం చూపిస్తున్నాయి. ఈ దిశగా మేము పలు సూచనలు చేశాం. అధిక ఉపాధికి అవకాశం ఉన్న వస్త్రాలు, పాదరక్షలు, పర్యాటకం, ఫర్నిచర్ తదితర రంగాలకు ప్రేరణ కల్పించే చర్యలు తీసుకోవాలని కోరాం. ఎంఎస్ఎంఈలకు సంబంధించి చర్యలతోపాటు, అంతర్జాతీయ వాల్యూ చైన్‌తో భారత్‌ను అనుసంధానించాలని కోరాం. పెట్రోల్‌పై కొంత ఎక్సైజ్ సుంకం తగ్గించడం ద్వారా ఖర్చు పెట్టే ఆదాయాన్ని పెంచొచ్చని సూచించాం" అని పురి వివరించారు.

చైనా దిగుమతులతో ఇబ్బందులు..

మన పొరుగు దేశం చైనా సొంత ఆర్థిక వ్యవస్థ నిదానించడంతో చౌకగా ఉత్పత్తులను భారత్‌లోకి పంపిస్తోందంటూ, దీని కారణంగా ఆర్థిక వ్యవస్థ తాత్కాలిక మందగమనాన్ని ఎదుర్కొంటున్నట్టు తాము తెలియజేశామని ఫిక్కీ వైస్ ప్రెసిడెంట్ విజయ్ శంకర్ తెలిపారు. పరిశ్రమల ప్రతినిధుల సూచనలను ఆర్థిక శాఖ మంత్రి, అధికారులు ఓపిగ్గా విన్నట్టు చెప్పారు. "ఆదాయపన్ను తగ్గించడం వల్ల ప్రజల చేతుల్లో ఆదాయం మిగులుతుందని, అది వినియోగాన్ని పెంచుతుందని సూచించినట్టు పీహెచ్‌డీసీసీఐ ప్రెసిడెంట్ హేమంత్ జైన్ వెల్లడించారు. జీఎస్టీని సులభంగా మార్చాలని కూడా కోరినట్టు తెలిపారు. సరఫరా వ్యవస్థకు వెన్నెముకగా ఉన్న ఎంఎస్ఎంఈలకు కావాల్సిన వాటిపై (రుణాల లభ్యత, టీడీఎస్ సులభతరం) దృష్టి పెట్టాలని కోరినట్టు అసోచామ్ ప్రెసిడెంట్ సంజయ్ నాయర్ ప్రకటించారు.

కొత్త టెక్నాలజీతో 10 లక్షల ఉద్యోగాలు

క్వెస్ ఐటీ స్టాఫింగ్ నివేదిక



న్యూఢిల్లీ: క్వాంటమ్ కంప్యూటింగ్, జనరేటివ్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీతో 2030 నాటికి 10 లక్షల ఉద్యోగాల సృష్టి జరుగుతుందని ఐటీ ప్లేస్‌మెంట్, స్టాఫింగ్ కంపెనీ క్వెస్ ఐటీ స్టాఫింగ్ నివేదిక వెల్లడించింది. ఏఐ, మెషీన్ లెర్నింగ్ (ఎంఎల్), సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్, డేటా సైన్స్, బ్లాక్‌చెయిన్ విభాగాలలోని నైపుణ్యాలు వినూత్న అప్లికేషన్‌లతో పరిశ్రమలను అభివృద్ధి దిశగా నడిపిస్తున్నాయని తెలిపింది. క్వెస్ టెక్నాలజీ స్కిల్స్ రిపోర్ట్–2024 ప్రకారం.. అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీ కూడా 2030 నాటికి భారత ఆర్థిక వ్యవస్థకు 150 బిలియన్ డాలర్లకు పైగా దోహదపడతాయని అంచనా. ఇది సాంకేతిక నైపుణ్యంలో భారత స్థానాన్ని సుస్థిరం చేస్తుంది. ఆరోగ్య సంరక్షణ, బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్, రిటైల్, ఆటోమోటివ్, తయారీలో ఏఐ/ఎంఎల్ సాంకేతికత మోసాన్ని గుర్తించడం, నిర్ధారణ, నాణ్యత నియంత్రణ ద్వారా సామర్థ్యాన్ని పెంచుతుంది' అని వివరించింది.

అసమాన అవకాశాలను..

'టెక్ నియామకాల్లో 43.5 శాతం వాటాతో బెంగళూరు ప్రథమ స్థానంలో ఉంది. హైదరాబాద్ 13.4 శాతం, పుణే 10 శాతం వాటాతో ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. భారత సాంకేతికత నిపుణులు టెక్నాలజీలో కొత్త మార్పులు తీసుకొస్తున్నారు. జనరేటివ్ ఏఐ, బ్లాక్‌చెయిన్ వంటి సాంకేతికతల జోరుతో 2030 నాటికి భారత ఐటీ రంగం 20 లక్షల ఉద్యోగాలను జోడించనుంది' అని నివేదిక తెలిపింది. ఏఐ/ఎంఎల్, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి అత్యాధునిక సాంకేతికతలతో ఎంటర్‌ప్రైజ్ రిసోర్స్ ప్లానింగ్ వంటి సంప్రదాయ నైపుణ్యాల కలయిక అసమాన అవకాశాలను అందిస్తుందని క్వెస్ ఐటీ స్టాఫింగ్ సీఈవో కపిల్ జోషి తెలిపారు.

ఇకపై కస్టమ్స్‌కు విదేశీ ప్రయాణికుల డేటా షేరింగ్

ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి



న్యూఢిల్లీ: విమానయాన సంస్థలు ఇకపై అంతర్జాతీయ ప్రయాణికుల డేటాను కస్టమ్స్ విభాగానికి కూడా తప్పనిసరిగా అందించాల్సి ఉంటుంది. ఈ నిబంధనలు 2025 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్నాయి. ఇందుకోసం విమాన రవాణా సేవల సంస్థలు జనవరి 10 నాటికి నేషనల్ కస్టమ్స్ టార్గెటింగ్ సెంటర్–ప్యాసింజర్ (ఎన్‌సీటీసీ–ప్యాక్స్)లో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. కేంద్రీయ పరోక్ష పన్నులు, కస్టమ్స్ బోర్డు (సీబీఐసీ) జారీ చేసిన ఆదేశాల ప్రకారం .. అంతర్జాతీయ ఫ్లయిట్ బైల్దేరడానికి 24 గంటల ముందుగానే విదేశీ ప్రయణికుల మొబైల్ నంబరు మొదలుకుని టికెట్ కోసం చెల్లింపులు జరిపిన మాధ్యమం, ట్రావెల్ షెడ్యూల్ వరకు పలు వివరాలను కస్టమ్స్ అధికారులకు ఎయిర్‌లైన్స్ అందించాలి. ఒకవేళ విమానయాన సంస్థ గానీ డేటాను షేర్ చేసుకోవడంలో విఫలమైన పక్షంలో, అలా చేసిన ప్రతిసారి రూ. 25,000–50,000 వరకు కస్టమ్స్ విభాగం జరిమానా విధించవచ్చు.

ఆదాయపన్ను శాఖ ఖండన

పన్ను ఎగవేతదారులను పట్టుకునేందుకు తాము డిజీయాత్ర యాప్ డేటాను చూడడం లేదని ఆదాయపన్ను శాఖ స్పష్టం చేసింది. ఈ మేరకు వస్తున్న వార్తలను ఖండిస్తూ ఎక్స్ ప్లాట్‌ఫామ్‌పై పోస్ట్ పెట్టింది. "ఇందుకు సంబంధించి ఇప్పటి వరకు అలాంటి చర్య ఏమీ లేదని స్పష్టం చేస్తున్నాం"అని అందులో పేర్కొంది. ముఖ గుర్తింపు విధానంలో (ఎఫ్ఆర్‌టీ) పనిచేసే డిజీ యాత్ర విమానాశ్రయాల్లో పలు చెక్ పాయింట్ల వద్ద ఎలాంటి అవాంతరాల్లేకుండా ముందుకెళ్లేందుకు వీలు కల్పిస్తుంది. డిజీ యాత్ర యాప్ కోసం ప్రయాణికులు ఇచ్చే సమాచారం ఎన్‌క్రిప్టెడ్ విధానంలో నిల్వ ఉంటుంది. ఆధార్ ఆధారిత ధ్రువీకరణ ద్వారా ప్రయాణికులు డిజీయాత్ర సేవలను పొందొచ్చు.

ఐకియా ఇండియా నష్టాలు పెరిగాయ్

2023-24లో రూ. 1,299 కోట్లు



న్యూఢిల్లీ: గత ఆర్థిక సంవత్సరం(2023–24)లో ఫర్నీచర్, హోమ్ ఫర్నిషింగ్ రిటైలింగ్ దిగ్గజం ఐకియా ఇండియా నష్టాలు పెరిగాయి. రూ. 1,299 కోట్లను అధిగమించాయి. అమ్మకాలు 4.5 శాతం బలపడి రూ. 1,810 కోట్లకు చేరాయి. మొత్తం ఆదాయం 5 శాతం పుంజుకుని రూ. 1,853 కోట్లయ్యింది. బిజినెస్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫామ్ టోఫ్లర్ వివరాల ప్రకారం అంతక్రితం ఏడాది(2022–23) రూ. 1,732 కోట్ల ఆదాయం సాధించగా.. రూ. 1,133 కోట్ల నష్టం ప్రకటించింది. నెదర్లాండ్స్ దిగ్గజం ఇంకా హోల్డింగ్స్‌కు అనుబంధ సంస్థ ఇది. ఓమ్నిచానల్ ద్వారా కార్యకలాపాల విస్తరణ కోసం భారీ పెట్టుబడులు చేపట్టడంతో నష్టాలు పెరిగినట్లు కంపెనీ పేర్కొంది. గతేడాది ధరలు పెంచకపోగా.. కొన్ని ప్రొడక్టులపై ధరలు తగ్గించినప్పటికీ అమ్మకాలు పెంచుకోగలిగినట్లు ఐకియా ఇండియా ప్రతినిధి ఒకరు తెలియజేశారు. ప్రకటనలు, ప్రమోషనల్ ఖర్చులు 2 శాతం అధికమై రూ. 196 కోట్లను దాటాయి. గతేడాది మొత్తం వ్యయాలు 9 శాతం పెరిగి రూ. 3,152 కోట్లను తాకాయి. అంతక్రితం ఏడాది రూ. 2,895 కోట్ల వ్యయాలు నమోదయ్యాయి. కంపెనీ హైదరాబాద్, నవీముంబై, బెంగళూరు తదితర నగరాలలో లార్జ్‌ఫార్మాట్ స్టోర్లను నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈకామర్స్ కార్యకలాపాల ద్వారా ఆన్‌లైన్‌లోనూ విక్రయాలు చేపడుతోంది.

చెస్‌లో స్వర్ణ వసంతం
కప్‌తో క్రికెట్ వైభవం

ఏడాది గడిచింది. క్రీడల్లో గెలుపోటములు సహజం. కానీ సమానమంటే మాత్రం కానే కాదు. ఎందుకంటే కప్, రన్నరప్... విజేత, పరాజిత... స్వర్ణం, రజతం... ఒకటి కావు. ఒక రంగులో ఉండవు. ఒక రూపం ఉండదు. అదెప్పటికీ ప్రత్యేకం... అపురూపం! చాంపియన్‌కు, టైటిల్‌కు, ట్రోఫీకి ఉండే విలువే వేరు. నేటితో గడిచిపోయే ఈ యేడాది స్పోర్ట్స్ డైరీలో మరుపురాని విజయాలెన్నో, చిరస్మరణీయ క్షణాలెన్నో ఉన్నాయి. ఓ ప్రపంచకప్ విజయం. 'పారిస్'లో పతకాల ప్రతాపం. పారాలింపిక్స్‌లో అయితే పతకాల తోరణం! చెస్‌లో ప్రపంచ చాంపియన్లు, ఒలింపియాడ్‌లో స్వర్ణాలు. ఇవన్నీ కూడా సొంతగడ్డపై కాదు... విదేశాల్లోనే విజయకేతనం! ఇది కదా భారత క్రీడారంగానికి శుభ వసంతం... ఏడాది ఆసాంతం! పట్టుదలకు పట్టం, ప్రతిభకు నిదర్శనం... మన క్రీడాకారుల విజయగర్జన. కొత్తేడాదికి సరికొత్త ప్రేరణ. –సాక్షి క్రీడా విభాగం


గుకేశ్



'పారా'లో ఔరా మన ప్రదర్శన

పారాలింపియన్ల పట్టుదలకు వైకల్యం ఓడిపోయింది. 84 మందితో పారిస్‌కు వెళ్లిన మన బృందం 29 పతకాలతో కొత్త చరిత్ర లిఖించింది. పతకాల పట్టికలో 18వ స్థానంలో నిలిచిన భారత్ మునుపెన్నడు గెలవనన్నీ పతకాల్ని చేజిక్కించుకుంది. ఏడు స్వర్ణాలు, తొమ్మిది రజతాలు, 13 కాంస్యాలు గెలుచుకుంది. అవని లెఖరా, సుమిత్ అంటిల్, మరియప్పన్ తంగవేలు, శీతల్ దేవి, నితీశ్ కుమార్, ప్రవీణ్ కుమార్, నవ్‌దీప్ సింగ్, హర్విందర్ సింగ్, ధరంవీర్ తదితరులు పతకాల పంట పండించారు.

2024లో కొత్త శిఖరాలకు భారత క్రీడారంగం

చదరంగంలో 'పసిడి ఎత్తులు'

భారత్‌లో చెస్ అంటే తక్కున గుర్తొచ్చే పేరు విశ్వనాథన్ ఆనంద్! ఆ తర్వాత మరెంతో మంది గ్రాండ్‌మాస్టర్లు వచ్చారు. కానీ అతనిలా భారత చదరంగంలో నిలిచిపోలేదు. అయితే ఈ ఏడాది మాత్రం చదరంగంలో స్వర్ణ చరిత్రను ఆవిష్కరించింది. చెస్ ఒలింపియాడ్, క్యాండిడేట్స్ టోర్నీ (ప్రపంచ చాంపియన్‌తో తలపడే ప్రత్యర్థిని ఖరారు చేసే ఈవెంట్), ప్రపంచ చాంపియన్‌షిప్, ప్రపంచ ర్యాపిడ్ చాంపియన్‌షిప్ వీటన్నింటా మనదే జేగంట! ఓ రకంగా 2024 భారత చెస్ గడిల్లో తీపిగీతలెన్నో గీసింది. బుడాపెస్ట్‌లో జరిగిన చెస్ ఒలింపియాడ్‌లో దొమ్మరాజు గుకేశ్, అర్జున్ ఇరిగేశి, విదిత్ గుజరాతి, ప్రజ్ఞానంద, పెంటేల హరికృష్ణ... ద్రోణవల్లి హారిక, దివ్య దేశ్‌ముఖ్, వంతిక అగర్వాల్, వైశాలి, తానియా సచ్‌దేవ్‌లతో కూడిన భారత బృందం విజయంతో పుటలకెక్కింది. క్యాండిడేట్స్ టోర్నీ గెలిచిన దొమ్మరాజు గుకేశ్ ఇటీవల క్లాసికల్ ఫార్మాట్‌లో సరికొత్త ప్రపంచ చాంపియన్‌గా ఆవిర్భవించాడు. అనుభవజ్ఞుడు, డిఫెండింగ్ చాంపియన్ డింగ్ లిరెన్ (చైనా) ఎత్తుల్ని చిత్తుచేసి అతిపిన్న వయసులో జగజ్జేతగా గుకేశ్ కొత్త రాత రాశాడు. న్యూయార్క్‌లో తెలుగుతేజం, వెటరన్ ప్లేయర్ కోనేరు హంపి ప్రపంచ ర్యాపిడ్ చాంపియన్‌షిప్‌లో రెండోసారి విజేతగా నిలిచింది.





మను భాకర్... సూపర్

పారిస్ ఒలింపిక్స్‌లో భారత అథ్లెట్లు సత్తా చాటుకున్నారు. అరడజను పతకాలైతే పట్టారు. కానీ స్వర్ణమే లోటు! బహుశా వినేశ్ ఫొగాట్ (100 గ్రాముల అధిక బరువు) అనర్హతకు గురి కాకుంటే రెజ్లింగ్‌లో పసిడి పట్టేదేమో! షూటర్ మను భాకర్ టోక్యోలో ఎదురైన నిరాశను అధిగమించేలా పారిస్ ఒలింపిక్స్‌ను చిరస్మరణీయం చేసుకుంది. ఒకే ఒలింపిక్స్‌లో 'హ్యాట్రిక్' పతకం, అరుదైన ఘనత చేజారినా... ఆమె రెండు కాంస్య పతకాలు సాధించింది. మళ్లీ స్వర్ణం తెస్తాడని గంపెడాశలు పెట్టుకున్న జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా రజతంతో సరిపెట్టాడు. స్వప్నిల్ కుసాలే (షూటింగ్), అమన్ సెహ్రావత్ (రెజ్లింగ్) కాంస్యాలు నెగ్గారు. హాకీ ఆటకు ఒలింపిక్స్‌లో పునర్వైభవం మొదలైనట్లుంది. వరుస ఒలింపిక్స్‌లో మన పురుషుల జట్టు కాంస్యం సాధించింది. షట్లర్ లక్ష్యసేన్, లిఫ్టర్ మీరాబాయి చాను, షూటర్ అర్జున్ బబుతా త్రుటిలో ఒలింపిక్ పతకాన్ని (కాంస్యం) కోల్పోయారు. ఓవరాల్‌గా 206 మందితో కూడిన భారత బృందం ఒక రజతం, ఐదు కాంస్య పతకాలతో సంతృప్తికరంగా ఈవెంట్‌ను ముగించింది.



విండీస్‌లో 'విన్ ఇండియా'

కపిల్‌దేవ్ సారథ్యంలో 1983లో తొలి వన్డే వరల్డ్‌కప్ గెలిచిన చాలా ఏళ్లకు మళ్లీ ధోనీ బృందం 2011లో భారత్‌కు రెండో వన్డే ప్రపంచకప్ ముచ్చట తీర్చింది. అంతకంటే ముందు ఆరంభ టి20 ప్రపంచకప్ (2007)ను ధోని సారథ్యంలోని యువసేన గెలుచుకొస్తే... 17 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ రోహిత్ సేన ఈ ఏడాది కరీబియన్ గడ్డపై రెండో టి20 కప్‌ను అందించింది. ప్రతీ మ్యాచ్‌లో భారత్ గర్జనకు ప్రత్యర్థులు తలవంచారు. అయితే దక్షిణాఫ్రికాతో ఫైనల్ మాత్రం కాస్త భిన్నంగా జరిగింది. కోహ్లి ఫైనల్లో రాణించడంతో భారత్ నిర్దేశించిన 177 పరుగుల లక్ష్యం కఠినమైందో, క్లిష్టమైందో కాకపోవడం .. క్లాసెన్ అప్పటికే ఐపీఎల్‌తో దంచికొట్టిన ఫామ్‌లో ఉండటంతో మ్యాచ్‌ను సఫారీ చేతుల్లోకి తెచ్చాడు. దాదాపు బంతులు, పరుగులు సమంగా ఉన్న దశలో క్లాసెన్‌ను హార్దిక్ అవుట్ చేశాడు. నిప్పులు చెరిగే బౌలింగ్‌తో బుమ్రా, యువ పేసర్ అర్ష్‌దీప్ పరుగుల్ని ఆపేశారు. సూర్యకుమార్ చరిత్రలో నిలిచే క్యాచ్... ఇలా ప్రతిఒక్కరు కడదాకా పట్టుబిగించడంతో భారత్ ప్రపంచకప్‌ను సొంతం చేసుకుంది.

ఐసీసీ 'క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు రేసులో బుమ్రా



దుబాయ్: భారత స్టార్ పేస్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ప్రతిష్టాత్మక 'క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు కోసం పోటీలో నిలిచాడు. 'సర్ గార్‌ఫీల్డ్ సోబర్స్ ట్రోఫీ' పేరుతో ఇచ్చే ఈ అవార్డు రేసులో బుమ్రాతో పాటు మరో ముగ్గురు బరిలో ఉన్నారు. ఇంగ్లండ్ బ్యాటర్లు జో రూట్, హ్యారీ బ్రూక్, ఆస్ట్రేలియా బ్యాటర్ ట్రావిస్ హెడ్‌ల పేర్లు అవార్డు కోసం నామినేట్ అయ్యాయి. బుమ్రా ఈ ఏడాది అసాధారణ ప్రదర్శనతో అదరగొట్టాడు. తాజా సిరీస్‌లో కూడా అతని బౌలింగ్ పదును ముందు ఆస్ట్రేలియా బ్యాటర్లు నిలబడలేకపోతున్నారు. 2024లో 13 టెస్టులు ఆడిన బుమ్రా కేవలం 14.92 సగటుతో 71 వికెట్లు పడగొట్టాడు. 8 టి20ల్లో 8.26 సగటుతో 15 వికెట్లు తీసిన బుమ్రా... భారత జట్టు టి20 వరల్డ్ కప్ గెలుచుకోవడంలో కీలకపాత్ర పోషించాడు. రూట్ 17 టెస్టుల్లో 1556 పరుగులు చేయగా, బ్రూక్ 12 టెస్టుల్లో 1100 పరుగులు సాధించాడు. 9 టెస్టుల్లో 608 పరుగులు చేసిన హెడ్ 15 టి20ల్లో 539 పరుగులు సాధించాడు. మరోవైపు 'టెస్టు క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు కోసం కూడా బుమ్రా, రూట్, బ్రూక్ పోటీ పడుతుండగా... శ్రీలంక బ్యాటర్ కమిందు మెండిస్ కూడా నామినేట్ అయ్యాడు. మెండిస్ ఈ ఏడాది 9 టెస్టుల్లో కలిపి 1049 పరుగులు చేశాడు.

న్యూజిలాండ్‌దే టి20 సిరీస్


మిచెల్ హే

మౌంట్ మాంగనుయ్: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకున్న న్యూజిలాండ్ జట్టు...శ్రీలంకతో జరుగుతున్న మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సొంతం చేసుకుంది. సోమవారం జరిగిన రెండో టి20లో న్యూజిలాండ్ 45 పరుగుల తేడాతో గెలిచింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 186 పరుగులు సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మిచెల్ హే (19 బంతుల్లో 41 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), మార్క్ చాప్‌మన్ (29 బంతుల్లో 42; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), టిమ్ రాబిన్సన్ (34 బంతుల్లో 41; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) దూకుడుగా ఆడారు. శ్రీలంక బౌలర్లలో హసరంగ 2 వికెట్లు పడగొట్టగా... నువాన్ తిసారా, పతిరణలకు ఒక్కో వికెట్ లభించింది. 187 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంక 19.1 ఓవర్లలో 141 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. నిసాంక (28 బంతుల్లో 37; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), కుశాల్ పెరీరా (35 బంతుల్లో 48; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) మినహా మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. కివీస్ బౌలర్లలో జేకబ్ డఫీ 4 వికెట్లు తీయగా... హెన్రీ, సాంట్నెర్‌లకు 2 వికెట్ల చొప్పున లభించాయి. సిరీస్‌లోని చివరిదైన మూడో టి20 మ్యాచ్ జనవరి 3న నెల్సన్‌లో జరుగుతుంది.

బెంగాల్ X కేరళ

- నేడు సంతోష్ ట్రోఫీ జాతీయ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ ఫైనల్
- రాత్రి గం. 7:30 నుంచి దూరదర్శన్ స్పోర్ట్స్ చానెల్‌లో ప్రత్యక్ష ప్రసారం



సాక్షి, హైదరాబాద్: దేశంలోని రెండు అత్యుత్తమ జట్లు సంతోష్ ట్రోఫీ జాతీయ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ టైటిల్ కోసం అమీతుమీ తేల్చుకోనున్నాయి. 32 సార్లు చాంపియన్ పశ్చిమ బెంగాల్, 7 సార్లు విజేత కేరళ జట్లు ప్రతిష్టాత్మక టైటిల్ కోసం నేడు తుది సమరంలో పోటీపడనున్నాయి. గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో జరిగే ఈ ఫైనల్ మ్యాచ్ రాత్రి 7 గంటల 30 నిమిషాలకు మొదలవుతుంది. ఈ మ్యాచ్‌ను దూరదర్శన్ స్పోర్ట్స్ చానెల్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు. ఈ టోర్నీలో బెంగాల్, కేరళ జట్లు ఆద్యంతం నిలకడగా రాణించాయి. లీగ్ దశలో బెంగాల్ ఐదు మ్యాచ్‌లు ఆడి నాలుగింటిలో గెలిచింది. ఒక మ్యాచ్‌ను 'డ్రా' చేసుకుంది. కేరళ కూడా ఐదు మ్యాచ్‌లు ఆడి నాలుగింటిలో నెగ్గింది. ఒక మ్యాచ్‌ను 'డ్రా'గా ముగించింది. నాకౌట్ దశలోనూ ఈ రెండు జట్లు తమ ఆధిపత్యాన్ని చాటుకున్నాయి. 'ఇతర జట్లకు సంతోష్ ట్రోఫీలో ఫైనల్ చేరితే గొప్ప ఘనతలాంటిది. కానీ బెంగాల్‌కు కాదు. మా సత్తా ప్రకారం మేము ట్రోఫీ గెలవాల్సిందే. గతంలో మేము 32 సార్లు విజేతగా నిలిచాం. ప్రస్తుతం జట్ల సంఖ్య పెరిగింది. పోటీతత్వం కూడా పెరిగింది' అని బెంగాల్ జట్టు కోచ్ సంజయ్ సేన్ వ్యాఖ్యానించారు. 'సంతోష్ ట్రోఫీ మాకు వరల్డ్ కప్‌లాంటిది. కనీసం ఫైనల్ చేరాలన్నదే మా అభిమానుల ఆకాంక్ష. మా తొలి లక్ష్యం పూర్తయింది. ఇక ట్రోఫీ సాధించడమే మిగిలి ఉంది'' అని కేరళ జట్టు కోచ్ థామస్ తెలిపారు. ఈ టోర్నీలో ఆడిన 10 మ్యాచ్‌ల్లో కేరళ 35 గోల్స్ చేయగా... బెంగాల్ జట్టు 27 గోల్స్ నమోదు చేసింది. కేరళ ప్లేయర్లు నసీమ్ రెహమాన్ 8 గోల్స్, మొహమ్మద్ అజ్సాల్ 9 గోల్స్, సాజీశ్ 5 గోల్స్ చేశారు. బెంగాల్ తరఫున రాబీ హన్స్‌దా (11 గోల్స్), నరోహరి శ్రేష్ఠ (7 గోల్స్) కీలక ఆటగాళ్లుగా ఉన్నారు. సంతోష్ ట్రోఫీ చరిత్రలో బెంగాల్, కేరళ జట్లు 32 సార్లు తలపడ్డాయి. 15 సార్లు బెంగాల్ నెగ్గగా... 9 సార్లు కేరళ గెలిచింది. 8 మ్యాచ్‌లు 'డ్రా'గా ముగిశాయి.

అఫ్గానిస్తాన్ 699 ఆలౌట్

టెస్టుల్లో తమ అత్యధిక స్కోరు నమోదు

- హష్మతుల్లా డబుల్ సెంచరీ
- అఫ్సర్ జజాయ్ సెంచరీ
- జింబాబ్వేతో తొలి టెస్టు 'డ్రా'


అఫ్సర్

బులవాయో: పరుగుల వరద పారిన అఫ్గానిస్తాన్, జింబాబ్వే జట్ల మధ్య తొలి టెస్టు 'డ్రా'గా ముగిసింది. మ్యాచ్ చివరిరోజు ఓవర్‌నైట్ స్కోరు 515/3తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన అఫ్గానిస్తాన్ 197 ఓవర్లలో 699 పరుగులు చేసి ఆలౌటైంది. టెస్టు క్రికెట్‌లో అఫ్గానిసాన్ జట్టుకిదే అత్యధిక స్కోరు కావడం విశేషం. 2021లో అబుదాబిలో జింబాబ్వేతోనే జరిగిన టెస్టులో అఫ్గానిస్తాన్ 4 వికెట్లకు 545 పరుగులు చేసింది. ఆఖరి రోజు అఫ్గానిస్తాన్ కెప్టెన్ హష్మతుల్లా షాహిది (474 బంతుల్లో 246; 21 ఫోర్లు) డబుల్ సెంచరీ పూర్తి చేసుకోగా... అఫ్సర్ జజాయ్ (169 బంతుల్లో 113; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) శతకం సాధించాడు. అంతకుముందు మూడో రోజు రహ్మత్ షా (424 బంతుల్లో 234; 23 ఫోర్లు, 3 సిక్స్‌లు) డబుల్ సెంచరీ చేశాడు. ఓవరాల్‌గా అఫ్గానిస్తాన్ ఇన్నింగ్స్‌లో రెండు డబుల్ సెంచరీలు, ఒక సెంచరీ నమోదు కావడం విశేషం. 113 పరుగులతో వెనుకబడి రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన జింబాబ్వే 34 ఓవర్లలో 4 వికెట్లకు 142 పరుగులు చేసింది. మ్యాచ్‌లో ఫలితం తేలే అవకాశం లేకపోవడంతో రెండు జట్ల కెప్టెన్‌లు 'డ్రా'కు అంగీకరించారు. జింబాబ్వే తొలి ఇన్నింగ్స్‌లో 586 పరుగులు సాధించింది. ఇరు జట్ల మధ్య రెండో టెస్టు జనవరి 2 నుంచి బులవాయోలోనే జరుగుతుంది.


హష్మతుల్లా

10 టెస్టు క్రికెట్‌లో తొలిసారి 600 పరుగుల స్కోరు దాటేందుకు అఫ్గానిస్తాన్ తీసుకున్న టెస్టులు. ఇప్పటి వరకు 10 జట్లు టెస్టుల్లో 600 అంతకంటే ఎక్కువ స్కోరు నమోదు చేశాయి. ఇందులో అఫ్గానిస్తాన్ తక్కువ టెస్టుల్లో ఈ మైలురాయిని దాటడం విశేషం.

భారత్ 14 మాల్దీవులు 0



బెంగళూరు: అంతర్జాతీయ ఫ్రెండ్లీ మహిళల ఫుట్‌బాల్ మ్యాచ్‌లో భారత జట్టు అదరగొట్టింది. మాల్దీవులు జట్టుతో సోమవారం జరిగిన మ్యాచ్‌లో భారత జట్టు 14–0 గోల్స్ తేడాతో ఘనవిజయం సాధించింది. జోకిమ్ అలెగ్జాండర్సన్ (స్వీడన్) భారత జట్టుకు కొత్త కోచ్‌గా వచ్చాక టీమిండియా సాధించిన తొలి విజయం ఇదే కావడం విశేషం. భారత్ తరఫున లిండా కోమ్ సెర్టో (11వ, 21వ, 28వ, 52వ నిమిషాల్లో) నాలుగు గోల్స్ చేయగా... ప్యారీ జాజా (6వ, 7వ, 14వ నిమిషాల్లో) మూడు గోల్స్ సాధించింది. నేహా (15వ, 55వ నిమిషాల్లో), కాజోల్ (59వ, 66వ నిమిషాల్లో) రెండు గోల్స్ చొప్పున చేశారు. సంగీత (51వ నిమిషంలో), రంజన (54వ నిమిషంలో), రింపా (62వ నిమిషంలో) ఒక్కో గోల్ సాధించారు.



జనవరి 13 నుంచి యూపీలోని ప్రయాగ్‌రాజ్‌లో మహాకుంభమేళా ప్రారంభం కానుంది. దీనిని పురస్కరించుకుని శ్రీ పంచాయతి అఖాడా నిరంజని సారథ్యంలో సోమవారం ధర్మ ధ్వజ పూజ జరుపుతున్న సాధువులు.

విమానంలో ఏ సీటు భద్రం?

ఆదివారం దక్షిణకొరియాలో జరిగిన ఘోర విమాన ప్రమాదంలో వెనకవైపు సీట్లలో కూర్చున్న ప్రయాణికులు ఇద్దరు ప్రాణాలతో బయటపడినట్లు వార్తలొచ్చాయి. దీంతో విమానంలో ముందువైపు లేదంటే వెనుకవైపు అసలు ఏ నంబర్ సీటులో కూర్చుంటే ప్రమాదం జరిగినా బయటపడొచ్చనే అంశంపై ఇప్పుడు అంతర్జాతీయంగా చర్చ మొదలైంది. తరచూ విమానప్రయాణాలు చేసే అంతర్జాతీయ ప్రయాణికులు ఈ చర్చలను తీక్షణంగా గమనిస్తున్నట్లు వార్తలొచ్చాయి. నిజంగానే వెనుకవైపు సీట్లు భద్రమా? అనే ప్రశ్న ఇప్పుడు ప్యాసింజర్లను తొలచేస్తోంది.

మిగతా ప్రయాణాలతో చూస్తే భద్రమే

ఎక్కడ కూర్చుంటే క్షేమంగా ఉంటామనే ప్రశ్న కంటే అసలు విమానంలో ప్రయాణమే అత్యంత భద్రమని మరో వాదన మొదలైంది. నిర్లక్ష్య డ్రైవింగ్, గతుకుల రోడ్డు, ఎత్తుఒంపులు ఉన్న చోట్ల సాంకేతిక ప్రమానాలు పాటించకుండా నిర్మించిన రోడ్లు, సరైన సూచికల వ్యవస్థ లేకపోవడం వంటి ఎన్నో కారణాలతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు ప్రయాణంతో పోలిస్తే విమాన ప్రయాణం ఎంతో క్షేమదాయకమని వారు చెబుతున్నారు. విమానంలో ఎక్కడ కూర్చున్నా భద్రమేనని, ఎప్పటికప్పుడు మొత్తం విమానాన్ని క్షుణ్ణంగా తనిఖీచేసి సుశిక్షితులైన పైలట్ల పర్యవేక్షణలో విమానం ప్రయాణిస్తుందని, అత్యంత అరుదుగా మాత్రమే, అసాధారణ వాతావరణ పరిస్థితుల్లోనే వి మానం ప్రమాదంబారిన పడుతుందని విశ్లేషకులు చెబుతున్నారు.



అమెరికాలో ఎలా?

ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్, ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ప్రకారం అమెరికా రోడ్లపై ప్రతి 10 కోట్ల వాహన ప్రయాణాల్లో కేవలం 1.18 మరణాలు సంభవిస్తున్నాయి. అదే 10 కోట్ల మైళ్ల రైలు ప్రయాణంలో 0.04 మరణాలు సంభవిస్తున్నాయి. ఇక 10 కోట్ల మైళ్ల విమాన ప్రయాణాల్లో అత్యంత స్వల్పంగా కేవలం 0.003 మరణాలు సంభవిస్తున్నాయి. అంతర్జాతీయ పౌర విమానయాన రంగ గణాంకాల ప్రకారం 2023లో ప్రతి వంద కోట్ల మంది ప్రయాణికులకు కేవలం 17 మంది మాత్రమే విమాన ప్రమాదాల్లో చనిపోయారు. 2022 ఏడాదిలో ఈ సంఖ్య 50గా ఉంది. అత్యాధునిక విమానాల్లో ఆధునిక భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నా అననుకూల వాతావరణ పరిస్థితుల కారణంగానే అత్యల్ప స్థాయిలో ప్రమాదాలు జరుగుతున్నాయి.

తోక క్షేమమే

విమానం ద్రవరూప ఇంధనం(ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్)తో నడుస్తుంది. చిన్న జెట్ విమానాలను మినహాయిస్తే అంతర్జాతీయ సర్వీస్‌లకు వాడే భారీ పౌరవిమానాల్లో రెక్కల కింద ఈ ఇంధనాన్ని నిల్వచేస్తారు. ఏదైనా ప్రమాదం జరిగి నిప్పురవ్వలు రాజుకుంటే రెక్కల కింద ఇంధనం భగ్గున మండి రెక్కల సమీప సీట్లలోని ప్రయాణికులు బుగ్గిపాలు కావడం ఖాయం. ఈ కోణంలో చూస్తే రెక్కల సమీపంలోని సీట్లు ప్రమాదసందర్భాల్లో అంత క్షేమదాయకం కాదని గత ప్రమాదరికార్డులు తేటతెల్లంచేస్తున్నాయి. ఈ విషయమై అమెరికాలో పాపులర్ మెకానిక్స్ అనే మేగజైన్ 1971 నుంచి 2005 వరకు జరిగిన విమాన ప్రమాదాలను విశ్లేషిస్తూ ఒక నివేదిక సిద్ధంచేసింది. దీని ప్రకారం తోకభాగంలో కూర్చుంటే ప్రమాదాల్లో బతికే అవకాశాలు మిగతా సీట్లతో పోలిస్తే 40 శాతం అధికంగా ఉంటాయి.

ముందు సీట్లతో ముప్పే

ప్రమాదంలో ఇంధనం అంటుకుని మంటలు చుట్టుముట్టకపోయినా ముందు సీట్లు ఒకరకంగా ప్రమాదకరమని నివేదించారు. ఎదురుగా ఏదైనా కొండను ఢీకొట్టినా, నేలపై కుప్పకూలినా, వేరే విమానాన్ని ఢీకొట్టినా, రన్‌వే చివరన గోడ లాంటి నిర్మాణాన్ని ఢీకొట్టినా, రన్‌వే దాటి లోయ లేదంటే సముద్రం, సరస్సు వంటి జలాశయంలోకి దూసుకెళ్లినా ప్రమాద ప్రభావం ముందు సీట్లపైనే అధికంగా ఉంటుంది.

బతికే అవకాశాలు 60 శాతం

అమెరికా జాతీయ రవాణా భద్రతా బోర్డ్ నివేదికను విశ్లేషిస్తూ బ్రిటన్ పాత్రికేయుడు మ్యాక్స్ ఫాస్టర్ తాజాగా ఒక విషయాన్ని బయటపెట్టారు. ''విమానం నేలపై కూలినా, నీటిలో పడినా, గాల్లోనే పేలిపోయినా ముందు సీట్లలో కూర్చునే ప్రయాణికులు 49 శాతం వరకు బతికే అవకాశాలు ఉన్నాయి. రెండు రెక్కల మధ్యభాగంలోని సీట్లలో కూర్చుంటే 59 శాతం వరకు బతికే అవకాశాలు ఉన్నాయి. ఇక వెనుకవైపు అంటే తోక సమీప సీట్లలో కూర్చుంటే 69 శాతం బతికే అవకాశాలు ఉన్నాయి''అని అన్నారు. అయితే ఇక్కడో ఘటనను తప్పక గుర్తుచేసుకోవాలని ఆయన చెబుతున్నారు. '1989లో అమెరికాలో యునైటెడ్ ఎయిర్‌లైన్స్ విమానం ప్రమాదానికి గురైనప్పుడు 269 మంది ప్రయాణికుల్లో 184 మంది బతికారు. వీరిలో చాలా మంది ముందు సీట్లలో కూర్చున్నారు''అని ఆయన గుర్తుచేశారు. ప్రఖ్యాత 'టైమ్'మేగజైన్ నివేదిక సైతం వెనుక సీట్లు క్షేమమని తెలిపింది. మిగతా సీట్లతో పోలిస్తే వెనుకవైపు సీట్లలో మధ్య వాటిల్లో కూర్చుంటే మరింత క్షేమమని పేర్కొంది. ఇక్కడ కూర్చుంటే మరణించే అవకాశం కేవలం 28 శాతమని, అదే విమానం మధ్యలో కూర్చుంటే ముప్పు శాతం 44 శాతంగా ఉంటుందని వెల్లడించింది.

మధ్య సీట్ల పరిస్థితి విచిత్రం

మధ్య సీట్లలో కూర్చుంటే రెక్కలకు సమీపంలో ఉండటం వల్ల ఇంధనంలో మంటలొస్తే ప్రమాదమే. కానీ మంటలు చెలరేగని పక్షంలో ఎమర్జెన్సీ ఎగ్జిట్ మార్గం వీళ్లకే దగ్గరగా ఉంటుంది. తప్పించుకునే అవకాశాలు వీళ్లకే ఎక్కువ. ఏదేమైనా విమానం ప్రమాదంలో పడిన తీరు, వేగం, దిశను బట్టి విమానంలోని ముందు, వెనుక, పక్క భాగాలు దెబ్బతింటాయి. భారత్‌లో గంటకొకటి చొప్పున జరిగే రోడ్డు ప్రమాదాలు, ఇటీవల సర్వసాధారణమైన పట్టాలు తప్పడం వంటి రైలు ప్రమాదాలతో పోలిస్తే అత్యంత అరుదుగా జరిగే విమాన ప్రమాదాలను భూతద్దంలో చూడాల్సిన పనిలేదని భరోసా ఇచ్చే వాళ్లు ఈ 'సీటు క్షేమం'చర్చలో పాల్గొన్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

పూజారులు, గ్రంథీలకు నెలకు రూ.18 వేలు

- ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల వేళ కేజ్రీవాల్ మరో వరం
- నేటి నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించనున్న ఆప్ అధినేత
- ఎలాంటి అవాంతకాలు కలిగించద్దని బీజేపీకి విన్నపం



సాక్షి, న్యూఢిల్లీ: త్వరలో జరగనున్న ఢిల్లీ శాసనసభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఆమ్ ఆద్మీ పార్టీ మరో వరాల జల్లు కురిపించింది. ఆలయాల్లో పూజారులు, గురుద్వారాల్లో సేవచేసే గ్రంథీలకు నెలకు రూ.18 వేల గౌరవ వేతనం ఇస్తామని ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ సోమవారం ప్రకటించారు. మంగళవారం ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్‌లోని ప్రాచీన హనుమాన్ ఆలయం నుంచి ఈ పథకానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియను స్వయంగా కేజ్రీవాల్ ప్రారంభించనున్నారు. ముందుగా హనుమాన్ ఆలయం అర్చకుల పేర్లను నమోదు చేస్తారు. ఆ తర్వాత.. పార్టీ ఎమ్మెల్యేలు, కార్యకర్తలు ఢిల్లీలోని అన్ని దేవాలయాలు, గురుద్వారాలకు వెళ్లి పూజారులు, గ్రంథిల పేర్లు నమోదు చేస్తారు. సోమవారం పార్టీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేజ్రీవాల్ ఈ వివరాలను ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ''మహిళా సమ్మాన్, సంజీవని యోజన లాగా 'పూజారి, గ్రంథి సమ్మాన్ యోజన'కు ఎలాంటి అవాంతరాలు కలిగించవద్దని బీజేపీని వేడుకుంటున్నా. అయినాసరే అడ్డుకుంటామంటే బీజేపీకి మహాపాపం చుట్టుకుంటుంది. పూజారులు, గ్రంథులు మనకు దేవుడికి మధ్య వారధులుగా ఉంటూ మన ఆచారాలను భవిష్యత్ తారాలకు అందజేస్తున్నారు. సమాజంలో పూజారులు, గ్రంథీలు కీలక పాత్ర పోషిస్తున్నా వారు ఇన్నాళ్లు నిర్లక్షానికి గురయ్యారు. దేశంలోనే తొలిసారిగా వీళ్లను ఆదుకునేందుకు ఈ పథకం తెస్తున్నాం. ఢిల్లీ రాష్ట్రంలో ఆప్ మళ్లీ అధికారంలోకి రాగానే ఈ పథకం అమల్లోకి వస్తుంది. గతంలో ఏ పార్టీ, ప్రభుత్వం ఇలాంటి ప్రయోజనం అర్చకులకు, సేవకులకు చేకూర్చలేదు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కూడా అధికారంలో ఉన్న రాష్ట్రాల్లోని అర్చకుల కోసం ఇలాంటి పథకాన్ని ప్రారంభిస్తాయని ఆశిస్తున్నా''అని కేజ్రీవాల్ అన్నారు. ''దేశ సంస్కృతి, సంప్రదాయాలను తరాలుగా కొనసాగిస్తున్న అర్చకులను ఆదుకునేందుకు ఉద్దేశించిన చక్కని పథకమిది''అని ఢిల్లీ సీఎం అతిశి 'ఎక్స్'లో పోస్ట్‌చేశారు. మరోవైపు ఢిల్లీ వక్ఫ్ బోర్డ్ పరిధిలోని మసీదుల్లో సేవలందించే ఇమామ్‌లు కేజ్రీవాల్ నివాసం బయట ఆందోళకు దిగారు. ఇమామ్‌లకు అందాల్సిన నెలవారీ గౌరవ వేతనం రూ.18,000, ముయేజిన్‌లకు అందాల్సిన రూ.16వేల గౌరవ వేతనం గత ఏడాదిన్నరగా అందట్లేదని వారు నిరసన తెలిపారు.

సంతాప దినాల్లో విహార యాత్రా?

రాహుల్ వియత్నాం పర్యటనపై బీజేపీ వ్యాఖ్య

న్యూఢిల్లీ: మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ కన్నుమూసిన కొన్ని రోజులకే కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వియత్నాంలో జరిగే న్యూ ఇయర్ వేడుకల్లో పాల్గొనేందుకు వెళ్లారంటూ బీజేపీ ఎద్దేవా చేసింది. బీజేపీ ఐటీ విభాగం చీఫ్ అమిత్ మాలవీయ సోమవారం 'ఎక్స్'లో ఈ విషయం ప్రస్తావించారు. మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ మరణంతో దేశమంతా సంతాపపాటిస్తుండగా న్యూ ఇయర్ వేడుకల కోసం వియత్నాం వెళ్లారు'అని పేర్కొన్నారు. 'గాంధీల కుటుంబం, కాంగ్రెస్ సిక్కులను ద్వేషిస్తుంది. దర్బార్ సాహిబ్‌ను ఇందిరా గాంధీ అపవిత్రం చేసిన విషయం మరువరానిది'అంటూ ఆయన వ్యాఖ్యానించారు. దీనిపై కాంగ్రెస్ నేత మాణిక్కం ఠాగూర్ వెంటనే స్పందించారు. మాజీ ప్రధాని మన్మోహన్ అంత్యక్రియల నిర్వహణలో విఫలమైన బీజేపీ ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఇలాంటి వాటిని తెరపైకి తెస్తోందన్నారు. రాహుల్ గాంధీ ఒక్కరే వియత్నాం వెళ్లారు. ఆయన పర్యటనతో బీజేపీకి బాధ ఎందుకో?అని ప్రశ్నించారు.

అతిశీని తాత్కాలిక సీఎం అనడం అవమానకరం: సక్సేనా

ఆప్ చీఫ్ కేజ్రీవాల్‌పై ఢిల్లీ ఎల్జీ ధ్వజం

న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి అతిశీని తాత్కాలిక సీఎం అంటూ ఆప్ చీఫ్ కేజ్రీవాల్ వ్యాఖ్యానించడం రాజ్యాంగాన్ని అవమానించడమేనని ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా పేర్కొన్నారు. ఇటీవల ఓ బహిరంగ సభలో కేజ్రీవాల్ చేసిన ఆ వ్యాఖ్య ప్రజాస్వామ్య స్ఫూర్తిని అగౌరవపరచడమేనని విమర్శించారు. ఈ మేరకు ఆయన ఢిల్లీ సీఎం అతిశీకి లేఖ రాశారు. తన రెండున్నరేళ్ల పాలనా కాలంలో వాస్తవంగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న సీఎం అతిశీయేనంటూ ప్రశంసించారు. ఈ లేఖపై సీఎం అతిశీ స్పందించారు. ఎల్జీ కార్యాలయం బీజేపీ కార్యాలయం మాదిరిగా పనిచేస్తోందంటూ ఎదురుదాడికి దిగారు. ఢిల్లీలో కేజ్రీవాల్‌ను మించిన నేత మరొకరు లేరని పేర్కొన్నారు. ఇలాంటి దిగజారుడు రాజకీయాలు మాని ప్రజల ఆకాంక్షల మేరకు పనిచేసేందుకు సహకారం అందించాలన్నారు.


ఉక్రెయిన్‌కు 2.5 బిలియన్ డాలర్లు

సైనిక సాయం ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు బైడెన్

వాషింగ్టన్: మరో 10 రోజుల్లో పదవి నుంచి వైదొలగనున్న వేళ అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఉక్రెయిన్‌కు సుమారు 2.5 బిలియన్ డాలర్ల(రూ.21 వేల కోట్ల) భారీ మిలటరీ సాయం ప్రకటించారు. ఈ నిధులను త్వరత్వరగా ట్రంప్ పగ్గాలు అందుకోకమునుపే ఆ దేశానికి అందించేందుకు బైడెన్ యంత్రాంగం ఆగమేఘాలపై చర్యలు ప్రారంభించింది. ఇందులో 1.25 బిలియన్ డాలర్లు అధ్యక్షుడి అధికార పరిధిలోనివే. ఈ మేరకు రష్యాపై పోరాడేందుకు అవసరమైన ఆయుధాలను వేగంగా సరఫరా చేయాలని నిర్ణయించింది. మరో 1.22 బిలియన్ డాలర్లను దీర్ఘకాలం అందించే ఆయుధాల ప్యాకేజీ ఉక్రెయిన్ సెక్యూరిటీ అసిస్టెన్స్ ఇనిషియేటివ్‌గా ఉద్దేశించింది. గరిష్ట స్థాయిలో సాధ్యమైనంత వేగంగా ఉక్రెయిన్‌కు సాయం అందించాలని అధికారులను ఆదేశించినట్లు బైడెన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉక్రెయిన్ ఇంధన వనరులే లక్ష్యంగా రష్యా దాడులను తీవ్రతరం చేసిన వేళ అమెరికా ఈ సాయం ప్రకటించడం గమనార్హం. ట్రంప్ అధికారం చేపట్టాక రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య శాంతి చర్చలే జరిగితే ఆ సమయానికి ఉక్రెయిన్‌ను బలమైన స్థితిలో నిలపడమే బైడెన్ ప్రభుత్వం లక్ష్యంగా ఉంది.

బోరు వేస్తుండగా భారీగా గ్యాస్ లీకేజీ

జైసల్మీర్(రాజస్తాన్): బోరు బావి తవ్వుతుండగా అకస్మాత్తుగా భూమి కుంగిపోయింది. ఆపైన గ్యాస్ లీకేజీ అయ్యింది. గ్యాస్ ఒత్తిడికి నీరు జెట్ స్పీడుతో పైకి ఎగజిమ్మింది. రాజస్తాన్ రాష్ట్రం జైసల్మీర్‌లోని మోహన్‌గఢ్ కెనాల్ ప్రాంతంలో శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. దీంతో, జనం భయభ్రాంతులకు లోనయ్యారు. అయితే, ఆదివారం రాత్రి 10 గంటల సమయానికి గ్యాస్ లీకేజీ దానంతటదే ఆగిపోయిందని అధికారులు తెలిపారు. విషయం తెలిసి ఓఎన్‌జీసీ అధికారులు ఘటనా స్థలిని పరిశీలించారు. గ్యాస్ తిరిగి ఎప్పుడైనా లీకయ్యే ప్రమాదముందని వివరించారు. ప్రస్తుతానికి అది విషపూరితం కాదు, మండే స్వభావం లేనిదని స్పష్టం చేశారు. అయితే, విషపూరిత వాయువులు వెలువడే అవకాశముందన్నారు. చుట్టుపక్కల 500 మీటర్ల దూరం వరకు ఎవరూ వెళ్లవద్దని కోరారు. పశువులను కూడా అటుగా వెళ్లకుండా చూడాలన్నారు. దీంతో, అధికారులు అక్కడ నిషేధాజ్ఞలు విధించారు. నిపుణులు పరిశీలించే వరకు అక్కడి డ్రిల్లింగ్ యంత్ర సామగ్రిని కూడా అలాగే ఉంచాలని చెప్పారు.



కెంటకీలోని బార్డ్స్‌టౌన్‌లో 1979 జులై 31వ తేదీన హైస్కూల్ జిమ్‌లో జరిగే సమావేశానికి పరేడ్‌గా వస్తూ కారు పైకెక్కి అభిమానులతో ఉత్సాహంగా చేయి కలుపుతున్న అమెరికా అధ్యక్షుడు జిమ్మీ కార్టర్



1979 మార్చి 26న వైట్ హౌస్‌లో శాంతి ఒప్పందంపై సంతకాలు చేసిన అనంతరం ఈజిప్టు అధ్యక్షుడు సాదత్, ఇజ్రాయెల్ ప్రధాని బెగిన్‌తో కార్టర్




1976లో రెవరెండ్ మార్టిన్ లూథర్‌కింగ్ సీనియర్‌తో జిమ్మీ కార్టర్

భారత్‌లో కార్టర్ పేరిట గ్రామం!!

కార్టర్‌పురీ(గురుగ్రామ్): అమెరికా మాజీ అధ్యక్షుడు జిమ్మీ కార్టర్ పేరు మీద భారత్‌లో ఒక గ్రామం ఉందని చాలా మందికి తెలీదు. 46 సంవత్సరాల క్రితం అంటే 1978 జనవరి మూడో తేదీన హరియాణాలోని గురుగ్రామ్ సమీపంలోని దౌల్తాబాద్ నసీరాబాద్ గ్రామంలో జిమ్మీ కార్టర్ దంపతులు పర్యటించారు. కార్టర్ పర్యటించిన ఆ గ్రామం పేరును నాటి భారత ప్రధానమంత్రి మొరార్జీ దేశాయ్ సిఫార్సు మేరకు కార్టర్‌పురీగా నామకరణంచేశారు. అంతకుపూర్వం ఈ గ్రామాన్ని ఖేదాగానూ సమీప గ్రామస్తులు పిలిచేవారు. కార్టర్ మరణవార్త తెల్సి కార్టర్‌పురీ గ్రామస్తులు విచారం వ్యక్తంచేశారు. ''మా గ్రామం సొంత కుమారుడితో సమానమైన కార్టర్‌ను కోల్పోయింది''అని కార్టర్‌పురీ గ్రామ మాజీ సర్పంచ్ యద్రామ్ యాదవ్ వ్యాఖ్యానించారు. భారత్‌లో పర్యటించిన మూడో అమెరికా అధ్యక్షుడిగా కార్టర్ పేరు చరిత్రలో నిలిచిపోయింది. కార్టర్ తల్లి లిలియాన్ 1960వ దశకంలో శాంతిదళాలతో కలిసి భారత్‌లో ఆరోగ్యకార్యకర్తగా సేవలందించారు. జైల్‌దార్ సర్ఫరాజ్‌కు చెందిన ఒక భవనంలో ఉంటూ లిలియాన్ సామాజిక కార్యకర్తగా చిన్నారులకు సేవచేశారు. వైద్యసాయం అందించారు. ''కార్టర్ మా గ్రామానికి వచ్చినపుడు ఆయన భార్య రోసాలిన్ సంప్రదాయ భారతీయ గ్రామీణ కట్టుబొట్టులో వచ్చి అందరితో కలిసిపోయారు. కార్టర్ దంపతులు గ్రామంలో కలియతిరిగారు. ఆదర్శవంతమైన గ్రామంగా తీర్చిదిద్దాలని ఆశించారు. అయితే ఆ తర్వాతి ప్రభుత్వాలు మమ్మల్ని పట్టించుకోవడమే మానేశాయి. అయినా కార్టర్‌పై మాప్రేమ అలాగే ఉంది. 2003లో కార్టర్‌కు నోబెల్ శాంతి బహుమతి ప్రకటించినప్పుడు సంబరాలు చేసుకున్నాం. గతంలో అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌజ్ నుంచి ప్రత్యేక బృందం మా గ్రామంలో సందర్శించింది''అని గ్రామస్తులు చెప్పారు. భారత్‌లో ఎమర్జెన్సీ ఎత్తేశాక 1977లో జనతాపార్టీ సార్వత్రిక ఎన్నికల్లో గెలిచిన తర్వాత కార్టర్ భారత్‌లో పర్యటించారు. ఎమర్జెన్సీ తర్వాత భారత్‌లో పర్యటించిన తొలి ప్రెసిడెంట్ ఈయనే. ఈ సందర్భంగా భారత పార్లమెంట్‌లోనూ కార్టర్ 1978 జనవరి రెండో తేదీన ప్రసంగించారు.

100 ఇళ్ల నిర్మాణంలో చేయూత

మహారాష్ట్రలోని ముంబై సమీపంలోని పటాన్ గ్రామంలో దిగువ తరగతి వర్గాల కోసం 2006 ఏడాదిలో వంద ఇళ్ల నిర్మాణం కోసం కార్టర్ ఎంతో సాయపడ్డారు. ఆ ఏడాది అక్టోబర్‌లో ఒక వారం పాటు ఇక్కడే ఉండి పనుల్లో మునిగిపోయారు. స్వయంగా కార్పెంటర్‌గా పనిచేశారు. ఈ కార్యక్రమంలో 2,000 మంది అంతర్జాతీయ, స్థానిక వలంటీర్లు పాల్గొన్నారు. హాలీవుడ్ నటుడు బ్రాడ్ పిట్, బాలీవుడ్ నటుడు జాన్ అబ్రహం తదితరులూ తమ వంతు కృషిచేశారు. 1984 ఏడాది తర్వాత ప్రతి ఏటా ఒక వారం పాటు సమాజసేవకు కార్టర్ కేటాయించారు. ''67 ఏళ్ల తల్లి లిలియాన్‌తో కలిసి నేను విక్రోలీలో కుష్ఠురోగుల కాలనీలో సేవచేశా'' అని కార్టర్ గతంలో ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. కార్పెంటరీ, లేబర్ పనుల్లో ఆరితేరిన కార్టర్ న్యూయార్క్‌లోనూ ఒక భవంతి ఆధునీకరణ పనుల్లో పాలుపంచుకున్నారు.



2002 డిసెంబర్ పదో తేదీన నార్వే రాజధాని ఓస్లోలో నోబెల్ శాంతి బహుమతితో జిమ్మీ కార్టర్

క్లాస్‌మేట్‌ను చంపిన టీనేజర్‌కు జీవిత ఖైదు

- దోషిగా తేలిన మరో టీనేజర్‌కు 12 ఏళ్ల జైలు
- చైనా న్యాయస్థానం సంచలన తీర్పు

బీజింగ్: క్లాస్‌మేట్‌ను దారుణంగా చంపిన నేరానికి గాను ఇద్దరు టీనేజర్లకు చైనా న్యాయస్థానం కఠిన జైలు శిక్షలు విధించింది. వీరిలో ఒకరికి జీవిత ఖైదు, మరొకరికి 12 ఏళ్ల జైలు శిక్షను విధిస్తూ తీర్పు వెలువరించింది. ఈ ఘటనలో సాక్షిగా ఉన్న మరో టీనేజర్‌ను కరెక్షన్ సెంటర్‌కు పంపించింది. హెబీ ప్రావిన్స్‌లోని హండన్‌లో ఈ ఏడాది మార్చిలో చోటుచేసుకున్న ఈ ఘటన చైనాలో సంచలనం కలిగించింది. బాధితుడు, దోషుల వయస్సు 13 ఏళ్లు. అందుకే అధికారులు వీరిని క్లుప్తంగా ఇంటి పేర్లతో వెల్లడించారు. క్లాస్‌మేట్ వాంగ్‌ను కొంతకాలంగా ఝాంగ్, లి, మా అనే బాలురు వేధిస్తున్నారు. వాంగ్‌ను చంపాలని ఝాంగ్ పథకం వేశాడు. దాని ప్రకారం మార్చి 3న నగరం శివార్లలోని పాడుబడ్డ గ్రీన్ హౌస్‌కు అతడిని తీసుకెళ్లాడు. అనుకున్న ప్రకారం మిగతా ఇద్దరూ అక్కడికి వచ్చారు. వాంగ్‌ను ఝాంగ్ పారతో కొట్టడం మొదలుపెట్టగా అతడికి లి సహకరించాడు. ఇది చూడలేక మా అక్కడికి నుంచి వెళ్లిపోయాడు. దెబ్బలతో చనిపోయిన వాంగ్‌ను ఇద్దరూ కలిసి అక్కడున్న గుంతలో పూడ్చి వేశారు. మార్చి 10న పోలీసులు ఈ ముగ్గురినీ అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా దారుణం వెలుగుచూసింది. సోమవారం ఈ కేసును విచారించిన న్యాయస్థానం..ఇది చాలా హేయమైన, క్రూరమైన చర్యగా అభివర్ణించింది. నేరానికి ప్రధాన సూత్రధారి ఝాంగ్‌కు జీవిత ఖైదును, అతడికి సహకరించిన లి కి 12 ఏళ్ల జైలు శిక్షను విధించింది. మూడో బాలుడు మా ను పరివర్తన విద్యాకేంద్రానికి పంపించాలని తీర్పు వెలువరించింది. అయితే, వీరిని ఈ నేరానికి పురిగొల్పిన అసలు కారణాలు మాత్రం తెలియరాలేదు. కోర్టు తీర్పుపై నెటిజన్లు హర్షం వ్యక్తం చేశారు. కఠిన శిక్షల భయం లేనందునే పిల్లలు కూడా ఇలాంటి దారుణాలకు తెగబడుతున్నారని అభిప్రాయం వ్యక్తం చేశారు. కాగా, ఈ నలుగురి తల్లిదండ్రులు నగరానికి పనుల నిమిత్తం వెళ్లిపోగా, అమ్మమ్మతాతల వద్ద ఉంటూ అల్లరిచిల్లరగా తిరగడం అలవాటు చేసుకున్నారని చెబుతున్నారు. 2020 నాటి గణాంకాల ప్రకారం ఇలా 'వదిలివేయబడిన బాలలు'దేశంలో 6.70 కోట్ల మంది వరకు ఉన్నట్లు అంచనా.

మహిళలు పనిచేసే ఎన్జీవోల మూత

అఫ్గాన్‌లో తాలిబన్ల ఆదేశాలు


కాబూల్: అఫ్గానిస్తాన్‌లోని తాలిబన్ పాలకులు మహిళలకు వ్యతిరేకంగా మరో నిర్ణయం తీసుకున్నారు. తమ దేశ మహిళలు పనిచేసే జాతీయ, విదేశీ ప్రభుత్వేతర సంస్థలన్నిటినీ మూసివేయనున్నట్లు సోమవారం ప్రకటించారు. ఇస్లాం సిద్ధాంతాల ప్రకారం ధరించాల్సిన హిజాబ్‌ను ఆయా సంస్థల్లోని అఫ్గాన్ మహిళలు ధరించకపోవడమే ఇందుకు కారణమన్నారు. ఆర్థిక శాఖ ఆదివారం రాత్రి 'ఎక్స్'లో ఈ విషయం వెల్లడించింది. తమ ఉత్తర్వులను బేఖాతరు చేసే సంస్థల లైసెన్సులను రద్దు చేస్తామని, కార్యకలాపాలను నిలిపివేస్తామని కూడా అందులో హెచ్చరించింది. నాన్ గవర్నమెంటల్ సంస్థల రిజిస్ట్రేషన్, సమన్వయం, నిర్వహణ, పర్యవేక్షణ సహా అన్ని కార్యకలాపాల బాధ్యత తమదేనని స్పష్టం చేసింది. తాలిబాన్ నియంత్రణలో లేని సంస్థలు అన్నిటిలోనూ మహిళలు పనిచేయడం ఆపేయాలని మరోసారి హుకుం జారీ చేసింది. అత్యవసరమైన మానవతా సాయం అందించే కార్యక్రమాల్లోనూ మహిళల ప్రాతినిథ్యాన్ని తాలిబన్లు అడ్డుకుంటున్నారని ఇటీవల ఐరాస సైతం ఆరోపించడం గమనార్హం. బాలికలు ఆరో గ్రేడ్ మించి చదువుకోరాదని, బహిరంగంగా కనిపించే విధుల్లో పాల్గొనరాదని ఇప్పటికే తాలిబన్ పాలకులు నిషేధం విధించడం తెలిసిందే.

కిటికీల నుంచి మహిళలు కనిపించొద్దు

తాలిబన్ నేత హిబతుల్లా అఖుండ్‌జాదా మరో తాఖీదు జారీ చేశారు. మహిళలు, నిలబడి లేదా కూర్చున్నట్లుగా కనబడేలా భవనాలకు కిటికీలు ఉండరాదన్నారు. కొత్తగా నిర్మించే వాటితోపాటు ఇప్పటికే ఉన్న భవనాలకు సైతం ఈ నిబంధన వర్తిస్తుందన్నారు. వరండాలు లేదా వంటగదులు కనిపించేలా కిటికీలు ఏర్పాటు చేయవద్దన్నారు. ఒక వేళ కిటికీలుంటే భవన యజమాని ఆ స్థానంలో గోడను నిర్మించడం లేదా ఏదైనా అడ్డుగా ఉంచడం చేయాలన్నారు. నివాస భవనాల్లోపలి భాగం కనిపించేలా కొత్తగా భవన నిర్మాణం చేయరాదని ఆయన మున్సిపల్, ఇతర అధికారులకు సైతం నిర్దేశించడం గమనార్హం.

సాక్షి ప్లస్
మంగళవారం: 31-12-2024

నిజాం కాలంలో అతిపెద్ద భూ విస్తీర్ణం ఉన్న జాగీరు?



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
తెలంగాణ చరిత్ర

నిజాం హయాంలో భూ పరిమితి కాలం, సాంఘిక వ్యవస్థ, జాగీర్దార్లు, దేశ్‌ముఖ్, వెట్టి

అసఫ్‌జాహీలు

నిజాం రాజ్య పాలకులు గతంలో మొగలులు, కుతుబ్‌షాహీలు అనుసరించిన భూమిశిస్తు విధానాలనే కొనసాగించారు. స్థానిక అవసరాల దృష్ట్యా కొన్ని మార్పులు చేశారు. హైదరాబాద్ రాజ్య విస్తీర్ణం 82,698 చదరపు మైళ్లు. దీనిలో 60 శాతం దివానీ భూమి, 30 శాతం భూమి జాగీర్దార్ల ఆధీనంలో ఉండేది. మిగిలిన 10 శాతం భూమిని నిజాం సొంత ఖర్చుల కోసం నిర్దేశించేవారు. ఆ భూములను సర్ఫ్-ఎ-ఖాస్ అనేవారు.

దివానీ భూమి శిస్తు విధానం

- రాజ్యానికి చెందిన భూమిని 'దివానీ లేదా ఖల్సా' భూములు అనేవారు. ఇందులో 60 శాతం ప్రభుత్వ ఆధీనంలో ఉండేది.
- దివానీ భూముల నుంచి వచ్చే పన్నులను ప్రభుత్వ నిర్వహణకు ఉపయోగించేవారు.
- 1875లో దివానీ పద్ధతిలో క్రమబద్ధమైన సర్వే సెటిల్‌మెంట్ విధానం 1317 ఫసలీ చట్టం ద్వారా సాలార్‌జంగ్-1 ప్రవేశపెట్టాడు.
- 1948లో హైదరాబాద్ రాజ్యాన్ని భారత యూనియన్‌లో విలీనం చేసేనాటికి సంస్థానం దివానీ భూమిలో 13,816 గ్రామాలు ఉన్నాయి.
- కాకతీయుల కాలంలో నిర్మించిన చెరువులకు మరమ్మతులు చేసి నీటిపారుదల సౌకర్యాలు మెరుగుపరిచారు. తెలంగాణలో ఎక్కువ శాతం వ్యవసాయం చెరువులు, వర్షం ఆధారంగా సాగయ్యేది.
- సాగు భూముల నుంచి వచ్చే ఆదాయం తక్కువ ఉండటం, సరైన మార్కెట్ వ్యవస్థ లేకపోవడం వల్ల గుత్తేదార్లు, దళారీలు రైతులను వీలైనంత ఎక్కువ దోచుకొనేవారు. ఫలితంగా 15 శాతం సాగు భూమి వృథాగా ఉండేది.
- నిజాం రాజ్యంలో రైత్వారీ విధానంతోపాటు ఇతర భూమి శిస్తు పద్ధతులు కూడా ఉండేవి. రైత్వారీ విధానం ఎక్కువ ప్రాచుర్యం పొందింది. నిజాం పాలకుల కింద అధిక భూభాగం ఈ విధానం కిందే ఉండేది. రాజ్యంలో రైత్వారీ పద్ధతితోపాటు సరబాస్తా, ఇజారా, పాన్‌మక్తా వంటి ఇతర పద్ధతుల కింద కూడా భూమి ఉండేది.

రైత్వారీ విధానం

ఈ విధానంలో భూమి దున్నే రైతులకు యాజమాన్య హక్కులు ఇచ్చారు. ఈ విధానంలో మధ్యవర్తులు ఉండేవారు కాదు. దాదాపు 200 మిలియన్ల ఎకరాలకు పైగా భూమి రైత్వారీ విధానం కింద ఉండేది.

- హైదరాబాద్ రెవెన్యూ కోడ్ (1879) కింద ప్రభుత్వం భూయజమానులకు వాస్తవ హక్కులను కల్పించింది. ఈ కోడ్ ద్వారా రాజ్యంలో రైతును అసలైన యజమానిగా గుర్తించారు.
- భద్రత, సమర్థమైన పూర్తి హక్కులకు కోడ్ ప్రకారం రైతులకు అప్పగించారు. కొన్ని నియమ నిబంధనలతో రైతు ప్రభుత్వానికి క్రమం తప్పకుండా భూమి పన్ను కట్టాలి.
- రైత్వారీ విధానంలో పట్టాదారు తన భూమిని విక్రయించడానికి లేదా తనఖా పెట్టడానికి హక్కు ఉండేది.
- చట్టపరంగా సేద్య భూమిని వ్యక్తిగతంగా లేదా వ్యవసాయ కూలీల ద్వారా సేద్యం చేసేవారు. దీన్ని పట్టాదారు విధానం అనే వారు.
- ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ రైతులు సేద్యం ద్వారా ఉమ్మడిగా లేదా వాటాదారులుగానీ ఉత్పత్తి చేసిన దాంట్లో సమాన భాగస్వామ్యం కలిసి ఉన్న విధానమే 'పాఠ్ పట్టాదారీ'.

పాన్‌మక్తా:
ప్రభుత్వ భూములను కౌలుకు తీసుకొని స్థిరమైన శిస్తు చెల్లించే కౌలుదారీ విధానమే పాన్‌మక్తా. ఇందులో పన్ను పెరుగుదల ఉండేది కాదు.

ఇజారా పద్ధతి:
వ్యవసాయ క్షేత్రాలు బ్రిటిష్ ప్రాంత పరిపాలనలోకి వెళ్లకుండా, ముఖ్యంగా తెలంగాణ ప్రాంతంలో గ్రామాలను పునర్జీవనం చేయడానికి, బీడు భూములను సాగులోకి తీసుకురావడానికి ఉద్దేశించిన పద్ధతే ఇజారా పద్ధతి. పరిపాలనలో అవినీతిని నిరోధించడానికి, గుత్తేదార్లు, భూస్వాముల నుంచి వ్యవసాయదారులను రక్షించడానికి సాలార్‌జంగ్ సంస్కరణల ఫలితంగా ఈ పద్ధతిని ప్రవేశపెట్టారు.

వతన్‌దారీ పద్ధతి:
ఇది చాలా ప్రాచీన భూమిశిస్తు పద్ధతి. రాజుకు సేవ చేసినందుకు ప్రభుత్వం ఈ భూములను ఇచ్చేది. వతన్ అంటే స్థానిక లేదా సొంత ప్రాంతం అని అర్థం.

- స్థానిక రెవెన్యూ అధికారులైన పటేల్, పట్వారీ, దేశ్‌ముఖ్, దేశ్‌పాండే, సర్దేశ్‌పాండేలు, గ్రామంలోని వృత్తి పనివాళ్లకు, గ్రామ సేవకులకు నగదు రూపంలో ఇచ్చే జీతాలకు బదులుగా ఈ భూములను ఇచ్చేవారు.

సర్ఫ్-ఎ-ఖాస్:
సర్ఫ్-ఎ-ఖాస్ పదాన్ని అరబిక్ భాష నుంచి గ్రహించారు. సర్ఫ్-ఎ- ఖాస్ అంటే వ్యక్తిగత వ్యయం అని అర్థం.

- నిజాం రాజు సొంత ఖర్చుల నిమిత్తం కేటాయించిన భూమే సర్ఫ్-ఎ-ఖాస్ (సర్ఫేఖాస్). వీటి విస్తీర్ణం 10,000 చదరపు మైళ్లు.
- 1948లో హైదరాబాద్ సంస్థానం, భారత యూనియన్‌లో విలీనం అయ్యేంత వరకు సర్ఫేఖాస్ భూముల ఆదాయం, వనరులను రాజ కుటుంబానికి కేటాయించారు.
- రెండో నిజాం కాలంలో దార్-ఉల్-సిద్రాఅనేది సర్ఫేఖాస్ భూముల కేంద్ర పరిపాలన విభాగం.
- నిజాంకు వ్యక్తిగత సైన్యం ఉండేది. దాన్ని సర్ఫేఖాస్ సైన్యం అని పిలిచేవారు.
- సర్ఫేఖాస్ ఆదాయాన్ని ప్రభుత్వ ఖజానాలో కలిపేవారు కాదు. ఈ భూముల్లో వసూలైన పన్నులను జిల్లా సర్ఫేఖాస్ ఖాతా నుంచి పర్యవేక్షకుడి ఖాతాలో చేరుతుంది. వీటిని ప్రభుత్వ ఆజ్ఞ ద్వారా సర్ఫేఖాస్ అధికారి పర్యవేక్షించేవాడు. ఖాతా ధనం మొత్తం సర్ఫేఖాస్ కార్యదర్శి ద్వారా సర్ఫేఖాస్ అధికారికి చేరుతుంది.
- సర్ఫేఖాస్ భూములను సర్దార్-ఉల్-మహమ్ అనే అధికారి పర్యవేక్షించేవాడు. ఇతడు ప్రత్యక్షంగా నిజాం ఆధీనంలో పనిచేసేవాడు.
- సర్ఫేఖాస్ భూములను ముఫ్‌వాజా(అప్పగించిన భూములు), జేర్‌నిగరాని(పర్యవేక్షించే తాలూకాలు)గా విభజించారు.

జాగీర్దారీ పద్ధతి:
నిజాం నవాబుకు, ప్రభుత్వానికి సేవచేసిన వారికి ఇచ్చిన భూములను జాగీర్లు అనేవారు. జాగీరు పొందిన వ్యక్తి ఆ ప్రాంతం మీద పూర్తి హక్కులు పొందుతాడు. అలా పూర్తి హక్కులు పొందినవారినే జాగీర్దార్లు.

- ఈ జాగీర్దారీ విధానాన్ని కాకతీయుల కాలంలోని నాయంకర విధానం, విజయనగర కాలంలో అమర నాయక విధానం, మొగలుల కాలంలో మున్సబ్‌దారీ విధానాలతో పోల్చవచ్చు.
- జాగీర్దారీ విధానాన్ని మధ్యాసియా ప్రాంతం నుంచి ఢిల్లీ సుల్తాన్లు తీసుకువచ్చి భారతదేశంలో ప్రవేశపెట్టారు.
- జాగీర్దార్ అనే పదం రెండు పర్షియన్ పదాల కలయిక. జాగీరు అంటే భూమి, దార్ అంటే అధికారి. భూమి మీద హక్కులు ఉన్న అధికారి అని జాగీర్దార్ అర్థం.
- నిజాం రాజు మొత్తం భూభాగంలో 40 శాతం జాగీర్దార్లకు ఇచ్చారు.
- జాగీర్దారు తన జాగీరులో పన్నులు వసూలు చేసుకొని శాంతి భద్రతలు కాపాడుతూ, సైన్యాన్ని నిర్వహించేవారు. రాజుకు అవసరం ఉన్నప్పుడు సైన్యాన్ని పంపేవారు.

జాగీరు రకాలు

పాయిగా జాగీర్:
పాయిగా జాగీరు భూములకు మరో పేరు జాగిరత్-ఇ-నిగదిస్తు జామతి. ఇది ఒక సైనిక జాగీరు. పాయిగా జాగీరును నవాబ్ నిజాం అలీ ఖాన్ బహదూర్ నుంచి అబ్దుల్ ఖాహిర్ ఖాన్, నవాబ్ షంషుల్ ఉమ్రా, అమీర్-ఇ-కబీర్ గుర్రాల నిర్వహణ కోసం భూములను పొందారు. తర్వాత కాలంలో ఈ భూములను పాయిగా జాగీరుగా మార్చారు.

- పాయిగా అంటే స్థిరత్వం. ఈ జాగీరు మొత్తం విస్తీర్ణం 2000 చ.మైళ్లు. ఇందులో సుమారు 1000 గ్రామాలు ఉన్నాయి.

ఆల్‌తమ్‌గా జాగీర్:
ఆల్‌తమ్‌గా తుర్కీ భాషకు చెందిన పదం. ఆల్‌తమ్‌గా అంటే రాజు చిహ్నానికి ఉన్న రెండు గుర్తులు. ఇది భూమిశిస్తు లేని జాగీరు. ఈ జాగీరును రాజు తన ముద్ర ద్వారా కేటాయిస్తారు. ఈ జాగీరు శాశ్వతమైన వంశపారపర్యంగా పొందే హక్కు. దీన్ని విక్రయించే హక్కు లేదు. ఒకవేళ ఈ భూమిని ఎవరికైనా బహుమతిగా ఇవ్వాలంటే ముందుగా రాజు అనుమతి తీసుకోవాలి.

జాట్ జాగీర్‌లు:
నిజాం కాలంలో అతిపెద్ద భూ విస్తీర్ణం ఉన్న జాగీరు. జీవితాంతం నిజాం కోసం సేవ చేసే వారికి ఇచ్చే భూములే జాట్ జాగీరులు.

- ఈ జాగీరు పొందినవారు తమ జీవితాంతం ఆ భూమిని అనుభవించవచ్చు.
- ఈ జాగీరుకు మరో పేరు ఖాన్ కా జాగీరు. ఈ జాగీర్దారుకు తమకు వచ్చే ఆదాయం పై న్యాయపరమైన హక్కు ఉండేది.
- వీరికి ఆరోగ్యశాఖ, విద్యాశాఖ, భూమి కొలతల శాఖ మొదలైన వాటిపై పొందిన భూమిపై అన్నిరకాల పన్నుల నుంచి మినహాయింపులు ఉండేవి. వీరు సమాజంలో అత్యంత గౌరవప్రదమైన హోదాను కలిగి ఉండేవారు.

ఉమ్రా-ఇ-అజమ్ జాగీరు:
వీరు కూడా నిజాం రాజు సేవకులే. పాయిగా జాగీరు తర్వాత స్థాయికి చెందినవారు. ఈ జాగీర్లను ఇలాఖాలు అని కూడా పిలిచేవారు. నిజాం రాజ్యంలో మొత్తం ఇలాఖాలు తొమ్మిది. ఇందులో ప్రధానమైనవి నాలుగు.

- ఈ నాలుగు ఇలాఖాలు అత్యంత పలుకుబడి ఉన్న అధికారుల ఆధీనంలో ఉండేవి. ఇవి నవాబ్ సాలార్‌జంగ్, మహారాజా శ్రీ కిషన్ ప్రసాద్, నవాబ్ ఖాని ఖానన్, నవాబ్ ఫఖుర్-ఉల్-ముల్క్ అనే ప్రధాన మంత్రులకు చెందినవి.
- ఈ ఇలాఖాల్లో మొత్తం 769 గ్రామాలు ఉండేవి. ఈ గ్రామాలను నాలుగు సంస్థానాలుగా విభజించారు.
- ఈ నాలుగు సంస్థానాల్లో సాలార్‌జంగ్‌కు చెందిన ఇలాఖా పెద్దది. ఇందులో 1126 చదరపు మైళ్ల విస్తీర్ణంతో 359 గ్రామాలుండేవి. ఇలాఖా నుంచి ఏడాదికి 20 లక్షల సిక్కాల ఆదాయం లభించేది.
- ఈ నాలుగు ఇలాఖాలు విడివిడిగా రెవెన్యూ, చట్ట నిర్వహణ చేసేవి.

మశ్రుతి జాగీర్లు:
రాజ్యంలో ప్రజల కోసం, సైనిక వ్యవస్థ కోసం, మతం కోసం పనిచేసిన వ్యక్తులకు ఇచ్చే జాగీర్లు. ఇది షరతులతో కూడిన జాగీరు.

జాగీరు భూముల్లో రెవెన్యూ పరిపాలన

అన్ని జాగీరుల భూముల విస్తీర్ణం, ఆదాయం ఒకే విధంగా ఉండేది కాదు. ఈ జాగీరు ప్రాంతాల్లో వివిధ రకాలైన పరిపాలన ఉంటుంది. కాబట్టి కౌలుదార్ల నుంచి జాగీర్దార్లు ఎక్కువ కౌలు వసూలు చేసేవారు. నిజాం కూడా పెద్ద జాగీరుల ఆగడాలను నిలువరించలేకపోయాడు. కొన్ని సందర్భాల్లో నిజాం దివానీ హక్కులను కూడా జాగీర్దార్లు ధిక్కరించారు. తొంభై శాతం జాగీర్దార్లు నిజాం రాజు ప్రవేశపెట్టిన రెవెన్యూ విధానం కాకుండా తమ స్వతంత్ర శిస్తు విధానాన్ని అమలు చేశారు.

ఇనాం భూములు:
ఇనాం అనేది బహుమతిగా ఇచ్చిన భూమి లేదా భూమిశిస్తు. పాలకులు పొందిన సేవలు లేదా భవిష్యత్తులో పొందే సేవలకు గాను సేవకులకు ఇనాం భూములు ఇచ్చారు.

అగ్రహారాలు:
అగ్రహారాలు నిజాం కాలంలో ప్రధాన హిందూ విద్యా కేంద్రాలుగా ఉండేవి. విద్య బోధించడానికి బ్రాహ్మణులకు అగ్రహార గ్రామాలను శిస్తులేకుండా ఇచ్చేవారు. ఈ అగ్రహార భూములు వంశపారంపర్యంగా వారసులకు లభించేవి. ఈ విద్యాకేంద్రాలపై ఎటువంటి అజమాయిషీ ఉండేది కాదు.

వెట్టి:
వెట్టి అంటే బలవంతంగా లేదా తప్పనిసరిగా దేశ్‌ముఖ్‌లకు, దొరలకు తక్కువ వేతనాలకు లేదా అసలు వేతనం లేకుండా పని చేయడం.

బాగేలా(వెట్టి చాకిరి) పద్ధతి:
నిజాం కాలంలో సమాజంలో భూమి లేని నిమ్న వర్గాలకు చెందినవారు బాగేలా పద్ధతిలో పనిచేసేవారు. తీసుకున్న అప్పు తీరే వరకు కుటుంబంలో ఒక వ్యక్తి దేశ్‌ముఖ్ లేదా దేశ్‌పాండే ఇంట్లో పని చేసేవారు. తనఖా ఉన్న బాగేలా జీతం చాలా తక్కువగా ఉండేది. బాగేలా చనిపోతే ఆ అప్పు తన కుమారుడికి వారసత్వంగా వెళ్లేది.

- 1992లో చిలుకూరులో జరిగిన నిజాం ఆంధ్ర మహాసభ సమావేశంలో వెట్టిచాకిరి నిర్మూలన కోసం అవగాహన వారాలను నిర్వహించింది.
- 1944 భువనగిరి, 1945 మణికొండ నిజాం ఆంధ్ర మహాసభల్లో 'వెట్టిచాకిరిని రద్దు చేయాలి' అని తీర్మానం చేశారు.

జనరల్ నాలెడ్జ్ గ్రాఫ్స్

బ్రిటిష్ పాలనా కాలంలో ప్రధాన చట్టాలు

చట్టం	గవర్నర్ జనరల్	సం॥	అంశం
చార్టర్ చట్టం	లార్డ్ మింటో	1813	దేశంలో క్రిస్టియన్ మిషనరీలు ప్రచారం చేసుకోవటానికి అనుమతి ఇచ్చారు. అలాగే దేశంలో ఈస్టిండియా కంపెనీ ఏకస్వామ్యాన్ని రద్దు చేశారు. అన్ని బ్రిటిష్ కంపెనీలు వ్యాపారం చేసుకోవటానికి అనుమతి ఇచ్చారు. విద్యారంగానికి లక్ష రూపాయలు కేటాయించారు.
సతీసహగమన నిషేధ చట్టం	లార్డ్ విలియం బెంటిక్	1829	రాజారామ్మోహన్‌రాయ్ కృషి మేరకు సతీసహగమన దురాచారాన్ని రద్దు చేశారు.

టెస్ట్ ట్యూబ్ బేబీ అంటే?



బయోటెక్నాలజీ

బయోటెక్నాలజీలో సస్య ప్రజననంతోపాటు కణజాల వర్ధనం, జెనెటిక్ ఇంజినీరింగ్, క్లోనింగ్, ఏకకణ ప్రోటీన్స్ లాంటివి అనేక అంశాల్లో వివిధ రీతుల్లో ఉపయోగపడుతున్నాయి.

జెనెటిక్ ఇంజినీరింగ్: దీంట్లో భాగంగా జన్యు పదార్థమైన డీఎన్ఏను ఉపయోగించి ఆధునిక విధానాల ద్వారా మొక్కల్లో, జంతువుల్లో శ్రేష్ఠమైన లక్షణాలను నిక్షిప్తం చేయడం, నూతన వంగడాలు, జంతు క్లోన్స్, వివిధ రకాల ఆహార పదార్థాలను తయారు చేయడం, కలుషిత నీటిని, పరిసరాలను శుభ్రపరచడం మొదలైన అంశాలుంటాయి.

జెనెటిక్ ఇంజినీరింగ్ విధానంలో నాలుగు దశలుంటాయి.

1. వాంఛనీయ జన్యువును వేరు చేయడం.
2. జన్యువును వాహక డీఎన్ఏలోకి ప్రవేశపెట్టడం.
3. పునఃసంయోజక డీఎన్ఏ వాహకాన్ని అతిథేయి కణంలోకి బదిలీ చేయడం.
4. వాంఛనీయ జన్యువును కలిగిన అతిథేయి కణాలను వరణం ద్వారా ఎన్నుకోవడం.

వాంఛనీయమైన జన్యువును వేరు చేయడంలో డీఎన్ఏను ఖండితాలుగా చేయడానికి ఉపయోగించే ఎంజైమ్‌లను 'రిస్ట్రిక్టెడ్ ఎంజైమ్స్' అంటారు. వీటినే 'అణు కత్తెరలు' అని కూడా అంటారు. వీటిలో ఎండో న్యూక్లియేజ్ ఎంజైమ్‌లు ఉంటాయి. ఖండితాలైన డీఎన్ఏ ముక్కలను ఎలక్ట్రో ఫోరెసిస్, సదరన్ బ్లాటింగ్ పరీక్ష ద్వారా గుర్తించి ఎంపిక చేస్తారు. ఈ ప్రక్రియను ఇ.ఎం. సదరన్ కనుగొన్నాడు.

ఈ ప్రక్రియ అనంతరం వాహకంలో క్లోనింగ్ చేస్తారు. అంటే వేరు చేసిన డీఎన్ఏ ఖండితాల నకళ్లను తయారు చేస్తారు. వాహకంగా ఇ-కోలీ అనే బ్యాక్టీరియాను ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. ప్లాస్మిడ్, కాస్మిడ్, బ్యాక్టీరియో ఫేజెస్ లాంటివాటిని కూడా వాహకాలుగా వినియోగిస్తున్నారు. వాహకంలో ఏర్పడిన డీఎన్ఏను r-డీఎన్ఏ లేదా కైమరిక్ డీఎన్ఏ అంటారు. P^{BR}–322 అనేది కృత్రిమ వాహకం.

r-డీఎన్ఏను బదిలీ చేసిన కణాలను మార్కర్ జన్యువుల ద్వారా గుర్తిస్తారు. ఎంపిక విధానంలో ముఖ్యంగా కాలనీ హైబ్రిడైజేషన్ పద్ధతిని ఉపయోగిస్తారు. కొన్నిసార్లు C-డీఎన్ఏను ఉపయోగించి కూడా అతిథి కణాలను ఎంపిక చేస్తారు. C-డీఎన్ఏను ఉపయోగించి డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ ద్వారా నేర నిర్ధారణ జరుపుతారు. ఇది వివిధ వ్యాధులను,ఆహార కాలుష్యకాలను గుర్తించడానికి కూడా ఉపయోగపడుతుంది. మొక్కల్లో T_i ప్లాస్మిడ్‌ను కలిగిన ఆగ్రో బ్యాక్టీరియం టామిఫేసియన్లను జన్యువుల బదిలీలో ఎక్కువగా ఉపయోగిస్తున్నారు.

క్లోనింగ్ విధానంలో కనుగొన్న కొన్ని క్లోన్స్	
డాలి	- గొర్రె పిల్ల (మొదటి క్లోన్)
ప్రామేటి	- గుర్రం పిల్ల
టెట్రా	- రీసస్ కోతి
హంబావో	- లేగ దూడ
పంపా	- ఆవు దూడ
ప్రిన్స్	- పంది పిల్ల
మటిల్డా	- గొర్రె
డ్యూయా	- మగజింక
విటి-20	- కుందేలు
స్నాటి	- మచ్చల జింక
జియోజియో	- ఎలుక

» క్లోనింగ్ ద్వారా మానవ అవయవాలను కూడా అభివృద్ధి చేయవచ్చు. అయితే శరీర భాగాలను తయారు చేయడం ద్వారా సాంఘిక, సామాజిక పరమైన సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది.
» జంతువుల్లో జీవ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సూపర్ ఒవ్యులేషన్ విధానం ద్వారా ఆవుల్లో, గేదెల్లో కృత్రిమ గర్భధారణ చేస్తున్నారు.
» జన్యు చికిత్స (Gene Therapy) ని అనువంశిక వ్యాధులను నయం చేయడంలో ఉపయోగిస్తారు.
» నేర నిర్ధారణ, రక్త సంబంధీకుల నిర్ధారణలో పాలిమరేజ్ చైన్ రియాక్షన్ (PCR) అనే ఆధునిక పరీక్ష ఎక్కువగా తోడ్పడుతోంది.

వ్యవసాయం - బయోటెక్నాలజీ

నార్మన్ ఇ. బోర్లాగ్ 1960 ప్రాంతంలో అధిక దిగుబడినిచ్చే రకాలను కనుగొని హరిత విప్లవానికి కారకులయ్యారు. ఈయనను 'హరిత విప్లవ పితామహుడు' అంటారు. ఇండియాలో ఎం.ఎస్. స్వామినాథన్‌ను హరిత విప్లవ పితామహుడిగా పేర్కొంటారు. మెరుగైన వంగడాలను వాడటం, రసాయన ఎరువులు, పెస్టిసైడ్స్, సేద్యపు నీటి పరిజ్ఞానం, భూ సంస్కరణలు, శాస్త్రీయ పద్ధతులను ఉపయోగించడం తదితరాలు హరిత విప్లవంలో భాగంగా ఉంటాయి.

జన్యు మార్పిడి విధానం ద్వారా జన్యు పరివర్తిత మొక్కలను (GM–Plants) రూపొందిస్తున్నారు.

ఉదా: బీటీ కాటన్, గోల్డెన్ రైస్.

బీటి-పత్తిలో చీడల నిరోధకతను అభివృద్ధి పరిచారు. దీన్ని మొదట మోనిశాంటో అనే అమెరికా విత్తన సంస్థ రూపొందించింది. ప్రస్తుతం దీన్ని ఇండియాలో మహికో విత్తన సంస్థ రూపొందిస్తోంది.

బాసిల్లస్ థురెంజియన్సిస్ అనే బ్యాక్టీరియా లెపిడాప్టిరాన్స్, కోలియోప్టిరాన్స్, డిప్టిరాన్స్ లాంటి వాటి నుంచి రక్షించడానికి తోడ్పడుతుంది.

గోల్డెన్‌రైస్‌లో విటమిన్-ఎ ఉత్పత్తి జరిగే విధంగా రూపొందించారు.

గతంలో జంతువులను చంపి వాటి క్లోమం నుంచి ఇన్సులిన్‌ను నిష్కర్షణ చేసేవారు. 1983లో అమెరికాకు చెందిన ELiLilly అనే కంపెనీ ఇ-కోలీ బ్యాక్టీరియాను ఉపయోగించి హ్యుమ్యులిన్ అనే ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేసి మార్కెట్‌లోకి విడుదల చేసింది.

జన్యుపరివర్తిత మొక్కల ఉపయోగాలు

- బొప్పాయిలో రింగ్ స్పాట్ వైరస్ నిరోధకతను సాధించగలిగాం.
- టమాటో పంటలో సూడోమోనాస్ అనే వ్యాధికారక బ్యాక్టీరియాకు నిరోధకతను రూపొందించారు.
- ఫలాలు ఆలస్యంగా పక్వతకు వచ్చే విధానాన్ని సృష్టించి రవాణాకు అనుకూలపరిచారు.
- బంగాళాదుంపలో పైటాప్తోరా అనే శిలీంధ్ర నిరోధకతను అభివృద్ధి పరిచారు.
- బాస్మతి వరి రకంలో జీవ, నిర్జీవ ప్రతి బలాలను తట్టుకునే నిరోధకతను రూపొందించారు.
- మొక్కలను జీవ పరిశ్రమలు (బయోరియాక్టర్)గా ఉపయోగించి వాణిజ్య ఉత్పత్తులు, ఔషధాలు, రసాయనాలను భారీ ఎత్తున తయారు చేస్తున్నారు. దీన్నే 'అణు సేద్యం' అంటారు.

జీవభద్రత, నైతిక సమస్యలు

జెనెటిక్ ఇంజినీరింగ్ విధానంలో అనేక లాభాలున్నప్పటికీ ప్రజల్లో కొంత అభద్రతా భావం ఉంది. దీనికి ప్రధాన కారణాలు..

1) మానవులు, జంతువుల్లో విష పదార్థాలు బదిలీ చెంది ఇతర కొత్త సమస్యలు ఏర్పడే ప్రమాదం ఉంది.
2) కూరగాయల సహజత్వంలో మార్పు వచ్చే ఆస్కారం ఉంది.
3) జీవ వైవిధ్యానికి హాని ఏర్పడే ప్రమాదం ఉంది.
4) అసహజ కలుపు మొక్కలు వృద్ధి చెందే పరిస్థితులు కూడా ఎదురవుతున్నాయి.

పైన పేర్కొన్నవాటితో పాటు బయోపైరసీ జరిగే ప్రమాదం కూడా ఉంది. రూపొందించిన వారి అనుమతికి సంబంధించిన అధికారిక పత్రం, నష్ట పరిహారం లేకుండా జీవ వనరులను ఉపయోగించడాన్ని బయోపైరసీ అంటారు.

క్లోనింగ్

ఈ విధానంలో స్టెమ్ (మూల) కణాలను ఉపయోగించి కృత్రిమంగా జంతువులను రూపొందిస్తారు. స్టెమ్‌సెల్స్‌కు ఉండే సామర్థ్యాన్ని 'ప్లూరో పొటెన్సీ' అంటారు. మొట్టమొదటగా ఈ ప్రక్రియలో 'డాలి' అనే గొర్రె పిల్లను సృష్టించారు. స్కాట్లాండ్ శాస్త్రవేత్త ఇయాన్ విల్మట్ దీన్ని రోసాలిన్ అనే పరిశోధనా సంస్థలో రూపొందించారు.

క్లోనింగ్ ఉపయోగాలు: జంతువుల్లో అవసరమైన లక్షణాలను అభివృద్ధి చేయవచ్చు.

ఉదా: తల్లిపాలలో ఉండే ప్రోటీన్లను ఆవుపాలలో ప్రవేశ పెట్టవచ్చు. అంతరించిపోయే ప్రమాదమున్న జంతుజాలాన్ని పెద్ద ఎత్తున ఉత్పత్తి చేయవచ్చు.

మాదిరి ప్రశ్నలు

1. జన్యు పదార్థంగా దేన్ని పరిగణిస్తారు?
   1) C–DNA 2) r–DNA
   3) B–DNA 4) Z–DNA
2. జెనెటిక్ ఇంజినీరింగ్ విధానం ద్వారా ఉత్పత్తి చేసే మొక్కలను ఏమంటారు?
   1) జెనెటికల్ మొక్కలు
   2) అనువంశిక మొక్కలు
   3) జన్యు పరివర్తిత మొక్కలు
   4) ఉత్పరివర్తిత మొక్కలు
3. డీఎన్ఏను ఖండితాలుగా చేసేది?
   1) ఎండో న్యూక్లియేజ్ 2) లిగేజ్
   3) ఐసోమరేజ్ 4) ఏదీకాదు
4. బీటీ - కాటన్‌ను మొదట ఉత్పత్తి చేసిన విత్తన సంస్థ?
   1) పోయినీర్ 2) మోన్‌శాంటో
   3) ప్రీమియర్ 4) పైవన్నీ
5. గోల్డెన్‌రైస్‌లో ఏ అంశాన్ని ప్రవేశ పెట్టారు?
   1) హార్మోన్ 2) బయోపెస్టిసైడ్స్
   3) విటమిన్స్ 4) పిండి పదార్థం
6. డీఎన్ఏ టెక్నాలజీలో విరివిగా ఉపయోగిస్తున్న బ్యాక్టీరియా?
   1) స్ట్రెప్టోకోకస్ 2) బాసిల్లస్
   3) ఇ-కోలీ 4) స్పైరిల్లం
7. మొదటగా రూపొందించిన క్లోన్?
   1) స్నాటి 2) డాలి
   3) ప్రామేటి 4) స్వప్ని
8. మొదటగా రూపొందించిన టెస్ట్ ట్యూబ్ బేబీ?
   1) బేబీ హర్ష
   2) లూయిస్ జాయ్ బ్రౌన్
   3) డాలి 4) ఏదీకాదు
9. పెన్సిలిన్‌ను ఏ సంవత్సరంలో కను గొన్నారు?
   1) 1920 2) 1928
   3) 1935 4) 1919
10. భారతదేశంలో సాగు చేస్తున్న పుట్టగొడుగు రకం?
    1) అగారికస్ వైరోసా
    2) అమానిటా జాతులు
    3) అగారికస్ బైస్పోరస్
    4) పైవన్నీ
11. మష్రూమ్ అంటే అర్థం ఏమిటి?
    1) పుష్పం 2) స్పాంజీ
    3) గొడుగు 4) బూడిద
12. స్పైరులినా అనేది?
    1) ఏక కణ ప్రోటీన్‌గా ఉపయోగపడే శైవలం
    2) ఏకకణ ప్రోటీన్‌గా ఉపయోగపడే శిలీంధ్రం
    3) ఏకకణ ప్రోటీన్‌గా ఉపయోగపడే బ్యాక్టీరియా
    4) ఏదీకాదు
13. క్లోనింగ్‌లో ఉపయోగించే కణాలు?
    1) టాటి పోటెంట్ కణాలు
    2) ప్రోకేరియోటిక్ కణాలు
    3) మూలకణాలు (స్టెమ్ సెల్స్)
    4) పైవన్నీ
14. జెనెటిక్ ఇంజినీరింగ్ విధానం ద్వారా ఉత్పత్తి చేసిన ఇన్సులిన్?
    1) హ్యూమ్యులిన్ 2) హైరుడిన్
    3) రెన్నెట్ 4) ఏదీకాదు
15. టానరింగ్ (తోళ్ల శుద్ధి) విధానంలో ఉపయోగపడే బ్యాక్టీరియా?
    1) క్లాస్ట్రీడియం 2) అజటో బాక్టర్
    3) రైజోబియం 4) పైవన్నీ
16. ఫింగర్ ప్రింటింగ్ విధానంలో నేరస్థులను నిర్ధారణ చేసేందుకు ఉపయోగపడేది?
    1) r–DNA 2) C–DNA
    3) B–DNA 4) Z–DNA
17. లైంగిక నిర్ధారణలో ఉపయోగపడే క్రోమోజోములు?
    1) xx 2) xy 3) yy 4) 1, 2
18. ఆగ్రో బ్యాక్టీరియం టామిఫేసియన్స్ అనేది?
    1) వైరస్ 2) బ్యాక్టీరియా
    3) విత్తన సంస్థ 4) ఏదీకాదు
19. టెస్ట్ ట్యూబ్ బేబీ అంటే?
    1) శిశువు పరీక్ష నాళికలో వృద్ధి చెందుతుంది
    2) ఫలదీకరణ పరీక్ష నాళికలో జరిగి శిశువు గర్భాశయంలో ఎదుగుతుంది
    3) ఫలధీకరణ ఫాలోపియన్ నాళంలో జరిగి శిశువు పరీక్ష నాళికలో ఎదుగుతుంది
    4) ఫలదీకరణ, శిశువు ఎదుగుదల పరీక్ష నాళికలో జరుగుతుంది
20. గోబర్ గ్యాస్ దేని నుంచి లభిస్తుంది?
    1) ఆగ్రో బ్యాక్టీరియం టామిఫేసియన్స్
    2) బాసిల్లస్ థురెంజియన్సిస్
    3) మిథనో కోకస్
    4) పైవన్నీ

సమాధానాలు

1) 3; 2) 3; 3) 1; 4) 2; 5) 3; 6) 3; 7) 2; 8) 2; 9) 2; 10) 3; 11) 2; 12) 1; 13) 3; 14) 1; 15) 1; 16) 2; 17) 4; 18) 2; 19) 2; 20) 3.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

సాక్షి ప్లస్
మంగళవారం । 31-12-2024

వాతావరణంలో అత్యధికంగా ఉండే జడవాయువు?

శీతోష్ణస్థితి-వాతావరణ పొరలు-సూర్యపుటం

వాతావరణ సంఘటనం

భూమిని ఆవరించి సుమారు 1600 కి.మీ. ఎత్తు వరకు వ్యాపించి ఉన్న గాలిపొరను 'వాతావరణం' అంటారు. వాతావరణ పొరలకు భూగురుత్వాకర్షణ శక్తి ఉండటం వల్ల అవి భూమిని ఆవరించి ఉంటాయి. భూమి ఆకర్షణ వల్ల వాతావరణం భూ ఉపరితలం వద్ద దట్టంగా, ఎత్తుకు వెళ్లే కొద్దీ పలుచగా ఉంటుంది. వాతావరణాన్ని అట్మాస్పియర్ అంటారు. అట్మాస్ అంటే ఆవిరి.

వాతావరణ స్థితి: ఒకరోజు లేదా కొన్ని గంటల్లో వాతావరణ అంశాల పరిస్థితిని తెలియజేస్తుంది. ఇది ప్రాంతాలను బట్టి మారుతుంది. తాత్కాలికమైంది, అస్థిరమైంది.

శీతోష్ణస్థితి: ఏదైనా ఒక ప్రాంతానికి సంబంధించి కొన్ని ఏళ్ల సగటు ఉష్ణోగ్రత, వాయుపీడనం, పవనాలు, వర్షపాతం తదితర భౌతికాంశాల పరిస్థితులను తెలుపుతుంది. ఇది వందల ఏళ్ల వాతావరణ పరిస్థితుల సంగ్రహం.

వాయువులు

జీవకోటి మనుగడకు ముఖ్యమైన వాయువు ఆక్సిజన్. మొత్తం వాతావరణంలో నీటిఆవిరి సుమారు 0.4 శాతం ఉంటుంది. దీనిలో అధిక భాగం భూమికి దగ్గరగా ఉంటుంది.

నైట్రోజన్	78.08 శాతం
ఆక్సిజన్	20.94 శాతం
ఆర్గాన్	0.93 శాతం
కార్బన్ డై ఆక్సైడ్	0.03 శాతం
ఇతర వాయువులు	0.02 శాతం
మొత్తం	100.00 శాతం

వాతావరణం - పొరలు

వివిధ పదార్థాల ఆధారంగా వాతావరణాన్ని రెండు ప్రధాన పొరలుగా విభజించారు. అవి..
1) సమరూప ఆవరణం (Homo sphere)
2) బహురూప ఆవరణం (Hetero sphere)

సమరూప ఆవరణం: ఈ ఆవరణం 90 కి.మీ. ఎత్తు వరకు వ్యాపించి ఉంటుంది. దీనిలో మూడు పొరలుంటాయి. అవి.. ట్రోపో ఆవరణం, స్ట్రాటో ఆవరణం, మెసో ఆవరణం. సమరూప ఆవరణం అంతటా నైట్రోజన్, ఆక్సిజన్, ఆర్గాన్, కార్బన్ డై ఆక్సైడ్ లాంటి వాయువుల నిష్పత్తి ఒకే రకంగా ఉంటుంది.

బహురూప ఆవరణం: 90 కి.మీ. కంటే పైన ఉన్న వాతావరణ పొరను బహురూప ఆవరణం అంటారు. దీనిలో వాయువుల నిష్పత్తి వేర్వేరుగా ఉంటుంది. కాబట్టి దీనికి ఆ పేరు వచ్చింది. దీనిలో థర్మో ఆవరణం, ఎక్సో ఆవరణం అనే రెండు పొరలు ఉన్నాయి.

ట్రోపో ఆవరణం: ఇది వాతావరణంలో అన్నిటికంటే కింద ఉన్న పొర. ధ్రువాల వద్ద 8 కిలోమీటర్ల ఎత్తు వరకు, భూమధ్యరేఖ వద్ద 18 కి.మీ. ఎత్తు వరకు ఇది విస్తరించి ఉంటుంది. ఈ పొర సగటు ఎత్తు 13 కిలోమీటర్లు.

భూమధ్యరేఖ వద్ద బలమైన సంవహన ప్రవాహాల వల్ల వేడిమి చాలా ఎత్తు వరకు వెళుతుంది. కాబట్టి ఇక్కడ ట్రోపో ఆవరణం ఎత్తు ఎక్కువగా ఉంటుంది. వాతావరణంలోని ధూళికణాలు, తేమ అంతా ఈ పొరలోనే ఉంటాయి. శీతోష్ణస్థితులు, వర్షపాతం లాంటి వాతావరణ అంశాలన్నీ ఈ ఆవరణంలోనే సంభవిస్తాయి. ఈ పొరలో పైకి వెళ్లే కొద్దీ ఉష్ణోగ్రత తగ్గుతుంది. దీన్ని 'సాధారణ క్షీణతా క్రమం' అంటారు. నీటి బిందువులు ఘనీభవించటం, బాష్పీభవనం కావటం, ద్రవీభవనం, వర్షపాతం, తుపానులు వంటివన్నీ ఈ పొరలోనే జరుగుతాయి.



సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
జాగ్రఫీ

స్ట్రాటో ఆవరణం: ఈ పొర 50 కి.మీ. ఎత్తు వరకు ఉంటుంది. ఇందులో మబ్బులు ఉండవు, కాబట్టి వర్షపాతం, తుపానులు వంటివి ఉండవు. దీంతో జెట్ విమానాలు ఎగరడానికి ఈ పొర చాలా అనువుగా ఉంటుంది. స్ట్రాటో ఆవరణంలో ఓజోన్ పొర ఉంటుంది. ఎత్తుకు వెళ్లే కొద్దీ ఈ ఆవరణంలో ఉష్ణోగ్రతలు తగ్గుతాయి.

మెసో ఆవరణం: ఇది 80 కి.మీ. ఎత్తు వరకు ఉంటుంది. ఉల్కలు ఈ పొరలోకి ప్రవేశించగానే కాలిపోతాయి. ఎత్తు పెరిగే కొద్దీ ఈ ఆవరణంలో ఉష్ణోగ్రతలు తగ్గుతాయి.

థర్మో ఆవరణం: ఇది 400 కి.మీ. వరకు ఉంటుంది. థర్మో ఆవరణంలో ఎత్తుకు వెళుతున్న కొద్దీ ఉష్ణోగ్రతలు వేగంగా పడిపోతాయి. ఈ పొరలో అయాన్లు అనే కణాలు ఉంటాయి. వీటికి విద్యుదావేశం ఉంటుంది. ఈ అయాన్ల వల్ల భూమి నుంచి ప్రసారితమయ్యే రేడియో తరంగాలు తిరిగి భూమికి పరావర్తనం చెందుతాయి. ఈ పొరని 'ఐనో ఆవరణం' అని కూడా అంటారు.

ఎక్సో ఆవరణం
ఇది వాతావరణంలో అన్నింటికంటే చివరి పై పొర.

సౌరశక్తి - సూర్యపుటం

సూర్యుడి నుంచి నిరంతరం విడుదలయ్యే శక్తిని సౌర వికిరణం అంటారు. సూర్యుడిలో నిరంతరం ఉష్ణం జనించే ప్రక్రియే అణు సంఘటనం. సూర్యుడి వ్యాసం, భూమి వ్యాసం కంటే 109 రెట్లు ఎక్కువ ఉంటుంది. భూమి గురుత్వాకర్షణ శక్తి కంటే సూర్యుడి గురుత్వాకర్షణ శక్తి 28 రెట్లు అధికం. సూర్యుడు భూమి కంటే 1.3 మిలియన్ రెట్లు పెద్దగా ఉంటాడు. సూర్యుడు విడుదల చేస్తున్న శక్తిలో భూమి గ్రహించే శక్తి (2 వేల మిలియన్లు) 2 వేల మిలియన్లలో ఒక వంతు.

సూర్యపుటం: భూమి వైపు నిరంతరం ప్రసరించే సూర్యుడి శక్తిని సూర్యపుటం అంటారు. సగటున భూమి ఒక చ.సెం.మీ. ఉపరితల విస్తీర్ణంలో నిమిషానికి 2 కేలరీల శక్తికి సమానమైన సూర్యపుటాన్ని గ్రహిస్తుంది. దీన్నే సౌర స్థిరాంకం అంటారు. భూమి గ్రహిస్తున్న శక్తిలో పరావర్తనం అవుతున్న శక్తి శాతాన్ని ఆల్బిడో అంటారు. భూమి ఆల్బిడో 35 యూనిట్లు.

సూర్యపుటం ప్రభావితం చేసే అంశాలు

సూర్యకిరణాలు భూమి మీద పడే కోణం: సూర్య కిరణాల వాలు తక్కువగా ఉంటే సూర్యపుటం తీవ్రత ఎక్కువగా, వాలు ఎక్కువగా ఉంటే తీవ్రత తక్కువగా ఉంటుంది.
ఉదా: సూర్యోదయం, సూర్యాస్తమయాల్లో కంటే మిట్ట మధ్యాహ్నం వేళ సూర్యపుటం ఎక్కువ.
ఉదా: సూర్యకిరణాలు లంబంగా ప్రసరించే ఉష్ణ మండల ప్రాంతాలు, సూర్యకిరణాలు ఏటవాలుగా ప్రసరించే ధ్రువ ప్రాంతాల కంటే ఎక్కువ సూర్యపుటాన్ని గ్రహిస్తాయి.

పగటి ప్రమాణం
పగటి ప్రమాణం ఎక్కువగా ఉండే వేసవి కాలాలు పగటి ప్రమాణం తక్కువగా ఉండే శీతాకాలాల కంటే అధిక సూర్య పుటాన్ని గ్రహిస్తాయి.
భూమధ్యరేఖ నుంచి దూరంగా వెళ్లే కొద్దీ వేసవి కాలం పగటి ప్రమాణం పెరుగుతుంది. శీతాకాలంలో రాత్రి ప్రమాణం పెరుగుతుంది.

మాదిరి ప్రశ్నలు

1. వాతావరణంలోని పై పొరను ఏమని పిలుస్తారు?
   1) ట్రోపో స్ఫియర్ 2) స్ట్రాటో స్ఫియర్
   3) ఐనో స్ఫియర్ 4) ఎక్సో స్ఫియర్
2. వాతావరణంలో అత్యధికంగా ఉండే జడవాయువు?
   1) నియాన్ 2) ఆర్గాన్
   3) మోనాజటాన్ 4) ఏదీకాదు
3. వాతావరణంలోని ఏ పొర నుంచి రేడియో తరంగాలు ప్రసారమవుతాయి?
   1) ఐనో ఆవరణం 2) మెసో ఆవరణం
   3) స్ట్రాటో ఆవరణం
   4) ట్రోపో ఆవరణం
4. భూమికి దగ్గరగా ఉన్న వాతావరణ పొర?
   1) ఎక్సో స్ఫియర్ 2) ఐనో స్ఫియర్
   3) ట్రోపో స్ఫియర్ 4) స్ట్రాటో స్ఫియర్
5. రాత్రివేళల్లో భూమి నుంచి సముద్రం వైపు వీచే గాలులను ఏమంటారు?
   1) సముద్ర మంద మారుతం
   2) భూమంద మారుతం
   3) చల్లని గాలి 4) రాత్రి గాలి
6. వాతావరణంలోని అత్యల్ప ఎత్తులో ఉన్న పొరను ఏమని పిలుస్తారు?
   1) స్ట్రాటో స్ఫియర్ 2) మెసో స్ఫియర్
   3) ఐనో స్ఫియర్ 4) ట్రోపో స్ఫియర్
7. వాతావరణ మార్పులు ఎక్కువగా ఎక్కడ జరుగుతాయి?
   1) స్ట్రాటో స్ఫియర్ 2) ట్రోపో స్ఫియర్
   3) ఐనో స్ఫియర్ 4) మెసో స్ఫియర్
8. భూమి మీద ఆక్సిజన్ భాగం?
   1) 27.72 శాతం 2) 46.5 శాతం
   3) 41.5 శాతం 4) 8.13 శాతం
9. ఓజోన్ ఆవరణం అని దేన్ని పిలుస్తారు?
   1) ట్రోపో 2) స్ట్రాటో
   3) మెసో 4) ఎక్సో
10. స్పేస్ స్టేషన్ ఏ ఆవరణంలో ఉంది?
   1) ట్రోపో 2) స్ట్రాటో
   3) థర్మో 4) ఎక్సో
11. వాతావరణ పొరలు వేటి మూలంగా వేడెక్కుతాయి?
   1) ఉష్ణ వికిరణం 2) భూ వికిరణం
   3) ఉష్ణ వాహకం 4) ఉష్ణ సంవహనం
12. భూమి సగటు ఆల్బిడో?
   1) 35 శాతం 2) 45 శాతం
   3) 37 శాతం 4) 38 శాతం
13. సముద్రమట్టం వద్ద సాధారణ వాతావరణ పీడనం (మిల్లీ బార్లలో)?
   1) 1083.3 2) 1019.3
   3) 870 4) 1013.2
14. అధిక ఉష్ణోగ్రతలు గ్రహించే నేలలు?
   1) ఎర్ర నేలలు 2) నల్లరేగడి నేలలు
   3) ఇసుక నేలలు 4) ఒండ్రు నేలలు

సమాధానాలు
1) 4; 2) 2; 3) 1; 4) 3; 5) 2; 6) 4; 7) 2; 8) 1; 9) 2; 10) 3; 11) 2; 12) 1; 13) 4; 14) 2.

ముఖ్యమైన పదాలు - అర్థాలు

- **సౌర వికిరణం:** సూర్యుడి నుంచి నిరంతరం విడుదయ్యే అపరిమితమైన శక్తి.
- **అణు సంఘటన:** సూర్యుడి నుంచి నిరంతరం ఉష్ణం జనించే ప్రక్రియ.
- **సూర్యపుటం:** భూమి వైపు నిరంతరం ప్రసరించే సూర్య శక్తి.
- **సౌర స్థిరాంకం:** ఒక చ.సెం.మీ. భూమి విస్తీర్ణం 1 నిమిషానికి 2 కేలరీల శక్తికి సమానమైన ఉష్ణాన్ని గ్రహించటం.
- **భూ వికిరణం:** భూమి గ్రహించిన శక్తిని దీర్ఘతరంగాలుగా విశ్వంలోకి విడుదల చేయడం.
- **ఆల్బిడో:** భూమి గ్రహిస్తున్న శక్తిలో పరావర్తనం అవుతున్న శక్తి శాతం.
- **ఉష్ణ సమతుల్యం:** సూర్యపుటం ద్వారా భూమి ఎంత వేడెక్కుతుందో, భూ వికిరణం ద్వారా అంతగానే చల్లబడటం.

ఉద్యోగ సమాచారం

అన్నమయ్య జిల్లాలో 116 అంగన్‌వాడీ పోస్టులు

అన్నమయ్య జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖలోని ఐసీడీఎస్ ప్రాజెక్టులో అంగన్‌వాడీ వర్కర్/మినీ అంగన్‌వాడీ వర్కర్/అంగన్‌వాడీ హెల్పర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» మొత్తం పోస్టుల సంఖ్య: 116.
» అర్హత: పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. స్థానికంగా నివసిస్తున్న వివాహిత మహిళలు మాత్రమే ఈ పోస్టుకు అర్హులు.
» వయసు: 21 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.
» వేతనం: నెలకు అంగన్‌వాడీ వర్కర్ పోస్టులకు రూ.11,500, మినీ అంగన్‌వాడీ వర్కర్ పోస్టులకు రూ.7000, అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు రూ.7000.
» ఎంపిక విధానం: ఇంటర్వ్యూ, మెరిట్ ఆధారంగా ఎంపికచేస్తారు. రాతపరీక్ష లేదు.
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును సంబంధిత ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో అందజేయాలి. బయోడేటాతో పాటు విద్యార్హతలు, ఇతర సర్టిఫికేట్లు జిరాక్స్ కాపీలపై గెజిటెడ్ ఆఫీసర్‌తో అటెస్టేషన్ చేయించి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో అందజేయాలి.
» దరఖాస్తులకు చివరితేది: 02.01.2025.
» వెబ్‌సైట్: https://annamayya.ap.gov.in

ఐఐఎస్‌టీ తిరువనంతపురంలో వివిధ ఉద్యోగాలు

తిరువనంతపురం (కేరళ)లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఐఐఎస్‌టీ).. వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» మొత్తం పోస్టుల సంఖ్య: 03.
» పోస్టుల వివరాలు: డేటా ప్రాసెసింగ్ అసిస్టెంట్-01, ప్లేస్‌మెంట్ ఆఫీసర్-01, ఇంజనీర్(హెచ్‌పీసీ)-01.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభా గంలో బీఈ/బీటెక్, ఎంబీఏ, పీజీ ఉత్తీర్ణులవ్వా లి. దీంతోపాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» వేతనం: నెలకు డేటా ప్రాసెసింగ్ అసిస్టెంట్ పోస్టుకు రూ.30,000, ప్లేస్‌మెంట్ ఆఫీసర్‌కు రూ.50,000, ఇంజనీర్‌కు రూ.45,000.
» ఎంపిక విధానం: రాతపరీక్ష/ఇంటర్వ్యూ, స్కిల్స్/ఉద్యోగానుభవం ఆధారంగా.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» చివరితేది: 05.01.2025.
» వెబ్‌సైట్: https://www.iist.ac.in

The local residents may protest against..



BANK EXAMS
REASONING

MODEL QUESTIONS

Read the questions carefully and answer the following:

Directions (Q. No. 1-5): Given a statement followed by two assumptions numbered I and II. You have to consider the statement and the following assumptions and decide which of the assumptions is implicit in the statement.
Mark (a) if only assumption I is implicit
Mark (b) if only assumption II is implicit
Mark (c) if either I or II is implicit
Mark (d) if neither I nor II is implicitMark (e) if both I and II are implicit

1. **Statement:-**
   The government has decided to provide monetary relief to the farmers in the drought-hit areas.
   Assumptions:
   I. The farmers of the affected areas may accept the government relief.
   II. The government machinery may be able to reach the affected farmers to provide relief.
2. **Statement:-**
   All the students of a school were instructed by the Principal to reach school at least 15 minutes before the stipulated time for the coming month.
   Assumptions:
   I. The parents of the students of the school may protest against the Principal's instruction.
   II. The parents may request the Principal to withdraw the instruction.
3. **Statement:-**
   Railway authority has started Internet booking facility of long-distance trains and also delivering the tickets at the doorstep through courier service at a little extra cost.
   Assumptions:
   I. Many customers may now book their tickets through Internet, resulting into fewer crowds at ticket booking offices.
   II. Most of the customers may still buy their railway tickets at the booking counters.
4. **Statement:-**
   "If you have obtained 75 per cent or more marks in X Std examination, your admission to our coaching class for XII Std is guaranteed."_An advertisement.
   Assumptions:
   I. Bright students do not generally opt for attending coaching classes.
   II. The coaching class has adequate capacity to accommodate all such students.
5. **Statement:-**
   The municipal corporation has given permission for holding fun fairs in the local football ground during the holiday season.
   Assumptions:
   I. The local residents may protest against the corporation's decision.
   II. Many people may not participate in the fun fair.

Directions (Q. No. 6-10): In making decisions about important questions, it is desirable to be able to distinguish between "strong" arguments and "weak" arguments in so far as they relate to the question. Strong arguments are those which are both important and directly related to the question. Weak arguments are those which are of minor importance and also may not be directly related to the question or may be related to a trivial aspect of the question.

Instructions: Each question below is followed by two arguments numbered I and II. You have to decide which of the arguments is a strong argument and which is a weak argument.
Give answer 1 if only argument I is strong
Give answer 2 if only argument II is strong
Give answer 3 if either I or II is strong
Give answer 4 if neither I nor II is strong and
Give answer 5 if both the arguments I and II are strong.

6. Should graduation be made minimum educational qualification for entry-level jobs in any public sector organization?
   Arguments:-
   I. Yes, graduates always perform better than non-graduates by virtue of their higher level of education.
   II. No, there are quite a few people who cannot afford to remain unemployed till the completion of graduation and are capable of performing equally well as the graduate candidates.
7. Should the examination bodies for all university examinations permit the use of calculators?
   Arguments:-
   I. No, it is necessary for the students to know the methods of manual calculations.
   II. Yes, manual calculations are no more required with extensive use of computers in all fields.
8. Should the knowledge of Hindi language be made compulsory for all the employees of public sector organizations?
   Arguments:-
   I. Yes, it is necessary for dealing with people from the educationally backward strata of the society.
   II. No, it is not necessary for every employee to have the knowledge of Hindi language.
9. Should it be made compulsory for all the private sector organizations to reserve quota for society backward classes?
   Arguments:-
   I. No, the private sector should not be governed by the Government rules.
   II. Yes, private sector organizations should also contribute in upliftment of socially backward classes.
10. Should the women be advised not to travel alone at night in view of the increasing incidences of rape and sexual abuse?
   Arguments:-
   I. No, instead the Government should take measures to control such incidences.
   II. Yes, it is difficult even for the police department to control such cases.

Directions (Q. No. 11 - 13): Read the questions carefully and answer the following:

11. **Cause:-**
   All the major rivers in the state have been flowing way over the danger level for the past few weeks. Which of the following is /are possible effect (s) of the above cause?
   (A) Many villages situated near the riverbanks are submerged, forcing the residents to flee.
   (B) Govt has decided to provide alternate shelter to all the affected villagers residing near the river banks.
   (C) The entire state has been put on high flood alert.
   (1) Only (A) (2) Only (A) and (B)
   (3) Only (B) and (C)
   (4) All (A), (B) and (C)
   (5) None of these
12. **Effect:-**
   This year majority of the final year students of the management institute have opted for finance specialization.
   Which of the following can be a probable cause of the above effect?
   (1) Last year most of the students with HR specialization got better job offers than other specializations.
   (2) The management institute offers only finance specialization to its final year students.
   (3) Last year the students with finance specialization bagged most of the lucrative offers vis-à-vis students with other specializations.
   (4) The management institute has recently started its finance specialization in addition to Marketing and HR being offered earlier.
   (5) None of these
13. **Effect:-**
   Govt allowed all the airlines to charge additional amount as peak time congestion charges for the flights landing between 6.00 a.m. and 10.00 a.m.
   Which of the following is a probable cause of the above effect?
   (1) All the airline companies had threatened to suspend their services during peak hours.
   (2) The Govt has increased its tax for peak time flights.
   (3) The aircrafts are routinely put on hold over, causing extra fuel consumption.
   (4) The airline companies can now charge unlimited additional charge for peak time flights.
   (5) None of these

Solutions

1. When the government has decided to provide relief to the farmers, it must be assuming that the plan can be executed, and the farmers respond positively. Hence, both I and II are implicit. **Ans: 5**
2. If Principal is instructing students, he must be assuming that the students will abide by his instruction, and the parents will also accept it. Hence, both I and II are not implicit **Ans: 4**
3. The initiative taken by the railway authority has been aimed at providing better service-customer. Hence, I is implicit. II may nor may not be an assumption. Hence II is not implicit **Ans: 1**
4. From the advertisement, it is clear that the advertiser must be assuming II. Hence, II is implicit. Assumption I is rather contradicting the statement. Hence, I is not implicit. **Ans: 2**
5. Since assumptions I and II go against the spirit of the given statement, both I and II are not implicit. **Ans: 4**
6. Note "graduates ALWAYS perform". Hence, I is not necessarily true. Hence I is not strong. II deviates from the core issue. Hence, II is not strong. **Ans: 4**
7. I is a simple declaration. Hence, it is not strong. II is strong as it explains the reason behind it. **Ans: 2**
8. I is strong because it is true to a large extent. But II is simplistic and hence weak. **Ans: 1**
9. I is not the correct way of arguing. Hence, I is not strong. Upliftment of socially backward classes is necessary. Hence, II is strong. **Ans: 2**
10. **Ans:** 4.
11. All the three are the possible effects of the given cause. **Ans: 4**
12. Only (3) seems to be the probable cause. **Ans: 3**
13. As aircrafts incur extra fuel consumption charges, government allowed all the airlines to charge additional amount. **Ans: 3**